
ఈనాడు

విజయవాడ 1-12-2025 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 111
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 12
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



352 వన్డేల్లో రోహిత్ శర్మ సిక్సర్లు. అత్యధిక సిక్స్‌లతో పాకిస్థాన్ మాజీ ఓపెనర్ షాహిద్ అఫ్రిది (351) నెలకొల్పిన రికార్డును అతను తుడిపేశాడు.

వన్డే కింగ్ కోహ్లి

దక్షిణాఫ్రికాతో తొలి వన్డేలో భారత్ విజయం

ఒకప్పటిలా తన ఆధిపత్యాన్ని చాటుతూ... దక్షిణాఫ్రికాతో తొలి వన్డేలో కోహ్లి (135; 120 బంతుల్లో 11×4, 7×6) సూపర్ సెంచరీ సాధించాడు. రోహిత్(57), రాహుల్(60) కూడా రాణించడంతో భారత్ 349 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా 332 పరుగులకు ఆలౌటైంది.

52 విరాట్ శతకాల సంఖ్య. ఒక ఫార్మాట్లో అత్యధిక సెంచరీలు సాధించిన బ్యాటర్‌గా భారత దిగ్గజం సచిన్ తెందుల్కర్ (టెస్టుల్లో 51) పేరిట ఉన్న రికార్డును కోహ్లి బద్దలు కొట్టాడు.



వివరాలు ఛాంపియన్ లో..

కటకటాల్లోకి ఖతర్నాక్ డాన్ కామాక్షి

మరో ఏడుగురు కూడా..

పెంచలయ్య హత్య, గంజాయి కేసుల్లో అరెస్టు

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

ఎదురెదురుగా ఢీకొన్న రెండు ప్రభుత్వ బస్సులు

9 మంది మహిళలు సహా 11 మంది దుర్మరణం

40 మందికిపైగా గాయాలు

తీవ్ర వాయుగుండంగా బలహీనపడిన దిత్వా తుపాను

నేటి ఉదయానికి వాయుగుండంగా మారే అవకాశం

3లో

నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌పై కొత్త ఎఫ్ఐఆర్

6లో

ఆధారాలు ముందుంచినా.. నోరు విప్పని జోగి సోదరులు

విచారణలో మొక్కుబడి సమాధానాలు

ఇద్దరికీ ముగిసిన కస్టడీ.. నెల్లూరు తరలింపు


3లో

ఖాతాల కంత్రీలు

కమీషన్ల కోసం బ్యాంకు ఎకౌంట్ల తాకట్టు

- సైబర్ నేరగాళ్లకు వెన్నెముకగా 'మనీ మ్యూల్స్ అగ్రిగేటర్లు'
- వ్యవస్థీకృతంగా నేర దందా
- ఏలూరు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి

ఈనాడు – అమరావతి



'మీ బ్యాంకు ఖాతాల వివరాలివ్వండి. అందులో కొంత డబ్బు జమచేస్తాం. ఆ మొత్తాన్ని తర్వాత వేరే ఖాతాల్లోకి మళ్లీ బదిలీ చేయించుకుంటాం. ప్రతిగా మీకు 10 శాతం కమీషన్ చెల్లిస్తాం' అంటూ టెలిగ్రామ్, వాట్సప్ గ్రూపులు, డార్క్‌వెబ్‌లలో ప్రకటనలిచ్చి మరీ అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠాలు 'మనీ మ్యూల్స్'ను (నేర కార్యకలాపాల కోసం బ్యాంకు ఖాతాలను అద్దెకు ఇచ్చేవారు) ఉచ్చులోకి దించుతున్నాయి. దీని కోసం మనీ మ్యూల్ అగ్రిగేటర్ల పేరిట వ్యవస్థీకృత దందా నడిపిస్తున్నాయి. సైబర్ నేరగాళ్లకు ఆర్థికంగా వెన్నెముకలా పనిచేస్తున్న ఈ 'మనీ మ్యూల్ అగ్రిగేటర్ల' వ్యవహారంలో కొందరు బ్యాంకు మేనేజర్లు, పోలీసు సిబ్బంది పాత్రధారులుగా ఉంటున్నారు. ఏలూరు రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో ఇటీవల నమోదైన ఓ డిజిటల్ అరెస్టు కేసును ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిశోర్ దర్యాప్తు చేస్తుంటే ఈ మనీ మ్యూల్ అగ్రిగేటర్ల వ్యాపారం బయటపడింది. బ్యాంకు ఖాతాలను సేకరించి.. మోసపూరితంగా వచ్చిన డబ్బును లాండరింగ్ చేసి ఆ తర్వాత దాన్ని డిజిటల్, క్రిప్టో కరెన్సీలోకి మార్చేసుకుంటున్నట్లు తేలింది.

మ్యూల్ అగ్రిగేటర్లు ఎవరు?

కొల్లగొట్టిన సొత్తును వారి వద్దకు బదిలీ చేయించుకునేందుకు బహుళ అంచెల్లో పలు అంతర్జాతీయ సైబర్ నేరాల ముఠాలు వందల బ్యాంకు ఖాతాలను వినియోగిస్తాయి. ఇందుకోసం అవసరమైన బ్యాంకు ఖాతాలను సిద్ధం చేసి అందివ్వడమే ఈ మ్యూల్ అగ్రిగేటర్ల పని. వీరిని ఖాతాలు అందించే దళారులుగా పేర్కొనవచ్చు. సైబర్ నేరాల్లో బాధితులు పోగొట్టుకున్న డబ్బుకు (మిగతా 2లో)

చైనాలో సూత్రధారులు.. భారత్‌లో ఆపరేటర్లు

➤ ఈ మొత్తం మనీ మ్యూల్స్ అగ్రిగేటర్ల నేర నెట్‌వర్క్‌ను చైనాలోని సూత్రధారులు నిర్వహిస్తున్నారు. బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో వారి తరపున ఆపరేటర్లుగా పనిచేస్తున్న కొందరు దోచుకున్న సొత్తును.. మ్యూల్ ఖాతాల ద్వారా విదేశాలకు చేరవేస్తున్నారు.

➤ వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా ఈజీ జాబ్, ఆన్‌లైన్ కమీషన్, లోన్ ప్రాసెసింగ్, వర్క్‌ఫ్రమ్ హోమ్ ఉద్యోగాలు, ఓటీపీ షేర్ చేయండి అంటూ బ్యాంక్ ఖాతాల వివరాలు ఫీల్డ్ అసిస్టెంట్లు సేకరిస్తున్నారు. చాలా మంది తెలిసే తమ బ్యాంకు ఖాతాలను నేరగాళ్లకు అద్దెకు ఇస్తున్నారు.

పంథా మార్చిన చంద్రబాబు



- జిల్లాల పర్యటనల్లో నాయకులకు కటువుగానే హెచ్చరికలు
- పదవుల పంపిణీలో సామాజిక సమతూకం పాటించకపోతే మందలింపు
- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొనని వారికి అక్షింతలు

ఈనాడు, అమరావతి: అధికారంలో ఉన్నప్పుడు పాలనా వ్యవహారాల్లో తలమునకలై పార్టీకి సమయం కేటాయించకపోవడంతో నష్టం జరుగుతోందని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఈసారి పంథా మార్చారు. పింఛన్ల పంపిణీ కోసం నియోజకవర్గాలకు వెళ్లినప్పుడు.. స్థానిక తెదేపా నాయకులు, కేడర్‌తో సమావేశమవుతున్నారు. పరిస్థితుల్ని తెలుసుకుంటూ, పార్టీ అండగా ఉంటుందన్న భరోసానిస్తూ వారిలో ఉత్సాహం నింపుతున్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కుల్ని బాధితులకు అందజేయడంలో జాప్యం చేస్తున్న, మరణించిన పార్టీ కార్యకర్తలకు బీమా సొమ్ము చెక్కుల్ని స్వయంగా అందజేయని ఎమ్మెల్యేల విషయంలో (మిగతా 2లో)

తప్పుచేస్తే ఉపేక్షించను

ప్రజల్లో వ్యతిరేకత రావడానికి నాయకులే తప్పు చేయాల్సిన పనిలేదు. కార్యకర్త తప్పు చేసినా, చివరకు అధికారులు తప్పులు చేసినా ప్రభుత్వానికే చెడ్డపేరు వస్తుంది. మొదట నాయకులు, కార్యకర్తలు మోటివేట్ అయితే... అధికారుల్ని నియంత్రించడం పెద్ద కష్టం కాదు. పవిత్రయజ్ఞానికి ఎవరు విఘ్నం కలిగించినా వదిలిపెట్టను. –చంద్రబాబు

అధినేత చేతిలో అందరి చిట్టాలు

నియోజకవర్గాల్లో పదవుల కేటాయింపులో సామాజిక సమతూకం పాటించారా? లేదా? 2024 ఎన్నికల్లో కూటమికి ఎన్ని ఓట్లు వచ్చాయి? ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్ని వస్తాయి? ఎమ్మెల్యే పనితీరుపై ప్రజల స్పందనేంటి? నియోజకవర్గంలోని పార్టీ నాయకుల్లో ఎవరైనా పార్టీకి దూరంగా ఉంటున్నారా? ఇలా సమస్త సమాచారం అధినేత చేతిలో పెట్టుకుంటున్నారు. ఆశించిన పనితీరు లేనివారిని సున్నితంగా హెచ్చరిస్తున్నారు.



అఖిలపక్ష సమావేశంలో పాల్గొనేందుకు వెళుతున్న కేంద్ర మంత్రులు జె.పి.నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, కిరణ్ రిజిజు తదితరులు

సర్‌పై చర్చించాల్సిందే

- ప్రతిపక్షాల డిమాండ్
- ఎటువంటి హామీ ఇవ్వని ప్రభుత్వం
- నేటి నుంచి పార్లమెంటు శీతాకాల సమావేశాలు
- స్తంభింపజేయవద్దు: అధికార పక్షం

దిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రత్యేక సమగ్ర సవరణపై (సర్) చర్చించాల్సిందేనని ప్రతిపక్షాలు డిమాండు చేశాయి. దీంతోపాటు దిల్లీ పేలుడు నేపథ్యంలో జాతీయ భద్రత, కార్మిక కోడ్‌లపైనా చర్చించాలని కోరాయి. అయితే ఈ అంశాలపై ప్రభుత్వం ఎటువంటి హామీ ఇవ్వలేదు. సభలు సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, స్తంభింపజేయవద్దని విజ్ఞప్తి చేసింది. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో ఆదివారం దిల్లీలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. రెండు గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో 36 రాజకీయ పార్టీలకు చెందిన 50 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ప్రభుత్వం తరపున రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు, మంత్రులు అర్జున్ రామ్ మేఘ్‌వాల్, ఎల్ మురుగన్ పాల్గొన్నారు. ఇవి పార్లమెంటు శీతాకాల సమావేశాలని, ప్రతి ఒక్కరూ 'కూల్ మైండ్'తో ఉండాలని రిజిజు కోరారు. సర్‌పై చర్చించాలన్న ప్రతిపక్షాల డిమాండుకు అంగీకరించారా.. అన్న ప్రశ్నకు దీనిపై సభా వ్యవహారాల సలహా కమిటీలో (బీఏసీ) చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాజకీయ పార్టీల మధ్య అభిప్రాయ భేదాలు ఉంటాయని, కానీ సభను ఆటంకపరచవద్దని అందరం నిర్ణయించుకుంటే సత్ఫలితాలను సాధించవచ్చని, ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని పేర్కొన్నారు. సమాఖ్య అంశంపై చర్చించాలని (మిగతా 2లో)

ఉత్తరాంధ్ర ఆయకట్టుకు గోదావరి ఆయువు

- వేగంగా సాగుతున్న పోలవరం ఎడమ కాలువ పనులు
- జగన్ సర్కార్‌లో రూపాయి పనీ చేయలేదు
- కూటమి ప్రభుత్వంలో 9 నెలల్లో రూ.564 కోట్ల పనులు పూర్తి
- బిల్లులు సకాలంలో చెల్లిస్తే మిగిలిన పనులకు ఢోకా లేదు
- వచ్చే ఖరీఫ్ సీజన్‌లోగా నీరందించేలా ప్రణాళిక

అనకాపల్లి నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు మళ్లించే పోలవరం ఎడమ కాలువ పనులు వేగంగా సాగుతున్నాయి. పోలవరం ప్రధాన డ్యాం నిర్మాణం 2027 డిసెంబరుకు పూర్తికానుంది. ఈలోగా 2026 ఖరీఫ్ సీజన్ నాటికే ఈ ఎడమ కాలువ నుంచి అనకాపల్లి జిల్లాలో 1.50 లక్షల ఎకరాలకు నీళ్లు అందించేలా పనులు చేస్తున్నారు. గోదావరిపై ఇప్పటికే పురుషోత్తపట్నం ఎత్తిపోతల, పుష్కర ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. ఆ రెండింటి ద్వారా.. గోదావరి వరద సమయంలో వచ్చే సీజన్‌లోనే జలాలు ఉత్తరాంధ్ర భూములను సస్యశ్యామలం చేయనున్నాయి. అందుకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం కేవలం 9 నెలల్లో రూ.564 కోట్ల విలువైన పనులు పూర్తి చేసింది. ఇందులో రూ.261 కోట్ల బిల్లులు చెల్లించారు. మరో రూ.282 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నిధులు సత్వరమే చెల్లిస్తే పనులు వేగం అందుకుంటాయి. ఐదేళ్ల జగన్ పాలనలో ఒక్క రూపాయి పని కూడా చేయకపోవడం గమనార్హం.



కాకినాడ జిల్లా బెండపూడి వద్ద పోలవరం ఎడమ కాలువ జాతీయ రహదారిని దాటే చోట ట్రాఫిక్‌ను మళ్లించేందుకు రెండూ వైపులా నిర్మించిన వంతెనలు

సవాళ్లను అధిగమిస్తూ..

కాలువ నిర్మాణంలో భాగంగా అనేక సవాళ్లను అధిగమిస్తూ పనులు పూర్తి చేస్తున్నారు. ఎత్తయిన కొండల్ని తవ్వుతున్నారు. ఏలేరు కాలువను, పంపా, (మిగతా 2లో)

పంథా మార్చిన చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన కఠినంగా ఉంటున్నారు. అలాంటి 49 మంది ఎమ్మెల్యేలకు నోటీసులివ్వాలని పార్టీ కార్యాలయ సిబ్బందిని ఇటీవలే ఆదేశించారు. వారిలో మంత్రులూ ఉన్నారు!

సామాజిక సమతూకంపై ప్రత్యేకదృష్టి

ముఖ్యమంత్రి ఇటీవల కడప జిల్లా కమలాపురం నియోజకవర్గ పార్టీ కేడర్‌తో సమావేశమయ్యారు. అక్కడ ఒక సామాజికవర్గానికి చెందినవారు 29% ఉంటే, వారికి 39% పదవులు ఇవ్వడం, ఎస్సీల్లోని ఒక వర్గంవారు 11% ఉంటే 8% పదవులే కేటాయించడం, 2-3% జనాభా ఉన్న కొన్ని వర్గాలకు పదవులే దక్కకపోవడం లాంటి అంశాల్ని ఆయన ప్రస్తావించారు. "పదవుల పంపకంలో నియోజకవర్గ స్థాయిలోనూ సామాజికవర్గాల్ని బ్యాలెన్స్ చేసుకోవాలి. చిన్నచిన్న వర్గాల్ని విస్మరిస్తే వాళ్ల మనుషులు కనిపించక.. బాధ్యత తీసుకోరు. పార్టీ గాలి వీచినప్పుడు అందరూ ఓట్లేస్తారు. అన్ని వర్గాలవారూ.. అన్ని సందర్భాల్లో పార్టీతో ఉండేలా సోషల్ రీ ఇంజినీరింగ్ జరగాలి" అని ఆయన స్పష్టంచేశారు.

ఎమ్మెల్యేలకు ప్రోగ్రెస్ రిపోర్టు

నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సీఎం సమావేశమైనప్పుడు... స్థానిక ఎమ్మెల్యే పనితీరును ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. పింఛన్ల పంపిణీలో ఎన్నిసార్లు పాల్గొన్నారు? స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ఎన్నిసార్లు హాజరయ్యారు? పబ్లిక్ గ్రీవెన్సెస్ ఎన్నిసార్లు నిర్వహించారు? సభ్యత్వ నమోదులో ఎన్నో స్థానంలో ఉన్నారు? ఇలా వారి ప్రోగ్రెస్ రిపోర్టు బయటపెడుతున్నారు.

వయసు, వర్గాల వారీగా విశ్లేషణ

నియోజకవర్గంలో సామాజికవర్గాలు, మహిళలు, పురుషులు ఏ పార్టీవైపు మొగ్గు చూపుతున్నారు? ఏ వయసువారిలో ఏ పార్టీకి ఆదరణ బాగుంది? తెదేపాకు దూరంగా ఉండే వర్గాల్లో.. సూపర్ సిక్స్ లాంటి సంక్షేమ పథకాల అమలు తర్వాత ఎలాంటి మార్పు వచ్చింది? గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల మొగ్గు ఎటు ఉందనే విషయాన్ని చంద్రబాబు కూలంకషంగా విశ్లేషిస్తున్నారు. ఏ వర్గాలపై ఎక్కువ దృష్టిపెట్టాలో మార్గదర్శనం చేస్తున్నారు.

శని, ఆదివారాల్లో మూడేసి గంటలు కూర్చుంటున్నా

గ్రామం నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రభుత్వం, పార్టీ పదవుల కేటాయింపులో మొహమాటాలకు తావు లేదని, పనితీరునే ప్రామాణికంగా తీసుకుంటున్నామని సీఎం స్పష్టం చేస్తున్నారు. "2024 ఎన్నికల్లో రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించాను. తెలిసిన వ్యక్తికి సీటు ఇవ్వాలనుకోలేదు. ప్రజలు మెచ్చిన వ్యక్తికే దండ వేశాను. సోషల్ రీ ఇంజినీరింగ్ చేశాను. బెస్ట్ టీమ్‌ను డెవలప్ చేశాను" అని ముఖ్యమంత్రి కమలాపురం సమావేశంలో చెప్పారు. డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటున్నానని, ప్రతి శని, ఆదివారాల్లో మూడేసి గంటలు పార్టీ వ్యవహారాల్ని సమీక్షిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.



కొలకలూరి ఇనాక్‌కు పురస్కారం అందిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

గురజాడ గొప్పదనాన్ని పిల్లలకు తెలియజేయాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: సమాజంలో పేరుకుపోయిన దురాచారాలను రూపుమాపేందుకు గురజాడ అప్పారావు ఎంతో కృషిచేశారని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్.మానవేంద్రనాథ్‌రాయ్ అన్నారు. గురజాడ వర్ధంతి సందర్భంగా విజయనగరంలోని పి.వి.జి.రాజు క్షత్రియ కల్యాణమండపంలో ఆదివారం జరిగిన గురజాడ సాహితీ చైతన్యోత్సవంలో ఆయన మాట్లాడారు. ఆ మహాకవి గొప్పదనాన్ని నేటితరం పిల్లలకు తెలియజేయాలని, ఆయన రచనలను చదవాలని సూచించారు. గురజాడలో ఒక దేశభక్తుడు, సంఘసంస్కర్త కనిపిస్తాడన్నారు. సొంతలాభం కొంత మానుకుని, పొరుగువాడికి తోడు పడవోయ్.., దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్.. అన్న మాటలు నేటికీ అందరి మదిలో నిలిచిపోయాయని చెప్పారు.

కొలకలూరికి విశిష్ట పురస్కారం

ఈ ఏడాదికి గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రకటించిన విశిష్ట పురస్కారాన్ని ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ అందించారు. ఈ సందర్భంగా ఇనాక్ మాట్లాడుతూ.. గురజాడ అప్పారావు ఓ చైతన్యశక్తిగా ఎదిగి, తెలుగుగడ్డపై చెరగని ముద్ర వేశారని కొనియాడారు. మనుషుల మధ్య భేదాభిప్రాయాలు పోగొట్టేందుకు ఆయన రచనలు ఉపయోగపడ్డాయని చెప్పారు. జిల్లా కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి, ఎస్పీ దామోదర్, గురజాడ వారసులు ఇందిర, వెంకటేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష రంగం ఎప్పటికీ ప్రైవేటీకరణ కాదు

ఇస్రో ఛైర్మన్ నారాయణన్

చెన్నై (సైదాపేట), న్యూస్‌టుడే: అంతరిక్ష రంగం ఎప్పటికీ ప్రైవేటీకరణ కాదని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ పేర్కొన్నారు. చెన్నైలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. "2025లో ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్‌కు అంతరిక్ష రంగంలో పలు విజయాలు దక్కాయి. ఈ ఏడాది జనవరిలో 100వ రాకెట్‌ను ప్రయోగించడం ద్వారా రికార్డు సృష్టించాం. ప్రస్తుతం 57 కృత్రిమ ఉపగ్రహాలు అంతరిక్షంలో తిరుగుతున్నాయి. రానున్న మూడేళ్లలో వీటి సంఖ్య 150కి చేరుతుంది. కేంద్ర ప్రభుత్వంలోని 68 శాఖల్లో కృత్రిమ ఉపగ్రహాల అవసరం ఉంది. ఇందుకు ప్రైవేట్ సంస్థల సాయమూ తీసుకుంటున్నాం" అని తెలిపారు.

అమరావతిలో మరో 5 స్టార్ హోటల్

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిలో మరో 5 స్టార్ హోటల్ ఏర్పాటు కానుంది. సీడ్ యాక్సెస్ రహదారి పక్కన ఈ-3, ఎన్-6 జంక్షన్ వద్ద హోటల్ నిర్మాణానికి మట్టి పరీక్షలు చేస్తున్నట్టు ఆదివారం అక్కడ పనిచేస్తున్న సిబ్బంది తెలిపారు. మహాలక్ష్మీ గ్రూప్‌నకు చెందిన 'డబుల్ ట్రీ బై హిల్టన్' పేరుతో ఈ హోటల్ రానున్నట్లు తెలిసింది. 25 అంతస్తులతో 200 లగ్జరీ గదులు, భారీ కన్వెన్షన్ సెంటర్‌తో హోటల్ నిర్మించనున్నట్లు సమాచారం.


తిరుమలలో అందుబాటులో లేని బంగారు డాలర్లు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న తితిదే డాలర్ల విక్రయ కేంద్రంలో బంగారు డాలర్లు 16 రోజులుగా అందుబాటులో లేవు. దర్శనానంతరం భక్తులు శ్రీవారి దర్శనానికి గుర్తుగా తితిదే డాలర్ల కేంద్రంలో బంగారు, వెండి, రాగి డాలర్లను కొనుగోలు చేస్తారు. వాటిపై శ్రీవారు, అమ్మవారి ఫొటోలు ఉండటంతో సేకరించి పెట్టుకుంటారు. కొన్ని రోజులుగా 2, 5, 10 గ్రాముల బంగారు డాలర్లు లేవు. అధికారులు స్పందించి డాలర్లను విక్రయ కేంద్రంలో అందుబాటులో ఉంచాలని భక్తులు కోరుతున్నారు.

ప్రతి నియోజకవర్గంలో సర్వే

- అన్నిచోట్లా సమాచారం తెప్పించుకుంటున్నా
- నేతలు.. కార్యకర్తల మనసెరిగి నడుచుకోవాలి
- 3న రైతు సేవా కేంద్రాల్లో కార్యశాలలు
- 5న మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌లలో పాల్గొనాలి
- పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం

ఈనాడు, అమరావతి: ప్రతి నియోజకవర్గంలోనూ సర్వే చేయించి సమాచారం తెప్పించుకుంటున్నానని సీఎం చంద్రబాబు తెలిపారు. కార్యకర్తల మనోభీష్టం మేరకే నాయకులు నడుచుకోవాలని సూచించారు. పొలిటికల్ గవర్నెన్స్ అనేది కూటమి ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. తెదేపా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యనేతలు మొదలు బూత్‌స్థాయి కార్యకర్తలతో ఆదివారం ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. "సమష్టిగా పనిచేసి ప్రజల్లో ఉందాం. కార్యకర్తలను పట్టించుకోకుండా, ప్రజల్లో ఉండకపోతే మనం ఎంత చేసినా ప్రయోజనం ఉండదు. రాష్ట్రాన్ని ఐదు జోన్లుగా విభజించి అభివృద్ధి చేస్తున్నాం. పెట్టుబడుల సదస్సు ద్వారా ఇప్పటికే రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి"



అని చంద్రబాబు వివరించారు. తెదేపాకు 12 లక్షల మంది కుటుంబ సాధికార సారథులు, 46 వేల మంది బూత్, 8 వేల మంది యూనిట్ ఇన్‌ఛార్జులతో ఓ పెద్ద వ్యవస్థ ఉందని గుర్తుచేశారు. వీరంతా కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

17 నెలలుగా నేనే పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నా

"17 నెలలుగా నేనే పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నాను. అలాగే అన్ని స్థాయిల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలి. ప్రతినెలా ఒకటో తేదీన ఏ ఆటంకమూ లేకుండా పింఛన్ల పంపిణీ నిర్వహిస్తున్నాం. దీనికి ఇప్పటివరకు రూ.50,763 కోట్లు ఖర్చుచేశాం. డిసెంబర్ 3న రైతుసేవా కేంద్రాల్లో నిర్వహించే వర్క్‌షాపులు, 5న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్.. ఇలా ప్రతి కార్యక్రమంలో పార్టీ నాయకత్వం, కార్యకర్తలు పాల్గొనాలి" అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కొన్నిచోట్ల అనర్హులు పింఛన్లు తీసుకుంటున్నారని, అదే సమయంలో అర్హులకు అన్యాయం జరగకూడదని చంద్రబాబు గుర్తుచేశారు. త్వరలో ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ఉమ్మడి కుటుంబాలకు మరింత లబ్ధి చేకూరుస్తామన్నారు.

గత పాలకుల విధ్వంసం గురించి ప్రజల్లో చర్చ జరగాలి

వైకాపా హయాంలో రాష్ట్రం విధ్వంసానికి గురైందని చంద్రబాబు పేర్కొన్నారు. "వైకాపా పాలకుల అరాచకాల గురించి ఇంకా చర్చ జరగాలి. రాజకీయ కక్షతో నీరు-చెట్టు, ఉపాధి హామీ బిల్లులనూ ఆపేశారు. కేంద్రంతో మాట్లాడి ఆ బిల్లులు మంజూరు చేయించాం. ఉగాది నాటికి 5 లక్షల ఇళ్లను ప్రజలకు అప్పగిస్తాం. పార్టీ కార్యక్రమాలకు డిసెంబరు క్యాలెండర్ రూపొందించాం. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించి చెబితే కూటమిని కాదని మరో పార్టీకి ప్రజలు ఓటు వేయరు. నేతలు నిరంతరం ప్రజలతో మమేకం కావాలి. ఇప్పటికే పార్టీ కోసం కష్టపడ్డవారికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చి గౌరవించాం" అని చంద్రబాబు పేర్కొన్నారు.

నేడు ఏలూరు జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఈ నెల ఒకటో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలంలో పర్యటించనున్నారు. ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో గొల్లగూడెం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో గోపినాథపట్నం చేరుకుని మూత్రపిండాల వ్యాధిగ్రస్తురాలు గుడ్ల నాగలక్ష్మి ఇంటికి వెళ్లి ఆమెకు పింఛను అందజేస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో నల్లమాడు చేరుకుని ప్రజావేదిక వద్ద ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు. అనంతరం గొల్లగూడెం వెళ్లి కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. సీఎం పర్యటనపై కలెక్టర్ వెట్రిసెల్వి ఆధ్వర్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు.

సర్‌పై చర్చించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

కొంత మంది ప్రతిపక్ష సభ్యులు డిమాండు చేశారు. రాష్ట్రాలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు పెండింగ్‌లో ఉంచడంపై ఆందోళన వ్యక్తం చేశారు.



అఖిలపక్ష సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్

- అఖిలపక్ష సమావేశం మొక్కుబడి కార్యక్రమమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలతో చర్చించకుండా.. సర్‌పై స్వల్ప చర్చను ఎజెండాలో మోదీ ప్రభుత్వం చేర్చిందని అభిప్రాయపడ్డారు. 'పార్లమెంటరీ చరిత్రలోనే అతి తక్కువగా 15 రోజులే ఈ సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఈ కొద్ది రోజుల్లోనే 13 బిల్లులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 10 బిల్లులను స్టాండింగ్ కమిటీలు పరిశీలించనేలేదు' అని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడానికి, పార్లమెంటును దారి తప్పించడానికి, పార్లమెంటరీ సంప్రదాయాలను మంటగలపడానికి అధికార పక్షం ప్రయత్నిస్తోందని లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నేత గౌరవ్ గొగొయ్ విమర్శించారు. జాతీయ భద్రత, వాయు కాలుష్యం, ఓటరు జాబితా స్వచ్ఛీకరణ, విదేశాంగ విధానం, రైతులకు గిట్టుబాటు ధరలపై చర్చించాలని డిమాండు చేశారు. సర్‌పై చర్చకు అనుమతించకపోతే.. పార్లమెంటు సమావేశాలు సజావుగా జరగడం ప్రభుత్వానికి ఇష్టం లేదని భావించాల్సి వస్తుందని రాజ్యసభలో కాంగ్రెస్ పక్ష ఉప నేత ప్రమోద్ తివారీ స్పష్టం చేశారు.
- సర్‌పై చర్చించకపోతే పార్లమెంటు సమావేశాలను సాగనివ్వబోమని సమాజ్‌వాదీ పార్టీ నేత రాంగోపాల్ యాదవ్ తేల్చి చెప్పారు.
- పార్లమెంటు సమావేశాలు సజావుగా జరగకపోతే ప్రభుత్వానిదే బాధ్యతని సీపీఎం నేత జాన్ బ్రిటాస్ అభిప్రాయపడ్డారు.
- సర్‌పై చర్చకు అనుమతిస్తే సభ సజావుగా సాగేందుకు అంగీకరిస్తామని తృణమూల్ నేత కల్యాణ్ బెనర్జీ పేర్కొన్నారు.
- సర్‌పై చర్చించాలని ప్రతిపక్షాలు ఏకగ్రీవంగా డిమాండు చేశాయని డీఎంకే నేత తిరుచ్చి శివ తెలిపారు.
- సర్‌పై చర్చించాలని సీపీఐ ఎంపీ సందోశ్ కుమార్, బిజూ జనతాదళ్ సస్మిత్ పాత్ర డిమాండు చేశారు.

15 రోజులే..

సాధారణంగా పార్లమెంటు శీతాకాల సమావేశాలు 20 రోజులపాటు (పని దినాలు) జరుగుతాయి. కానీ ఈసారి వాటిని 15 రోజులకే కుదించారు. దీనిపై ప్రతిపక్షాలు అసంతృప్తి వ్యక్త చేశాయి. అణు ఇంధన బిల్లు-2025 ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. దీంతోపాటు ఉన్నత విద్య, మరో 8 బిల్లులు సభకు రానున్నాయి.

- రాజ్యసభా వ్యవహారాల సలహా కమిటీ సమావేశంలో సర్ అంశాన్ని ప్రతిపక్షాలు ప్రస్తావించాయి. ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ అధ్యక్షతన ఆదివారం ఈ సమావేశం జరిగింది. సభ సజావుగా సాగేందుకు అన్ని పక్షాల నేతలు ఈ సందర్భంగా అంగీకరించారు. ఎన్నికల సంస్కరణలపై సోమవారం మధ్యాహ్నం అత్యవసరంగా చర్చించాలని ప్రతిపక్షాలు కోరాయి.
- లోక్‌సభా వ్యవహారాల కమిటీ సమావేశంలోనూ సర్ అంశంపైనే ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. వందే మాతరం 150వ దినోత్సవం నేపథ్యంలో ఈ అంశంపై చర్చిద్దామని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనిపై 10 గంటలపాటు చర్చించాలని నిర్ణయించారు. ఎప్పుడు చర్చించాలనేది స్పీకర్ ఓం బిర్లా నిర్ణయించనున్నారు.

సభలో ప్రవేశపెట్టనున్న కొన్ని బిల్లులు

- భూసేకరణను వేగవంతం చేసే జాతీయ రహదారుల (సవరణ) బిల్లు.
- మరింత సులభతర వ్యాపారం కోసం కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లు.
- సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్ (ఎస్ఎంసీ) బిల్లు-2025.
- మధ్యవర్తిత్వ బిల్లులోని సెక్షన్ 34 మార్పు బిల్లు.

ఖాతాల కంత్రీలు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి ఉనికి తెలియకుండా ఉండేందుకు ఈ నేర విధానం అనుసరిస్తున్నారు. మొదటి అంచెలో బాధితులు తొలుత సైబర్ నేరగాళ్లు చెప్పే మ్యూల్ ఖాతాలో డబ్బు జమచేస్తారు. రెండో అంచెలో ఆ మ్యూల్ ఖాతా నుంచి వందలు, వేల సంఖ్యల్లోని మ్యూల్స్ ఖాతాల్లోకి క్షణాల్లో డబ్బు బదిలీ అవుతుంది.

- ఈ అక్రమ చెల్లింపుల కోసం నేరగాళ్లు చైనాకు చెందిన ప్రత్యేక పేమెంట్ గేట్‌వేలు వినియోగిస్తున్నారు.

దశ-1: ఎక్కడా అనుమానం రాకుండా

'రోజుకు రూ.10 లక్షల మేర లావాదేవీలు నిర్వహించేందుకు అనుమతి ఉన్న మర్చంట్ క్యూఆర్ బ్యాంక్ ఖాతాలు అత్యవసరంగా కావాలి. కార్పొరేట్ స్థాయి ప్రివిలేజెస్ కలిగిన, అపరిమిత లావాదేవీల నిర్వహణకు అవకాశమున్న బ్యాంకు ఖాతాలు ఉంటే వెంటనే సంప్రదించండి. మీకు 10 శాతం కమీషన్ చెల్లిస్తాం' అంటూ టెలిగ్రామ్, వాట్సప్ గ్రూపులతో పాటు డార్క్‌వెబ్‌ల ద్వారా ఎగ్రిగేటర్లు ప్రకటనలిస్తున్నారు. ఎంక్యూఆర్ డీల్స్ 2025, జీపీఆర్ పే, ఫైనాన్స్ ట్రాన్స్‌ఫర్ క్రూ వంటి గ్రూపుల పేరుతో ఈ దందా నడిపిస్తున్నారు. +6699 వంటి వర్చువల్ వాట్సప్ నంబర్ల ద్వారా సంబంధిత ఖాతాదారుల్ని సంప్రదిస్తున్నారు. ఇలాంటి ఖాతాలు కలిగిన వారిని గుర్తించేందుకు కొన్ని సందర్భాల్లో వివిధ వ్యాపారాల పేరిట ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. సైబర్ నేరాల్లో కొల్లగొట్టిన భారీ మొత్తాలు ఈ ఖాతాల్లో జమైనా, వాటి నుంచి బదిలీ అయినా ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు వీలుగా ఎంపిక చేసుకుంటున్నారు. బాధితుడికి ఏ బ్యాంకులో ఖాతా ఉందో అదే బ్యాంకులో ఉండే ఖాతాలను అప్పటికప్పుడు సైబర్ నేరగాళ్లకు అందిస్తున్నారు.

దశ-2: కొందరు బ్యాంకు ఉద్యోగుల సహకారం

బ్యాంకు ఖాతాల్లో కేవైసీ రెడ్‌ఫ్లాగ్‌లను తొలగించడానికి కొందరు బ్యాంకు ఉద్యోగులు ఈ మనీ మ్యూల్ అగ్రిగేటర్లకు సహకరిస్తున్నారు. క్లెయిమ్‌ల వెరిఫికేషన్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ క్రెడెన్షియల్స్‌ను వారికి అందిస్తున్నారు. భారీ మొత్తాల్లో నగదు లావాదేవీలు చట్టబద్ధమైన వ్యాపారం ముసుగులో జరుగుతున్నా.. వాటిని తెలిసి కూడా ఉద్దేశపూర్వకంగానే వాటిని పట్టించుకోకుండా ఉంటున్నారు. సాధారణ సేవింగ్స్ ఖాతాలను భారీ మొత్తాల్లో లావాదేవీలకు ఆస్కారం కల్పించే మ్యూల్స్ ఖాతాలుగా మారుస్తున్నారు. ఏలూరులో నమోదైన డిజిటల్ అరెస్టు కేసులోనూ మహారాష్ట్రకు చెందిన ఓ బ్యాంకు మేనేజర్ సాయంతోనే సైబర్ నేరగాళ్లు.. వారు దోచుకున్న సొత్తును వివిధ ఖాతాల్లోకి మళ్లించినట్లు తేలింది.

దశ-3: మ్యూల్ ఖాతాదారులను బంధించి..

సైబర్ నేరగాళ్లు బాధితుల నుంచి మ్యూల్స్ ఖాతాల్లోకి డబ్బులు జమ చేయించిన తర్వాత.. ఆ మ్యూల్స్‌ను తమ నిర్బంధంలో పెట్టుకుంటున్నారు. మెట్రో నగరాల్లోని హోటళ్లలోకి తీసుకెళ్లి అక్కడ బంధించి.. వారి మొబైళ్లలోకి మోసపూరిత ఏపీకే ఫైల్స్ పంపించి.. ఆ ఫోన్లతో తమ పని పూర్తి చేసుకుంటున్నారు. సైబర్ నేరాల్లో కొల్లగొట్టిన సొత్తును ఆ ఖాతాల్లో నుంచి తమ ఖాతాల్లోకి బదిలీ చేసుకునే మనీ లాండరింగ్ సైకిల్ పూర్తయ్యేంతవరకూ వారి అదుపులోనే ఉంచుకొని ఈ ప్రక్రియ ముగిశాకే వారిని వదిలిపెడుతున్నారు.

దశ-4: క్రిప్టో ద్వారా కమీషన్ల చెల్లింపు

బాధితుల నుంచి కొల్లగొట్టిన డబ్బంతా తమ ఖాతాల్లోకి బదిలీ అయిపోతే.. సంబంధిత మనీ అగ్రిగేటర్లకు సైబర్ నేరగాళ్లు యూఎస్‌డీటీ రూపంలో ఫైనాన్స్ వాలెట్‌ల ద్వారా కమీషన్ చెల్లిస్తున్నారు. ఈ అగ్రిగేటర్లు తర్వాత దశలో వాటిని క్రిప్టో నుంచి రూపాయిల్లోకి మార్చుకుంటున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకోండి..

- మీ బ్యాంకు ఖాతాను అమ్మడం, అద్దెకివ్వడం నేరం. అలా ఇవ్వాలని ఎవరైనా ఒత్తిడి చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.
- ఓటీపీ వర్క్, వర్క్ ఫ్రమ్ హోమ్, లోన్ ప్రాసెసింగ్, ఆన్‌లైన్ కమీషన్ వంటి ఆఫర్ల పేరిట నిర్వహించే టెలిగ్రామ్, వాట్సప్ గ్రూపులను నమ్మొద్దు.
- బ్యాంక్ వర్క్ చేయండి.. సులువుగా కమీషన్ సంపాదించండి అంటూ టెలిగ్రామ్, వాట్సప్‌ల్లో నిర్వహించే గ్రూపులను విశ్వసించవద్దు.
- ఆధార్, పాన్ తదితర వివరాలు ఎవరికీ ఇవ్వొద్దు.

ఉత్తరాంధ్ర ఆయకట్టుకు గోదావరి ఆయువు

(మొదటి పేజీ తరువాయి)

తాండవ, వరాహ వంటి చిన్న నదులను కాలువ దాటాల్సి ఉంది. ఇందుకోసం సైఫన్‌లు, అక్విడక్టులు నిర్మిస్తున్నారు. మరోవైపు చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిని ఈ కాలువ దాటుతూ వెళ్తుంది. అక్కడ వంతెనల నిర్మాణానికి ట్రాఫిక్ మళ్లింపు కష్టంగా మారింది. ఎన్ని అవాంతరాలు ఎదురైనా వచ్చే సీజన్‌లో వరద సమయానికి ఈ కాలువ చివరి వరకు గోదావరి జలాలు అందించాలని కృతనిశ్చయంతో ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి రామానాయుడు సమీక్షలతో పాటు ప్రతి సోమవారం జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ పనుల పురోగతిని సమీక్షిస్తున్నారు. ఎస్ఈ ఏసుబాబు వారానికి మూడు రోజులు క్షేత్రస్థాయిలోనే ఉంటున్నారు.

4 లక్షల ఎకరాలకు సాగునీరు

- పోలవరం ఎడమ కాలువ పనులు 8 ప్యాకేజీల్లో చేస్తున్నారు. 177.809 కి.మీ మేర కొత్తగా కాలువ తవ్వుతున్నారు. ఆ తర్వాత ఏలేరు జలాశయం నుంచి ప్రస్తుతం విశాఖకు నీళ్లిచ్చే కాలువను 22 కి.మీ.పైగా పోలవరం ఎడమ కాలువ ప్రవాహ సామర్థ్యానికి అనుగుణంగా మార్పులు చేయాల్సి ఉంటుంది. ఇది కాకుండా మరో 10.850 కి.మీ మేర కొత్త కాలువ తవ్వాల్సి ఉంది.
- 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించనున్నారు. కాకినాడ జిల్లాలో 1.67 లక్షల ఎకరాలు, అనకాపల్లిలో 1.50 లక్షల ఎకరాలు, తూర్పుగోదావరిలో 81 వేలు, కోనసీమలో 2 వేల ఎకరాల ఆయకట్టు ఉంది.
- విశాఖపట్నం జిల్లా కేంద్రంతో పాటు 560 గ్రామాలకు తాగునీరు ఇస్తారు. వివిధ పరిశ్రమలకు 23.44 టీఎంసీల నీటిని సరఫరా చేస్తారు.
- ఈ కాలువ చివరి నుంచి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి గోదావరి వరద జలాలు మళ్లిస్తారు. ఉత్తరాంధ్ర జిల్లాలన్నింటికీ గోదావరి నీళ్లు చేరతాయి.

కూటమి ప్రభుత్వం ఏం చేసింది?

- 2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే తొలి రెండు ప్యాకేజీల్లో దాదాపు పనులు పూర్తయ్యాయి. పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఏలేరు జలాశయానికి గోదావరి వరద జలాలు మళ్లించేందుకు నాడు ఆ పనులు వేగంగా చేసేశారు. ఆ తర్వాత ఏర్పడిన వైకాపా ప్రభుత్వంలో ఎడమ కాలువ పనులను పట్టించుకోలేదు.
- మళ్లీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వీలైనంత త్వరగా అనకాపల్లి జిల్లాలో 1.50 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలని రంగంలోకి దిగింది. 1, 3, 5, 5ఏ, 6ఏ, 8, 8ఏ ప్యాకేజీల్లో మిగిలిన పనులకు ఎంత ఖర్చవుతుందో లెక్కించింది. రూ.1,028 కోట్ల విలువతో టెండర్లు పిలిచి 2025 జనవరి నాటికి గుత్తేదారులకు పనులు అప్పగించింది.


కొండల్ని తొలచి.. మట్టిని గట్టుగా మలిచి

పోలవరం ఎడమ కాలువ ఐదో ప్యాకేజీలో ఏళ్ల తరబడి పనులు సాగలేదు. అక్కడ ఉన్న కుమ్మరిలోవ గ్రామస్థులకు పునరావాస ప్యాకేజీపై ఒప్పందం కుదరకపోవడంతో పనులు ఆగిపోయాయి. కాకినాడ జిల్లా కలెక్టర్, గుత్తేదారు సంస్థ, స్థానిక రెవెన్యూ అధికారులు వారితో చర్చించి, ఒప్పించారు. ఆ ఊరిని ఖాళీ చేయించడం ఒక ఎత్తు కాగా.. కొండల్ని తొలిచి కాలువ స్థాయికి తీసుకురావడం మరో ఎత్తు. తొలుత కొండను తొలవాలి. రెండోవైపు కాలువ గట్టు కోసం మట్టిని కట్టగా మలచాలి. ఇందుకోసం కొండల్ని దాదాపు 87 మీటర్ల మేర తొలచాల్సి వచ్చింది. ఈ చిత్రంలో ఆ పని స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ప్యాకేజీలో మొత్తం 62 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పని ఉండగా 47 లక్షల క్యూబిక్ మీటర్ల పని పూర్తయింది. కొండల పక్కనే



తాండవ నది ప్రవహిస్తోంది. ఆ నదిని కూడా పోలవరం ఎడమ కాలువ దాటాలి. అందుకు నదిపై అక్విడక్టు నిర్మాణం గతంలో కొంతచేస్తే ఇప్పుడు మిగిలిన పని వేగంగా చేస్తున్నారు. ఆ అక్విడక్టును పై చిత్రంలో గమనించవచ్చు. సవాళ్లతో కూడిన ఈ పనులను పది నెలల్లోనే కొలిక్కి తీసుకొచ్చారు.

నదుల మీదుగా కాలువ ప్రవాహం



పోలవరం ఎడమ కాలువ వెళ్లే మార్గంలో ఏలేరు కాలువ, పంపా, తాండవ, వరాహ నదులను దాటాల్సి ఉంటుంది. ఈ మేరకు ఏలేరు కాలువ వద్ద సైఫన్, పంపా, తాండవ వద్ద అక్విడక్టుల నిర్మాణాలు కీలకం. ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్నది ఏలేరు కాలువ.. ఆ కాలువను దాటించేలా సైఫన్ నిర్మిస్తున్నారు. ఏలేరు జలాశయం నుంచి ఏలేరు కాలువ ద్వారా ఆయకట్టుకు పైనుంచి నీళ్లు వెళ్తుండగా.. ఈ సైఫన్ వద్ద ఎడమ కాలువ నీళ్లు కింద నుంచి ప్రవహిస్తాయి. సైఫన్ సాయంతో ఇక్కడ పోలవరం కాలువ ఏలేరు కాలువను దాటుతుంది. ప్రస్తుతం 11 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి అనుగుణంగా పనులు చేశారు. మిగిలిన పనులు కొనసాగుతున్నాయి. పంపా వద్ద నీటి ప్రవాహం ఉండటంతో ప్రస్తుత ఖరీఫ్ ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాల్సి ఉంది. నవంబరు నెలాఖరు తర్వాత పనులు ప్రారంభమవుతాయి. వరాహ అక్విడక్టు పనులు దాదాపు పూర్తయ్యాయి.

జాతీయ రహదారుల వద్ద నిర్మాణం పెద్దసవాల్..

పోలవరం ఎడమ కాలువ చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి, కత్తిపూడి ఒంగోలు జాతీయ రహదారిని మొత్తం 9 చోట్ల దాటుతుంది. అక్కడ వంతెనలు నిర్మించాల్సి ఉంది. ఈ చిత్రంలో కనిపిస్తున్నది కాకినాడ జిల్లాలోని బెండపూడి వద్ద హైవేను మళ్లించేందుకు ఎడమ కాలువపై నిర్మిస్తున్న వంతెనలు. ఈ రోడ్డు నిత్యం రద్దీతో ఉంటుంది. తొలుత హైవేను ఆనుకుని తాత్కాలిక వారధులు నిర్మించి ట్రాఫిక్‌ను అటువైపు మళ్లించాక.. జాతీయ రహదారిపై ఆరు నెలల్లోగా శాశ్వత వంతెనలు నిర్మించనున్నారు. ఈలోపు మళ్లింపు వంతెనలు నిర్మించినా వాటి అప్రోచ్‌ల వల్ల నేరుగా ట్రాఫిక్ వెళ్లేందుకు ఆస్కారం లేదని, కొన్నిచోట్ల గ్రామాలు ఉన్నాయని జాతీయ రహదారుల సంస్థ అభ్యంతరాలు తెలియజేస్తోంది. ఈ అంశంపై జలవనరులశాఖ అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా సమస్య పరిష్కారం కావడం లేదు. పైగా కొన్నిచోట్ల ప్రస్తుత జాతీయ రహదారి కన్నా ఎంతో ఎత్తుకు వంతెనలు నిర్మించాల్సి వస్తోంది. కాలువ ప్రవాహ సామర్థ్యం ఆధారంగా అది తప్పడం లేదు. అక్కడ అప్రోచ్‌లు, భూసేకరణ మరింత సమస్యగా ఉంది.



కొత్తగా 8,190 మందికి స్పౌజ్ కేటగిరీ కింద పింఛన్లు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం కింద డిసెంబర్ నెలకు స్పౌజ్ కేటగిరీ (వితంతువులకు) కింద 8,190 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేసినట్లు సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. వీరికి రూ.4వేల చొప్పున పింఛను అందించేందుకు నెలకు రూ.3.28 కోట్లు ఖర్చవుతుందని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రహం అనుగ్రహం

1-12-2025 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, శుక్లపక్షం
ఏకాదశి: మ. 2-18 తదుపరి ద్వాదశి
రేవతి: రా. 7-49 తదుపరి అశ్విని
వర్జ్యం: ఉ. 8-24 నుంచి 9-56 వరకు
అమృత ఘడియలు: సా. 5-32 నుంచి 7-03 వరకు
దుర్ముహూర్తం: మ. 12-10 నుంచి 12-54 వరకు తిరిగి 2-23 నుంచి 3-07 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6.17; సూర్యాస్తమయం: సా.5.20
సర్వ ఏకాదశి, గీతా జయంతి

చలి-పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	17.4	27.5
విజయనగరం	18.0	26.0
అనంతపురం	19.0	28.5
కడప	21.0	24.0
రాజమహేంద్రవరం	21.0	29.0
కర్నూలు	21.4	28.5
తాడేపల్లిగూడెం	22.0	27.0
తిరుపతి	23.0	24.2
విశాఖపట్నం	23.0	29.0
శ్రీకాకుళం	23.0	29.0
నెల్లూరు	23.4	26.7
విజయవాడ	23.4	28.0
నరసాపురం	23.8	28.2
ఒంగోలు	24.0	25.1
గుంటూరు	24.0	28.0


శ్రీవారి ఆలయం ఎదుట కురుస్తున్న వర్షం

తిరుమలలో ఎడతెరపి లేని వర్షం

నిండుకుండల్లా ఐదు డ్యామ్‌లు

తిరుమల, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో తిరుమలలో ఎడతెరపి లేని వర్షం కురుస్తోంది. ఆదివారం తిరుమలలోని దర్శనీయ ప్రదేశాలు పాపవినాశనం, శ్రీవారి పాదాలకు వెళ్లే మార్గాలను మూసేశారు. ఘాట్‌రోడ్డులో ప్రయాణించే వాహనదారులను అలిపిరి వద్ద తితిదే భద్రతా సిబ్బంది అప్రమత్తం చేస్తున్నారు. మరోవైపు తిరుమలలోని ఐదు డ్యామ్‌లు పూర్తిగా నిండి పొంగి పొర్లుతున్నాయని తితిదే వాటర్ వర్క్స్ ఈఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గోగర్భం, పాపవినాశనం డ్యామ్‌లలో ఒక గేటు తెరచి నీటిని దిగువకు విడుదల చేశారు. ఆకాశగంగ, కుమారధార, పసుపుధార డ్యామ్‌లు పూర్తిగా నిండాయి. ఈ వర్షానికి తిరుమలలోని పలు తీర్థాలు, జలపాతాలు జలకళ సంతరించుకున్నాయి.

దిత్వా ప్రభావంతో తమిళనాడులో ముగ్గురి మృతి

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: దిత్వా తుపాను కారణంగా తమిళనాడులో ముగ్గురు మృతి చెందారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో తంజావూరు జిల్లా కుంభకోణం సమీపం ఆలమన్‌కురిచ్చి గ్రామంలో ఇంటి గోడ కూలి రేణుక(20) అనే యువతి ప్రాణాలు కోల్పోగా, కుటుంబీకులు ముగ్గురు గాయపడ్డారు. తూత్తుకుడిలో గోడకూలి ఒకరు, మైలాడుతురైలో విద్యుదాఘాతంతో ఒకరు చనిపోయారు.

తమిళనాట ఘోర రోడ్డు ప్రమాదం

9 మంది మహిళలు సహా 11 మంది దుర్మరణం


ఢీకొన్న బస్సులు

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: రెండు ప్రభుత్వ బస్సులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో 11 మంది మృతిచెందిన ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తిరుప్పూర్ నుంచి కారైక్కుడి వెళ్తున్న ప్రభుత్వ బస్సు, కారైక్కుడి నుంచి దిండుక్కల్ వెళుతున్న మరో బస్సు శివగంగై జిల్లా కుంబన్‌కుడి వంతెన వద్ద ఆదివారం సాయంత్రం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ బస్సు డ్రైవరు సహా ఎనిమిది మంది ప్రయాణికులు ఘటనాస్థలిలోనే మృతిచెందారు. మరో ముగ్గురు తిరుప్పత్తూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చనిపోయారు. 40 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. వారిని అంబులెన్స్‌ల ద్వారా తిరుప్పత్తూర్, మదురై, కారైక్కుడి ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. అందులో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుల్లో తొమ్మిది మంది మహిళలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని జిల్లా కలెక్టరు పొర్కొడి, జిల్లా ఎస్పీ పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. దిండుక్కల్ వెళ్తున్న బస్సు అతి వేగంగా వెళ్లడం కారణంగా ప్రమాదం జరిగినట్లు పోలీసుల దర్యాప్తులో తెలిసింది.

తీవ్ర వాయుగుండంగా బలహీనపడిన దిత్వా తుపాను

- కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు

ఈనాడు, అమరావతి: తమిళనాడు, పుదుచ్చేరి తీరం వెంట ఉత్తరం దిశగా కదులుతూ రెండు రోజులుగా తీరప్రాంత జిల్లాల ప్రజల్ని వణికిస్తున్న దిత్వా తుపాను ఆదివారం సాయంత్రం తీవ్ర వాయుగుండంగా బలహీనపడింది. సోమవారం ఉదయానికి ఇది మరింత బలహీనపడి వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఫలితంగా రాష్ట్రంపై వర్షాల ప్రభావమూ తగ్గనుంది. తుపాను ప్రభావంతో ఆదివారం ఉదయం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ముసురు వాతావరణం నెలకొంది. చిరుజల్లులు కురిశాయి. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 8 గంటల మధ్య అత్యధికంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో 88.75, జలదంకిలో 56.25, తిరుపతి జిల్లా చిట్టమూరులో 32.75 మి.మీ. వర్షపాతం నమోదైంది.

✦ తీవ్ర వాయుగుండం ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమలో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. తీరం వెంట గంటకు 45 నుంచి 65 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని, సముద్రం అలజడిగా ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.

✦ సోమవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు. అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురవొచ్చని విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది.

ఆర్టీజీఎస్ ద్వారా హోం మంత్రి సమీక్ష

తుపాను నేపథ్యంలో రాష్ట్రంలో పరిస్థితిని హోం మంత్రి అనిత ఆదివారం ఆర్టీజీఎస్ కార్యాలయం నుంచి సమీక్షించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, వైఎస్సార్ కడప, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ప్రజల్ని అప్రమత్తం చేయాలని, ప్రాణనష్టం లేకుండా చూడాలని చెప్పారు.

✦ దిత్వా తుపాను దృష్ట్యా దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. తుపాను సన్నద్ధతపై టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో ఆయన సమీక్షించారు.

తుపాను ప్రభావంతో ముందే పంట కోతలు

దిత్వా తుపాను దృష్ట్యా రైతులు ఆందోళన చెందుతున్నారు. మారిన వాతావరణ పరిస్థితుల్లో ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఎక్కడ నేలపాలవుతుందనే భయం వారిని వెంటాడుతోంది. దాంతో వరి పంట పూర్తి స్థాయిలో కోతకు రాకపోయినా ముందస్తుగానే కోసేస్తున్నారు. ఒక్కసారిగా అన్నదాతలు పంట కోత పనులు చేపట్టడంతో కూలీలు, యంత్రాలకు డిమాండ్ ఏర్పడింది. గతంలో యంత్రంతో ఎకరా పంట కోయడానికి రూ.2,500 ఉండగా, ప్రస్తుతం రూ.4 వేలకు పైనే తీసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. యంత్రాలు, కూలీల కొరత ఉండడంతో కృష్ణా జిల్లా కంకిపాడు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన కౌలు రైతు కొలుగుమట్టి నాగేశ్వరరావు రాత్రివేళ హార్వెస్టర్‌తో పంటను కోయించారు. ఎందరో రైతులు ఇలాగే కంటి మీద కునుకు లేకుండా పంటను రక్షించుకోవడానికి పొలాల్లో కాపలా కాస్తున్నారు.


వేల్పూరులో రాత్రివేళ సాగుతున్న వరి కోత పనులు

సర్దార్ పటేల్ సేవలు యువతకు స్ఫూర్తి

ఏక్తా యాత్రలో వెంకయ్యనాయుడు


వడోదరలో జరిగిన ఏక్తా యాత్రలో పాల్గొన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు, దిల్లీ: ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని నవంబరు 26న ఆయన జన్మస్థలం కరంసద్ నుంచి ప్రారంభమైన ఏక్తాయాత్రలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. ఈ పాదయాత్ర ఆదివారం గుజరాత్‌లోని వడోదరకు చేరుకున్న సందర్భంగా వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని యాత్రికులతో కలిసి నడిచారు. అనంతరం బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ దేశానికి వల్లభ్‌భాయ్ పటేల్ చేసిన సేవలకు ఈ యాత్ర ఒక ఘనమైన నివాళిగా అభివర్ణించారు. నేటి యువత పటేల్ త్యాగాల నుంచి స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు. 565 సంస్థానాలుగా ఉన్న దేశాన్ని విలీనంచేసి భారత్‌ను బలమైన శక్తిగా నిలిపిన ఘనత ఉక్కుమనిషి సర్దార్ పటేల్‌కే దక్కుతుందని శ్లాఘించారు. ఆయన గుజరాత్‌లోని ఖేడా జిల్లాలోని పాల ఉత్పత్తిదారులందర్నీ ఒక సహకార సంఘంగా ఏర్పరిచి అప్పట్లో బహుళజాతి సంస్థ పాల్సన్ గుత్తాధిపత్యాన్ని దెబ్బకొట్టారని గుర్తుచేశారు. పటేల్ సకాలంలో జోక్యం చేసుకొని ఆపరేషన్ పోలో నిర్వహించడం వల్లే 1948లో హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైందని గుర్తుచేశారు. ప్రస్తుత సివిల్ సర్వీసెస్‌కు ఆయన రూపకర్త అని కొనియాడారు. ఆ మహనీయుడి స్ఫూర్తితోనే ప్రస్తుత ప్రధాని మోదీ 'ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్' లక్ష్యాన్ని పెట్టుకున్నారన్నారు. నర్మదా నది ఒడ్డున సగర్వంగా నిలబడిన 182 అడుగుల ఎత్తైన సర్దార్ పటేల్ విగ్రహం దేశ గమ్యానికి మార్గదర్శనం చేస్తోందని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

ఆధారాలు ముందుంచినా.. నోరు విప్పని జోగి సోదరులు

- విచారణలో మొక్కుబడి సమాధానాలు
- ఇద్దరికీ ముగిసిన కస్టడీ.. నెల్లూరు తరలింపు

ఈనాడు, అమరావతి: విచారణలో కీలక ఆధారాలను ముందుంచి ప్రశ్నించినా ఏమాత్రం నోరు విప్పలేదు. నోరు తెరిచినా 'మాకు తెలీదు, సంబంధం లేదు, గుర్తు లేదు' అని మొక్కుబడి సమాధానాలతోనే జోగి సోదరులు సరిపుచ్చారు. మాజీమంత్రి జోగి రమేష్ (ఏ18), అతని సోదరుడు రాము (ఏ19) కస్టడీలో విచారణకు సహకరించలేదని తెలిసింది. నాలుగు రోజుల పాటు నకిలీ మద్యం కేసులో సిట్ అధికారులు వీరిని కస్టడీకి తీసుకున్నారు. ప్రశ్నించేందుకు మొదటిరోజు 30 నిమిషాలే దొరికింది. ఇంకోరోజు కస్టడీ కావాలని కోర్టులో వేసిన పిటిషన్‌కు అనుమతి లభించడంతో ఆదివారం కూడా విచారించారు. ఐదురోజుల విచారణ అనంతరం సాయంత్రం వైద్యపరీక్షలు చేయించి ఎక్సైజ్ కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపర్చారు. కస్టడీలో అడిగిన ప్రశ్నలు, నిందితుల సమాధానాలను పోలీసులు కోర్టులో సమర్పించారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించాలని న్యాయాధికారి లెనిన్‌బాబు ఆదేశించారు. దీంతో వీరిని నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు.


జోగి రమేష్, రాములను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొస్తున్న పోలీసులు

తెలీదు.. సంబంధం లేదని సమాధానాలు

కస్టడీలో పోలీసులు జనార్దన్‌రావు, జగన్మోహన్‌రావులతో ఆర్థిక, వ్యాపార, వ్యక్తిగత సంబంధాలపై ప్రశ్నలు అడిగారు. గతంలో వీరు కలిసున్న ఫొటోలను చూపించి వివరాలు అడిగినా జనార్దన్‌రావు ఎవరో తెలియదని సమాధానమిచ్చారు. జోగి రాము, జనార్దన్‌రావు మధ్య 18 కాల్స్ ఉన్నాయి. వీటిగురించి అడిగినా సరైన సమాధానం చెప్పలేదు. 2020లో జరిగిన యూపీఐ లావాదేవీలపై ప్రశ్నించినా తనకు గుర్తులేదని రాము జవాబిచ్చినట్లు సమాచారం. జోగి సోదరుల బ్యాంకు స్టేట్‌మెంట్లను వారిముందు ఉంచి పెద్ద మొత్తంలో నగదు ఎవరు, ఎందుకు జమచేశారని ప్రశ్నించినా తెలియదనే చెప్పారు. మీకు ఎందుకు ఇంత ఆదాయం వచ్చిందని అడిగినా సమాధానం లేదు.

విజయవాడ జైలుకు మార్చండి: జోగి రమేష్ వినతి

తనను నెల్లూరు నుంచి విజయవాడ జిల్లా జైలుకు మార్చాలని న్యాయాధికారిని జోగి రమేష్ కోరారు. కస్టడీ అనంతరం న్యాయాధికారి ఎదుట హాజరుపర్చినప్పుడు జైలు మార్పు గురించి అడిగారు. దూరమైనందున బెజవాడకు మార్చాలని కోరారు. ఇక్కడ ఖాళీలు లేవని చెప్పి, నెల్లూరు కారాగారానికి తరలించాలని జడ్జి ఆదేశించారు.

మనిషిని జ్ఞానవంతుడిగా మార్చేదే విద్య

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రామేశ్వర్‌రావు, జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్, జయప్రకాశ్ నారాయణ, ప్రొఫెసర్ గాలి మాధవీలత, అశోక్ పడిపాటి, హను రాఘవపూడి, బీవీఎస్ రవి, సి.సువర్ణ

హైదరాబాద్, న్యూస్‌టుడే: మనిషిని జ్ఞానవంతుడిగా, సమాజ శ్రేయస్కారిగా మార్చడమే విద్య లక్ష్యమని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం వదాన్య స్వచ్ఛంద సంస్థ 15వ వార్షికోత్సవాన్ని హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్య.. మనిషి జ్ఞానం, నైపుణ్యాలు, వ్యక్తిత్వం, జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందన్నారు. అసమానతలు విద్యకు అడ్డుగా మారకూడదని వదాన్య సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు డా.జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే కష్టపడేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ) ప్రొఫెసర్ గాలి మాధవీలత మాట్లాడుతూ ఉక్కు సంకల్పంతో ముందుకెళ్తే జీవితంలో అనుకున్నది సాధిస్తారన్నారు. చినాబ్ నదిపై నిర్మించిన రైల్వే వంతెన ప్రపంచంలోనే అతిపెద్దగా నిలిచిందని, అలాంటి నిర్మాణంలో తాను భాగమవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. ఐఎఫ్ఎస్ అధికారి డా.సి.సువర్ణ మాట్లాడుతూ అత్యున్నత శిఖరాలను అధిరోహించడానికి క్రమశిక్షణతో చదవడం ఎంతో ముఖ్యమన్నారు. ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు విద్యావకాశాలను అందిస్తూ 15 ఏళ్లుగా తమ సంస్థ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిందని వదాన్య సంస్థ వ్యవస్థాపకులు అశోక్ పడపాటి తెలిపారు. ఎస్కీ డైరెక్టర్ రామేశ్వర్‌రావు, సినీదర్శకుడు హను రాఘవపూడి, రచయిత, దర్శకుడు బీవీఎస్ రవి తదితరులు పాల్గొన్నారు.

కటకటాల్లోకి ఖతర్నాక్ డాన్ కామాక్షి

- మరో ఏడుగురు కూడా..
- పెంచలయ్య హత్య, గంజాయి కేసుల్లో అరెస్టు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నెల్లూరు నగరానికి చెందిన సీపీఎం స్థానిక నాయకుడు పెంచలయ్య హత్య, గంజాయి కేసుల్లో ఖతర్నాక్ డాన్ అరవ కామాక్షి, మరో ఏడుగురిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఇంట్లో అక్రమంగా గంజాయి నిల్వలు ఉన్నాయన్న సమాచారంతో నవాబుపేట పోలీసులు దాడులు చేసి 25 కిలోల సరకు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కామాక్షిని అరెస్టుచేశారు. వివరాలను నగర ఇన్‌ఛార్జి డీఎస్పీ ఎం.గిరిధర్, స్థానిక ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్‌రెడ్డితో కలిసి వెల్లడించారు. బోడిగాడితోట అహ్మద్ నగర్ ప్రాంతానికి చెందిన అరవ కామాక్షి, జోసెఫ్ దంపతులు. ప్రస్తుతం ఆమె వైకుంఠపురం సమీపంలో ఉంటున్నారు. ఈ నెల 28న నెల్లూరు గ్రామీణ మండలం కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద జరిగిన కె.పెంచలయ్య హత్యకేసులో ఆమె ప్రధాన నిందితురాలు. నవాబుపేట ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్‌రెడ్డి, నెల్లూరు గ్రామీణ ఇన్‌స్పెక్టర్ జి.వేణు శనివారం రాత్రి ఆమెను ఇంటివద్ద అదుపులోకి తీసుకుని తాళాలు ఇవ్వాలని కోరారు. లేవనడంతో తాళాలు పగలగొట్టి లోపల తనిఖీ చేసి.. 25 కిలోల గంజాయి, విలువైన డాక్యుమెంట్లు, బ్యాంకు పాస్‌పుస్తకాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆమెను అరెస్టు చేశారు.


కామాక్షిని అరెస్టు చూపిస్తున్న నవాబుపేట పోలీసులు


హత్యకు ఉపయోగించిన కత్తులు

ఏడుగురు నిందితుల అరెస్టు

హత్య కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసి, ఏడు కత్తులు, మూడు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను నెల్లూరు గ్రామీణ డీఎస్పీ జి.శ్రీనివాసరావు వెల్లడించారు. కామాక్షి కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో యువకులను ఏర్పాటుచేసుకుని గంజాయి క్రయవిక్రయాలు చేస్తుండగా స్థానికంగా ఉండే పెంచలయ్య, కాలనీ పెద్దలు ఆమె వ్యాపారాన్ని అడ్డుకున్నారు. గుడి వ్యవహారంలోనూ పెత్తనం ఇవ్వకపోవడాన్ని ఆమె అవమానంగా భావించింది. ఈ నేపథ్యంలో పెంచలయ్యను అంతమొందించాలని.. తన అనుచరులైన జానకిరామ్ అలియాస్ జాన్, విష్ణువర్ధన్, సంతోష్, రోహిత్ అలియాస్ చింటూ, వినయ్, సంతోష్, తన భర్త జోసెఫ్‌లతో కలిసి పెంచలయ్య హత్యకు పథకం రచించింది. శుక్రవారం పెంచలయ్య తన కుమారుడితో పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుండగా స్కూటీని ఢీకొట్టి కత్తులతో హత్య చేశారు. ఈ కేసులో తొమ్మిది మందిని అరెస్టు చేయగా, మరో ఐదుగురి కోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.


స్వర్ణ చతుర్భుజి అంటే వాజ్‌పేయే గుర్తుకొస్తారు

మండపేటలో విగ్రహావిష్కరణలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్


మండపేటలో వాజ్‌పేయీ విగ్రహావిష్కరణలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి తదితరులు

మండపేట, మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: దేశంలోని ప్రధాన నగరాలను అనుసంధానిస్తూ నిర్మించిన స్వర్ణ చతుర్భుజి రహదారుల గురించి వింటే మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ గుర్తుకొస్తారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చెప్పారు. దిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతాలను కలిపే 5,846 కిలోమీటర్ల జాతీయ రహదారుల ప్రాజెక్టును ప్రారంభించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట బైపాస్ జంక్షన్‌లో వాజ్‌పేయీ విగ్రహాన్ని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి ఆయన ఆదివారం ఆవిష్కరించారు. పురందేశ్వరి మాట్లాడుతూ అటల్‌జీ అంటే అన్ని పార్టీల నాయకులకూ ప్రత్యేక గౌరవం ఉండేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా.. వాజ్‌పేయీ ఐరాస భద్రతామండలి సమావేశంలో భారత ప్రతినిధిగా పాల్గొని తన వాగ్ధాటితో ఆకట్టుకున్నారని గుర్తుచేశారు.

వాజ్‌పేయీ ధైర్యశాలి: కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



వాజ్‌పేయీ విగ్రహావిష్కరణ అనంతరం తాపేశ్వరంలో ఏర్పాటుచేసిన సభలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ జాతీయ భద్రత కోసం అణుశక్తి సామర్థ్యం ఉండాలనే ఉద్దేశంతో పోఖ్రాన్‌లో అణుపరీక్షలు నిర్వహించిన ధైర్యశాలి అని వాజ్‌పేయిని కొనియాడారు. కార్యక్రమంలో అమలాపురం ఎంపీ హరీష్‌మాథుర్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, కోనసీమ జిల్లా భాజపా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధిక లాభానికి ఆశపడి జైలు పాలు

- నకిలీ మద్యం కేసులో అజ్ఞాతంలో ఉన్న తలారి రంగయ్య అరెస్టు
- లేబుళ్ల డిజైన్, ముద్రణలో కీలక పాత్ర

ఈనాడు, అమరావతి: నకిలీ లేబుళ్ల తయారీ చట్ట విరుద్ధమని తెలిసినా.. లేబుల్‌కు 70 పైసల లాభం వస్తోందని ఆశపడి డిజైనింగ్, ముద్రణకు ఒప్పుకొన్నాడు. చివరకు కటకటాల పాలయ్యాడు. నకిలీ మద్యం కేసులో నెలన్నరగా అజ్ఞాతంలోకి వెళ్లిన తలారి రంగయ్య (ఏ14)ను పోలీసులు ఎట్టకేలకు అరెస్టుచేశారు. రంగయ్య ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కోర్టు ఇటీవల తోసిపుచ్చింది. హైదరాబాద్‌కు వెళ్లిన ప్రత్యేక బృందం రంగయ్యను అదుపులోకి తీసుకుని.. ఆదివారం రాత్రి విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో న్యాయాధికారి లెనిన్‌బాబు ఎదుట హాజరుపర్చారు. నిందితుడికి కోర్టు ఈ నెల 9వ తేదీ వరకు రిమాండ్ విధించడంతో నెల్లూరులోని కేంద్ర కారాగారానికి తరలించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారానికి చెందిన తలారి రంగయ్య (ఏ14).. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో ఆర్జే డిజైనర్స్ అండ్ ప్రింటింగ్ పేరుతో 2018 నుంచి సొంతంగా డీటీపీ సెంటర్ నడుపుతున్నాడు. తర్వాత అతని బంధువు చెక్కా సతీష్ (ఏ17) వాటాదారుడిగా చేరాడు. 2022 చివరలో తిరుమలశెట్టి శ్రీనివాసరావు వచ్చి, డబ్బు ఆశ చూపించి నకిలీ లేబుల్స్ డిజైన్ చేసి, ముద్రించేందుకు ఒప్పించాడు. సాధారణంగా లేబుల్ షీట్‌కు రూ.30 తీసుకుంటారు. నకిలీ లేబుళ్లకు షీట్‌కు రూ.45 ఇచ్చేందుకు జనార్దన్‌రావు, శ్రీనివాసరావు వెనుకాడలేదు. లేబుల్‌కు 70 పైసల లాభం వస్తోందని ఆశపడి లేబుళ్ల డిజైన్, ముద్రణకు ఒప్పుకొన్నాడు.

రెండేళ్లలో 2 లక్షల లేబుళ్ల ముద్రణ

ఇరువర్గాల మధ్య ఒప్పందం కుదిరిన తర్వాత.. తొలుత 15వేల మంజీరా బ్రాండ్ లేబుళ్ల తయారీకి ఆర్డర్ వచ్చింది. డిజైన్ తయారైన తర్వాత వాటిపై బ్యాచ్ నంబరు, తయారీ తేదీని ఖాళీగా పెట్టారు. ప్రభుత్వ మద్యం డిపో నుంచి ఇబ్రహీంపట్నంలోని ఏఎన్ఆర్ బార్‌కు స్టాక్ వచ్చిన తర్వాత.. వాటిపై ఉన్న బ్యాచ్ నంబరు, తయారీ తేదీ వివరాలను రంగయ్యకు జనార్దన్‌రావు చెప్పేవాడు. వీటి ఆధారంగా లేబుళ్లను సిద్ధం చేసేవాడు. తర్వాత వీటిని తిరుమలశెట్టి శ్రీనివాసరావు, జనార్దన్‌రావులకు పంపించేవాడు. వారు వీటిని క్షుణ్ణంగా పరిశీలించి అసలు వాటిలా ఉన్నాయని భావించిన తర్వాతే ముద్రణకు పంపించేవారు. లేబుళ్లను రంగయ్య మెయిల్ ద్వారా దిల్‌సుఖ్‌నగర్‌లోని ఐకార్ట్స్ డిజిటల్, డీపీఎం ప్రింటర్స్‌కు పంపించి ప్రింటింగ్ చేయించాడు. మంజీరా బ్రాండ్ తర్వాత ఆంధ్రా గోల్డ్ విస్కీ, ట్రాపికానా, రాయల్ లాన్సర్ బ్రాండ్ల నకిలీ లేబుళ్లను డిజైన్ చేశాడు. 2023 నుంచి ఈ ఏడాది జనవరి వరకు రెండేళ్లలో 10 నుంచి 12 విడతలలో దాదాపు 2లక్షల వరకు లేబుళ్లను రంగయ్య ముద్రించి సరఫరా చేశాడు.

అక్కను వేధించారని.. బావ, అత్తలపై కత్తివేటు

- స్నేహితులతో కలిసి పాలిటెక్నిక్ విద్యార్థి ఘాతుకం
- పల్నాడు జిల్లాలో జంట హత్యలు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, సత్తెనపల్లి: అక్క ఇంటికి వచ్చినప్పుడల్లా ఏడుస్తూ కనిపించడం.. శరీరంపై సిగరెట్ వాతలు ఉండటం.. భర్త, అత్తమామలు వేధిస్తున్నారని అమ్మతో చెప్పుకోవడం చూసి ఆ బాలుడు బావపై కోపం పెంచుకున్నాడు. ఆ బంధాన్ని తెంచి, అక్కకు వేరే పెళ్లి చేసినా కూడా మొదటి భర్త నుంచి వేధింపులు కొనసాగడంతో మరింత రగిలిపోయాడు. స్నేహితులతో కలిసి హత్యకు ప్రణాళిక రచించిన ఆ మైనర్ యువకుడు.. బావ, అతని తల్లిపై కత్తులతో దాడిచేసి హతమార్చాడు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామంలో ఆదివారం జరిగిన ఈ జంట హత్యలపై సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు కథనం.. ధూళిపాళ్లకు చెందిన దొప్పలపూడి వీరయ్య, కృష్ణకుమారి(60) దంపతుల కుమారుడు సాంబశివరావు(30) తాడికొండలో ఓ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. అతడికి నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన సాహితితో మూడేళ్ల కిందట వివాహమైంది. పిల్లలు పుట్టడం లేదని ఆమెను అత్తింటి వారు వేధించడంతో ఆరు నెలల కిందట విడాకులు తీసుకుంది. అనంతరం అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామానికి చెందిన ఓ యువకుడిని వివాహం చేసుకుంది. గతంలో పెళ్లితో ఆగిన ఇంజినీరింగ్ చదువును.. సాహితి తిరిగి కొనసాగిస్తోంది.

హత్య చేసి.. 5 కి.మీ. పరుగెత్తి..

సాహితి చదువుతున్న కళాశాలలో ఒకరికి సాంబశివరావుతో స్నేహం ఉంది. అతని ద్వారా సాహితి విషయాల్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు తనతో మాట్లాడాలని చెప్పడంతో ఆమె ఇబ్బంది పడింది. కళాశాలకు వెళ్లనని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆరా తీశారు. ఈ విషయాలు సాహితి తమ్ముడికి (పాలిటెక్నిక్ విద్యార్థి) తెలిశాయి. దీంతో ఆ యువకుడు సాంబశివరావు, అతడి తల్లిదండ్రులపై కక్ష పెంచుకున్నాడు. వారిని హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. అతనికి ఇంటర్ చదువుతున్న ఇద్దరు స్నేహితులు తోడయ్యారు. తాడికొండలో ఉండే సాంబశివరావు.. ఆదివారం ధూళిపాళ్లకు వచ్చాడని నిర్ధారించుకున్న తర్వాత ముగ్గురూ బైక్‌పై చిలకలూరిపేట నుంచి వచ్చి సాంబశివరావు, అతని తల్లి కృష్ణకుమారిపై కత్తులతో దాడి చేశారు. సాంబశివరావు అక్కడికక్కడే మృతి చెందగా, కృష్ణకుమారిని గుంటూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయారు. ఆ సమయంలో ఆమె భర్త వీరయ్య బజారుకు వెళ్లడంతో ప్రాణాలు దక్కించుకున్నారు. అరుపులతో ఇరుగుపొరుగు వారు రావడంతో ముగ్గురు మైనర్లు.. రెండు గ్రామాల మీదుగా ఐదు కిలోమీటర్లకు పైబడి పరుగు తీశారు. ధూళిపాళ్ల గ్రామస్థులు, పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. వారి వెంట తెచ్చుకున్న మారణాయుధాలు, గ్లౌజులు, యాప్రాన్లను చూసి పోలీసులు ఆశ్చర్యపోయారు. విడాకుల తర్వాత కూడా తన అక్కను వేధిస్తున్నందువల్లే చంపానని ప్రధాన నిందితుడు పోలీసులకు చెప్పాడు. జంట హత్యలపై ఎస్పీ కృష్ణారావు ఆరా తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సత్తెనపల్లి గ్రామీణ పోలీసులు తెలిపారు.



సాంబశివరావు


కృష్ణకుమారి

గర్భం దాల్చిన 14 ఏళ్ల బాలిక

- పెంపుడు తండ్రి, అతని బావమరిది అత్యాచారం

ధర్మవరం న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో 14 ఏళ్ల బాలికపై పెంపుడు తండ్రి, అతని బావమరిది కొన్ని నెలలుగా అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక గర్భం దాల్చడంతో అసలు విషయం బయటకొచ్చింది. ధర్మవరంలో ఉండే ఓ జంట 14 ఏళ్ల క్రితం చిత్తూరు జిల్లా బోయకొండ గంగమ్మ ఆలయ ప్రాంతం నుంచి ఓ ఆడ శిశువును తెచ్చుకున్నారు. ఆ బాలికను వారే పెంచుకుంటున్నారు. ప్రస్తుతం ఆమెకు 14 ఏళ్లు. పెంపుడు తండ్రి, అతని బావమరిది బాలికపై కన్నేసి, తరచూ అత్యాచారం చేస్తూ ఎవరికీ చెప్పకూడదని బెదిరించారు. ఆదివారం బాలిక అస్వస్థతకు గురికావడంతో పెంపుడు తల్లి ఆసుపత్రికి తీసుకెళ్లింది. వైద్యులు పరీక్షలు చేసి గర్భం దాల్చిందని, ప్రస్తుతం ఐదు నెలలని చెప్పారు. పెంపుడు తల్లి తన సోదరుడే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని భావించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ధర్మవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను డీఎస్పీ హేమంత్ కుమార్ విచారించగా, పెంపుడు తండ్రి, అతని బావమరిది అత్యాచారం చేశారని వాపోయింది. ఆమె ఫిర్యాదు మేరకు ఇద్దరిపైనా పోక్సో కేసు నమోదుచేశారు. నిందితులు పరారీలో ఉన్నారని డీఎస్పీ తెలిపారు.



ఇవన్నీ ఉంటే మీరు నిజంగా సంపన్నులే..

✦ మీరు, మీ కుటుంబం ఆరోగ్యంగా ఉండటం.
✦ ప్రేమ, సంతోషాలతో నిండిన ఇల్లు. ✦ గుణవంతులైన పిల్లలు.
✦ మీరు చేసే పని ఉపాధితో పాటు సంతృప్తిని, గౌరవాన్ని అందించడం.
✦ తక్కువ ఆశించడం, ఎక్కువ ఇచ్చే మనసు ఉండటం. ✦ స్వార్థం లేని స్నేహబంధాలు.

– వాలా అఫ్సర్, కాలమిస్ట్


భారత్ గౌరవ్ అవార్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, త్రిదండి చినజీయర్‌స్వామి చేతుల మీదుగా భారత్ గౌరవ్ అవార్డు అందుకుంటున్న పల్సస్ గ్రూప్ వ్యవస్థాపకుడు, సీఈఓ డాక్టర్ గేదెల శ్రీనుబాబు. – న్యూస్‌టుడే, హైదరాబాద్

ఈనాడు

ఏకగ్రీవాలా... వేలంపాటలా?

గ్రామ పంచాయతీ ఎన్నికలొచ్చిన ప్రతిసారీ బాగా వినిపించే మాట 'ఏకగ్రీవం'. తెలంగాణ పల్లెల్లో ఓట్ల పండుగకు సమయం సమీపిస్తున్న తరుణంలో అది మళ్లీ చర్చల్లోకొస్తోంది. వాస్తవానికి గ్రామాభివృద్ధికోసం చిత్తశుద్ధితో పాటుపడే నిస్వార్థ సేవకులను స్థానికులంతా ఏకతాటిపై నిలిచి సర్పంచిగా, వార్డు సభ్యులుగా ఎంపిక చేసుకోవడం అభినందనీయమే. ఎన్నికలంటేనే డబ్బూ మద్యం ఇతరేతర ప్రలోభాలతో భ్రష్టుపట్టిపోయిన పరిస్థితుల్లో ప్రజలు విచక్షణతో అలాంటి నిర్ణయాలు తీసుకోవడం మెచ్చదగిందే. పైగా, ఏకగ్రీవమైన పల్లెల ప్రగతికి ప్రభుత్వాలు నగదు ప్రోత్సాహకాలనూ ప్రకటిస్తున్నాయి. కానీ, గ్రామాల బాగోగులే పరమావధిగా జరగాల్సిన ఏకగ్రీవాలు వేలంపాటలవుతూ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్నాయి. ఎన్నికల్లో శ్రీమంతుల ప్రాబల్యాన్ని అవి మరింత పెంచి, సామాన్యులను ప్రజాసేవకు దూరంచేస్తున్నాయి. పుష్కర కాలం క్రితం ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఏడున్నర శాతం సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2019 తెలంగాణ ఎలక్షన్లలో అలాంటివారి సంఖ్య దాదాపు 17శాతానికి చేరింది. 2021లో ఏపీలోనూ అదే స్థాయిలో ఏకగ్రీవ సర్పంచులు కొలువుతీరారు. లక్షలాది రూపాయలు వెదజల్లి పదవులు కొనుక్కుంటున్న కొంతమంది మూలంగా బాపూజీ కలలుగన్న పల్లె స్వరాజ్యం ఎండమావిని తలపిస్తోంది!

గ్రామసీమలను దేశానికి వెన్నెముకగా అభివర్ణించిన మహాత్ముడు- ప్రతి పల్లెపట్టూ స్వయం సమృద్ధ గణతంత్రం కావాలని ఆకాంక్షించారు. దురదృష్టవశాత్తు పార్టీల పడగనీడ ప్రసరించేకొద్దీ పంచాయతీల పనితీరు పూర్తిగా పడకేస్తోంది. డబ్బు గుమ్మరించి పదవుల్లోకి వస్తున్నవారు పల్లె ప్రగతిని గాలికొదిలేస్తున్నారు. ఎక్కడో నగరాల్లో ఉంటూ పంచాయతీలపై పెత్తనం చలాయించడానికి, తద్వారా తమ పరపతిని ప్రదర్శించుకోవడానికి కొందరు ఎన్నికలను వేలంపాటలుగా దిగజార్చుతున్నారు. అలాంటి ఏకగ్రీవాలు ఆమోదయోగ్యమైనవి కాదు. గ్రామాల తలరాతలను తిరగరాసే ఆలోచనేమీ లేకుండా రాజకీయాధికారం కోసమే ఏకగ్రీవమనే పాటపాడేవారిని యంత్రాంగం ఊపేక్షించరాదు. పల్లెలు పచ్చగా పరిఢవిల్లాలంటే- ధనబల సంపన్నులకు మారుగా స్వగ్రామ సౌభాగ్యమే లక్ష్యంగా కష్టించే యువత ముందుకు రావాలి. పంచాయతీ ప్రగతికి తమదైన ప్రణాళికలను ప్రజల ముందు ఉంచి వారి మెప్పు పొందాలి. ఊళ్లో అందరి తలలో నాలుకలా వ్యవహరించగలిగిన సమర్థులకే జనం పట్టం కట్టాలి. ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధులకు బదులుగా వారి కుటుంబాల్లోని పురుషులే రాచకార్యాలు చక్కబెట్టే పెడసంస్కృతి సమసిపోవాలి!

స్వాతంత్ర్యం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలు దాటినా చాలా పల్లెలను చూస్తే నేటికీ వెలగని వీధిదీపాలు, గుంతల రోడ్లు, అరకొర విద్యా వైద్య వసతులు, దాహార్తితో అలమటించాల్సిన దుర్భర పరిస్థితులు దర్శనమిస్తాయి. కొన్ని చోట్ల పంచాయతీలకు సొంత భవనాలూ కరవయ్యాయి. నిధుల కోసం నేటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దగ్గర స్థానిక సర్కార్లు చేయిచాచాల్సిన దుస్థితి దాపురించింది. మరోవైపు ఆర్థిక సంఘం ద్వారా అందిన నిధులను గుట్టుచప్పుడు కాకుండా దారిమళ్లించిన దారుణాలు గతంలో ఏపీలో బయటపడ్డాయి. ఇలాంటి నయవంచనలకు తోడు తగిన ఆదాయ వనరులు లేక బ్లీచింగ్ పౌడర్ చల్లడానికీ పంచాయతీలు నానాతంటాలు పడుతున్నాయి. ఈ దుస్థితి తప్పిపోవాలంటే- పల్లెలను ఆర్థికంగా పరిపుష్టం చేయాలి. నిధులు, విధుల బదిలీలో రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్ణయాలు తీసుకోవాలి. పంచాయతీరాజ్ వ్యవస్థలు బలోపేతం కావాలంటే, వాటికి రాష్ట్రాల శాసనసభల నుంచి కాకుండా నేరుగా రాజ్యాంగం ద్వారానే అధికారాలు దఖలుపడాలన్న మేలిమి సూచనలు వాస్తవరూపం దాల్చాలి!



అవరోధాలు, వ్యతిరేకత, విమర్శ...
ఇవన్నీ అధిగమించాల్సిన విషయాలు. వాటిని గెలిచి ముందుకు వెళ్లినప్పుడు లభించే ఆనందమే వేరు.
అవేవీ లేకుండా కేవలం ప్రశంసలే లభిస్తే ఆ జీవితంలో మజా ఉండదు. ఏం చేయాలో కూడా తెలియదు.

– విజయలక్ష్మీ పండిట్

పరమాత్ముడి ప్రవచనం

భగవద్గీత... శ్రీకృష్ణ పరమాత్మ పాండవ మధ్యముడైన అర్జునుడికి బోధించిన అద్భుత వికాస పాఠం. పరమాత్మ ప్రబోధం అర్జునుడికే అయినా, విశ్వ మానవాళి దైనందిన జీవితంలో తెలుసుకోవాల్సిన అనేక విషయాలు భగవద్గీతలో దర్శనమిస్తాయి. భగవద్గీత అపురూపమైన విశ్వమానవ విజ్ఞానకోశం! నిత్యసత్యాలు, మార్గదర్శకమైన బోధనలు అన్ని అధ్యాయాలలోనూ అంతర్భాగమై, నవ్యమైన జీవనానికి బంగరు బాటలు వేస్తాయి.

అమృతతుల్యమైన గీతాసారాన్ని పరికిస్తే, మంచి చెడుల మధ్య జరిగే నిరంతర సంఘర్షణ, మానవులు ఆచరించాల్సిన జీవన నియమాల వంటివి వ్యక్తిత్వవికాసానికి హితమైన రీతిలో కన్పిస్తాయి. ఇంద్రియ భోగం క్షణభంగురమనీ, ఆవేశాలను, ఆవేదనలను మనిషి వీలున్నంతగా నిగ్రహించుకోవడం అవసరమని గీత చెబుతోంది.



దేహినిత్యుడని, దేహాలు అనిత్యాలనీ ప్రబోధిస్తూ, ఒంటి మీద పెంచుకునే మమకారం శుష్కమైందని కృష్ణ పరమాత్మ ప్రబోధించాడు. తద్వారా లంపటాలపై, అనుబంధాలపై నిండిన అమితమైన ఆసక్తి మనుషులకు నిరర్థకమని విశదం చేశాడు.

ప్రాపంచిక సుఖభోగాలపట్ల మమకారంతో మెలిగే జీవులు చిత్తభ్రాంతికి లోనవుతారు. భగవత్ ప్రాప్తి పథంలో సాఫల్యానికి కావాల్సిన దృఢ సంకల్పాన్ని కలిగి ఉండలేరు. కళ్ల ముందు కనిపించే అందాలు, ఆనందాలు శాశ్వతమని భావించే అల్పమనస్కులు వీరు. ఎన్నో నదులు తనలో నిత్యం కలుస్తున్నా, సముద్రం ఎలా నిశ్చలంగా, ప్రశాంతంగా ఉంటుందో, అలాగే వాంఛనీయ వస్తువులు కనులముందు దర్శనమిస్తున్నా, చలించని యోగి నిజమైన శాంతిని పొందుతాడన్న గీతా ప్రబోధం నిత్యసత్యం. వివేకులకు అనుభవైకవేద్యం. పనులను కర్తవ్యంలా పూనికతో నిర్వహిస్తూ, కర్మఫలాలపై ఆసక్తి లేకుండా వ్యవహరించే వ్యక్తి పరమపదాన్ని చేరుకోగలడని గీత బోధించింది. పండితుడైనవాడు అందరినీ, అన్నిటినీ సమదృష్టితో చూస్తాడని తెలుపుతూ పాండిత్యమన్న పదానికి మహితమైన నిర్వచనాన్ని భగవద్గీత అందించింది. మనిషికి మనసే మిత్రుడు, మనసే శత్రువు. మనసును జయించిన యోగులు శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, మానావమానాలవంటి ద్వంద్వాలకు అతీతంగా ఉన్నతమైన స్థానంలో ఉంటారు. వారు ప్రశాంతతతో, స్థిరచిత్తంతో మెలుగుతారన్నది గీతావాక్యం. భగవద్గీత అనేది ఆధ్యాత్మిక బోధ కాదు. మనుషులు తాము చేయాల్సిన పనుల పట్ల ఎంతటి నిబద్ధతతో ముందుకు సాగాలో చెప్పే విశిష్ట గ్రంథం.

సత్వరజస్తమో గుణాలకు అతీతంగా ప్రవర్తించేవారే పరమాత్మను తెలుసుకోగలరని గీత పేర్కొంది. సుఖదుఃఖాలలో ఒక రీతిగానే ఉండేవారు; మట్టిముద్దను, బంగారాన్ని ఒకే విలువతో చూసేవారు; అనుకూల, ప్రతికూల పరిస్థితుల్లో ఒక్కరీతిగానే ఉండేవారు; నిందాస్తుతులను రెంటినీ సమంగా స్వీకరించేవారే త్రిగుణాలకు అతీతులు. వారి వర్తన అందరికీ మార్గదర్శకమనీ గీత ప్రబోధించింది. పరమాత్మ జగతికి అందించిన మహత్తర జీవన సందేశమిది.

అంతర్యామి

– వెంకట్ గరికపాటి

సుస్థిర సేద్యానికి 'జీఈ' వంగడాలు

వాతావరణ మార్పుల వల్ల భూతాపం కట్టుతప్పుతోంది. అతివృష్టి, అనావృష్టి, భూసార క్షయం పెరిగిపోతున్నాయి. ఫలసాయాలూ తగ్గిపోతున్నాయి. ప్రపంచంలో ఎక్కువమందికి ప్రధాన ఆహారమైన వరి కూడా ఈ సమస్యను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో పర్యావరణ విపరిణామాలను తట్టుకునేలా సవరించిన జన్యువులతో రెండు కొత్త వరి రకాలను భారత్ ఇటీవల విడుదల చేయడం విశేషం!

ప్రపంచ జనాభాలో సగంమందికి ప్రధాన ఆహార ధాన్యం వరి. వర్ధమాన దేశాల్లో వందల కోట్ల మందికి ఆహార భద్రత, ఆదాయాలు, మనుగడ వరితోనే ముడివడి ఉన్నాయి. ఈ క్రమంలో పర్యావరణ మార్పులను నిభాయించే రెండు వరి రకాలను భారత్ ఇటీవల అభివృద్ధి చేసింది. అవి- డీఆర్ఆర్ ధన్ 100 (కమల), పూసా డీఎస్టీ రైస్ 1. వీటిలో మొదటిదాన్ని హైదరాబాద్‌లోని భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) అనుబంధ అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ రూపొందించింది. పూసా డీఎస్టీ రైస్ 1ని దిల్లీలోని ఐసీఏఆర్ అభివృద్ధి చేసింది. ఈ అద్భుత శాస్త్రీయ పురోగతి రాబోయే రోజుల్లో సుస్థిర వ్యవసాయానికి, ఆహార భద్రతకు భరోసా ఇస్తుంది.



జీఎం నుంచి జీఈకి

పాత వరి రకాల జన్యువులకు సవరణలు చేసి రూపొందించిన ఈ రెండు వంగడాలు అనావృష్టిని తట్టుకుంటాయి. తక్కువ నీటిని వినియోగించుకుంటూ త్వరగా కోతకొస్తాయి. డీఆర్ఆర్ వంగడాన్ని సాంబ మసూరి జన్యువులకు సవరణ చేసి రూపొందించినా, మసూరికన్నా 20 రోజుల ముందే చేతికొచ్చి, 19శాతం ఎక్కువ దిగుబడి ఇస్తుంది. పూసా డీఎస్టీ రకం చవుడు, క్షార భూముల్లోనూ పెరగడమే కాదు, 10 నుంచి 30 శాతం ఎక్కువ ఫలసాయం అందిస్తుంది. అందుబాటులో ఉన్న నీటిలో 80శాతం వ్యవసాయానికే వినియోగమయ్యే ఇండియాలో ఈ రెండు వంగడాలు పరిమితంగా నీటిని వాడుకుంటూ 750 కోట్ల క్యూబిక్ మీటర్ల సాగునీటిని ఆదా చేయగలవు.

ఈ అపూర్వ వంగడాలకు మూలాధారమైన సాంకేతికత.. జన్యు సవరణ (జీఈ). అది జన్యు మార్పిడి (జీఎం)కి భిన్నమైంది. రైతులు, శాస్త్రజ్ఞులు దశాబ్దాలుగా మంచి లక్షణాలున్న పంటలను ఒకదానితో ఒకటి కలిపి మెరుగైన పంటలను సృష్టిస్తూ వచ్చారు. ఈ ప్రక్రియకు 10 నుంచి 15 ఏళ్లు పడుతుంది. తరవాత జీఎం పంటలొచ్చాయి. వీటి భద్రతపై అనుమానాలూ, ఆందోళనలు వ్యక్తమయ్యాయి. జీఎం కన్నా జీఈ ఎంతో మెరుగైనది. జీఎంలో రెండు పంటల మధ్య జన్యువులను మార్పిడి చేస్తే జీఈలో ఒకే పంట జన్యువులను సవరించి మెరుగుపరుస్తారు. ఈ జన్యు సవరణకు దశాబ్దం క్రితం జెనిఫర్ డౌడ్నా, ఇమాన్యుయెల్ షార్పెంటియే అనే శాస్త్రజ్ఞులు కనుగొన్న క్రిస్పర్-కాస్9 ప్రక్రియను ఉపయోగించారు. వారిద్దరికీ 2020లో రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది.

క్రిస్పర్-కాస్9 ప్రక్రియను జన్యు కత్తెరతో పోలుస్తారు. డీఎన్ఏలో మార్పు చేయాలనుకున్న చోటికి కాస్9 ఎంజైమ్‌ను పంపి కత్తెర వేస్తారు. అప్పుడు కణానికి ఉన్న సహజ మరమ్మతు శక్తి డీఎన్ఏకి దిద్దుబాటు చేస్తుంది. పంటలకు తెగుళ్లను తట్టుకునే శక్తి ఇవ్వడానికి, పోషకాలు పెంచడానికి ఈ ప్రక్రియతో జన్యు సవరణ చేస్తారు. దీనివల్ల రైతులకు పురుగుమందులు, ఎరువుల ఖర్చు తగ్గుతుంది. వాతావరణ మార్పులను, చవుడును తట్టుకునే శక్తి పంటలకు లభిస్తుంది. జీఈ ప్రక్రియ పంటలు ఎక్కువ కాలం నిల్వ ఉండేలా చేసి వృథాను అరికడుతుంది. జీఈ వ్యవసాయ దిగుబడులను, స్వావలంబనను పెంచి ఆత్మనిర్భర్ భారత్ సాకారానికి తోడ్పడుతుంది.

మేధాహక్కుల సమస్య

క్రిస్పర్-కాస్9పై పేటెంట్ హక్కులు అమెరికాలోని ఎంఐటీ, హార్వర్డ్, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయాలకు ఉన్నాయి. షార్పెంటియే స్థాపించిన ఈఆర్ఎస్ జెనోమిక్స్ అనే కంపెనీ ద్వారా పేటెంట్ హక్కులను నిర్వహిస్తున్నారు. ఈ కంపెనీ 2022 నుంచి భారత్‌లో లైసెన్సు మీద క్రిస్పర్-కాస్9 వినియోగాన్ని అనుమతిస్తోంది. భారతీయ శాస్త్రజ్ఞులు పరిశోధన కోసం స్వేచ్ఛగా క్రిస్పర్-కాస్9ని ఉపయోగించుకోవచ్చు. కానీ, దాని ద్వారా సాధించే విత్తనాలు, ఇతర ఉత్పత్తులను విక్రయించడానికి ఖరీదైన లైసెన్సులు పొందాల్సి ఉంటుంది. ఈ సాంకేతికతను భారత్‌లో విరివిగా ఉపయోగించడానికి జాతీయ లైసెన్సు కోసం ఐసీఏఆర్, దాని అనుబంధ వాణిజ్య విభాగం ఎగ్రినోవేట్ ఇండియా సంస్థ సంప్రదింపులు జరుపుతున్నాయి. లైసెన్సు ఫీజు మరీ ఎక్కువగా ఉంటే బడా కంపెనీలకు తప్ప సాధారణ రైతులకు అందుబాటులో ఉండదు. చివరికి భారత శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధనా మండలి (సీఎస్ఐఆర్) కూడా ఫీజు భారాన్ని తట్టుకోలేక సికిల్ సెల్ అనీమియా చికిత్సకు క్రిస్పర్ లైసెన్సును పొందలేకపోయింది.

స్వదేశీ సాంకేతికతలు కీలకం

సికిల్ సెల్ అనీమియాకు అందుబాటు ధరల్లో చికిత్స అందించడానికి సీఎస్ఐఆర్ అనుబంధ సంస్థ జీనోమిక్స్, సమగ్ర జీవశాస్త్ర సంస్థ (ఐజీఐబీ)కి చెందిన భారతీయ శాస్త్రవేత్తలు సొంతగా క్రిస్పర్ సిస్టమ్‌ను రూపొందించారు. దీనికి సంబంధించిన లైసెన్సును ఇటీవల సీఎస్ఐఆర్-ఐజీఐబీ సంస్థ సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాకు అందించింది. జన్యు సవరణతో సికిల్ సెల్ అనీమియాకు స్వదేశీ చికిత్సా విధానాన్ని రూపొందించడం వీలవుతుంది. భారతీయ వ్యవసాయం, వైద్య, పారిశ్రామిక రంగాలకు జీఈ సాధనాలను అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వ రంగంలో సీఎస్ఐఆర్-ఐజీఐబీ తరహా జన్యు సవరణ సాంకేతికతల రూపకల్పనకు నిధులు, వసతులు మరింతగా సమకూర్చాలి. దేశమంతటికీ ఒకే జన్యు సవరణ లైసెన్సును వర్తింపజేయాలి. పరాయి జన్యువులను చొప్పించి జన్యుమార్పిడి చేసిన పంటలకూ జన్యు సవరణ పంటలకూ మధ్య తేడాను ప్రజలకు తెలియజెప్పాలి. క్రిస్పర్-కాస్9 వంటి విదేశీ సాంకేతికతలను విరివిగా చేపడితే బహుళజాతి కంపెనీల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సిన దుస్థితి దాపురిస్తుంది. దాన్ని నివారించడానికి స్వదేశీ సాంకేతికతలను రూపొందించుకోవాల్సిందే.



ఆచార్య అప్పారావు పొదిలె
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి



చిన్న మాట చాలు...

'అరేయ్ శేఖర్.. పెళ్లి రోజు శుభాకాంక్షలురా!'
'హ్హహ్హహ్హ... నీకు గుర్తుందా..!'
'అరె... అలా ఎలా మర్చిపోతానురా?'

ఈ సంభాషణలో ప్రత్యేకతేంటీ అనుకుంటున్నారా? నిజమే, బిజీ షెడ్యూల్... పెళ్లిరోజులూ పుట్టినరోజులూ చేసుకుంటేనే హ్యాపీగా ఉన్నట్లా అన్న ఆలోచనలతో బతికేసే వాళ్లకి... ఉన్నట్టుండి చిన్ననాటి స్నేహితులెవరైనా గుర్తుపెట్టుకుని ఫోన్ చేసి చెబితే ఎంత సంతోషంగా అనిపిస్తుందో కదూ. ఆ ఒక్క నిమిషం ఫోన్ కాల్ మనల్ని ఆ రోజంతా హ్యాపీగా ఉంచుతుంది. మరికొన్ని రోజులవరకూ ఆ మూడ్ కొనసాగుతుంది. అందుకే ఈ వేడుకలూ శుభాకాంక్షలూ అంటున్నాయి అధ్యయనాలు.

'ఆ ఏముందిలే ఏటా వచ్చేదే కదా... అయినా పుట్టి ఏం సాధించాను' అని కొందరూ.. 'మనకి కుదిరిన రోజే సెలబ్రేషన్' అని మరికొందరూ మెట్ట వేదాంతం చెబుతుంటారు. కానీ అవేవీ ఆ రోజుకు సరికావు. గడిచిన ఏ ఒక్క క్షణం తిరిగి రాదు. కరిగిపోయే కాలాన్ని ఎటూ బంధించలేం. కాబట్టి కాలంకన్నా వేగంగా పరుగెట్టే జీవితంలో మనవైన రోజులూ, జ్ఞాపకాలూ ఉండాలి. అవే మలిజీవితంలో నెమరేసుకునేందుకు పనికొస్తాయి.

పైగా ఇది ఏఐ కాలం. అల్గారిథమ్స్‌తోనూ మర మనుసులతోనే సావాసం. కుటుంబీకులూ సన్నిహితులూ అంతా కలిసి ఒకేచోట ఉండే రోజులూ కావు. ఎవరి బిజీ వాళ్లది. ఆ రొటీన్‌లో మన అనుకున్నవాళ్లు మన పుట్టినరోజునో పెళ్లి రోజునో గుర్తుంచుకుని చెబితే ఆ ఫీలే వేరు. అలా చెప్పాలని కోరుకోవడం ఎంతమాత్రం అత్యాశ కాదు. కానీ దానికీ తీరికలేని వాళ్లే ఎక్కువ. గుర్తుంచుకోలేనివాళ్లు కొందరైతే, గుర్తున్నా... 'ఆ చెప్పకపోతే ఏమవుతుందిలే' అనుకునేవాళ్లు ఇంకొందరు. కానుక ఇవ్వాలేమో అన్న ఆలోచనతో కావాలని మరచిపోయేవాళ్లు మరికొందరు!


కానీ ఒక్కసారి ఆలోచించండి. ఎవరైనా విష్ చేస్తే మీరెంత సంతోషపడ్డారో అలాగే మీరు చెబితే వాళ్లూ అంతగా ఆనందించరూ? తిరిగివ్వాలన్నది కాదు కానీ, మనం చెప్పే ఒక్క చిన్నమాట ఎదుటి వాళ్లకి ఎనలేని ఆనందాన్ని పంచుతున్నప్పుడు దాన్ని ఎందుకు మిస్ చేయాలి. కాబట్టి మర్చిపోకుండా రిమైండర్ పెట్టుకోండి. నిజానికి అది మీకే ఎక్కువ ఆనందాన్నిస్తుంది. అవతలివాళ్లకి సంతోషం కలిగించామన్న ఫీల్... మీలో హ్యాపీ హార్మోన్లను విడుదల చేస్తుంది. దాంతో ఒత్తిడి, ఆందోళనలూ తగ్గడమే కాదు, శారీరక ఆరోగ్యమూ బాగుంటుందని న్యూరో సైంటిస్టులు చెబుతున్నారు. ఇది అనుబంధాన్ని మరింత పటిష్ఠం చేస్తుంది. ఇలా చెప్పే అలవాటు ఉన్నవాళ్లకు సామాజిక సంబంధాలూ బాగుంటాయి. అవి లేనివాళ్లు ఊబకాయం, ధూమపానం, అధిక రక్తపోటు కన్నా దారుణమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారట!

కాబట్టి, అసలే అంతంతమాత్రం బంధాలతో వర్చువల్ ప్రపంచంలో బతికేస్తున్న కాలంలో- ఆత్మీయులు, స్నేహితులు అనుకున్నవాళ్లకైనా శుభాకాంక్షలు చెప్పడం మర్చిపోకండేం. ఆ చిన్నమాట ఒంటరితనాన్ని తగ్గించి అనంతమైన శక్తినిస్తుంది.

– శాంతిశ్రీ

ఏఐకి నేటికీ దూరం!

కృత్రిమ మేధ (ఏఐ) నేడు అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తోంది. ఈ క్రమంలో అన్ని సంస్థలు ఆ సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయి. 2021లో విశ్వవ్యాప్తంగా 56శాతం కంపెనీలు ఏఐని వినియోగిస్తే- 2024కి వచ్చేసరికి అలాంటివి 78 శాతానికి చేరాయి. కానీ ఉత్తర అమెరికా, ఐరోపా ఖండాలతో పోలిస్తే చాలా దేశాలు ఏఐని అక్కున చేర్చుకోవడంలో ఇప్పటికీ వెనకబడ్డాయి. 2024 నాటికి ఆయా ప్రాంతాల్లో ఎన్ని సంస్థలు ఏఐని వినియోగిస్తున్నాయంటే (శాతాల్లో)...



■	ఉత్తర అమెరికా	82
■	ఐరోపా	80
■	అభివృద్ధి చెందుతున్న దేశాలు	77
■	గ్రేటర్ చైనా	75
■	ఆసియా–పసిఫిక్ దేశాలు	72

(ఆధారం: మెకిన్సీ, కంపెనీ సర్వే వయా ఏఐ ఇండెక్స్-2025)

ముప్పు ఇంకా తొలగిపోలేదు!

నేడు ప్రపంచ ఎయిడ్స్ దినం. మూడున్నర దశాబ్దాల క్రితం ఈ వ్యాధి సోకిందంటే మరణం తప్పేది కాదు. కాలక్రమంలో మెరుగైన మందులతో దీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించడానికి అవకాశం దక్కుతోంది. అయితే అవగాహన కొరవడటం, చికిత్సలో లోపాల వల్ల నేటికీ ఎయిడ్స్ కోరచాస్తోంది.

ప్రపంచంలో ప్రస్తుతం నాలుగు కోట్ల మందికి పైగా ఎయిడ్స్ వ్యాధితో జీవిస్తున్నారు. 2023లో విశ్వవ్యాప్తంగా 13 లక్షల కొత్త కేసులు వెలుగు చూశాయి. గత దశాబ్ద కాలంలో ఇండియాలో ఎయిడ్స్ వ్యాప్తి తగ్గినా నేడు 25 లక్షల మంది ఆ వైరస్‌తో సహజీవనం చేస్తున్నారు. నిరుడు దేశీయంగా సుమారు 64 వేల కొత్త కేసులు నమోదయ్యాయి. వాస్తవానికి, నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ కార్యక్రమాలు, యాంటీ రిట్రోవైరల్ థెరపీ (ఏఆర్టీ) కేంద్రాలు, ప్రజారోగ్య నిపుణుల కృషితో ఎయిడ్స్ నియంత్రణలో ఇండియా విశేష పురోగతి సాధించింది. కానీ, ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపం, ఎయిడ్స్ పట్ల భయం సమస్యాత్మకం అవుతున్నాయి. ఆ వ్యాధి సోకిన వారిని చిన్నచూపు చూసే ధోరణి నేటికీ మారలేదు. గ్రామీణ మహారాష్ట్రలో ఇటీవల జరిపిన సర్వేలో 51శాతం మందికి ఎయిడ్స్ గురించి సరైన అవగాహన లేదని వెల్లడైంది. 2030 నాటికి ఆ మహమ్మారిని తరిమికొట్టాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపిచ్చింది. సమాజంలో అవగాహన పెంచి వివక్షను చెరిపేస్తేనే ఎయిడ్స్ లేని ప్రపంచం సాకారమవుతుంది. ఈ క్రమంలోనే ఎయిడ్స్‌పై చైతన్యం పెంపుదల, చికిత్స తదితరాల పరంగా అంతరాయాలను తగ్గించి, ఆ వ్యాధి బాధితుల పట్ల సంఘంలో ప్రతిస్పందనను మార్చాలని ఈ ఏడాది ప్రపంచ ఎయిడ్స్ డే నినాదంగా ఎంచుకున్నారు.

జాగ్రత్తగా ఉండాల్సిందే

ఝార్ఖండ్‌లో థలసీమియాతో బాధపడుతున్న పలువురు పిల్లలకు రక్తమార్పిడిలో దారుణ నిర్లక్ష్యం వల్ల హెచ్ఐవీ సోకినట్లు ఇటీవల తేలడం తీవ్ర ఆందోళన రేపింది. చాలా బ్లడ్ బ్యాంకులు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, చౌకబారు కిట్లతో రక్త పరీక్షలు చేయడం వల్ల హెచ్ఐవీ వైరస్ విస్తరిస్తోంది. దీన్ని నిరోధించడానికి ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలి. విండో పీరియడ్‌లో రక్తదాతల్లో హెచ్ఐవీని కనిపెట్టడానికి ఆధునిక టెస్టులను ప్రతి బ్లడ్ బ్యాంకులో విధిగా జరపాలి. నవతరంలో ఓర్పు, సహనం తక్కువగా ఉంటున్నాయి. ఉద్రేక పూరిత నిర్ణయాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల హెచ్ఐవీ, లైంగిక వ్యాధులు విజృంభించే ప్రమాదం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల విషయంలో జాగరూకతతో వ్యవహరించాలి. మంచిచెడులను తెలియజెప్పి వారు సక్రమ మార్గంలో పయనించేలా చూడాలి. ఇండియాలోని పారిశ్రామిక ప్రాంతాల్లో నానాటికీ హెచ్ఐవీ కేసులు పెరుగుతున్నట్లు పరిశీలనలు వెల్లడిస్తున్నాయి. అనైతిక సంబంధాలు, వ్యభిచార గృహాలు విచ్చలవిడిగా కొనసాగుతుండటం ఎయిడ్స్ వ్యాప్తికి కారణమవుతున్నాయి. అంతే కాకుండా ఒకరు వాడిన ఇంజెక్షన్లు మరొకరు వినియోగించడం, నిర్లక్ష్యంగా రక్తమార్పిడి చేయడం, ఒకే సూదితో ఎక్కువ మందికి పచ్చబొట్లు పొడవడం వల్ల హెచ్ఐవీ, హెపటైటిస్-బి, సి లాంటివి కట్టుతప్పే ప్రమాదం ఉంది. దానికి తోడు చికిత్సలో అలక్ష్యమూ ప్రాణాలపైకి తెస్తుంది.



విచ్చలవిడిగా ఔషధాల వినియోగం

ఒక్కో వ్యక్తి శరీరం హెచ్ఐవీ చికిత్సకు వేర్వేరు రకాలుగా స్పందిస్తుంది. ఈ నేపథ్యంలో జీవన శైలి, జన్యు చరిత్ర తదితరాల ఆధారంగా ప్రత్యేక చికిత్సలు అందుబాటులోకి వస్తున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటమ్ టెక్నాలజీ వంటివాటి ద్వారా రోగి స్థితిగతులను సంపూర్ణంగా విశ్లేషించి ఔషధాలు అందించడం వల్ల జీవన నాణ్యత మెరుగుపడుతుంది. ఇదంతా బాగానే ఉన్నా, ఇండియాలో శిక్షణ పొందిన హెచ్ఐవీ ఎయిడ్స్ వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. మరోవైపు డాక్టర్ల చీటీ లేకుండానే మెడికల్ షాపుల్లో ఏఆర్టీ మందులు యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. వాటిని ఎక్కువ మోతాదులో తీసుకుంటే ఔషధాలకు లొంగనంత మొండిగా వైరస్ తయారై ప్రాణాపాయానికి దారితీస్తుంది. చాలామంది రోగులు, విద్యాధికులు కూడా వైద్య నిపుణులను సంప్రదించకుండానే ఏళ్ల తరబడి పాతమందుల్ని వాడటం వల్ల కిడ్నీ సమస్యలు తలెత్తుతున్నాయి. ఎయిడ్స్ సోకిన కొంతమందిలో ప్రాణాంతకమైన సిఫిలిస్, గనేరియా, హెర్పిస్ లాంటి సుఖవ్యాధులతో పాటుక్షయ, అంధత్వానికి కారణమయ్యే సైటోమెగలో వైరస్ ఇన్ఫెక్షన్లు, రక్త నాళాల్లో గడ్డలు, హృదయ సంబంధిత వ్యాధులు, పక్షవాతం లాంటివీ తరచూ కనిపిస్తున్నాయి. ఈ వ్యాధిగ్రస్థులకు సరైన బీమా సదుపాయం లేకపోవడం వల్ల పేద, మధ్యతరగతివారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ప్రభుత్వాలు దృష్టిసారించాలి.



డాక్టర్ కూటికుప్పల సూర్యారావు
జెనీవాలోని అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ సంఘం సభ్యులు




కోడిపుంజు కూసింది..!

వెంకటాపురంలో కోటయ్య తన కుటుంబంతో కలిసి ఉండేవాడు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇంట్లో ఒక కోడిపుంజును పెంచేవాడు. అది ప్రతిరోజూ తెల్లవారుజామునే కూసేది. ఆ అరుపుతోనే అంతా నిద్రలేచి.. వాళ్ల పనులు చేసుకునేవారు. ఒకరోజు ఆ కోడిపుంజు.. 'వీళ్లందరినీ నేను నిద్ర లేపడం ఏంటి? అయినా నేనెందుకు ఉదయాన్నే వీళ్ల కోసం లేవాలి. రేపటి నుంచి అస్సలు లేవను. ఒకవేళ లేచినా.. అరవను. ఏం చేస్తారో చూద్దాం' అనుకుంది. అలా వరసగా మూడునాలుగు రోజులు ఉదయాన్నే కూయడం మానేసింది కోడిపుంజు. దానికి ఏమైందోనని కోటయ్య కంగారుపడ్డాడు. కానీ రోజంతా అది బాగానే తిరుగుతుండటం చూసి అతనికి అనుమానం వచ్చింది. దాంతో ఒకరోజు ఉదయాన్నే తన భార్యని పిలిచి.. 'మన కోడిపుంజుకు ఏదో అయినట్లుంది. అందుకే ఉదయాన్నే కూయడం లేదు. దాని అనారోగ్యం ఇంకాస్త ముదరకముందే.. కోసుకుని తింటే మంచిది. ఆ కొడవలి తీసుకురా!' అన్నాడు. ఆ మాటలు విన్న కోడిపుంజుకు ఒక్కసారిగా ఒంట్లో వణుకు పుట్టింది. 'ఇదేంటి నేను ఒకటి అనుకుంటే.. ఇంకేదో జరుగుతోంది' అనుకుంది. వెంటనే గట్టిగా కూసిందా కోడిపుంజు. అప్పుడతను.. 'ఇంకేం తీసుకురావొద్దులే! కోడిపుంజు బాగానే ఉంది. మళ్లీ కూస్తోంది.. ఇంకోసారి ఇలాగే చేస్తే అప్పుడు చూద్దాంలే' అంటూ పొలానికి వెళ్లిపోయాడు కోటయ్య. 'ఎవరు చేసే పని వాళ్లు చేయాలి. కావాలని బద్ధకంగా ప్రవర్తించినా, కారణం లేకుండా పనులు ఎగ్గొట్టినా అది చివరికి మనకే నష్టం చేస్తుంది. మొదటిసారి కాబట్టి తృటిలో తప్పించుకున్నాను లేకపోతే ఈపాటికి నా పని అయిపోయేదే! ఇంకోసారి ఎప్పుడూ ఇలా చేయకూడదు' అనుకుంది కోడిపుంజు.

– మా.శ్రీ.రాజు





అండబెండ బ్రహ్మాండం!

నంద్యాల జిల్లా కోవెలకుంట్ల పట్టణం స్వామినగర్ కాలనీలోని సంజమ్మ ఇంటి పెరట్లో ఓ బెండ మొక్క ఏపుగా ఎదిగింది. బెండ మొక్కలు సాధారణంగా మూడడుగుల ఎత్తు వరకు పెరుగుతాయి. కానీ, ఈ మొక్క సుమారు 15 అడుగులు పెరగడం విశేషం. ఐదు నెలల కిందట విత్తనాలు నాటామని, ఈ మొక్క రోజూ అర కిలో చొప్పున కాయలు కాస్తూ.. క్రమంగా ఎత్తు పెరిగిందని సంజమ్మ చెబుతున్నారు. – న్యూస్‌టుడే, కోవెలకుంట్ల



'విలేజ్ కుకింగ్' @ 3 కోట్లు

వంటల వీడియోలతో 3 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లను సొంతం చేసుకుంది 'విలేజ్ కుకింగ్' యూట్యూబ్ ఛానల్. తమిళనాడులోని పుదుకోట్టై జిల్లా చిన్నవీరమంగళం గ్రామానికి చెందిన సుబ్రమణియన్, అయ్యనార్, పెరియతంబి, మురుగేశన్, ముత్తుమాణిక్యం, తమిళ్‌సెల్వన్ 2018లో దీన్ని ప్రారంభించారు. పెద్దఎత్తున వంటలు చేస్తూ పోస్టు చేసేవారు. నెమ్మదిగా ఆదరణ పెరుగుతున్న క్రమంలో 2021 అసెంబ్లీ ఎన్నికల వేళ రాహుల్ గాంధీ ఛానల్ సభ్యులతో కలిసి వంట చేసిన వీడియో వైరల్‌గా మారి కోటి సబ్‌స్క్రైబర్లను పొందింది. తాజాగా 3 కోట్లు దాటింది. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ ఫుడ్ వీడియోలను అప్‌లోడ్ చేసే ఛానళ్ల జాబితాలో నాల్గో స్థానంలో నిలిచింది. –న్యూస్‌టుడే, చెన్నై

ప్రథమ పాఠం పిల్లలకు నేర్పారా?



రమేశ్, సునీతలు వారి పిల్లల్ని ఓ రోజు ఇంట్లో వదిలి ఉద్యోగానికి వెళ్లారు. పిల్లలిద్దరూ ఆడుకుంటుండగా అనుకోకుండా వారి కుమారుడికి ఓ ఇనుప వస్తువు చేతికి గుచ్చుకుని రక్తస్రావమైంది. ఆ సమయంలో ఏం చేయాలో ఆ చిన్నారులకు పాలుపోలేదు. దీంతో తల్లిదండ్రులు వచ్చేవరకూ అలానే ఉన్నారు. సాయంత్రం ఇంటికి చేరుకున్న అమ్మానాన్నలకు జరిగిన విషయమంతా వివరించారు. కుమారుడ్ని ఆసుపత్రికి తీసుకువెళ్లగా సకాలంలో వైద్యం అందకపోవడంతో ఇన్ఫెక్షన్ సోకిందని వైద్యులు తెలిపారు. ప్రాథమిక చికిత్స చేసుంటే నష్టం కొంతమేర తగ్గేదేమోనని వెల్లడించారు.

పిల్లలను ఇంట్లో వదిలి పనులు, ఉద్యోగాలకు వెళ్లే తల్లిదండ్రులు ఎందరో ఉంటారు. సెలవు రోజుల్లో కూడా కొన్నిసార్లు ఇంట్లో పిల్లలు మాత్రమే ఉంటారు. తల్లిదండ్రులు విధులు ముగించుకొని తిరిగి ఇంటికి చేరుకునేవరకూ వారు ఒంటరిగానే ఉండాల్సి వస్తుంది. చిన్నారులు ఆడుకునే సమయంలో, మరే ఇతర కారణాలతో గాయపడితే ఏం చేస్తారు? తల్లిదండ్రులు వచ్చే వరకు ఎదురుచూస్తూ ఉండలేరు కదా? అందుకే పిల్లలకు ప్రాథమిక వైద్యంపై అవగాహన కల్పించాలి. చిన్నచిన్న గాయాలైనా, మరే కారణంతోనో రక్తస్రావమైనా, వాటికి ప్రాథమిక వైద్యం ఎలా పొందాలనేది నేర్పించాలి. గాయాలైనప్పుడు ఆందోళనకు గురికాకుండా ధైర్యంగా తాత్కాలిక చికిత్స తీసుకోవాలనేది స్పష్టంగా తెలియజేయాలి.


ప్రాథమిక చికిత్స కిట్ తప్పనిసరి..

- ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ప్రాథమిక చికిత్సకు అవసరమైన వస్తువులు (ఫస్ట్ ఎయిడ్ కిట్) అందుబాటులో ఉండాలి. వివిధ బ్యాండేజీలు, మెడికల్ టేపులు, కాటన్, యాంటీ సెప్టిక్ మందులు, కత్తెర, థర్మామీటర్, నొప్పి నుంచి ఉపశమనం కలిగించే కొన్ని మందులు, కాలిన గాయాలకు రాసే ఆయింట్‌మెంట్.. ఇతరత్రాలకు కిట్‌ను అందుబాటులో ఉంచాలి.
- ఈ కిట్‌కు రూ.300-400 వెచ్చిస్తే సరిపోతుంది. ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లో కూడా ఇవి తక్కువ ధరకే లభిస్తాయి.
- ఇంట్లో ఈ కిట్ ఉండే ప్రదేశం, దీని వల్ల ఉపయోగాలు, అవగాహన, వినియోగంపై పిల్లలకు అవగాహన కల్పించాలి.

ఏ గాయానికి ఆ చికిత్స..

- ఆడుకుంటూ కింద పడినప్పుడో, ఏమరపాటులో పదునైన వస్తువు తగిలి రక్తస్రావమైతే, దానిని నియంత్రించి, ప్రాథమిక చికిత్స చేసే విధానాన్ని వివరించాలి. ఫస్ట్ ఎయిడ్ కిట్‌లో ఉండే కాటన్‌తో ఎలా శుభ్రంచేసి, ప్లాస్టర్ లేదా బ్యాండేజీ వేయాలనేది నేర్పాలి.
- పిల్లల ముక్కు పైనా కొంత బలంగా తగిలితే వెంటనే.. రక్తస్రావం అవుతుంది. ఆ సమయంలో కంగారు పడిపోకుండా, కూర్చోవడం, తలను కొద్దిగా ముందుకు వంచడం, ముక్కుపై ఐస్ క్యూబ్‌లు ఉంచితే, రక్తస్రావం ఆగుతుందనేది తెలియజేయాలి.
- కాలిన గాయాలైతే.. ఆ గాయాన్ని 10-20 నిమిషాలపాటు చల్లని లేదా గోరువెచ్చని నీటితో చల్లబరచడం, తర్వాత దానిపై ఆయింట్‌మెంట్ రాయడం వివరించండి.
- జ్వరంగా ఉంటే, థర్మామీటర్ చెక్ చేయడం, తీవ్రత ఎక్కువగా ఉంటే దానికి సంబంధించిన టానిక్ లేదా మందుల వినియోగాన్ని తెలియజేయాలి.
- ఫ్రిజ్, టీవీ, ఛార్జింగ్‌లో ఉన్న సెల్‌ఫోన్ వంటివి కాలిపోయి ఇంట్లో పొగలు, మంటలు వ్యాపిస్తే.. వెంటనే అప్రమత్తమై బయటపడటం, ఒకవేళ పిల్లల దుస్తులకు మంట అంటుకుంటే, వాటిని ఆర్పడం నేర్పించాలి.
- కాలు జారిపడినా, ఆడుకుంటూ కొంత ఎత్తు నుంచి దూకినప్పుడు కాళ్లు, చేయికి తీవ్రగాయమై.. బోన్ ఫ్రాక్చర్ అవుతుంది. ఆ సమయంలో నొప్పి తీవ్రంగా ఉంటుంది. దాని గురించి ఆ సమయంలో జాగ్రత్తగా ఎలా వ్యవహరించాలో తెలియజేయాలి.
- ఊపిరి తీసుకోవడం, గుండె కొట్టుకోవడం ఆగిపోయినా.. వెంటనే ప్రాణం నిలబెట్టేందుకు కార్డియోపల్మనరీ రిసస్సిటేషన్ (సీపీఆర్) చేయాలని పిల్లలకు నేర్పించడం మంచిది.
- ఇంట్లో ఉన్నవాళ్లు ఎవరికైనా అత్యవసరంగా ఆసుపత్రికి తరలించాల్సి వస్తే.. నేరుగా 108కి కాల్‌చేసి, సమాచారం తెలియజేయడాన్ని చూపించాలి.

- ఈనాడు, అమరావతి



ఓరుగల్లులో ఏలియన్?

గ్రహాంతర జీవి భూమిపైకి వచ్చి ఇక్కడి పరిసరాలను పరికిస్తున్నట్లుగా ఉన్న ఈ చిత్రం వరంగల్ నగరంలోని ఉర్సుగుట్టపై కనిపించింది. అక్కడ భారీ బండరాయి చెక్కినట్లుగా ఇలా విభిన్నంగా ఉండడంతో చూపరులను ఆకట్టుకుంటోంది. – ఈనాడు, హనుమకొండ





కుమారుడి కోసం మైదానాన్నే నిర్మించాడు..

కుమారుడిని క్రికెటర్‌ను చేయాలని లక్షలు వెచ్చించి ఏకంగా తన పొలాన్ని మైదానంగా మార్చాడో తండ్రి. తెలంగాణలోని ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వేపకుంట్లకు చెందిన రైతు పొట్లపల్లి నాగరాజు(రాజా) క్రికెట్ అభిమాని. కుమారుడు మణికంఠను క్రికెటర్‌ని చేయాలన్నది ఆయన కల. నిరంతర శిక్షణ కోసం ఖమ్మం నగరానికి 15 కి.మీ. దూరంలోని తన ఐదున్నర ఎకరాల వ్యవసాయ భూమిలో మైదానం సిద్ధం చేశారు. లాన్, ఏడు పిచ్‌లు, విశ్రాంతి గదులు ఇతర సౌకర్యాలకు రెండున్నరేళ్ల క్రితం సుమారు రూ.35 లక్షలు వెచ్చించారు. ఇద్దరిని నియమించి నిర్వహణకు నెలకు రూ.50వేలు ఖర్చు చేస్తున్నారు. ప్రతి ఆదివారం ఖమ్మం నగరంలోని వైద్యులు, పోలీసులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది వచ్చి క్రికెట్ ఆడి వెళ్తుంటారు. సమీప జిల్లాల వారు క్రికెట్ పోటీలు నిర్వహిస్తుంటారు. నిర్వహణ నిమిత్తం వారి నుంచి నామమాత్రపు రుసుం వసూలు చేస్తున్నారు. ఇలా వచ్చేవారితో తన కుమారుడిని ఆడించటం ద్వారా నైపుణ్యం పెరిగేలా చేయగలిగారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మణికంఠ.. తండ్రి ఆలోచనకు తగినట్టు రాణిస్తూ పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. 2026 జనవరిలో రాజస్థాన్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పాఠశాల క్రీడల్లో తెలంగాణ జట్టు తరఫున అండర్-19 జట్టుకు ఎంపికయ్యాడు. –ఈనాడు, ఖమ్మం, న్యూస్‌టుడే, రఘునాథపాలెం

కొక్కొరొకో ట్రీహౌస్..



గ్రామాల్లో ఇంటింటా నాటుకోళ్ల పెంపకం సర్వసాధారణమే. అయితే వాటికి వివిధ సమయాల్లో వచ్చే వ్యాధులు, కోళ్ల పేను తదితర సమస్యలతో చాలామంది వాటి పెంపకాన్ని విడిచిపెడుతున్నారు. కొందరు రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటూ వాటి పెంపకాన్ని కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా కోళ్లు.. గుడ్లను పొదిగే సమయంలో వాటికి పేను ఆశించే అవకాశం ఉంటుంది. దీన్ని నివారించేందుకు చెట్టుకు కోళ్ల గంపలను వేలాడదీసి అందులో కోడి గుడ్లను పొదిగేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కొదురుపాకలో ఓ రైతు తమ ఇంటి ఆవరణలో చెట్ల కొమ్మలకు ఇలా గూళ్లను కట్టి కోళ్ల పొదిగే ఏర్పాటు చేశారు.

–ఈనాడు, కరీంనగర్



డిసెంబరులో మీ నిబద్ధతను పరీక్షించుకోండి



వచ్చే ఏడాది కోసం జనవరిలో కొత్త తీర్మానాలు చేసుకోవడానికి సిద్ధమవుతున్నారా? అంతకన్నా ముందు మీ నిబద్ధతను పరీక్షించుకోవడానికి డిసెంబరును ఉపయోగించుకోండి. ఈ నెలలో రోజూ తప్పనిసరిగా ఈ పనులు చేయగలరేమో ప్రయత్నించండి. ✦ 7 గంటల నిద్ర ✦ 10 వేల అడుగుల నడక ✦ గంట సేపు వ్యాయామం ✦ తీపి పదార్థాలకు దూరంగా ఉండటం ✦ ఒక కొత్త నైపుణ్యాన్ని సాధన చేయడం ✦ పుస్తక పఠనానికి 15 నిమిషాలు కేటాయించడం.

– నేట్ స్టోన్, పర్ఫార్మెన్స్ కోచ్

ఆచరణ మీదైతే.. కోరిన కొలువు!

❖ సరైన ప్రణాళికతోనే విజయం
❖ ఈనాడు - ఈప్రతిభ వెబినార్‌లో నిపుణుల సూచనలు

2026లో ప్రభుత్వ ఉద్యోగ సాధనే లక్ష్యంగా శ్రమిస్తున్న ఆశావహుల కోసం ఈనాడు ఈప్రతిభ ఆదివారం నాడు ఉచిత వెబినార్ నిర్వహించింది. సరైన దిశలో నిరంతర అభ్యాసంతో కోరుకున్న కొలువు దక్కించుకోవడం పెద్ద కష్టమేమీ కాదని నిపుణులు పేర్కొన్నారు. పోటీపరీక్షల నిపుణులు రేమల్లి సౌజన్య, డాక్టర్ తాటికొండ ప్రతిజ్ఞ అభ్యర్థులకు విలువైన సూచనలు, సలహాలు అందించారు. కెరీర్ కౌన్సిలింగ్ నిపుణులు డాక్టర్ బి.నరేశ్‌కుమార్ మోడరేటర్‌గా వ్యవహరించారు.



ఈనాడు ఈప్రతిభ వెబినార్‌లో మాట్లాడుతున్న నిపుణులు బి. నరేశ్, తాటికొండ ప్రతిజ్ఞ, రేమల్లి సౌజన్య

నిన్నటి కల.. రేపటి లక్ష్యం

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా కొన్ని విషయాలను దృష్టిలో ఉంచుకోవాలి. సమయపాలన, అనుసరించాల్సిన వ్యూహం, మైండ్‌సెట్... ఉద్యోగ సాధనలో కీలకపాత్ర పోషిస్తాయి. ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పోటీపరీక్షల్లో పాల్గొనే లక్షలాదిమందిలో కొందరినే విజయం వరిస్తుంది. వారు అనుసరించే టైం మేనేజ్‌మెంట్, ఆచరణాత్మక ప్రణాళిక, నిరంతర అభ్యాసమే దీనికి కారణం. అభ్యసనం ఎప్పుడూ స్థిరంగా ఉండాలి. పోటీ పరీక్షల్లో అకడమిక్ పరీక్షల మాదిరిగా తక్కువ సమయంలో చదివి రాయడం కుదరదు. ముఖ్యంగా రీజనింగ్, అరిథ్‌మెటిక్ లాంటి సెక్షన్లలో సమయాభావం ప్రధాన సవాలుగా నిలుస్తోంది. అందుకే మొదట సులభమైన ప్రశ్నలను ఆన్సర్ చేయడం ఉత్తమం. కఠినమైన ప్రశ్నలతో ప్రారంభిస్తే సమయం వృథా. అభ్యర్థులు తమకు ఏ సబ్జెక్ట్‌లో ఎక్కువ పట్టు, ఆసక్తి ఉన్నాయో చూసుకుని దానికి అనుకూలంగా ఉండే పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయితే లక్ష్యం చేరుకోగలరు. – డాక్టర్ బి. నరేశ్ కుమార్

సక్సెస్ కోసం R - T - E స్ట్రాటజీ

చాలా మంది పరీక్షార్థులు సామర్థ్యం ఉన్నా.. నిర్వహణ లోపం, సరైన వ్యూహాలు అనుసరించకపోవడం వల్ల ఉద్యోగ సాధనలో విఫలమవుతున్నారు. R-T-E స్ట్రాటజీ ద్వారా ఉద్యోగ పోటీలో ముందుండొచ్చు.

R - రివిజన్ సైకిల్ స్ట్రాటజీ: ఏదైనా టాపిక్ చదివేటప్పుడు ముఖ్యమైన అంశాలను షార్ట్ నోట్స్ రూపంలో ప్రిపేర్ చేసుకోవాలి. అప్పుడు తేలిగ్గా పునశ్చరణ చేసుకోవడానికి వీలుంటుంది. ఉదాహరణకు ఒక వారంలో చదివింది రెండు గంటల్లో రివిజన్ చేసేలా ఉండాలి.

T - టెస్ట్ బేస్డ్ లెర్నింగ్ స్ట్రాటజీ: చదివింది ఎంత వరకు గుర్తుంటుందో తెలుసుకోవడానికి ఇది తోడ్పడుతుంది. చదవడం ద్వారా టాపిక్‌పై అవగాహన వస్తుంది. సరిగ్గా నేర్చుకున్నామా.. లేదా అన్నది ప్రాక్టీస్ టెస్ట్స్ రాయడంతో తేలిపోతుంది.

E - ఎర్రర్ ఎలిమినేషన్ మెథడ్ స్ట్రాటజీ: దాదాపు ప్రతి పోటీపరీక్షలో నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. అందుకే కచ్చితంగా జవాబు తెలిసిన ప్రశ్నలను అటెంప్ట్ చేయడం ముఖ్యం. అంతగా తెలియని వాటి జోలికి వెళ్లకపోవడమే మంచిది.

☛ ఈ మూడు స్ట్రాటజీలు అనుసరించడం ద్వారా కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌లో విజయం సాధించవచ్చు. – డాక్టర్ తాటికొండ ప్రతిజ్ఞ

పూర్తి కథనం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ఒకటే పుస్తకం పది సార్లు..

ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర స్థాయి నియామక పరీక్షల్లో ప్రశ్నా సరళిలో మాత్రమే మార్పు తప్ప అన్నింటి సిలబస్ దాదాపు ఒకేలా ఉంటుంది. జనరల్ స్టడీస్ సబ్జెక్ట్స్‌పై పట్టు సాధిస్తే ఉద్యోగ సాధన సులభతరం అవుతుంది. ఇందుకోసం దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం.

తెలుగు రాష్ట్రాల నుంచి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ)కి పోటీ పడేవారి సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది. అన్ని స్థాయుల్లో కలిపి ఏటా సుమారు 20 నుంచి 25వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల అవుతున్నాయి. బ్యాంక్ మాదిరే ఎస్ఎస్‌సీ నియామక ప్రక్రియ కూడా ఏడాదిలోపే పూర్తవుతుంది. సిలబస్ పరంగా బ్యాంక్, ఎస్ఎస్‌సీ ఒకేలా ఉంటాయి. గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఎస్ఎస్‌సీలో ఉద్యోగం సాధిస్తే కెరీర్ బాగుంటుంది. రాష్ట్రస్థాయిలో పోలిస్తే ఏటా ఉద్యోగ ప్రకటనలు ఇచ్చే కేంద్ర ఏజెన్సీలు/బోర్డు పరీక్షలకు ప్రిపేర్ అయితే మంచి ఫలితం ఉంటుంది.

మల్టిపుల్ రివిజన్స్ తప్పనిసరి..

ఏదైనా విషయాన్ని మనం నేర్చుకునేటప్పుడు ముఖ్యంగా కోర్ కాన్సెప్ట్‌పై దృష్టి సారించాలి. ఒక పుస్తకాన్ని పది సార్లు చదవాలి తప్ప పది పుస్తకాలను ఒక సారి చదివవం కరెక్ట్ కాదు. మల్టిపుల్ రివిజన్స్‌తో ఆ టాపిక్‌ను పూర్తిగా నేర్చుకోవచ్చు. ఈ వ్యూహాన్ని అనుసరించడం ద్వారా తేలిగ్గా ఉద్యోగాన్ని సాధించగలం.

– రేమల్లి సౌజన్య

ధాన్యం ఎగుమతికి ప్రత్యేక రైలు: మంత్రి నాదెండ్ల

కొల్లిపర, న్యూస్‌టుడే: ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని తెనాలి నుంచి ఎగుమతి చేసేందుకు రానున్న రెండు రోజుల్లో 21 వ్యాగన్లతో కూడిన ప్రత్యేక రైలును సిద్ధం చేస్తున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా కొల్లిపర మండల పరిధిలోని అత్తోట, చివలూరు, దావులూరు గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి మాట్లాడారు. "సంక్లిష్ట పరిస్థితులు ఉన్నా.. రైతులందరి నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. గోనె సంచులకు కొరత లేదు. టార్పాలిన్లు ఉచితంగా ఇస్తున్నాం. హమాలీల కొరత తీర్చడానికి ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు రాష్ట్రంలో 11 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. రూ.2,600 కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేశాం" అని మంత్రి నాదెండ్ల వెల్లడించారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

ఏపీ కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడలోని సహకార్‌భవన్‌లో నామినేషన్లు దాఖలుచేశాక రెవెన్యూ భవన్‌లో మహా జనసభ జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా టీవీ ఫణిపేర్రాజు (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ), ప్రధాన కార్యదర్శిగా జి.సురేష్‌నాయుడు (గుంటూరు), కోశాధికారిగా జీసీబీవీ కోటేశ్వరరావు (ఎస్పీఎస్ఆర్ నెల్లూరు), సహాధ్యక్షుడిగా పి.నాగరమణయ్య, ఉపాధ్యక్షులుగా ఎస్.శ్రీనివాసులురెడ్డి, డి.విజయ్‌కుమార్, ఎంవీ కొండారెడ్డి, పి.రాజశేఖర్, ఎం.రషీద్ అహ్మద్, ఎన్.సురేంద్రబాబు, ఏకేఎన్ఎన్ మూర్తి, జీకే బాలగంగాధర్, బి.శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.రవిశంకర్, జోనల్ కార్యదర్శులుగా డీపీవీ రామారావు, పి.దుర్గాప్రసాద్, డి.వాసుబాబు, కె.మురళీమోహన్, కార్యదర్శులుగా బి.శివశంకర్‌నాయక్, ఎస్.రామకృష్ణ, కూచి సుబ్బారావు, ఎం.మోజస్, కె.మధుబాబు, కె.ఫణికుమార్, జి.శ్రీనివాసరావు, క్యాడర్ కార్యదర్శులుగా కె.సాయికిరణ్, జి.మల్లికార్జునరావు, బీవీఎస్ఎస్ ప్రణీత్‌వర్మలను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు ఫణిపేర్రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను స్వాగతిస్తూ తెలుపురంగు చొక్కాను, ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తూ బకాయిలను చెల్లించాలని కోరుతూ నలుపురంగు ప్యాంటు వేసుకుని ఉద్యోగులు ఈ సమావేశానికి వచ్చారని తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.



ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గం

దంతెవాడలో 37 మంది మావోయిస్టుల లొంగుబాటు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గౌరవ్‌రాయ్

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో 37 మంది మావోయిస్టులు ఆదివారం ఎస్పీ గౌరవ్‌రాయ్ ఎదుట లొంగిపోయారు. 'వీరిలో 27 మంది మావోయిస్టులపై రూ.65 లక్షల రివార్డు ఉంది. వీరంతా భైరమ్‌గఢ్, ఇంద్రావతి, మాడ్ వంటి అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో చురుగ్గా ఉన్నవారు. వీరిలో కుమ్లీ, గీత, రంజన్, బీమా వంటి కీలక నేతలతో పాటు జనతన సర్కార్‌కు చెందిన పలువురు సభ్యులున్నారు' అని ఎస్పీ వెల్లడించారు.

మావోయిస్టు నారాయణ లొంగిపోయేలా పోలీసుల ప్రయత్నాలు!

గ్రామపెద్దలు, కుటుంబసభ్యులతో సంప్రదింపులు

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం పంచాయతీ పరిధి పెదవంకకు చెందిన మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు చెల్లూరి నారాయణ ఎలియాస్ సురేశ్‌ను లొంగిపోయేలా చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు బాతుపురం పంచాయతీ పెద్దలు, కుటుంబ సభ్యులతో పాడేరు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మాట్లాడుతున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యులు, పాత్రికేయులను తీసుకెళ్లి ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఆయన్ను తీసుకొచ్చేలా చొరవ తీసుకోవాలని పోలీసులు కోరినట్లు పెద్దలు చెబుతున్నారు. మరోవైపు నారాయణ పోలీసుల అదుపులో ఉంటే కోర్టులో హాజరు పరచాలని గ్రామస్థులు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

శ్రీకాకుళం తీరానికి కొట్టుకొచ్చిన బంగ్లాదేశ్ పడవ

- అందులో 13 మంది మత్స్యకారుల గుర్తింపు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం మూసవానిపేట వద్ద సముద్రతీరానికి బంగ్లాదేశ్‌కు చెందిన 13 మంది మత్స్యకారులు బోటుతోపాటు కొట్టుకొచ్చారు. స్థానికులు, మెరైన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగ్లాదేశ్‌కు చెందిన వీరు కొన్ని రోజుల క్రితం వారానికి సరిపడా ఇంధనం, ఆహారంతో సముద్రంలో వేటకు బయల్దేరారు. తుపాను ప్రభావంతో సముద్రంలో తప్పిపోయారు. ఇంధనం, ఆహారంతో ఏడు రోజులు గడిపిన వీరికి.. తర్వాత కష్టాలు మొదలయ్యాయి. వెళ్లే దారి తెలియక, ఆహారం లేక ఆకలితో అలమటించారు. ఆటుపోట్లకు పడవ ఒడిశా మీదుగా మూసవానిపేటకు చేరుకుంది. ఇక్కడ వారు బోటుకు లంగరు వేసి ఉండిపోయారు. ఇది ఈ ప్రాంతానికి సంబంధించిన బోటు కాదని గుర్తించిన స్థానిక మత్స్యకారులు ఆదివారం పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న సీఐ బి.ప్రసాదరావు, ఎస్సై జి.లక్ష్మణరావులు మూడు బోట్ల సాయంతో వారిని ఒడ్డుకు చేర్చారు. వీరి భాష, వేషధారణను చూసి బంగ్లాదేశ్‌కు చెందిన వారిగా గుర్తించారు. ఆహారం లేక మాట్లాడలేకపోతున్న వీరికి స్థానికులు సపర్యలు చేసి ఆహారం అందించారు. అనంతరం కళింగపట్నం పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా దేశంలోకి ప్రవేశించిన వీరిపై కేసు నమోదు చేస్తామని మెరైన్ సీఐ తెలిపారు.



మూసవానిపేటకు వచ్చిన బంగ్లాదేశ్ మత్స్యకారులు



సముద్ర తాబేళ్ల మృత్యుఘోష

అరుదైన ఆలివ్‌రిడ్లే సముద్ర తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. సముద్ర గర్భంలో సంచరించే ఈ తాబేళ్లు సంతానోత్పత్తిలో భాగంగా గుడ్లు పెట్టేందుకు అక్టోబరు నుంచి జనవరి వరకు కొన్ని వేల కిలోమీటర్లు ప్రయాణించి తీరానికి చేరుకుంటాయి. ఈ క్రమంలో చేపల వేటకు ఉపయోగించే బోట్ల పంకాలకు తగిలి, మత్స్యకారుల వలలకు చిక్కి అనేక తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. అలా చనిపోయిన మూడు తాబేళ్ల మృతకళేబరాలు కాకినాడ సముద్ర తీరానికి కొట్టుకొచ్చాయి. సముద్ర తాబేళ్లను కాపాడేందుకు అటవీ శాఖ అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

– ఈనాడు, కాకినాడ

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా డా.బాలరాజు బాధ్యతలు స్వీకరణ

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా డాక్టర్ బాలరాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని ఐఎంఏ రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల దేశ వ్యాప్తంగా ఆసుపత్రులు, వైద్యులపై భౌతిక దాడులు జరుగుతున్నాయని వాటిని నివారించి వైద్యులు నిర్భయంగా, ప్రశాంత వాతావరణంలో సేవలు అందించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసుపత్రులపై దాడులకు పాల్పడే వారిపై కనీసం ఏడేళ్ల జైలుశిక్ష పడేలా చట్ట సవరణ చేసి, నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుభాష్ చంద్రబోస్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు డి.శ్రీహరి, నందకిశోర్, పి.ఎస్.శర్మ, తుమ్మల కార్తీక్, సమరం, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ బాలరాజు, చిత్రంలో వైద్యులు సమరం, శ్రీహరి, నందకిశోర్, సుభాష్‌చంద్రబోస్

ప్రపంచస్థాయి గొప్ప రాజధాని మనకెందుకు?

వైకాపా నేత అంబటి రాంబాబు వ్యాఖ్య

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రపంచస్థాయి గొప్ప రాజధాని ఎందుకు అని వైకాపా నేత అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు. తాడేపల్లిలోని వైకాపా కేంద్ర కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. "మా ఖర్మ కాకుంటే దిల్లీ కంటే పెద్ద రాజధాని మనకెందుకు? ఏంటి మనకు అంత గొప్ప? అసలు నాకు అర్థం కావట్లేదు... సింగపూర్, యూకే, లండన్ లాంటి రాజధాని ఎందుకు? నెత్తినేసి కొట్టుకోవడానికా? ఏం చేసుకుంటాం. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులని మేం మాట్లాడింది నిజమే. చంద్రబాబు ఒక రాజధాని అని చెప్పారు. దాన్ని అద్భుతంగా, ప్రపంచస్థాయి రాజధానిగా చేస్తామన్నారు. ఆయన అధికారంలోకి వచ్చారు. సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ పేరుతో చంద్రబాబు రూ.కోట్లు ఖర్చు పెడుతున్నారు. ఆ క్రమంలో సొమ్ము చేసుకుంటున్నారు. అమరావతిపై, రైతులపై ఆయనకు చిత్తశుద్ధి లేదు" అని అంబటి విమర్శించారు.


మిథిలా చిత్రకళతో
రామాయణ గాథ




బిహార్‌లోని ముజఫర్‌పూర్ కళాకారుడు సుజీత్ శ్రీవాస్తవ రామాయణ కథను సంప్రదాయ మిథిలా చిత్రకళతో (మధుబని చిత్రలేఖనం) అందంగా చిత్రీకరించారు. రెండు నెలలు శ్రమించి రాముడి జననం, స్వయంవరం, వనవాసం, సీతాపహరణం, రామ-రావణ యుద్ధం వంటి ఘట్టాలను జీవం ఉట్టిపడేలా తీర్చిదిద్దిన సుజీత్‌ను అందరూ అభినందిస్తున్నారు. చీరలు, దుప్పట్లు వంటి వస్తువులపై సుజీత్ వేసే మిథిలా చిత్రాలతో ఏటా దాదాపు రూ.10 లక్షల ఆదాయం వస్తోంది. అయోధ్యలో రామాలయ నిర్మాణం పూర్తయిన తర్వాత రామాయణ కథను మిథిలా చిత్రాల ద్వారా చెప్పాలనే ఆలోచన తనకు వచ్చిందని సుజీత్ తెలిపారు. దిల్లీ నుంచి వచ్చిన ఆర్డరు మేరకు 80 మీటర్ల వస్త్రంపై సంపూర్ణ రామాయణాన్ని చిత్రీకరించే పనిలో ప్రస్తుతం నిమగ్నమై ఉన్నట్లు చెప్పారు. 2014లో సుజీత్‌ను పెళ్లాడిన శ్వేత కూడా మిథిలా పెయింటింగ్ కళాకారిణి కావడంతో భర్తకు సహకరిస్తోంది.

ETV భారత్

సిద్ధార్థ నవలతో హిందీ నేర్చుకొని..
స్వీడన్‌లో బోధిస్తున్న హ్యాన్స్ వర్నర్



'ప్రపంచం ఓ కుగ్రామం' అనే నానుడికి ప్రతిబింబం హ్యాన్స్ వర్నర్. జర్మనీలో పుట్టిన ఈయన పదవీవిరమణ తర్వాత స్వీడన్‌లో హిందీ బోధిస్తుండటం విశేషం. భోపాల్‌లో జరుగుతున్న 'విశ్వ రంగ్ మహోత్సవ్'లో పాల్గొనేందుకు ప్రవాస రచయితగా ఆయన భారత్‌కు వచ్చారు. జర్మన్ - స్విస్ రచయిత హెర్మన్ హెస్ రాసిన 'సిద్ధార్థ' నవలను తన తండ్రి చదివేవారు. 15 ఏళ్ల వయసులో వర్నర్ చదివారు. ఆ పుస్తకం ఆయనపై బలమైన ముద్ర వేసి, భారతీయ సంస్కృతిపై ఆసక్తిని పెంచింది. ఆ ప్రయత్నంలో భాగంగానే హిందీపై ఆయన తిరుగులేని పట్టు సాధించారు. "హిందీపై శ్రద్ధ పెరిగింది. చాలా సమాచారం సేకరించాను. జర్మనీలో ఇండాలజీ (భారతీయ చరిత్ర, సంస్కృతి, భాషలు) సబ్జెక్టు నేర్చుకున్నాను. ఇదంతా 40 ఏళ్ల కిందట జరిగింది" అని వర్నర్ 'ఈటీవీ భారత్'కు వివరించారు. హిందీ రాదారులను మాట్లాడుతూ, పర్షియన్ పదాలు కలగలిసిన ఉర్దూ సాహిత్యాన్ని ఆయన తెలుగు వల్లె వేస్తున్నారు. పశ్చిమ దేశాల్లో హిందీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. "నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్నా, భారత ప్రజలు నన్ను కోరుకుంటే కొంతకాలం ఇక్కడ పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నా" అని తెలిపారు.

అన్నం కోసం వెళ్తే.. ప్రాణం తీశాడు
పెళ్లి విందులోకి వెళ్లిన బాలుడిపై హెడ్‌కానిస్టేబుల్ కాల్పులు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని శాహ్‌దరాలో శనివారం అమానవీయ ఘటన చోటుచేసుకుంది. అన్నం కోసం పెళ్లి విందుకు వెళ్లిన ఓ బాలుణ్ని కేంద్ర పారిశ్రామిక భద్రతా దళానికి(సీఐఎస్ఎఫ్) చెందిన హెడ్ కానిస్టేబుల్ తుపాకీతో కాల్చి చంపాడు. మానసరోవర్ పార్కులోని డీడీఏ మార్కెట్ వద్ద ఓ కమ్యూనిటీ సెంటర్‌లో పెళ్లి జరుగుతుండగా ఈ ఘటన జరిగింది. మురికివాడలో నివసించే 17 ఏళ్ల బాలుడు గేటు దూకి పెళ్లి భోజనం కోసం వెళ్లాడు. స్థానికులు అతణ్ని గుర్తించి అడ్డుకున్నారు. అక్కడే ఉన్న సీఐఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ ఆ బాలుడితో వాగ్వాదానికి దిగాడు. ఆవేశంతో తుపాకీ తీసి కాల్పులు జరిపాడు. గాయపడిన ఆ బాలుణ్ని కొందరు స్థానిక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. కాల్పులు జరిపిన హెడ్‌కానిస్టేబుల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పోలీసులపై ప్రజాభిప్రాయాన్ని మార్చాల్సిన అవసరం ఉంది: మోదీ



రాయ్‌పుర్: పోలీసులపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో ఉన్న అభిప్రాయాన్ని మార్చాల్సిన అవసరం ఉందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. వృత్తి నిపుణతను, సున్నితత్వాన్ని, ప్రతిస్పందనను పెంచడం ద్వారా దీనిని సాధించాలని సూచించారు. 'వికసిత భారత్: భద్రత కోణాలు' అనే అంశంపై రాయ్‌పుర్‌లో ఆదివారం ముగిసిన అఖిల భారత డీజీపీలు, ఐజీపీల మూడురోజుల సదస్సులో ఆయన ప్రసంగించారు. నిషేధిత సంస్థలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు వామపక్ష తీవ్రవాద ప్రభావం నుంచి బయటపడిన జిల్లాల్లో సమగ్ర అభివృద్ధి పర్యవేక్షణ, తీరప్రాంత భద్రతను బలోపేతం చేసేందుకు వినూత్న వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన ప్రాముఖ్యాన్ని ఆయన నొక్కిచెప్పారు. జనావాసాలు లేని ద్వీపాలను సమీకృతం చేయడం, నాట్‌గ్రిడ్ అంచెలతో ఉన్న సమాచారాన్ని సమగ్రంగా వినియోగించుకోవడం, వీటిని కృత్రిమ మేధతో అనుసంధానించడంపై పోలీసు బలగాలు దృష్టిసారించాలని సూచించారు. "అర్బన్ పోలీసు వ్యవస్థ బలపడాలి. పర్యాటక ప్రాంతాల్లో పోలీసు వ్యవస్థను బలోపేతం చేయాలి. నూతన చట్టాలపై ప్రజల్లో అవగాహన పెంచాలి. పోలీసు విధానాల్లో ఫోరెన్సిక్ ఎలా వాడుకోవాలో అధ్యయనం చేసేలా విద్యాసంస్థల్ని ప్రోత్సహించాలి. మాదకద్రవ్యాల జాడను అరికట్టడానికి సమగ్ర దృక్పథంతో చర్యలు చేపట్టాలి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టాన్ని పరిమితం చేయగలగాలి" అని మోదీ చెప్పారు. దేశ భద్రత అంశాలపై సదస్సులో విస్తృతంగా సమాలోచనలు జరిపారు. ఉగ్రవాదం, విప్లవవాదాలను ఎదుర్కోవడం, మహిళా భద్రతను పెంచడం, పలాయనంలో ఉన్న నేరగాళ్లను తిరిగి రప్పించడం, ఫోరెన్సిక్ సామర్థ్యాలు మెరుగుపరచడం వంటి అంశాల్లో మార్గదర్శకాల రూపకల్పనపై సమగ్రంగా చర్చించారు. నిఘా విభాగంలో విశిష్ట సేవలందించినవారికి 'రాష్ట్రపతి పోలీసు పతకాల'ను ప్రధాని ప్రదానం చేశారు.

అమెరికాలో కాల్పుల కలకలం
నలుగురి మృతి, 10 మందికి గాయాలు

స్టాక్‌టన్: అమెరికాలో కాల్పులు మళ్లీ కలకలం సృష్టించాయి. కాలిఫోర్నియాలోని స్టాక్‌టన్‌లో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో నలుగురు మృతిచెందారు. పది మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో చిన్నారులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. స్టాక్‌టన్‌లోని హోటల్లో ఓ చిన్నారి పుట్టిన రోజు వేడుక జరుగుతుండగా.. పార్టీ హాల్‌లోకి చొరబడిన దుండగులు అక్కడివారిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఉద్దేశపూర్వకంగానే దుండగులు కాల్పులకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది.

కిడ్నీ ఇచ్చి.. ప్రాణం పోసి..
21 ఏళ్ల ఇన్‌ఫ్లుయెన్సర్‌కు మూత్రపిండం ఇచ్చిన తండ్రి

దిల్లీ: ఓ 21 ఏళ్ల సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌కు ఆమె తండ్రి తిరిగి ప్రాణం పోశారు. రెండు మూత్రపిండాలు పాడైన ఆమెకు.. తన కిడ్నీ దానం చేసి రెండో జన్మ ప్రసాదించారు. దిల్లీకి చెందిన క్యూటీ మెందిరత్తా అనే యువతికి ఆమె తండ్రి యోగేశ్ మెందిరత్తా కిడ్నీ ఇచ్చి వార్తల్లో నిలిచారు.



క్యూటీకి తొలుత మూత్రంలో ఇన్‌ఫెక్షన్‌తో మొదలైన సమస్య.. క్రమంగా రెండు కిడ్నీలు పాడయ్యేలా వ్యాపించింది. దీంతో కిడ్నీ మార్పిడి అవసరమన్న వైద్యుల సలహాతో ఆమె తండ్రి ముందుకొచ్చారు. నెల క్రితమే క్యూటీకి కిడ్నీ మార్పిడి ఆపరేషన్ జరగ్గా.. ఇప్పుడిప్పుడే తను కోలుకుంటోంది. ఆమెకు సామాజిక మాధ్యమాల్లో లక్షల్లో ఫాలోవర్లు ఉన్నారు.

నేషనల్ హెరాల్డ్ కేసులో
సోనియా, రాహుల్‌పై కొత్త ఎఫ్ఐఆర్



దిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ తదితరులపై దిల్లీ పోలీసులు కొత్త ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. ఈ వ్యవహారంలో నగదు అక్రమ చలామణి జరిగిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఫిర్యాదు అందిన విషయం తెలిసిందే. వ్యక్తిగత ప్రయోజనాల కోసం వీరంతా తమ పదవుల్ని దుర్వినియోగం చేశారని ఆ ఫిర్యాదు. ఈడీ ఇచ్చిన సమాచారంతో ఎఫ్ఐఆర్‌లో కాంగ్రెస్ నేతలపై నేరపూరిత కుట్ర సంబంధిత అభియోగాలు మోపారు. ఆ జాబితాలో మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, సుమన్ దూబె, శాం పిట్రోడా ఉన్నారు. వీరందరూ కలిసి రూ.50 లక్షలు చెల్లించి.. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.2వేల కోట్ల విలువైన ఆస్తులపై అధికారాన్ని పొందారని ఆరోపించింది.

ప్రతీకార రాజకీయాలు కొనసాగిస్తున్న మోదీ, షా: కాంగ్రెస్

ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలు తమ పార్టీ అగ్రనేతలపై ప్రతీకార రాజకీయాలు కొనసాగిస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ధ్వజమెత్తారు. "అభద్రతా భావంతో, భయంతో మా నేతల్ని వేధిస్తున్నారు. నేషనల్ హెరాల్డ్ అంశం పూర్తిగా బోగస్ కేసు. సత్యమేవ జయతే" అని అన్నారు. "ఈ కేసులో డబ్బు ఎక్కడికీ బదిలీ కాలేదు. అయినా నగదు అక్రమ చలామణి జరిగిందంటున్నారు. అప్పుడున్న నేషనల్ హెరాల్డ్ అంశం పూర్తిగా బోగస్ కేసు. ఎలాంటి ఆస్తులను బదిలీ చేయలేదు. లెక్కల్లో చూపని నల్లధనమనేది లేదు. ఏమీ లేకుండానే మనీలాండరింగ్ ఆరోపణలు చేశారు. గాంధీలను గానీ, కాంగ్రెస్ శ్రేణులను గానీ యంగ్‌ఇండియా డైరెక్టర్లుగా ఎలాంటి డివిడెండ్లు, లాభాలు రావు" అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ మనుసింఘ్వి చెప్పారు.

ఆ ఒక్క నిర్ణయం మీ గతిని మార్చేస్తుంది



లక్ష్యసాధన కోసం ప్రయత్నించే ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సందర్భంలో తప్పనిసరిగా ఓ ఆలోచన వస్తుంది. అదేంటంటే.. ఇక ఈ ఒత్తిడిని, కష్టాలను భరించడం మనవల్ల కాదని, ప్రయత్నాలను ఇంతటితో ఆపేద్దామని అనిపిస్తుంది. ఆ సందర్భంలో మీరు తీసుకొనే నిర్ణయమే మిమ్మల్ని విజేతగానో లేక పరాజితుల్లో ఒకరిగానో మారుస్తుంది. మీరు విజేతగా నిలవాలనుకుంటే ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయకండి.

– డేవిడ్ గొగిన్స్, మోటివేషనల్ స్పీకర్

అవినీతి కేసుల్లో క్షమాభిక్ష ప్రసాదించండి

- వారానికి 3 సార్లు కోర్టుకు వెళ్లాల్సి వస్తోంది
- ఇజ్రాయెల్ అధ్యక్షుడికి నెతన్యాహు లేఖ



టెల్ అవీవ్: పలు అవినీతి కేసుల్లో ఐదేళ్లుగా అభియోగాలను, కోర్టు విచారణను ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తనకు క్షమాభిక్ష ప్రసాదించాలని దేశాధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అధికారికంగా లేఖ రాశారు. తనపై సుదీర్ఘంగా సాగుతున్న విచారణను ముగించాలని అందులో నెతన్యాహు కోరారు. తనపై విచారణ దేశాన్ని విభజిస్తోందని ఓ వీడియో సందేశంలో ఆయన పేర్కొన్నారు. వారానికి మూడు సార్లు తాను న్యాయస్థానానికి హాజరు కావాల్సి వస్తోందని, దీని వల్ల దేశానికి నాయకత్వం వహించడం కష్టమవుతోందని తెలిపారు. ఇటీవల ఇజ్రాయెల్ పర్యటనకు వచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. నెతన్యాహుకు క్షమాభిక్ష ప్రసాదించాలని హెర్జోగ్‌ను కోరారు. క్షమాభిక్ష కావాలనుకునేవారు తనకు అధికారికంగా లేఖ పంపాల్సి ఉంటుందని ఆ సమయంలో హెర్జోగ్ స్పష్టం చేశారు. మోసం, నమ్మకద్రోహం, అవినీతి తదితర అభియోగాలతో మూడు కేసుల్లో నెతన్యాహు విచారణ ఎదుర్కొంటున్నారు.

■ ఇజ్రాయెల్-పాలస్తీనా ఘర్షణకు ద్విదేశ పరిష్కారమే మార్గమని పోప్ లియో 14 తెలిపారు. రెండు పక్షాలకు ఈ పరిష్కారమే న్యాయం చేస్తుందని అభిప్రాయపడ్డారు.

'సర్' గడువు ఏడు రోజులు పొడిగించిన ఈసీ

దిల్లీ: తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరుగుతున్న 'ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)' ప్రక్రియను ఈ నెల 11 వరకు పొడిగిస్తున్నట్లు ఎన్నికల కమిషన్(ఈసీ) ఆదివారం ప్రకటించింది. తక్కువ సమయంలో 'సర్'ను పూర్తిచేసే క్రమంలో ప్రజలకు, క్షేత్రస్థాయి అధికారులకు సమస్యలు ఎదురవుతున్నాయన్న ప్రతిపక్షాల ఆరోపణల నేపథ్యంలో ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ డిసెంబరు 4తో పూర్తికావాల్సి ఉండగా 11 వరకు ఈసీ పొడిగించింది. అందుకు అనుగుణంగా ముసాయిదా ఓటరు జాబితా, తుది ఓటరు జాబితా విడుదల తేదీలను సవరించింది. ముసాయిదా ఓటరు జాబితాను ఈ నెల 16న.. తుది ఓటరు జాబితాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న విడుదల చేస్తామని ఈసీ పేర్కొంది. తొలుత విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 9న ముసాయిదా ఓటరు జాబితా, 2026 ఫిబ్రవరి 7న తుది ఓటరు బాబితా విడుదల కావాల్సి ఉంది. ప్రస్తుతం ఎస్ఐఆర్ రెండో దశలో ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరిలు ఉన్నాయి.

మరో ఇద్దరు బీఎల్‌వోల మృతి

దేశంలో బీఎల్‌వోల మరణాలు కలకలం రేపుతున్నాయి. తాజాగా రాజస్థాన్‌లోని దౌల్‌పుర్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని బిజ్నోర్‌లో బీఎల్‌వోలు మృతి చెందారు. రాజస్థాన్‌లో అనుజ్ గార్గ్(42) అనే బీఎల్‌వో శనివారం రాత్రి ఓటరు డేటా అప్‌లోడ్ చేస్తూనే గుండెపోటుతో మృతిచెందాడు. యూపీలోనూ శోభారాణి(56) అనే బీఎల్‌వో ఇదే రీతిలో చనిపోయారు. అర్ధరాత్రుల వరకు పనిచేయడంతోనే వీరిద్దరు మరణించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

ప్రియుణ్ని చంపిన తండ్రి, సోదరులు..
మృతదేహాన్ని పెళ్లాడిన యువతి

మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఓ యువతి వేరే కులంవాడిని ప్రేమించిందని ఆమె తండ్రి, సోదరులు కలిసి ప్రియుడిని అతి దారుణంగా హత్య చేశారు. ప్రాణం పోయినా అతడే తన భర్త అంటూ అంత్యక్రియల సమయంలో ఆమె మృతదేహాన్ని పెళ్లాడింది. జునాగంజ్ ప్రాంతానికి చెందిన సక్షమ్ తాటే (20), అచల్ (21) మూడేళ్లుగా ప్రేమలో ఉన్నారు. ఈ విషయం యువతి ఇంట్లో తెలిసి యువకుడిని హెచ్చరించినా ఫలితం లేకపోయింది. దీంతో నవంబరు 27వ తేదీ సాయంత్రం యువతి తండ్రి గజానన్, అన్నలు సాహిల్, హిమేశ్, వారి స్నేహితులు కలిసి సక్షమ్‌పై కాల్పులు జరిపి, బండరాయితో తలపై మోది హత్య చేశారు. ఈ హత్య జరిగిన 12 గంటల్లోపే పోలీసులు నిందితులు అందరినీ అదుపులోకి తీసుకున్నారు. ప్రియుడి అంత్యక్రియల్లో పాల్గొన్న అచల్ పసుపు, కుంకుమ రాసుకొని.. నుదిటిపై సిందూరం పెట్టించుకొని అతడే తన భర్తగా ప్రకటించింది. ఇక నుంచి సక్షమ్ ఇల్లే తన ఇల్లని, అక్కడే ఉంటానని మీడియా ఎదుట స్పష్టం చేసింది. ఈ హత్య చేసిన నిందితులను ఉరి తీయాలని ఆమె డిమాండ్ చేసింది.



అచల్, సక్షమ్ తాటే

ETV భారత్ యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

యువతకు అండగా మాజీ జవాన్లు

- అయిదేళ్లలో 400 మందికి ఉద్యోగాలు



ఛత్తీస్‌గఢ్ రాజధాని నగరం రాయ్‌పుర్‌లో ముగ్గురు మాజీ సైనికులు ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి.. ఆర్మీ, అగ్నివీర్, పోలీసు ఉద్యోగాల అభ్యర్థులకు ఉచిత తర్ఫీదు ఇస్తున్నారు. రాయ్‌పుర్‌లోని శాశ్వత్ నగర్‌లో పేద, మురికివాడల ప్రాంతాలకు చెందిన యువతకు వీరు శిక్షణ అందిస్తున్నారు. చలి తీవ్రతను కూడా లెక్కజేయకుండా రోజూ ఉదయాన్నే దాదాపు 50 మంది యువత వీరి శిక్షణ కేంద్రానికి హాజరవుతున్నారు. దేహదారుఢ్య పరీక్షలు, రాత పరీక్షల గురించి యువతకు అవగాహన కల్పిస్తున్నట్లు 30 ఏళ్లు ఆర్మీలో పనిచేసిన మాజీ సైనికుడు డి.పి.పటేల్ తెలిపారు. గత అయిదేళ్లుగా అఖిల భారత పూర్వ సైనిక సేవా పరిషత్తు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 17 కేంద్రాల్లో యువతకు ఇటువంటి శిక్షణ అందిస్తున్నారు. ఈ కేంద్రాల నుంచి 400 మందికి పైగా యువత సైన్యం, పోలీసు, అగ్నివీర్ ఉద్యోగాల్లో చేరినట్లు డి.పి.పటేల్ వివరించారు.

'హీరాకుండ్'లో ఉగ్రవాదులున్నారు!

- ఓ రైలు ప్రయాణికుడి ఆకతాయి బెదిరింపు
- సీటు కోసం తలెత్తిన తగాదాయే కారణమని గుర్తింపు

ఝాన్సీ: అమృత్‌సర్-విశాఖపట్నం మధ్య ప్రయాణించే హీరాకుండ్ ఎక్స్‌ప్రెస్‌కు ఆదివారం ఉగ్ర బెదిరింపు వచ్చింది. అయితే అది ఉత్తుత్తిదేనని తనిఖీల సందర్భంగా తేలింది. ఝాన్సీకి చెందిన నలుగురు ప్రయాణికులు హీరాకుండ్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నారు. సీటు విషయమై వారి మధ్య గొడవ తలెత్తింది. వీరిలో ఒకరు ఓ వర్గం, మిగిలిన ముగ్గురు మరో వర్గానికి చెందిన వారు. ఈ క్రమంలో ఓ ప్రయాణికుడు మిగిలిన ముగ్గుర్ని ఉగ్రవాదులుగా పేర్కొంటూ 20808 నంబరు రైల్లో వారు ప్రయాణిస్తున్నారంటూ కంట్రోల్ రూముకు సమాచారమందించాడు. ఇదిలా ఉండగా వారి మధ్య వాగ్వాదం ఎక్కువవడంతో ఆ నలుగురిని రైల్వే పోలీసులు, ప్రయాణికులు మధ్యప్రదేశ్‌లోని దతియా స్టేషన్‌లో రైల్లోంచి దింపేశారు. ప్రయాణికుడి సమాచారంతో అప్రమత్తమైన రైల్వే సిబ్బంది అదే స్టేషన్లో రైలు జనరల్ బోగీలో 30 నిమిషాల పాటు తనిఖీలు నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేవని తేల్చారు. రైలు నుంచి దించివేతకు గురైన నలుగురు ప్రయాణికులనూ విచారించారు. చివరకు ప్రయాణికుల మధ్య సీటు కోసం తలెత్తిన గొడవే ఉగ్ర బెదిరింపునకు కారణమని రైల్వే పోలీసులు తేల్చారు. అనంతరం రెండో దఫా ఝాన్సీ స్టేషన్‌లోనూ రైలుకు తనిఖీలు చేపట్టి బెదిరింపు ఉత్తిదేనని రూఢీపరచుకున్నారు. అనంతరం రైలును విశాఖపట్నం వెళ్లేందుకు అనుమతించారు.

ఏ320 విమానాల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ పూర్తి
ప్రకటించిన డీజీసీఏ


దిల్లీ: దేశీయ విమానయాన సంస్థలు తమ వద్ద ఉన్న ఎయిర్‌బస్ ఏ320 మోడల్ విమానాల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌ను పూర్తి చేశాయని డీజీసీఏ ఆదివారం వెల్లడించింది. మొత్తం 323 విమానాల్లో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసినట్లు పేర్కొంది. ఎయిర్ బస్ ఏ320 రకానికి చెందిన 338 విమానాలను భారత్ వినియోగిస్తోంది. ఇవి ప్రధానంగా ఇండిగో, ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ వద్ద ఉన్నాయి. వీటిలో 323 మాత్రమే ప్రస్తుతం విధుల్లో ఉండగా.. ఆరు మెయింటెనెన్స్‌లో ఉన్నాయి. మరో తొమ్మిది విమానాలకు ఎటువంటి అప్‌గ్రేడ్ అవసరం లేదని డీజీసీఏ అధికారులు తెలిపారు.

146కు పెరిగిన హాంకాంగ్ ప్రమాద మృతుల సంఖ్య

బీజింగ్: హాంకాంగ్‌లోని తై పో జిల్లాలో బహుళ అంతస్తుల భవనాల్లో చెలరేగిన మంటల కారణంగా మృతిచెందిన వారి సంఖ్య 146కు పెరిగింది. వీరిలో అగ్నిమాపక సిబ్బంది ఒకరు ఉన్నారు. మరో 150 మంది ఆచూకీ తెలియరాలేదు. భవనాల మరమ్మత్తుల సమయంలో మండే స్వభావం గల నాణ్యతలేని వస్తువులను ఉపయోగించి అగ్నిప్రమాదానికి కారణమైన ఓ మహిళ సహా 8 మందిని ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భవనాల సముదాయంలో ఎలా మంటలు రాజుకున్నాయన్న విషయమై ఇప్పటివరకూ ఎటువంటి స్పష్టమైన సమాచారం లేదు. ఈ దిశగా దర్యాప్తు కొనసాగుతోంది. ప్రమాద సమయంలో భవనాల్లో ఎటువంటి హెచ్చరిక సంకేతాలు వినిపించలేదని, దీని కారణంగా మృతుల సంఖ్య అధికంగా ఉందని దుర్ఘటనలో ప్రాణాలతో బయటపడిన వ్యక్తులు ఆవేదన వ్యక్తంచేశారు.

ఎన్నికల సంస్కరణలు, సర్‌పై నిలదీద్దాం
కాంగ్రెస్ వ్యూహ సమావేశంలో నిర్ణయం

దిల్లీ: ఎన్నికల సంస్కరణలు, ప్రత్యేక సమగ్ర సవరణపై (సర్) పార్లమెంటు సమావేశాల్లో నిలదీయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. మిగిలిన భాగస్వామ్య పక్షాలతో కలిసి ఈ అంశాలపై ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు సమావేశం కావాలని నిశ్చయించింది. ఆదివారం సాయంత్రం సోనియా గాంధీ నివాసంలో పార్టీ వ్యూహ సమావేశం జరిగింది. అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ తదితరులు హాజరయ్యారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు.




'ఆపరేషన్ సాగర్ బంధు'లో భాగంగా శ్రీలంకలో వరద ప్రభావిత ప్రాంతం నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న భారత వాయుసేన సిబ్బంది ★ శ్రీలంకలోని కెలనియా ప్రాంతంలో వరద ఉద్ధృతితో ప్రజల పాట్లు

శ్రీలంకలో 334కు పెరిగిన మృతులు

- కొలంబో నుంచి స్వదేశానికి భారతీయులు

కొలంబో: శ్రీలంకలో దిత్వా తుపాను బీభత్సం ధాటికి వరదలు వెల్లువెత్తడం, కొండచరియలు విరిగిపడటం వల్ల ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య 334కి పెరిగింది. మరో 370 మంది ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఆదివారం శ్రీలంక జాతీయ విపత్తు నిర్వహణ కేంద్రం (డీఎంసీ) వెల్లడించింది. దాదాపు 11.18 లక్షల మందిపై విపత్తు ప్రభావం పడిందని తెలిపింది. మరోవైపు 'ఆపరేషన్ సాగర్ బంధు' పేరుతో శ్రీలంకలో భారత్ చేపడుతున్న సహాయక చర్యలు ఆదివారం కూడా కొనసాగాయి. ఐఎన్ఎస్ విక్రాంత్, రెండు చేతక్ హెలికాప్టర్లతో పాటు 80 మంది జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) సిబ్బందిని శ్రీలంకకు పంపినట్లు విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడించారు. అంతకు ముందురోజు వాయుసేనకు చెందిన సీ-130జే, ఐఎల్ 76 విమానాలు 21 టన్నుల సహాయ సామగ్రిని శ్రీలంకకు తరలించాయి. కొలంబో విమానాశ్రయంలో చిక్కుకుపోయిన 323 మంది భారతీయులను ఆదివారం రవాణా విమానాల్లో స్వదేశానికి తరలించారు. 247 మంది తిరువనంతపురానికి, 76 మంది దిల్లీకి చేరుకున్నారు. వరద ప్రాంతాల్లో చిక్కుకున్న భారతీయుల్లో 45 మందిని భారత వాయుసేన (ఐఏఎఫ్) హెలికాప్టర్లు కొలంబోకు తరలించాయి. ప్రభావిత ప్రాంతాలకు 57 మంది శ్రీలంక సైనికుల్ని కూడా ఐఏఎఫ్ తరలించింది. శ్రీలంకలో చిక్కుకున్న భారతీయులెవరైనా అత్యవసర హెల్ప్‌డెస్క్‌ను +94 773727832 నంబరులో సంప్రదించాలని అధికారులు సూచించారు.

ఆహారాన్ని ఎత్తుకెళ్తున్న వరద బాధితులు

- ఇండొనేసియాలో దారుణ పరిస్థితి

మెడాన్: ఇండొనేసియాలోని సుమత్రా దీవిలో వరదలకు గురైన ప్రాంతాల్లోని ప్రజలు ఆకలిదప్పులతో అలమటిస్తున్నారు. ప్రాణాలు నిలుపుకోవడానికి ఆహారాన్ని ఎత్తుకెళ్తున్నారు. శిథిలమైన బ్యారికేడ్లు, వరద నీటితో నిండిన రోడ్లు, పగిలిన గాజు పెంకులను దాటుకుంటూ ఆహారం, ఔషధాలు, గ్యాస్‌ను దోచుకెళ్తున్నారు. ప్రాణాలకు తెగించి కొందరు లోతైన వరద నీటిలోనూ ముందుకు వెళ్తున్నారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీనిపై పోలీసులు కేసులు సైతం నమోదుచేస్తున్నారు. ప్రభుత్వ సహాయం అందడానికి ముందే.. జనం దోపిడీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. సుమత్రా దీవిలో వారం కిందట వచ్చిన వరదల్లో 442 మంది మరణించారు. గాలింపు చర్యలు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. సుమారు రెండు లక్షల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. కొండచరియలు విరిగిపడి రోడ్లు ధ్వంసమయ్యాయి. సమాచార వ్యవస్థ దెబ్బతింది.



పశ్చిమ సుమత్రాలోని అగమ్ ప్రాంతంలో వరదల్లో మరణించిన ఓ వ్యక్తి మృతదేహాన్ని తరలిస్తున్న సహాయక సిబ్బంది

పెళ్లిలో వైరి వర్గాల మధ్య కాల్పులు.. ఇద్దరు అతిథుల మృతి

లుధియానా: పంజాబ్‌లోని లుధియానాలో ఓ పెళ్లి వేడుకలో దారుణం చోటు చేసుకుంది. వివాహానికి వచ్చిన రెండు శత్రు వర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు అతిథులు దుర్మరణం పాలయ్యారు. శుభం మొట్టా నేతృత్వంలోని వర్గాన్ని, అంకుర్ సారథ్యంలోని గ్రూపును వరుడి తరఫు వ్యక్తులు శనివారం నాటి పెళ్లికి ఆహ్వానించారు. ఈ రెండు వర్గాల వ్యక్తులు కల్యాణ మండపంలో ఒకరికి ఒకరు తారసపడగానే వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పెద్ద గొడవగా మారడంతో అక్కడికి వచ్చిన అతిథులు వారికి సర్దిచెప్పబోయారు. అదే సమయంలో ఇరు వర్గాలు తుపాకులకు పనిచెప్పడంతో ఇద్దరు అతిథులకు బుల్లెట్లు తగిలి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. వారి మృతికి కారణమైన వ్యక్తి పారిపోయాడు.

బెదిరింపు కేసులో కంచన్‌ప్రీత్‌కు ఊరట

చండీగఢ్: శిరోమణి అకాలీ దళ్(ఎస్ఏడీ) నాయకుడు సుఖ్‌వీందర్‌కౌర్ రంధావా కుమార్తె కంచన్‌ప్రీత్ కౌర్‌కు ఓ తాజా కేసులో కోర్టు నుంచి ఊరట పొందారు. ఈ నేపథ్యంలో తరన్ తారన్ ఉప ఎన్నికల బెదిరింపుల వ్యవహారంలో నాన్‌బెయిలబుల్ కేసును స్థానిక కోర్టు కొట్టేసింది. దీంతో ఆమె ఆదివారం ఉదయం విడుదలయ్యారు. అంతకు ముందు శుక్రవారం కంచన్‌ను అరెస్టు చేసిన పోలీసులు శనివారం రాత్రి ఆమెను కోర్టులో హాజరుపరిచారు. ఆమెను 10 రోజుల కస్టడీకి అప్పగించాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. 10 గంటలకు మొదలైన విచారణ ఆదివారం తెల్లవారుజాము 1 గంట వరకూ సాగింది. నాలుగు గంటలకు తీర్పు వెలువడింది. కంచన్‌ప్రీత్ ఇటీవల తరన్ తారన్ ఉప ఎన్నికలో ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో బెదిరింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలతో పోలీసులు ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

బ్రిటన్‌లో భారత యువకుడి దారుణ హత్య

లండన్: బ్రిటన్‌లో భారత విద్యార్థి దారుణ హత్యకు గురయ్యాడు. హరియాణాకు చెందిన విజయ్ కుమార్ షియోరాన్ (30) అనే యువకుడిపై వోర్‌స్టర్‌లో ఈ నెల 25న గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడి చేసినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ కేసులో ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామన్నారు. విజయ్ కుమార్ షియోరాన్ ఈ ఏడాది ప్రారంభంలో ఉన్నత చదువుల కోసం బ్రిటన్‌కు వెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అంతకుముందు అతడు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్‌లో ఉద్యోగం చేసేవాడని.. ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి జనవరిలో బ్రిటన్‌కు వెళ్లినట్లు పేర్కొన్నారు. విజయ్ మృతదేహాన్ని త్వరగా భారత్‌కు తీసుకురావడానికి సహాయం చేయాలని మృతుడి కుటుంబసభ్యులు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను, హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీలను అర్థించారు.

సర్ ప్రక్రియ సజావుగానే ఉంది: ఈసీ

దిల్లీ: పని ఒత్తిడి కారణంగా తీవ్ర ఒత్తిడికి గురై.. ఇప్పటివరకు 40 మంది బూత్ స్థాయి అధికారులు చనిపోయారంటోన్న ప్రతిపక్షాల ఆరోపణలను ఈసీ ఖండించింది. సర్ ప్రక్రియ సజావుగా సాగుతోందని స్పష్టంచేసింది. సర్ గడువు ఈసీ పొడిగించడంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ఇంత తక్కువ సమయంలో ప్రక్రియ పూర్తి కాదని ఈసీ గుర్తించడంతోనే ఈ నిర్ణయం తీసుకుందని కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ పేర్కొన్నారు.

ఈనాడు అమరావతి
ఎన్టీఆర్
సోమవారం డిసెంబరు 1, 2025

తెల్ల పొనికి.. బొమ్మల ఉనికి

★ కొండపల్లి కళాకృతులకు తీవ్రంగా కలప కొరత
★ సీఎం ఆదేశించినా స్పందించని యంత్రాంగం

"కొండపల్లి బొమ్మలు మన సంస్కృతి, సంప్రదాయంలో భాగం. ఈ కళను, కళాకారులను కాపాడుకోవాలి. బొమ్మల తయారీకి అవసరమైన కలపను అటవీశాఖ ఆధ్వర్యంలో అందించే ఏర్పాటు చేయండి. బొమ్మల తయారీకి కలప కొరత ఉండకుండా చూడండి."
-గత సెప్టెంబరులో కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి



కొండపల్లి బొమ్మల తయారీకి.. తెల్లపొనికి చెట్ల కలప కొరత ఏటేటా తీవ్రమైపోతోంది. ప్రభుత్వానికి, అధికారుల దృష్టికి ఈ సమస్యను కళాకారులు తీసుకెళ్లారు. గత కలెక్టర్ల సమావేశంలోనూ దీనిపై చర్చ జరిగింది. చెక్క కొరత ఏర్పడుతోందని, ఎక్కడెక్కడి నుంచో తీసుకొస్తున్నామని అధిక ధర పడుతోందని, కళ మనుగడకే ముప్పు వాటిల్లుతోందంటూ కలెక్టర్ లక్ష్మీశ.. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. తెల్ల పొనికి చెక్కను సరిపడా అందిస్తే.. మరింత ఎక్కువగా బొమ్మలు తయారు చేస్తారన్నారు. ముఖ్యమంత్రి స్పందించి.. చెక్కను అందించాలంటూ అటవీశాఖ అధికారులను ఆదేశించారు.

"ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేసి ఇప్పటికి మూడు నెలలు గడుస్తున్నా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. అటవీశాఖ అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. తెల్లపొనికి కర్ర కోసం మొక్కలను పెంచుతామని, నర్సరీ ఏర్పాటు చేస్తామంటూ అటవీ అధికారులు పేర్కొంటున్నారు. అవి పెరిగి పెద్దవ్వడానికి కనీసం పదేళ్లు పడుతుంది. అప్పటివరకూ బొమ్మల తయారీని ఆపేయాలా? అంటూ కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు."

వెంటనే అందించాలి.. కొండపల్లి అటవీ ప్రాంతంలో తెల్లపొనికి చెట్లు పూర్తిగా అయిపోయాయి. ఎ.కొండూరు ప్రాంతంలో ఉన్నా తెచ్చేందుకు అటవీ అధికారుల నుంచి అనుమతి లేదు. మేమే తీసుకొస్తాం ఇవ్వండి, కొనుగోలు చేసుకుంటామంటూ కళాకారులు చెబుతున్నా.. స్పందించడం లేదు. నల్లమల అడవుల్లోనూ తెల్లపొనికి విస్తారంగా ఉంది. అక్కడి నుంచైనా తీసుకొచ్చి అందించే ఏర్పాటు చేయాలి. మొక్కలు వేస్తాం, పెంచి పెద్ద చేస్తామంటే.. అవి భవిష్యత్తు అవసరాలకు పనికొస్తాయి. ప్రస్తుతానికి పెద్ద వృక్షాల కొమ్మలైనా కొట్టి తీసుకొచ్చి ఇవ్వాలంటూ కళాకారులు వేడుకుంటున్నారు.

దొంగచాటుగా తెచ్చి.. అధిక ధరకు.. ఈ తెల్ల పొనికి చెక్కను స్మగ్లింగ్ చేసి తీసుకొచ్చి కొందరు భారీ ధరకు అమ్ముతున్నారు. తెల్లపొనికి కలప మెత్తగా, తేలికగా ఉంటుంది. ఆకృతులు చేయడానికి అనువుగా, ఎన్నో ఏళ్లు మన్నికగా ఉంటుంది. అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో కళాకారులు ఈ కలపను కొనుగోలు చేస్తున్నారు.



ఒంపుల దారి.. పచ్చగా మారి..

గొల్లపూడికి వెళ్లే ఇన్నర్ రింగు రోడ్డులోని వంతెన విభాగినిపై వందల సంఖ్యలో కుండీలు ఏర్పాటు చేసి మొక్కలు సంరక్షిస్తున్నారు. కనువిందు చేసేలా ఒంపులు తిరిగిన ఈ పచ్చదనం వాహనదారులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. -ఈనాడు, అమరావతి

రైతన్న ఉరుకులు.. మిణుకు మిణుకు ఆశలు

ఉమ్మడి జిల్లాలో దిత్వా అలజడి



ఈనాడు, అమరావతి

దిత్వా తుపాను ఉరుముతుండడంతో ఉమ్మడి జిల్లా రైతుల్లో అలజడి అలుముకుంది. వరి, పత్తి, అపరాలు, మొక్కజొన్న, ఉద్యాన తదితర పంటలను కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. కోసిన పంటలపై పట్టాలు కప్పి పంటను రక్షించుకుంటున్నారు. ఆదివారం జల్లులు పడడంతో ఉమ్మడి జిల్లాలో రైతన్నల్లో దిత్వా తుపాను భయాందోళనలు కనిపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 4.74 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. 12.6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా ఉంది. ప్రస్తుతం దాదాపు 50 శాతం కోతలు పూర్తయ్యాయి. గంపలగూడెం, రెడ్డిగూడెం తదితర ప్రాంతాల్లో 40 శాతం వరకు కోతలు పూర్తి చేశారు. కోత ధాన్యం అమ్ముకున్నా అధిక శాతం కల్లాల్లోనే ఆరబెట్టారు. పామర్రు, మోపిదేవి, మొవ్వ, కంకిపాడు తదితర మండలాల్లో ధాన్యం పచ్చి మీదే కోయడంతో అమ్మే వీలు లేక రోడ్లపైనే గుట్టలుగా పోసి పట్టాలు కప్పారు. దీంతో వర్షం పడితే ఎందుకూ పనికి రాకుండా పోయే పరిస్థితి ఉన్న నేపథ్యంలో రైతులు పట్టాలు తెచ్చుకుని కప్పుకొని కాపాడుకుంటున్నారు. ఇదే అదునుగా పట్టాల వ్యాపారులు అద్దె పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. నందిగామ, కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో పత్తి, మొక్కజొన్న రైతులు మొండా తుపాను దాటికి కుదేలు కాగా ప్రస్తుతం మిగిలిన పంటలను కాపాడుకునేందుకు పాట్లు పడుతున్నారు. పొలాల్లో ఉన్న పత్తి జల్లులకు తడిసిపోతోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో మొక్కజొన్న కల్లాల్లోనే మిగిలిపోయింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 4వేల వరకు టార్పాలిన్ పట్టాలు రైతులకు పంపిణీ చేశారు.



మద్దూరు వద్ద రోడ్డుపై ఆరబోసిన ధాన్యాన్ని పట్టాలు కప్పి కాపాడుకుంటున్న రైతులు



పండిన పంట ఆరబెట్టుకోవడానికి ఖాళీ స్థలాలు, రహదారులు సైతం సరిపోకపోవడంతో పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామం బస్టాండు ఆవరణలో ఆరబెట్టారిలా..

వీడియో పాఠం.. చిన్నారులకు ఉత్సాహం



నందిగామ పాత బస్టాండు ఎంపీపీ పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థులకు వీడియో పాఠాలు చెబుతున్నారు. ఎస్జీటీ వాణి రాజ్యలక్ష్మి తరగతి గదిలోని టీవీలో పాఠ్య పుస్తకాల్లోని పాఠాలను వీడియో రూపంలో ఆకట్టుకునేలా బోధిస్తున్నారు. టీవీ తెరపై కనిపించే గేయానికి అనుగుణంగా విద్యార్థులు నృత్యాభినయం చేస్తూ ఆటపాటలతో నేర్చుకుంటున్నారు. నిత్యం విద్యార్థులకు అన్ని సబ్జెక్టులను వీడియోల ద్వారా బోధిస్తున్నారు. ఈ బోధన ఆకట్టుకుంటోంది.
–నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే



ఆటోనగర్ 4వ క్రాస్ రోడ్డులో ఇలా..

నియంత్రికతో చెలగాటం!

ఆసియాలోనే అతిపెద్దది విజయవాడ జవహర్ ఆటోనగర్. వివిధ పనుల నిమిత్తం వచ్చేవారితో పాటు వేల మందికి ఇక్కడ ఉపాధి లభిస్తుంది. కార్మికులకు సంబంధించి భద్రతా చర్యలు మాత్రం ఇసుమంతైనా కనిపించవు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ లారీల విడిభాగాలు ఎలా పడేశారో. వాటిని బయటకు తీసే క్రమంలో ఏమాత్రం ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలినా జరిగే ప్రమాదాన్ని ఊహించుకోవచ్చు. నియంత్రికల చుట్టూ కంచెలను నిర్మించాలని పలువురు కోరుతున్నారు.
-ఈనాడు, అమరావతి

ప్రైవేటు సిబ్బంది.. భద్రత ఇబ్బంది

దుర్గగుడిలో పనిచేసేవారిపై పర్యవేక్షణ కరవు

ఈనాడు, అమరావతి

కనకదుర్గానగర్‌లోని పూజా సామగ్రి విక్రయించే ఓ దుకాణంలో పనిచేసే కుర్రాడు ఇటీవల భక్తులతో ఇబ్బందికరంగా ప్రవర్తించాడు. వాళ్లు ఫిర్యాదు చేయగా ఆలయ అధికారులు విచారించారు. తీరా చూస్తే ఆ కుర్రాడు.. రెండు రోజుల కిందటే చేరాడని, తనకు అతని గురించి ఏం తెలియదంటూ సదరు దుకాణ యజమాని అధికారులతో చెప్పడం గమనార్హం. భవానీ దీక్షల విరమణలు డిసెంబరు 11 నుంచి 15 వరకు దుర్గగుడిలో జరగనున్నాయి. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆలయ ప్రాంగణంలో విధులు నిర్వహించే, పనులు చేసే ప్రతి ఒక్కరి వివరాలు సేకరించాలి. వారికి విధిగా గుర్తింపు కార్డులను జారీ చేయాలి. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. ఆలయ ప్రధాన సిబ్బంది 400 మంది వరకూ ఉన్నారు. దుకాణాలు, పారిశుద్ధ్యం, ప్రైవేటు సెక్యూరిటీ అంతా కలిపి మరో 500 మంది వరకూ ఉంటారు. ఆలయ సిబ్బందికి గుర్తింపు కార్డులుంటాయి. కానీ ప్రైవేటు సంస్థల ద్వారా సేవలు అందించే సిబ్బందిపై ఎలాంటి పర్యవేక్షణ ఉండడం లేదు. ఇది ఆలయ భద్రతకు అత్యంత ప్రమాదకరం.



గత ఏడాది భవానీ దీక్ష విరమణ వేడుకల్లో..

కనీస సమాచారం ఇవ్వకుండా.. దుర్గగుడిలో పూజా సామగ్రి దుకాణాలు, చెప్పుల స్టాండ్లు, క్లోక్‌రూం, చీరల సేకరణ, విక్రయ కేంద్రాలు, సెల్‌ఫోన్, ఫొటో కౌంటర్లు, పారిశుద్ధ్యం, సెక్యూరిటీ.. కలిపి కనీసం 500 మంది వరకూ నిత్యం ప్రైవేటు వ్యక్తులు పనిచేస్తుంటారు. టెండర్లలో ఏదో ఒక సంస్థ పనులను దక్కించుకుని తర్వాత సిబ్బందిని నియమించుకుని వాటిని నిర్వహిస్తాయి. ఈ పనుల కోసం ఎవరిని నియమించాలి, అర్హతలేంటి, వారి వివరాలేంటి అనే కనీస సమాచారం సేకరించింది లేదు.

భవానీదీక్షల విరమణ వేడుకల సేవల్లో పాల్గొనే గురుభవానీలకు సైతం పక్కాగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకుని దరఖాస్తు చేశాకే.. గుర్తింపు కార్డులను జారీ చేస్తే ఎలాంటి వివాదాలకు తావుండదు. ఏటా సేవల్లో పాల్గొనే భవానీల విషయంలో వివాదం జరుగుతోంది. దుర్గగుడి ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకల్లో.. సేవ చేస్తామంటూ వచ్చి కొందరు భవానీలు పెత్తనం చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఈసారి అలాంటివి జరగకుండా కచ్చితంగా ప్రతి ఒక్కరికీ గుర్తింపుకార్డులు ఇచ్చి సేవలకు అవకాశం ఇస్తే వివాదాలుండవు.

ఎన్నాళ్లీ నిరీక్షణ..!

☛ రీసర్వే చేపట్టిన గ్రామాల్లో అందని పాస్ పుస్తకాలు
☛ బ్యాంకులు, సొసైటీల్లో అప్పు పుట్టక రైతుల అవస్థలు

ఈనాడు, అమరావతి

వైకాపా, కూటమి ప్రభుత్వాలు రీసర్వే చేసిన ప్రాంతాల్లో పాస్ పుస్తకాలు రాక అవస్థలు పడుతున్నారు. సాగు పెట్టుబడికి, కుటుంబ అవసరాలకు బ్యాంకుల్లో, సొసైటీల్లో అప్పు కూడా పుట్టని దైన్యం కళ్లకు కడుతోంది. క్రయ విక్రమాలకు ప్రతిబంధకంగా మారింది. రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేని పరిస్థితి.

సర్వే చేసిన గ్రామాలు..	
వైకాపా పాలన..	365
కూటమి పాలనలో..	
మొదటి దశ	38
రెండో	35
మూడో	31
మొత్తం	469



రీసర్వే చేస్తున్న అధికారులు, సిబ్బంది

ఎదురుచూపులే మిగిలాయి..
వైకాపా పాలనలో లోపభూయిష్టంగా చేపట్టిన సర్వే వల్ల రైతుకు పాస్ పుస్తకాలు దూరమయ్యాయి. కూటమి సర్కారు వచ్చాక సర్వే చేసిన గ్రామాల్లో రైతులకు సైతం ఇప్పటికీ పాస్ పుస్తకాలు అందలేదు. దీంతో వేల మంది రైతుల అవస్థలు పడుతున్నారు. రైతుల్లో ఎక్కువ మంది సాగు, పిల్లల చదువులు, పెళ్లిళ్లకు బ్యాంకుల్లో, సొసైటీల్లో రుణాలు తీసుకుంటారు. పాస్ పుస్తకాలు లేక రుణాలు రావడం లేదు. దీంతో బయట అప్పులు తెచ్చి వడ్డీలు కట్టలేక చితికిపోతున్నారు. గతంలో రీసర్వే జరిగిన గ్రామాల పాస్ పుస్తకాలు వచ్చినా పంపిణీలో ప్రభుత్వ జాప్యంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎన్టీఆర్ డీఆర్వో, కృష్ణా ఏడీ సర్వే మాట్లాడుతూ త్వరలో పాస్ పుస్తకాలు మంజూరు చేస్తామని తెలిపారు.

★ వీరులపాడులో రైతు నాగసుబ్బారావు రెండేళ్ల కిందట అల్లూరులో ఎకరం పొలం కొన్నారు. అక్కడ రీసర్వే జరగడంతో ఇప్పటి వరకు పాస్ పుస్తకం రాలేదు. రుణం కోసం బ్యాంకుకు వెళితే పాస్‌పుస్తకం తప్పనిసరి అంటున్నారు. రూ.2 వడ్డీకి రూ.5లక్షలు అప్పుతెచ్చి వ్యవసాయం చేస్తున్నారు. పాస్ పుస్తకం ఉంటే 60 పైసల వడ్డీకే బ్యాంకులో, సొసైటీలో రుణం వచ్చేదని వాపోయారు.

★ కంకిపాడు మండలం కుందేరు, కొణతనపాడు, దావులూరు, మారేడుమాకలో రీసర్వే జరిగింది. దాదాపు 500 మంది రైతులున్నారు. వీరెవరికీ పాస్‌పుస్తకాలు రాలేదు. అప్పులు రాక, వ్యవసాయం, పిల్లల చదువులకు బయట ఎక్కువ మొత్తం వడ్డీలకి తీసుకొస్తున్నారు. కొందరు భూములు అమ్ముకోవాలనుకున్నా పాస్ పుస్తకాలు లేక కొనేందుకు ముందుకు రావడం లేదు.

నాడు తోచినట్టు కట్టారు.. నేడు తప్పక కూలగొట్టారు..



నిర్మించిన ఫుట్‌పాత్ (పాత చిత్రం)



పూడిక తీసే వీలు లేక పగులగొట్టిన పాదబాట

2023లో వైకాపా ప్రభుత్వ హయాంలో విజయవాడ కార్పొరేషన్, గ్రీన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రామవరప్పాడు-ప్రసాదంపాడు మధ్య ఫుట్‌పాతల నిర్మాణం, గ్రానైట్ ఏర్పాటు పనులు చేశారు. ఫుట్‌పాత్‌ల కింద ఉన్న మురుగు కాలువల్లో చెత్త తీసేందుకు వీలు లేకుండా ప్రణాళిక లోపంతో వీటిని నిర్మించారు. దీంతో గత నెలలో కురిసిన వర్షాలకు జాతీయ రహదారిపై మోకాలి లోతులో నీరు నిలిచిపోయింది. ఫలితంగా ఆ ఫుట్‌పాత్‌లను పగులగొట్టి మళ్లీ కొత్తగా నిర్మించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వ నిర్వాకంతో రూ.కోట్ల ప్రజాధనం వృథా అయ్యింది.
-ఈనాడు, కృష్ణా

సర్వమత సమానత్వానికి ప్రతీక.. ఫరీద్‌బాబా దర్గా



మతాలకతీతంగా ఫరీద్‌బాబా దర్గా మూడు రాష్ట్రాల భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. విజయనగరం జిల్లా దిబ్బడిపాలెంకు చెందిన నడిపల్లి అప్పలస్వామి.. తన గురువు ఖాదర్ వలీబాబా ఆదేశానుసారం కృష్ణా జిల్లా మచిలీపట్నం సమీపంలోని కరఅగ్రహారం చేరుకుని ఫరీద్‌బాబాగా మారారు. 1947లో ప్రార్థనా మందిరం నిర్మించారు. 1968లో బాబా చనిపోవడంతో భక్తులు సమాధిని ఏర్పాటు చేసి పూజించడం ప్రారంభించారు. ఏటా రంజాన్ మాసంలో కరఅగ్రహారంలో జరిగే ఉరుసు ఉత్సవంలో 20వేల మంది భక్తులు పాల్గొంటారు. హైదరాబాద్, చెన్నైతో పాటు రాష్ట్రంలోని నలుమూలల నుంచి తరలివస్తారు. వీరిలో హిందువులు భారీగా ఉంటారు. అలా.. సర్వమత సమానత్వానికి ఫరీద్‌బాబా దర్గా ప్రతీకగా నిలుస్తోంది. మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన దివంగత మర్రి చెన్నారెడ్డి అప్పట్లో దర్గాను దర్శించుకున్నారు.
– కరఅగ్రహారం(మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పాయకాపురం, న్యూస్‌టుడే: నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదివారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని డివిజన్ పరిధిలో మున్సిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

కేఎల్‌రావునగర్ పేరొచ్చిందిలా..!

న్యూస్‌టుడే, చిట్టినగర్



విజయవాడ నగరంలో కేఎల్ రావు నగర్‌కు ఒక ప్రత్యేకత ఉంది. అసలు ఆ ప్రాంతానికి ఆ పేరు ఎందుకు వచ్చిందో ఇప్పుడు తెలుసుకుందాం... కానూరి లక్ష్మణరావు ప్రముఖ ఇంజినీర్‌గా భారీ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. 1902 జులై 15న కంకిపాడులో జన్మించారు. చిట్టినగర్ సొరంగం నిర్మాణం చేయడంతో కృతజ్ఞతగా అక్కడి ప్రజల అభ్యర్థన మేరకు అప్పటి మున్సిపాల్టీ ఛైర్మన్ సహకారంతో ఆ ప్రాంతానికి కేఎల్ రావునగర్‌గా నామకరణం చేశారు. ఆయన హయాంలో నాగార్జునసాగర్ డ్యామ్, ఒడిశాలో హీరాకుడ్ డ్యామ్, కొండపల్లిలో థర్మల్ విద్యుత్తు కేంద్రం, శ్రీశైలం హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టు, దుర్గగుడి ఘాట్ రోడ్డు నిర్మాణం, గాంధీ కొండ నిర్మించారు. రాజకీయాల్లో ప్రవేశించి 1962 నుంచి 1977 వరకు విజయవాడ ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు. కాంగ్రెస్ హయాంలో మంత్రిగా సేవలందించారు. 1969లో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ బస్‌స్టేషన్ నిర్మాణం కోసం అక్కడి ప్రజానీకాన్ని తరలించేందుకు అయ్యదేవర కాళేశ్వరరావు సహకారంతో కేఎల్ రావు ఒప్పించారు. సుమారు 150 కుటుంబాలకు చిట్టినగర్ సమీపంలో పునరావాసం కల్పించారు. ప్రతి ఇంటికి 83 గజాల చొప్పున స్థలం కేటాయించారు. 2010లో అప్పటి ఎంపీ లగడపాటి రాజగోపాల్ సౌజన్యంతో కాంగ్రెస్ నాయకులు వరకాల ఆదాం, సుబ్బలక్ష్మి దంపతుల నేతృత్వంలో కేఎల్ రావునగర్‌లో ఆయన విగ్రహావిష్కరణ చేశారు.

ఆప్తమాలజీ ఎంఎస్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ



విజయవాడ పటమట ప్రాంతానికి చెందిన డా. రెడ్డి హర్షిత సాయి ఎన్టీఆర్ విశ్వ విద్యాలయం ఇటీవల విడుదల చేసిన ఆప్తమాలజీ ఎంఎస్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర మొదటి ర్యాంకు సాధించారు. ఆమె 800 మార్కులకు 585 సాధించారు. 2015లో ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల నుంచి ఎంబీబీఎస్ పూర్తి చేశారు. గుంటూరు జీఎంసీ వైద్య కళాశాల నుంచి 2022-23లో ఎంఎస్‌లో చేరారు. ఆమె తండ్రి విశ్రాంత అసిస్టెంట్ పోలీసు కమిషనర్ రెడ్డి రామచంద్రరావు. తల్లి విజయలక్ష్మి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తాను ర్యాంకు సాధించానని ఆమె తెలిపారు. – విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే

సాఫీగా సాగిపో..



వెస్ట్ బైపాస్ మీద జోరుగా రాకపోకలు సాగుతున్నాయి. ఆ మార్గంలో కృష్ణానదిపై నిర్మించిన వంతెనపై వాహనాలు ఏవీ ఆగకూడదు అని సూచిస్తూ డిజిటల్ బోర్డు ఏర్పాటు చేశారిలా.. -ఈనాడు అమరావతి


వెళ్తేనే రేషన్.. లేకుంటే పరేషాన్!

వృద్ధులను దుకాణాలకు రప్పిస్తున్న డీలర్లు

ఈనాడు, అమరావతి

డీలర్ల నిర్లక్ష్యం..అధికారుల పర్యవేక్షణ లోపంతో 65 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటికే రేషన్ అందించాలన్న ప్రభుత్వ ఆశయం మసకబారుతోంది. ఫలితంగా పండుటాకులు అవస్థలపాలవుతున్నారు. నవంబరు ముగిసినా వీరికి రేషన్ పంపిణీ సగమే అయింది. నేటి నుంచి సాధారణ రేషన్ సరఫరా మొదలవుతున్న నేపథ్యంలో తమని పట్టించుకోరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమయం ముగిసినా సగమే: ఉమ్మడి జిల్లాలో 65 ఏళ్లు దాటిన లబ్ధిదారుల కార్డులు 1,30,245 ఉన్నాయి. వీరంతా రేషన్ దుకాణాలకు వెళ్లి అక్కడ నుంచి బియ్యం తీసుకెళ్లాలంటే ఇబ్బంది పడతారన్న ఉద్దేశంతో వీరందరికీ ఇంటికే రేషన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి నెలా 25న మొదలుపెట్టి నెలాఖరుకి సరఫరా పూర్తి చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. క్షేత్రస్థాయిలో మాత్రం సవ్యంగా అమలు కావడం లేదు. నవంబరు 30 లోగా పంపిణీ ముగించాల్సి ఉండగా ఆదివారం మధ్యాహ్నం నాటికి కృష్ణా జిల్లాలో 54, ఎన్టీఆర్‌లో 52 శాతమే పూర్తి చేశారు. సోమవారం నుంచి సాధారణ రేషన్ పంపిణీ మొదలవుతున్న నేపథ్యంలో డీలర్లు వృద్ధులకు రేషన్ పంపిణీ చేయడం అనుమానమే. వృద్ధుల్లో చాలా మంది రేషన్ బియ్యమే తింటున్నారు. వీరికి సకాలంలో రేషన్ అందకపోతే బియ్యం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి.



జిల్లా	వృద్ధుల కార్డులు	రేషన్ ఇచ్చింది
ఎన్టీఆర్	60,556	31,528
కృష్ణా	69,689	37,457
మొత్తం	1,30,245	68,985

ఇంటికి రాకుంటే ఎలా..?

చాలా మంది డీలర్లు రేషన్ ఇంటికి సరఫరా చేయడం లేదు. సకాలంలో సరఫరా చేయకుండా జాప్యం చేసి వృద్ధులను ఇబ్బంది పెడుతున్నారు. దీంతో వృద్ధులే ఏదో తంటాలు పడి దుకాణానికి వచ్చి తీసుకెళ్తున్నారు. వృద్ధులు డీలర్లను అడుగుతున్నా మాకు ఇదే పనా ఇస్తాంలే అని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. అవనిగడ్డలో ఓ డీలర్ గత రెండు నెలల నుంచి పట్టుమని పది మంది వృద్ధులకు కూడా బియ్యం సరఫరా చేయకుండా కాలం గడిపేస్తున్నారు. నందిగామ పరిధిలో ఇద్దరు డీలర్లు వృద్ధులనే దుకాణానికి రావాలని ఆంక్షలు పెడుతున్నారు.

✦ 'ఇంటికి వెళ్లి రేషన్ ఇవ్వని డీలర్లపై చర్యలు తీసుకుంటాం' అని ఎన్టీఆర్, కృష్ణా డీఎస్వోలు పాపారావు, మోహన్‌రావు తెలిపారు.

'ఈనాడు' ప్రాపర్టీ షోకు విశేష స్పందన

● సందర్శకులతో కళకళలాడిన స్టాల్స్

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరి సొంతింటి కల నెరవేర్చుకునేందుకు స్థలం, ప్లాట్లు కొనేవారికి సమస్త సమాచారం అందించేందుకు విజయవాడ బృందావన కాలనీలోని 'ఎ' కన్వెన్షన్ సెంటర్‌లో 'ఈనాడు' ప్రాపర్టీ షోకు రెండోరోజు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. శనివారం ప్రారంభమైన ప్రాపర్టీ షో ఆదివారంతో ముగిసింది. ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు తరలివచ్చారు. కొలువు తీరిన పలు ప్రముఖ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద తమ కలల గృహాల కొనుగోలుతో పాటు ఓపెన్ ప్లాట్లకు సంబంధించిన వివరాలను సందర్శకులు అడిగి తెలుసుకున్నారు. ఆయా సంస్థల స్టాళ్ల వద్ద ఉదయం నుంచి పలువురు కుటుంబ సమేతంగా తరలివచ్చి అపార్టుమెంట్లలో ప్లాట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో విల్లాలు, నగర శివారు ప్రాంతాల్లోని ప్లాట్ల గురించి విచారించారు. ఆసక్తికి అనుగుణంగా ఆయా సంస్థల ద్వారా ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి విశేషాలను తెలుసుకున్నారు.



స్టాల్స్ వద్ద సందర్శకుల సందడి


లక్కీ డ్రా విజేతకు బహుమతి అందజేస్తున్న స్పాన్సర్లు

☛ వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రాజెక్టు వివరాలను ఒకే వేదికపై తెలుసుకునేలా ప్రాపర్టీ షో ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు వివరాలను పూర్తిగా తెలుసుకోవడంతో పాటు ఎంతో సమయం ఆదా అవుతుందని, ఆలోచించి పెట్టుబడి పెట్టేందుకు మార్గం సుగమమైందని పేర్కొన్నారు. స్టాళ్ల నిర్వాహకులు కొనుగోలుదారుల స్పందనపై సంతృప్తి వ్యక్తం చేశారు. రుణ సదుపాయాలు, వడ్డీ రేట్లు, వాయిదాల వివరాలను బ్యాంకుల అధికారులు తెలిపారు. ప్రాపర్టీ షోను సందర్శించిన వారికి లక్కీ డ్రా తీశారు. విజేతలకు గిఫ్ట్ స్పాన్సర్లు బీఎన్ఆర్ గోల్డ్ డైమండ్స్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులు బహుమతులు అందజేశారు.

దీక్ష విరమణ భక్తుల భద్రతకు ప్రాధాన్యం


అధికారులకు సూచనలిస్తున్న సీపీ రాజశేఖరబాబు, పక్కన డీసీపీ షిరీన్‌బేగం తదితరులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లలో భక్తుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తామని సీపీ రాజశేఖరబాబు తెలిపారు. పోలీసు అధికారులతో కలిసి ఆదివారం భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీతమ్మవారి పాదాల సెంటర్ వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల రాకపోకలను నియంత్రించాల్సిన అంశాన్ని అధికారులతో ప్రస్తావించారు. స్నానఘాట్ల వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. గిరిప్రదక్షిణ మార్గం, క్యూలైన్లు, అమ్మవారి దర్శనం, ఇరుముడి పాయింట్లు హోమ గుండాల ఏర్పాట్లు పరిశీలించాలని చెప్పారు. కార్యక్రమంలో డీసీపీలు కృష్ణకాంత్ పాటిల్, షిరీన్ బేగం, ఏసీపీలు రామచంద్రరావు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం ● ఈఎస్ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

● బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు.

దరఖాస్తులకు తుది గడువు
డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు ఆఫీసు, గూడవల్లి విలేజ్, విజయవాడ రూరల్ మండలం, ఎన్టీఆర్ జిల్లా-521104
వివరాలకు: 9121170928, 91549 91113
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Regional Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT
District Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
FM Partner: Mee FM | TV Partner: ఈటీవీ ఆంధ్రప్రదేశ్ | Organised by: ఈనాడు

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

సమాజంలో కాపులకు ప్రత్యేక స్థానం


స్వర్ణోత్సవ బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా, సుబ్రహ్మణ్యం, ఉదయభాను, శ్రీనివాస్, కృష్ణప్రసాద్ తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: సమాజంలో కాపులకు ప్రత్యేక స్థానం ఉందని, వారు సమాజ హితానికి పాటుపడతారని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం గాంధీనగర్‌లోని జింఖానా మైదానంలో నిర్వహించిన కాపునాడు స్వర్ణోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్వర్గీయ వంగవీటి మోహనరంగా స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చి పేదలకు సేవ చేస్తున్నట్లు చెప్పారు. కృష్ణా జిల్లాకు మోహనరంగా పేరు పెట్టాలని గత ప్రభుత్వంలో తాను నిరాహార దీక్షలు చేయడమే కాకుండా అనేక రూపాల్లో ఆందోళనలు చేపట్టినట్లు గుర్తు చేశారు. అరాచక వైకాపా ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడంలో కాపులు కీలక పాత్ర పోషించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కాపులకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. భాజపా నాయకుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ కాపునాడు స్వర్ణోత్సవాన్ని పండగలా నిర్వహించుకోవడం కాపుల ఐక్యతకు నిదర్శనమన్నారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను మాట్లాడుతూ కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులస్థులు ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, శ్రీనివాస్, వాసు, సాంబశివరావు, విజయకృష్ణా సూపర్‌బజార్ ఛైర్మన్ వెలగా సురేష్, దాసాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ కృష్ణప్రసాద్, మోహన్, శ్రీను, శ్రీనివాస్, బాశెట్టిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్మాత సేవలో హైకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ జ్యోతిర్మయి దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తజనం



ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. సాధారణ భక్తులతోపాటు అయ్యప్ప, భవానీ దీక్షాధారులు దుర్గాఘాట్‌లో స్నానం చేసి ఇంద్రకీలాద్రి బాట పట్టారు. అమ్మవారి సర్వ దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. దుర్గగుడి ఘాట్ రోడ్డు, మెట్ల మార్గాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. ఒకవైపు భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లను పురస్కరించుకొని క్యూలైన్లు ఏర్పాటు చేస్తుండడంతో అధిక శాతం భక్తుల వాహనాలను కెనాల్ రోడ్డులో పార్కింగ్ చేయించారు. ఘాట్ రోడ్డు మార్గంలో వచ్చిన వాహనాలను ఓంకార మలుపు వద్ద నియంత్రించారు. దీంతో వృద్ధులు, వికలాంగులను దేవస్థానం ఏర్పాటు చేసిన బ్యాటరీ వాహనాల్లో దర్శనానికి తీసుకెళ్లారు. అమ్మవారికి నివేదన సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వీఐపీ టికెట్ల విక్రయాలు నిలిపి వేశారు. భక్తులకు ఉచిత ప్రసాదం, అన్నప్రసాదం అందించేందుకు దేవస్థానం ఈవో శీనానాయక్ చర్యలు తీసుకున్నారు.

కులగణనతోనే సామాజిక న్యాయం



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ, వేదికపై ఈశ్వరయ్య, శంకర్, దుర్గాంబ తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: దేశంలో జనగణనతో పాటు కులగణనతోనే సామాజిక న్యాయం సాధ్యమని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ అన్నారు. సీపీఐ శత వసంతాల ముగింపు సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం దాసరి భవన్‌లో జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడారు. గతంలో కార్మికులు, శ్రామికులు, కర్షకులకు రాజ్యాధికారం దక్కాలని కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు, ఉద్యమాలు చేపట్టిందని తెలిపారు. రాష్ట్రంలో అవకాశవాద రాజకీయాలతో అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ మోదీ భజన చేస్తున్నాయని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశంలో ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, పేదరికం పేట్రేగిపోవడంతో మోదీ వికసిత్ భారత్ అంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు, కృష్ణయ్య, దుర్గారావు, రమేష్, వెంకట సుబ్బారావు, శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేంద్ర, రాష్ట్ర మహిళా సమాఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి దుర్గమ్మ తదితరులతో పాటు జిల్లా నుంచి నాయకులు, ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'విత్తన బిల్లుతో రైతులకు నష్టం'

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విత్తన చట్టం-2025 ముసాయిదా కార్పొరేట్లకు మేలు చేస్తూ రైతులకు నష్టపరిచే విధంగా ఉందని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘాల ఆధ్వర్యంలో ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రాల పరిధిలో ఉన్న వ్యవసాయాన్ని తన అధీనంలోకి తెచ్చుకునేందుకే కేంద్రం బిల్లు తెచ్చిందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతు సంఘాలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ముసాయిదాపై కేంద్రానికి తెలియజేయాల్సిందిగా కోరారు. రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు తీర్మానాన్ని ప్రవేశపెడుతూ అమెరికాతో ఫ్రీ ట్రేడ్ ఒప్పందానికి సిద్ధమయ్యేందుకు కేంద్రం ముసాయిదా బిల్లు తీసుకొస్తున్నట్లు చెప్పారు. నష్టపోయిన రైతులు కోర్టులకెళ్లేందుకు వీలు లేకుండా బిల్లు కట్టడి చేస్తుందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త బి.శరత్‌బాబు మాట్లాడుతూ విత్తన ఖరీదు ఎంత ఉంటే అంతే నష్టపరిహారం ఇస్తామని బిల్లులో పొందుపరిచారని, ఎరువులు, పురుగుల మందుల కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేసినప్పటికీ తక్కువ మొత్తంలో రైతులకు నష్టపరిహారం ఇచ్చి విత్తన కంపెనీలు చేతులు దులుపుకొంటాయన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య అధ్యక్షత వహించిన సమావేశంలో వ్యవసాయ శాస్త్రవేత్త వేణుగోపాల్, కొల్లా రాజమోహన్, ఎం.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేశవరావు, చిత్రంలో శోభనాద్రీశ్వరరావు, కృష్ణయ్య తదితరులు

వ్యాపారి మోసంపై ఫిర్యాదు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: వ్యాపార అవసరాల కోసం తీసుకున్న బంగారం తిరిగి ఇవ్వలేదని రిటైల్ వ్యాపారి ప్రకాష్‌పై హోల్‌సేల్ వ్యాపారి నరేంద్రసింగ్ ఫిర్యాదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సేకరించిన సమాచారం మేరకు భవానీపురానికి చెందిన నరేంద్ర సింగ్ పాతబస్తీ పులిపాటి వారి వీధిలో హోల్‌సేల్ బంగారం వ్యాపారం చేస్తున్నారు. పాతబస్తీకి చెందిన రిటైల్ వ్యాపారి ప్రకాష్ తన వద్దకు కొనుగోలుదారులు వచ్చినప్పుడు నరేంద్రసింగ్ వద్దకు వచ్చి బంగారపు వస్తువులను తీసుకొని వారికి విక్రయిస్తుంటారు. తిరిగి డబ్బులు ఇస్తుండడంతో నమ్మకంపై ఈ ఏడాది సెప్టెంబరు 12న 59 గ్రాముల బరువు ఉన్న బంగారపు వస్తువులను నరేంద్రసింగ్ రిటైల్ వ్యాపారి ప్రకాష్‌కు ఇచ్చారు. రెండు నెలలు గడిచిన డబ్బులు ఇవ్వడం లేదు. దీంతో బాధితుడు నరేంద్రసింగ్ ఫిర్యాదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పాయకాపురం, న్యూస్‌టుడే: తన తండ్రి మామిడి తోటను విక్రయించి తనకు రావాల్సిన నగదు ఇవ్వట్లేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం నున్న పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పాతపాడు కేవీ కండ్రిక ప్రాంతానికి చెందిన ఎస్.శంకరరావుకు ఇద్దరు కుమారులు కాగా.. కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. చిన్న కుమారుడు స్వర్ణకుమార్(25) పాల వ్యాపారం చేస్తుంటాడు. పది నెలల కిందట తండ్రి శంకరరావు తనకున్న మామిడి తోట విక్రయించారు. ఇందులో తనకు వాటాగా రావాల్సిన నగదు ఇవ్వాలని గత కొద్ది రోజులుగా స్వర్ణకుమార్ తండ్రిని అడుగుతున్నాడు. డబ్బు ఇస్తే పాడుజేస్తావని అవసరమైనప్పుడు ఇస్తానని తండ్రి కుమారుడికి నచ్చచెబుతున్నారు. సొమ్ము ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానని స్వర్ణకుమార్ బెదిరిస్తున్నాడు. ఈ క్రమంలో కుమారుడు శనివారం రాత్రి గేదెలు కట్టే తాడును ఇంటి నుంచి తీసుకుని బయటకు వెళ్లాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని తన స్నేహితుడు సురేష్‌కు వాట్సప్‌లో సందేశం పంపాడు. ఆదివారం ఉదయం మామిడితోటలో తాడుతో ఉరేసుకుని స్వర్ణకుమార్ కనపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు తోటకు వెళ్లి చూడగా అతడు మృతి చెంది ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహితపై అకృత్యం

ఇద్దరి లైంగిక దాడి

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని ఒక గ్రామానికి చెందిన వివాహితపై మూకుమ్మడిగా లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఇది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై జి.అనిల్ కేసు నమోదు చేశారు. సంఘటనపై దర్యాప్తు నిర్వహించిన మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వివాహితను గంపలగూడెం మండలం సొబ్బాలకు చెందిన చెన్నోజు అశోకాచారి, శ్రీకాకుళం జిల్లా పొలాకి మండలం తలసముద్రం గ్రామానికి చెందిన పోతల రాజేష్ శనివారం రాత్రి 7 గంటల సమయంలో ఒక కారులో బలవంతంగా ఎక్కించుకున్నారు. గంపలగూడెం శివారు ఎన్టీఆర్ కాలనీ సమీపంలోని పత్తి చేలోకి తీసుకెళ్లారు. ఆదివారం వేకువజాము వరకు ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత మహిళ వేకువజామున 112కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గంపలగూడెం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అశోకాచారి, రాజేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరు తోటమూల సమీపంలోని మారుతీ సర్వీస్ సెంటర్, ఏ-1 వాటర్ సర్వీసు సెంటర్‌లో పని చేస్తుంటారు. ఈ మేరకు బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం తిరువూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో నిందితులను తిరువూరు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు. నిందితులను నూజివీడు ఉప కారాగారానికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

'నవోదయ'లో బిర్యానీ రగడ

తరచుగా వసతి గృహంలోకి పార్శిళ్లు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : బిర్యానీ వ్యవహారం తీవ్ర దుమారానికి కారణమైంది. వివరాల్లోకి వెళ్తే.. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం వేలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో కొందరు విద్యార్థులు సమీపంలోని హోటళ్ల నిర్వాహకులతో పరిచయం పెంచుకుని తరచుగా వసతిగృహంలోకి రహస్యంగా బిర్యానీ, ఇతర ఆహార పదార్థాలు తెచ్చుకుంటున్నారు. రాత్రి వేళల్లో పాఠశాల రక్షణ గోడ దూకి మరీ పొలాల గుండా బయటకెళ్లి వీటిని తెచ్చుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో నాలుగు రోజుల కిందట పాఠశాల వర్గాలు నిఘా పెట్టి ఓ హోటల్ నిర్వాహకుడు ద్విచక్ర వాహనంపై వచ్చి విద్యార్థులకు బిర్యానీ పొట్లాలు ఇస్తుండగా పట్టుకున్నారు. ఇకపై ఇలా చేయవద్దని, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అతడిని హెచ్చరించారు. దీనిపై విచారణ చేసి 15 మంది విద్యార్థులను గుర్తించి, మందలించి గత నెల 28న వారి తల్లిదండ్రులను పిలిపించి జరిగిన విషయం చెప్పారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా వారితో పాటు ఇళ్లకు పంపించి తిరిగి ఈ నెల ఒకటో తేదీన తీసుకురావాలన్నారు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థిని ప్రిన్సిపల్, ఇతర ఉపాధ్యాయులు దారుణంగా కొట్టారంటూ అతని తండ్రి ఆరోపించారు. విద్యార్థి కాళ్లపై ఉన్న దెబ్బలు కన్పించేలా సామాజిక మాధ్యమాల్లో వీడియో పోస్టు చేశారు. మొత్తం విద్యార్థులను ఇదే విధంగా కొట్టారంటూ పేర్కొన్నారు. దీనిపై ఇన్‌ఛార్జి వైస్ ప్రిన్సిపల్ ఆదినారాయణను 'న్యూస్‌టుడే' సంప్రదించగా తాము ఏ విద్యార్థిని విచక్షణ రహితంగా దండించలేదన్నారు. తరచుగా బయట నుంచి ఆహారం తెచ్చుకుంటున్న విషయాన్ని ఆధారాలతో సహా నిర్ధారించుకున్న తర్వాత వారిని మందలించామన్నారు. తర్వాత తల్లిదండ్రులను పిలిపించి జరిగిన విషయం వివరించామన్నారు.


ఉపాధ్యాయులు కొట్టడంతోనే దెబ్బలు తగిలాయని చూపుతున్న విద్యార్థి

బ్రాయిలర్ ధరలు (కిలో ఠి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -113 రిటైల్ ధర 140 చికెన్ విత్ స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

జాతీయ స్థాయిలో మెరిసిన జూపూడి బాలిక



దామినిని పతకాలతో సత్కరిస్తున్న నిర్వాహకులు

ఇబ్రహీంపట్నం (గ్రామీణం, న్యూస్‌టుడే : జూపూడికి చెందిన కలతోటి దామిని ఇటీవల నిర్వహించిన తైక్వాండో జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి అయిదు పతకాలను సాధించింది. తైక్వాండో ఫెడరేషన్ ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యదర్శి మలిశెట్టి అంకమ్మరావు వద్ద ఆమె శిక్షణ పొందింది. బాలిక గుణదల డాన్‌బోస్కో పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. ఈ సందర్భంగా ఆమెను పలువురు ప్రముఖులు, నాయకులు ఆమెను ఆదివారం అభినందించారు.

వాతావరణ సమతుల్యతను కాపాడుకుందాం



సబ్ స్టేషన్‌లో మొక్క నాటుతున్న పవిత్రారాణి

కొండపల్లి, న్యూస్‌టుడే : మొక్కలు నాటి వాతావరణ సమతుల్యతను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఏఈ పవిత్రారాణి అన్నారు. కొండపల్లి జగనన్న కాలనీ సబ్ స్టేషన్‌లో బదిలీ ఉద్యోగులకు సన్మానం, మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వాతావరణంలో పెను విపత్తు రాకముందే ప్రతి ఒక్కరూ మేల్కొని మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? పశ్చిమ ఇబ్రహీంపట్నం గుడి సెంటర్‌లో వారం నుంచి పారిశుద్ధ్య పనులు నిర్వహించడం లేదు. **- శ్యాంసుందర్, స్థానికుడు** ✔ ఆ ప్రాంతమంతా పరిశీలించి పనులు నిర్వహిస్తాం. **- మధు, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు** – న్యూస్‌టుడే, కొండపల్లి ? జి.కొండూరు పీహెచ్‌సీ సమీపంలోని కాలువల్లో పూడిక పేరుకుంది. **- సాంబశివరావు గ్రామస్థుడు** ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. కార్మికులను పంపించి పూడిక తీయిస్తాం. **- బసవ లింగేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, జి.కొండూరు ? నరసాపురం - చిన్నంపేట వెళ్లే రహదారి పక్కన కొందరు చెత్త వేస్తున్నారు. **- స్థానికులు** ✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం. **- స్వాతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి, నరసాపురం** – న్యూస్‌టుడే, విస్సన్నపేట



మండల స్థాయి క్రీడా పోటీలు

కొండపల్లి, న్యూస్‌టుడే : మండల స్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీలను కొండపల్లి బాలికోన్నత పాఠశాలలో ఆదివారం ప్రారంభించారు. ఈ పోటీలు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు వేర్వేరుగా ఉన్నాయని ఎంఈవో పుష్పలత తెలిపారు. క్రికెట్, త్రోబాల్ పోటీలు ఉన్నాయని చెప్పారు. గెలుపొందిన వారు డివిజన్ స్థాయికి చేరుకుంటారని వివరించారు.

మౌలిక వసతులు కల్పించండి

కొండపల్లి, న్యూస్‌టుడే : షాబుఖారీ దర్గా ఉరుసు మహోత్సవాల సందర్భంగా స్థానిక దర్గా వద్ద మౌలిక వసతులను మెరుగు పరచాలని ముస్లిం మత పెద్దలు అల్తాఫ్ రజా కోరారు. ఆదివారం దర్గా ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. డిసెంబర్ 29, 30, 31న షాబుఖారీ ఉరుసు మహోత్సవాలు ఉన్నాయని తెలిపారు. ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా ఉన్న నేపథ్యంలో దాన్ని పూర్తిగా చదును చేయాలన్నారు.

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీ నేడు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంయుక్తంగా పాత ప్రభుత్వాసుపత్రి నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముసురు.. కంటిపై కునుకు కరవు!

ఆందోళన చెందుతున్న రైతులు

న్యూస్‌టుడే, మైలవరం, గంపలగూడెం



మైలవరం మండలం చంద్రగూడెంలో ధాన్యపు రాశులపై కప్పిన పట్టాలు

అన్నదాతల్లో కలవరింత మొదలైంది. మొంథా తుపాను మెట్ట పంటలను తుడిచి పెట్టగా, దిత్వా తుపాను హెచ్చరికలు కర్షకులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. కోతలు ప్రారంభమవుతున్న తరుణంలో ముసురు వాతావరణంతో ఎక్కడికక్కడే నిలిపేయాల్సి రావడంతో నష్టం తప్పదని ఆందోళన చెందుతున్నారు.

నాట్లు ఆలస్యం కావడంతో..

మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 22 వేల ఎకరాల వరకు వరి సాగవుతోంది. రెడ్డిగూడెం మండలంలోని పలు గ్రామాల్లో ముందస్తుగా సాగు చేపట్టిన రైతులు గత రెండు వారాలుగా కోతలు పూర్తి చేస్తున్నారు. మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో నాట్లు ఆలస్యం కాగా ఇప్పుడిప్పుడే కోతలు మొదలయ్యాయి. సాగు విస్తీర్ణంలో ఇప్పటి వరకు సుమారు 10 నుంచి 15 శాతం పొలాల్లోనే కోతలు ముగిశాయని రైతులు చెబుతున్నారు. మరో అయిదారు శాతం ధాన్యం కళ్లాల్లో ఉంది. కోతకు సిద్ధంగా ఉన్న పొలాలకు ముసురు తీవ్ర నష్టం కలిగించే అవకాశం ఉంది. కంకి బరువుతో పూర్తిగా నేలకొరిగిన మొక్కల్లోని ధాన్యం మొలకెత్తి చేతికి రాకుండా పోతుందని అన్నదాతలు చెబుతున్నారు. ఒకవేళ పనులు పూర్తయినా, తేమతో కోతకు ఇబ్బంది తప్పదంటున్నారు. ఆదివారం సాయంత్రం చిరు జల్లులు మొదలు కావడంతో కోసి ఆరబెట్టిన ధాన్యంపై పట్టాలు కప్పుకుంటూ పరుగులు తీశారు.

కోతలు సాగుతూనే ఉన్నాయి

తిరువూరు నియోజకవర్గంలో కూడా ఆదివారం సాయంత్రం ఒక మోస్తరు జల్లు పడింది. దీంతో ఖరీఫ్ వరి నూర్పిడి చేసిన, చేయాల్సిన రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. గంపలగూడెం, ఎ.కొండూరు, రెడ్డిగూడెం, విస్సన్నపేట మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 56 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. నవంబరు మొదటి వారం నుంచి యంత్రాలతో నూర్పిడులు చేస్తున్నారు. ఇప్పటి వరకు 25 వేల ఎకరాల్లో నూర్పిడులు పూర్తి అయ్యాయి. డిసెంబరు మొదటి పక్షం వరకు వరి కోతలు సాగుతూనే ఉంటాయి. నియోజకవర్గంలో వరి నూర్పిడులు గత పది రోజుల నుంచి వేగంగానే జరుగుతున్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించేందుకు రైతులు వడ్లలో తేమ తగ్గేందుకు ఆరబెట్టారు. ఏమైనా దిత్వా తుపాన్ కర్షకులకు కంటిపై కునుకు లేకుండా చేస్తోంది.

మహిళాభివృద్ధి దేశానికి ముఖ్యం



అవగాహన ప్రదర్శనలో స్త్రీశక్తి సభ్యులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : మహిళాభివృద్ధిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఏపీ దళిత స్త్రీశక్తి నేత జి.ఝాన్సీ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్త్రీశక్తి జండర్ క్యాంపెయిన్ డ్రైవ్‌ను ఇబ్రహీంపట్నం, కొండపల్లిలో ఆదివారం నిర్వహించారు. అన్ని రంగాల్లో మహిళాభివృద్ధి సాధించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం దీని ముఖ్య ఉద్దేశమని ఆమె తెలిపారు. మహిళాభివృద్ధి దేశానికి ఎంతో ముఖ్యమని చెప్పారు. ఏపీఎస్ఈబీ సెక్రటరీ కిరణ్, కాంతారావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్



సాయన్నపాలెం : శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, కూటమి నాయకులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం నాగులూరు, పాత నాగులూరు పంచాయతీల్లో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభం, నాగులూరులో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం నాగులూరుకు చెందిన తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేవీవీ.సత్యనారాయణ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు జనసేన మైలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎ.రామ్మోహనరావు, కూటమి నాయకులు ఆయన వెంట ఉన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే : మైలవరం- నూజివీడు రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదివారం పరిశీలించారు. వెల్వడంలో వేస్తున్న తారు పనులను చూసి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. స్థానిక నాయకులు ఆయన వెంట ఉన్నారు

80 మందికి కంటి వైద్య పరీక్షలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రంగాపురంలో అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 80 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు యువశక్తి సంఘం అధ్యక్షుడు సీహెచ్.వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామ సర్పంచి పి.సునీల, వైకాపా మండల అధ్యక్షుడు కె.వెంకటరెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. కంటి వైద్య నిపుణురాలు పి.లక్ష్మీకుమారి వైద్య పరీక్షలు చేశారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణ గానామృతం



వరుడికి గోదానం చేస్తున్న కన్యాదాతలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : ఎన్టీటీపీఎస్ ఏ కాలనీ శ్రీహరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీవేంకటేశ్వర స్వామి గానామృత కల్యాణాన్ని నిర్వహించారు. కొండపల్లి, ఇబ్రహీంపట్నంలకు చెందిన వేంకటేశ్వర స్వామి గానామృత సమాజం సభ్యులు కేవలం పాటలతోనే కల్యాణం చేపట్టారు. దేవస్థానం కమిటీ సభ్యులు కన్యాదాతలుగా వ్యవహరించారు. ఇబ్రహీంపట్నం కొండపల్లి గ్రామాలతో పాటు ఎన్టీటీపీఎస్ కాలనీలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో శేషు కుమారి బృందం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ధర్మపథం కార్యక్రమంలో భాగంగా జి.కొండూరు మండలం కవులూరుకు చెందిన గరిమెళ్ల శేషుకుమారి బృందం ప్రదర్శించిన గాన కళార్చన భక్తులను ఆదివారం అలరించింది. దుర్గమ్మను కీర్తిస్తూ బృందం సభ్యులు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. వారికి దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వారికి వేద పండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

సూర్యభగవానునికి పూజలు



స్వామి వారికి హారతి ఇస్తున్న మహిళలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని శ్రీరామ భజన మందిరంలో ఆదివారం నాగేశ్వర్స్ సేవా ఫౌండేషన్ భక్త బృందం ఆధ్వర్యంలో సామూహిక సూర్య అష్టోత్తర శతనామావళి, ఆదిత్య హృదయ పారాయణం ప్రారంభించారు. సూర్య భగవానునికి విశేష పూజలు చేశారు.

• గ్రామోత్సవం

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలనులో మూడు రోజుల పాటు నిర్వహించే గీతా జయంతి ఉత్సవాలను భక్తులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక శివాలయంలో భగవద్గీత గ్రంథానికి, శ్రీకృష్ణపరమాత్మ చిత్రపటానికి పూజలు నిర్వహించి పల్లకీలో గ్రామోత్సవం చేశారు. వివిధ దేవతల దీక్షలు తీసుకున్న భక్తులు పాల్గొన్నారు.

అన్నదాతలకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో మాధురి

తిరువూరు టౌన్ : తిరువూరు మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్డీవో మాధురి ఆదివారం పరిశీలించారు. ధాన్యం తూకం, సంచుల సరఫరా, రవాణా ఏర్పాట్లు ఎలా ఉన్నాయో? రైతులను అడిగి తెలుసుకున్నారు. అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ నాగమణి, వ్యవసాయ అధికారి పద్మ, తదితర అధికారులు పాల్గొన్నారు.



కర్షకులకు సూచనలు ఇస్తున్న ఏవో శ్రీనివాసరావు

రెడ్డిగూడెం : దిత్వా తుపాన్ నేపథ్యంలో రైతులు రెండు రోజుల పాటు వరి కోతలు కోయవద్దని ఏవో డి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం కూనపరాజుపర్వ, రంగాపురం, మద్దులపర్వ తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆరబెట్టిన ధాన్యం రాశులు తడవకుండా పట్టాలు కప్పి రక్షించుకోవాలని సూచించారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : నరసాపురం, తాతకుంట్ల, విస్సన్నపేట గ్రామాల్లో రైతులు ఆరబోసిన ధాన్యాన్ని మండల ఏవో షేక్ టిప్పుసుల్తాన్ ఆదివారం పరిశీలించారు. తుపాన్ దృష్ట్యా రెండు రోజులు వరి కోతలకు విరామం ప్రకటించాలని రైతులకు సూచించారు.

రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేయరూ..



నూజివీడు- గంపలగూడెం ఆర్అండ్‌బీ రహదారిలో రంగాపురం చెరువు కళంగుల దగ్గర వాగులపై ఉన్న రెండు చప్టాల రక్షణ దిమ్మెలు విరిగిపోయాయి. చప్టా వద్ద రహదారి పల్లంగా ఉండటంతో వాహనాలు అదుపు తప్పి వాగులో పడిపోతున్నాయి. గతంలో ఈ చప్టా వద్ద ట్రాక్టర్ బోల్తా కొట్టంగా ఒక వృద్ధురాలు మృతి చెందారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ప్రదేశాల్లో ప్రమాదాలు జరగకుండా చప్టాలపై రక్షణ దిమ్మెల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

గుంతల దారి.. అధ్వానంగా మారి



స్థానిక గెయిల్ ఇండియా కంపెనీ నుంచి గడ్డమణుగు గ్రామం మీదుగా చెరువు మాధవరం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిపై గుంతలు పడి అధ్వానంగా మారింది. దీంతో అటు వైపు రాకపోకలు సాగించాలంటేనే ఇబ్బందిగా ఉంటుందని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అడుగడుగునా గుంతలు ఉండటంతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నామని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు



కొందరు రెడ్డిగూడెం మండల పరిధిలోని జగ్గవరపు గట్టు(కొండను) యథేచ్ఛగా తవ్వేస్తూ గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో గ్రావెల్ కోసం అనుమతులు తీసుకున్న క్వారీలు లేవు. మండలంలోని గ్రామాల్లోనే కాకుండా వేరే మండలాలకు దీన్ని తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కొందరు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వగా గ్రావెల్ తరలించే ప్రదేశానికి వెళ్లగా అప్పటికే ట్రాక్టర్లు, పొక్లెయిన్లు వెళ్లిపోయయాని ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తామని చెప్పడం విశేషం. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

ఖాళీ స్థలాలు.. విష సర్పాలకు నిలయాలు



తిరువూరులోని నివాసాల మధ్య విషసర్పాలు కనిపిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇటీవల కాలంలో పలు కాలనీలు, ఇంటి ప్రాంగణాలు, రోడ్డు పక్కన ఇవి దర్శనం ఇవ్వడంతో స్థానికులు ఇంటి నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. సుందరయ్య కాలనీ, తంగేళ్లబీడు, మునుకుళ్ల రోడ్డు, అక్కపాలెం రోడ్డు తదితర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో చెత్తకుప్పలు, గుంతలు, పాడుబడ్డ కాలువలు, నీటి నిల్వలు ఉండటం వల్లనే తరచూ ఇళ్లలోకి వస్తున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

నిరుద్యోగ యువతకు శిక్షణ

విజయవాడ సిటీ : నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొందేందుకు జనశిక్షణ సంస్థాన్‌లో ఉచితంగా వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఛైర్‌పర్సన్ విద్యాకన్నా, డైరెక్టర్ ఎ.పూర్ణిమ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని కార్యాలయం లేదా 0866- 2470420 నంబరులో సంప్రదించాలని కోరారు.

రౌడీషీటర్లకు సత్ప్రవర్తన అవసరం



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై మహాలక్ష్మణుడు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని రౌడీషీటర్లు, క్రైం, లా అండ్ ఆర్డర్ సస్పెక్ట్ షీటర్లకు ఎస్సై జి.మహాలక్ష్మణుడు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కల్గించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



విస్సన్నపేటలో నిరసన తెలుపుతున్న సీపీఎం శ్రేణులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : గంజాయి విక్రయాలకు అడ్డుగా ఉన్నాడని ప్రజా కళాకారుడు పెంచలయ్యను నెల్లూరు జిల్లాలో దారుణంగా హత్య చేసిన గంజాయి ముఠాను కఠినంగా శిక్షించాలని సీపీఎం విస్సన్నపేట మండల కమిటీ నాయకులు కోరారు. స్థానికంగా ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం మండల కార్యదర్శి నాగరాజు, ధనలక్ష్మి, రంగారాణి, శ్రీనివాసరావు, రామకృష్ణ, జ్ఞానరత్నం, నాగేశ్వరరావు, బాషా పాల్గొన్నారు.

సత్సంబంధాలు కలిగి ఉంటేనే ఐక్యత



ర్యాలీలో పాల్గొన్న జేఐహెచ్ ప్రతినిధులు

తిరువూరు, న్యూస్‌టుడే : పట్టణంలో ఆదివారం జమాతే ఇస్లామి హింద్ సభ్యులు ఆధ్వర్యంలో పొరుగు వారి హక్కుల ఉద్యమంపై ప్రదర్శన నిర్వహించారు. ఇరుగు పొరుగు వారితో సత్సంబంధాలు కలిగి ఉండటం ఐక్యతకు నిదర్శనమని నినాదాలు చేశారు. జేఐహెచ్ ప్రతినిధులు ఎస్‌కే.వలి, అబ్దుల్ హమీద్, రషీద్, కరీముల్లా, అబీబ్, ఫాతిమా, అస్మా, షహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

దేశమంటే మట్టి కాదోయ్..



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతిని పట్టణంలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురజాడ సమాజ సమస్యలను కలం ద్వారా అలంకరిస్తునే చైతన్యం నింపారన్నారు. దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అని చాటి చెప్పారు. గంగాధర్, హరికృష్ణ, రాం ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత పెన్నా ఎఫ్‌సీ జట్టు



గెలుపొందిన క్రీడాకారులకు ఛాంపియన్ ట్రోఫీ అందిస్తున్న అతిథులు

మైలవరం, న్యూస్‌టుడే : ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మైలవరంలోని లకిరెడ్డి హనిమిరెడ్డి క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల తుది పోరులో పెన్నా ఎఫ్‌సీ జట్టు, తుంగభద్ర ఎఫ్‌సీ జట్టుపై విజయం సాధించి ట్రోఫీ గెలుచుకుంది. గత నెల 24న టోర్నీని ప్రారంభించగా రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదివారం పెన్నా, తుంగభద్ర జట్ల మధ్య తుదిపోరు హోరాహోరీగా సాగగా 2- 2 స్కోరుతో డ్రా జరిగింది. దాంతో పెనాల్టీ కార్నర్‌లో తుంగభద్ర జట్టు 2 గోల్స్ కొట్టగా, పెన్నా జట్టు 3 గోల్స్‌తో విజయం సాధించింది. విజేతలకు స్టేడియం నిర్మాణ దాత లకిరెడ్డి హనిమిరెడ్డి, జయప్రకాశరెడ్డి, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ నివృతరావు, విశ్రాంత డీఎస్‌డీవో బి.సుధాకర్, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శేషగిరిరావు, ఈసీ మెంబరు చక్రవర్తి తదితరులు పాల్గొని విజేతలకు ట్రోఫీ అందజేశారు.

ముగిసిన ఆటల పోటీలు



ట్రోఫీ గెలుచుకున్న చిట్టూరి ఉన్నత పాఠశాల విద్యార్థుల బృందం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : కేతనకొండలోని శ్రీస్వామి నారాయణ గురుకుల్ పాఠశాలలో నిర్వహించిన గురుకుల్ ఒలింపిక్స్ ఛాంపియన్ ట్రోఫీని విజయవాడ గాంధీనగర్‌కు చెందిన చిట్టూరి ఉన్నత పాఠశాల విద్యార్థుల బృందం కైవసం చేసుకుంది. గత మూడు రోజులుగా పాఠశాలలో నిర్వహించిన గురుకుల్ ఒలింపిక్స్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఇందులో జిల్లాకు చెందిన 25 పాఠశాలల నుంచి 1200 మంది విద్యార్థులు పలు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్ నితీష్, ఫిజిక్స్ ప్రొఫెసర్ యర్రంరెడ్డి గాంధీ, పాఠశాలకు చెందిన నిర్వాహకులు మంత్రస్వరూప్ దాస్ స్వామీజీ, కృష్ణమూర్తి దాస్ స్వామీజీ పాల్గొన్నారు.

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు'



మాట్లాడుతున్న స్వామిదాసు

ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే : వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం పేదలకు ఉచిత ఆరోగ్య సేవలను దూరం చేయడమేనని వైకాపా తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. గంపలగూడెం మండలం గోసవీడు, ఎ.కొండూరు మండలం కోడూరులో ఆదివారం జరిగిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

రోడ్డు మూసేసి.. తిప్పలు తెచ్చి..

కొండపల్లి, న్యూస్‌టుడే



కొండపల్లి బి.కాలనీ నుంచి జాతీయ రహదారికి చేరుకొనే మార్గం

ఎన్టీటీపీఎస్ ఐదో దశ విస్తరణలో భాగంగా కొండపల్లి బి.కాలనీ వద్ద ఉన్న రహదారిని ఆ సంస్థ మూసేసింది. దీంతో గతంలో అటుగా రాకపోకలు సాగించేవారంతా జాతీయ రహదారిపై నుంచి వెళ్లాల్సి వస్తోంది. సంస్థ ఏర్పడక ముందు, తర్వాత ఇబ్రహీంపట్నం నుంచి కొండపల్లికి ఇదే ప్రధాన మార్గం. కాలక్రమేణ జాతీయ రహదారి 221 ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే జాతీయ రహదారి నాలుగు వరుసలుగా విస్తరణ జరగడం, ఎన్‌హెచ్ఏఐ 221 కాస్త 30గా మారింది. ఇదే సమయంలో ఎన్టీటీపీఎస్ కొత్త గేటు వద్ద యాష్ లారీల కోసం కొంత ప్రాంతంలో సంస్థ ప్రహరీని నిర్మించింది. అయితే యాష్ లారీలతో ఇబ్బందిగా ఉందని కొండపల్లి ప్రజలు జాతీయ రహదారికి వెళ్లి అక్కడి నుంచి ఇబ్రహీంపట్నానికి చేరుకుంటున్నారు. ఆ రహదారి నుంచి ప్రజల రాకపోకలు తగ్గించడంతో ఎన్టీటీపీఎస్ ఐదో దశ విస్తరణ అంటూ బి.కాలనీ దర్గాల వద్ద ఉన్న రోడ్డును సైతం పూర్తిగా మూసేసింది. దీంతో ఎప్పుడైనా జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించినప్పుడు కొండపల్లికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దీనిపై దృష్టి సారించి గతంలో ఎన్టీటీపీఎస్ పాత గేటు నుంచి కొండపల్లి బి.కాలనీకి ఉన్న రహదారిని పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణం తోకపల్లికి చెందిన గుంజా మనోజ్ కుమార్(17) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతునికి, నిందితునికి మధ్య చరవాణి విషయమై వివాదం తలెత్తింది. నిందితుడు తన చరవాణిని అపహరించాడనే అనుమానంతో మనోజ్ కుమార్‌పై దాడి చేసేందుకు కుట్రపన్నాడు. దీనిపై నవంబరు 23న వివాదం చెలరేగి నిందితుడు తరచూ అతని ఇంటికెళ్లి చరవాణి చోరీ చేశాడనే ఆరోపణతో దాడి చేసే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో అదే రోజు రాత్రి ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న మనోజ్ కుమార్ తలపై నిందితుడు బండరాయితో మోది గాయపర్చాడని తండ్రి లక్ష్మణరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రోజు రాత్రి అతడిని తిరువూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. దాడికి పాల్పడిన చిరంజీవిపై ఎస్సై- 1 కృష్ణారెడ్డి కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. నిందితుడు ప్రస్తుతం నూజివీడు జైలులో ఉన్నాడు. వారం రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మనోజ్ కుమార్ శనివారం రాత్రి మృతి చెందాడు. దీనిపై పోలీసులకు సమాచారం అందగా నిందితునిపై ఆదివారం హత్య కేసు నమోదు చేసి తిరువూరు సీఐ కె.గిరిబాబు దర్యాప్తు చేపట్టారు.

జూదరులపై కేసు నమోదు

జి.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని దుగ్గిరాలపాడులో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు జి.కొండూరు ఎస్సై కె.సతీష్ కుమార్‌కు సమాచారం అందింది. వెంటనే ఆయన తన సిబ్బందితో ఆదివారం మధ్యాహ్నం దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1050 నగదు, ఒక కోడి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రకటన

నా క్లయింటు తిరువూరు మండలం, తిరువూరు కాపురస్తుడు సయ్యద్ కరీమ్ S/o మస్తాన్ అను వారు ది.25-11-2025వ తేదీన జిరాక్స్ కాపీలు తీయించుకొను నిమిత్తము విస్సన్నపేట సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయములో షేక్ హుస్సేన్ సాహెబ్ S/o షకూర్ సాహెబ్ గారి పేరుతో రిజిష్టరు కాబడిన నెం. 1750 / 2004 గల ఒరిజినల్ దస్తావేజును పోగొట్టుకొనుట జరిగినది. ఎవరికైననూ దొరికిన యెడల ఈ క్రింది చిరునామాదారుకు అందజేయగలరు.

ఇట్లు: కె.వి.ఆర్.యన్.ముత్యప్రసాద్
M.Com, B.L
అడ్వకేట్ & నోటరీ
తిరువూరు, యన్.టి.ఆర్ జిల్లా.
Cell: 98855 74113

ఛాంపియన్



350 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించినప్పుడు గెలుపు ఖాయమే అన్న నమ్మకం! అప్పి 130కే 5 వికెట్లు పడగొట్టినప్పుడు.. విజయం లాంఛనమే అన్న ధీమా! కానీ అనూహ్యం! సఫారీ జట్టు అద్భుత పోరాటం ఆటను రసవత్తరంగా మార్చింది. ఎంతో ఒత్తిడి ఎదుర్కొన్న టీమ్‌ఇండియా.. ఉత్కంఠను అధిగమిస్తూ తొలి వన్డేలో అతి కష్టం మీద గట్టెక్కింది. అంతరం కేవలం 17 పరుగులే. అయితే విజయం కష్టంగానే దక్కినా.. కోహ్లి అద్భుత శతకం భారత అభిమానులకు ఓ మధురానుభూతే. ఒకప్పటిలా కళ్లు చెదిరే షాట్లతో అలరించిన కింగ్.. భారత్ భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. విమర్శకులకు గట్టి సమాధానం చెబుతూ తనలో ఇంకా సత్తా తగ్గలేదని నిరూపించుకున్నాడు.

అంత కొట్టినా కష్టంగానే..

- తొలి వన్డేలో చెమటోడ్చి నెగ్గిన భారత్
- భయపెట్టిన దక్షిణాఫ్రికా
- కోహ్లి సూపర్ సెంచరీ

కోహ్లి 135
120 బంతుల్లో
11×4, 7×6

రాంచి

దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన టీమ్‌ఇండియా.. వన్డే సిరీస్‌లో శుభారంభం చేసింది. విరాట్ కోహ్లి (135; 120 బంతుల్లో 11×4, 7×6) మెరుపు సెంచరీ బాదిన వేళ.. ఆదివారం హోరాహోరీగా సాగిన తొలి మ్యాచ్‌లో 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. కోహ్లితో పాటు రాహుల్ (60; 56 బంతుల్లో 2×4, 3×6), రోహిత్ (57; 51 బంతుల్లో 5×4, 3×6) మెరవడంతో మొదట భారత్ 8 వికెట్ల నష్టానికి 349 పరుగులు చేసింది. ఛేదనలో దక్షిణాఫ్రికా.. 49.2 ఓవర్లలో 332 పరుగులకు ఆలౌటైంది. బ్రీజ్కే (72; 80 బంతుల్లో 8×4, 1×6), యాన్సెన్ (70; 39 బంతుల్లో 8×4, 3×6), బోష్ (67; 51 బంతుల్లో 5×4, 4×6) అద్భుత పోరాటంతో భారత్‌ను కంగారు పెట్టారు. కోహ్లికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. రెండో వన్డే బుధవారం జరుగుతుంది.

అయినా కలవరమే..!: 11/3, 77/4, 130/5. హర్షిత్ రాణా విజృంభించడంతో ఛేదనలో దక్షిణాఫ్రికా పరిస్థితిది. చకచకా మూడు వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికాను జోర్జి (39), బ్రెవిస్ (37)లతో కలిసి బ్రీజ్కే ఆదుకునే ప్రయత్నం చేసినా.. ఆ జట్టు పీకల్లోతు కష్టాల్లోకి కూరుకుపోయింది. సగం వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా.. అప్పటికి లక్ష్యానికి చాలా దూరంలో నిలిచింది. గెలవాలంటే 170 బంతుల్లో 220 పరుగులు చేయాలి. ఆ దశలో భారత్ విజయం లాంఛనమే అనుకున్నారంతా! కానీ బ్రీజ్కే, యాన్సెన్ జోడీ సంచలన బ్యాటింగ్‌తో ఆతిథ్య జట్టును ఆందోళనకు గురిచేసింది. ఓ వైపు బ్రీజ్కే నిలబడగా.. విధ్వంసక షాట్లతో చెలరేగిన యాన్సెన్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతడు ఎడాపెడా ఫోర్లు, సిక్సులు దంచేయడంతో దక్షిణాఫ్రికా 33 ఓవర్లలో 227/5తో తన అవకాశాలను మెరుగుపర్చుకుంది. భారత్ దిక్కుతోచని స్థితిలో పడింది. అయితే ప్రమాదకరంగా మారిన యాన్సెన్, బ్రీజ్కేలను కుల్‌దీప్ ఒకే ఓవర్లో ఔట్ చేయడంతో భారత్ ఊపిరిపీల్చుకుంది. కానీ దక్షిణాఫ్రికా ప్రయత్నం అంతటితో ఆగలేదు. సుబ్రయెన్ (17), బర్గర్ (17)ల అండతో బోష్ పోరాటం కొనసాగించడంతో భారత్‌కు కంగారు తప్పలేదు. 46 ఓవర్లకు 312/8తో నిలిచింది దక్షిణాఫ్రికా. అప్పుడు 47వ ఓవర్లో బర్గర్‌ను అర్ష్‌దీప్ ఔట్ చేశాడు. అయినా భారత్ పని తేలిక కాలేదు. ఆఖరి బ్యాటర్ బార్ట్‌మన్‌తో కలిసి దక్షిణాఫ్రికాను గట్టెక్కించే ప్రయత్నం చేశాడు బోష్. భారీ షాట్లను కొనసాగించాడు. ఆఖరి ఓవర్లో దక్షిణాఫ్రికాకు 18 పరుగులు అవసరమయ్యాయి. కానీ ప్రసిద్ధ్ రెండో బంతికి భారీ షాట్ కొట్టబోయి బోష్ క్యాచ్ ఔట్ కావడంతో గెలుపు భారత్ సొంతమైంది.

కింగ్ అలవోకగా..: భారత్ ఇన్నింగ్స్‌లో కోహ్లి ఆటే హైలైట్. వన్డే ప్రపంచకప్‌లో ఆడాలనే పట్టుదలతో ఉన్న అతడు.. అదిరే బ్యాటింగ్‌తో తన స్థానాన్ని ప్రశ్నించలేని పరిస్థితిని కల్పించాడు. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా.. ఓపెనర్ జైస్వాల్ (18)ను నాలుగో ఓవర్లోనే వెనక్కి పంపింది. కానీ సీనియర్ స్టార్లు కోహ్లి, రోహిత్‌లు అదిరే భాగస్వామ్యంతో ఆ జట్టు తన నిర్ణయానికి చింతించేలా చేశారు. ఈ జోడీ 136 పరుగుల భాగస్వామ్యంతో టీమ్‌ఇండియా భారీ స్కోరుకు బాటలు వేసింది. మొదట్లో జోర్జి క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన రోహిత్.. అవకాశాన్ని ఉపయోగించుకున్నాడు. చక్కని షాట్లతో చకచకా ఫోర్లు కొడుతూ సాగిపోయాడు. సుబ్రయెన్ బౌలింగ్‌లో వరుసగా రెండు భారీ సిక్సులు బాదేశాడు. 43 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. మరోవైపు కోహ్లి కళ్లు చెదిరే ఆటతో అభిమానులను ఉర్రూతలూగించాడు. సాధికారికంగా, అలవోకగా బ్యాటింగ్ చేస్తూ ఒకప్పటి కోహ్లిని గుర్తు చేశాడు. బలమైన పుల్స్, కళ్లు చెదిరే లాఫ్టెడ్ షాట్స్, తనదైన శైలిలో కవర్ డ్రైవ్‌లతో కోహ్లి అలరించాడు. తన ఇన్నింగ్స్ ఆరంభంలో 146 కిలోమీటర్ల పై వేగంతో వచ్చిన బర్గర్ బంతిని సిక్స్‌కు తరలించడం ద్వారా తన ఉద్దేశాన్ని చాటిన అతడు.. ఆద్యంతం అదే జోరు కొనసాగించాడు. బోష్ బౌలింగ్‌లో సిక్స్‌తో రోహిత్ కన్నా ముందే అర్ధశతకం పూర్తి చేసిన కోహ్లి.. అ తర్వాతి బంతిని కూడా స్టాండ్స్‌కు తరలించాడు. అయితే రోహిత్ నిష్క్రమించడం, రుతురాజ్ (8), సుందర్ (13) ఎక్కువసేపు నిలవకపోవడం... కోహ్లికి పరిమితంగా స్ట్రైకింగ్ రావడంతో కాసేపు భారత్ పరుగుల వేగం తగ్గింది. ఆ దశలో కోహ్లి కాస్త జాగ్రత్త వహించాడు. రాహుల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించిన అతడు.. 102 బంతుల్లో శతకం పూర్తి చేశాడు. శతకం తర్వాత కోహ్లి చెలరేగిపోయాడు. సుబ్రయెన్ ఓవర్లో వరుసగా 4, 6, 6, 4 దంచేశాడు. అదే జోరులో ఆడబోయి 43వ ఓవర్లో కోహ్లి వెనుదిరిగినా.. రాహుల్, జడేజా (32; 20 బంతుల్లో 2×4, 1×6) బ్యాట్లు ఝుళిపించడంతో భారత్ 350కి చేరువగా వెళ్లగలిగింది.



కోహ్లికి పాదాభివందనం చేస్తున్న అభిమాని



రోహిత్ 57

రోహిత్ రికార్డు సిక్సర్లు

వన్డేల్లో అత్యధిక సిక్సర్లు బాదిన బ్యాటర్‌గా భారత స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ రికార్డు నెలకొల్పాడు. దక్షిణాఫ్రికాతో తొలి వన్డేలో మూడుసార్లు స్టాండ్స్‌లోకి బంతిని పంపిన హిట్‌మ్యాన్.. ఈ ఫార్మాట్లో సిక్సర్ల సంఖ్యను 352కు పెంచుకున్నాడు. ఈ క్రమంలో పాకిస్థాన్ మాజీ ఓపెనర్ షాహిద్ అఫ్రిది (351) రికార్డును బద్దలు కొట్టాడు.

భారత్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) డికాక్ (బి) బర్గర్ 18; రోహిత్ ఎల్బీ (బి) యాన్సెన్ 57; కోహ్లి (సి) రికిల్టన్ (బి) బర్గర్ 135; రుతురాజ్ (సి) బ్రెవిస్ (బి) బార్ట్‌మన్ 8; సుందర్ (సి) బోష్ (బి) బార్ట్‌మన్ 13; రాహుల్ (సి) డికాక్ (బి) యాన్సెన్ 60; జడేజా (సి) మార్క్రమ్ (బి) బోష్ 32; హర్షిత్ నాటౌట్ 3; అర్ష్‌దీప్ (బి) బోష్ 0; కుల్‌దీప్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 23 మొత్తం: (50 ఓవర్లలో 8 వికెట్లకు) 349; **వికెట్ల పతనం:** 1-25, 2-161, 3-183, 4-200, 5-276, 6-341, 7-347, 8-347; **బౌలింగ్:** యాన్సెన్ 10-0-76-2; బర్గర్ 10-0-65-2; బోష్ 10-0-66-2; బార్ట్‌మన్ 10-0-60-2; సుబ్రయెన్ 10-0-73-0

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: మార్క్రమ్ (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 7; రికిల్టన్ (బి) హర్షిత్ 0; డికాక్ (సి) రాహుల్ (బి) హర్షిత్ 0; బ్రీజ్కే (సి) కోహ్లి (బి) కుల్‌దీప్ 72; జోర్జి ఎల్బీ (బి) కుల్‌దీప్ 39; బ్రెవిస్ (సి) రుతురాజ్ (బి) హర్షిత్ 37; యాన్సెన్ (సి) జడేజా (బి) కుల్‌దీప్ 70; బోష్ (సి) రోహిత్ (బి) ప్రసిద్ధ్ 67; సుబ్రయెన్ (సి) రాహుల్ (బి) కుల్‌దీప్ 17; బర్గర్ (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 17; బార్ట్‌మన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం:** (49.2 ఓవర్లలో ఆలౌట్) **332; వికెట్ల పతనం:** 1-7, 2-7, 3-11, 4-77, 5-130, 6-227, 7-228, 8-270, 9-312; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 10-1-64-2; హర్షిత్ 10-0-65-3; సుందర్ 3-0-18-0; ప్రసిద్ధ్ 7.2-1-48-1; కుల్‌దీప్ 10-0-68-4, జడేజా 9-0-66-0

ముందుకొచ్చి తన శైలిలో బ్యాట్‌ను ఝుళిపిస్తే బంతి స్టాండ్స్‌లో తేలింది.. కట్ చేస్తే సరళ రేఖ గీసినట్టే బంతి దూసుకెళ్లింది. ఆ కళాత్మక డ్రైవ్‌లు.. ముచ్చటగొల్పే ఫ్లిక్‌లు! ఒకటేమిటి కింగ్ కోహ్లి ఇన్నింగ్స్‌లో అన్నీ మెరుపులే! ఎన్నో రోజులుగా వేచి చూస్తున్న అభిమానులకు రాంచీలో పరుగుల విందు భోజనం పెట్టేశాడు కోహ్లి.

కోహ్లి.. కింగ్‌లా

ఈనాడు క్రీడావిభాగం

నిజానికి కోహ్లి ఇటీవల గొప్ప ఫామ్‌లో లేడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో తొలి రెండు వన్డేల్లోనూ డకౌట్ అయితే ఇతడికి ఇక కష్టమేనా అనుకున్నారు. మూడో వన్డేలో కాస్త పుంజుకుని అర్ధసెంచరీతో సిరీస్‌ను పూర్తి చేశాడు విరాట్. అయినా అభిమానులకు సంతృప్తి లేదు. పైగా జోరు మీదున్న దక్షిణాఫ్రికాపై అతడు ఎలా ఆడతాడో అనే ఆందోళన తోడైంది. కానీ ఫామ్ తాత్కాలికం.. క్లాస్ శాశ్వతం అనే మాటని నిరూపిస్తూ రాంచిలో రెచ్చిపోయాడు కోహ్లి. ట్రేడ్‌మార్కు షాట్లకు అద్భుతమైన టైమింగ్‌ను జత చేసి సఫారీ బౌలర్ల పని పట్టాడు.

ఆరంభం నుంచీ దూకుడే..: ఈ మధ్య కాలంలో నెమ్మదిగా ఆడి గేర్లు మార్చుతున్న 37 ఏళ్ల కోహ్లి.. దక్షిణాఫ్రికాపై మాత్రం ఆరంభం నుంచి స్వేచ్ఛగా ఆడాడు. అతడి ఆటలో దూకుడు తప్ప తడబాటు లేదు. షాట్లలో ఒకప్పటి జోష్ తప్ప పొరపాట్లు లేవు. అలవోకగా.. స్కోరుబోర్డు పరుగులెత్తించాడు విరాట్. ముఖ్యంగా సిక్సర్లు తక్కువగా బాదే కోహ్లి.. ఈ మ్యాచ్‌లో ఏడు బంతులను స్టాండ్స్‌లోకి పంపాడంటేనే అతడెంత దూకుడుగా ఆడాడో అర్థం చేసుకోవచ్చు. క్రీజులో బలంగా నుంచొని సుబ్రయెన్ బౌలింగ్‌లో కొట్టిన బ్యాక్‌ఫుట్ పంచ్, బోష్ బౌలింగ్‌లో ఆడిన గోల్ఫ్ షాట్ సిక్సర్, బార్ట్‌మన్ బౌలింగ్‌లో ముందుకొచ్చి మిడాఫ్ మీదగా బాదిన సిక్సర్.. వేటికవే ప్రత్యేకం. ఇక 39వ ఓవర్లో సుబ్రయెన్ బౌలింగ్‌లో చెలరేగిన తీరును చూసి తీరాల్సిందే. సాధారణంగా ఎడాపెడా షాట్లు కొట్టని విరాట్.. ఆ ఓవర్లో వరుసగా 4, 6, 6, 4 బాదాడు.

2027 వన్డే ప్రపంచకప్‌లో విరాట్ ఆడితే చూడాలని అభిమానులు బలంగా కోరుకుంటున్నారు. అతడి నుంచి ఒక పెద్ద ఇన్నింగ్స్ వస్తే కచ్చితంగా ప్రపంచ కప్ ప్రయాణానికి బాసటగా నిలుస్తుందని ఆశించారు. వాళ్ల ఆశలను నెరవేరుస్తూ.. పరుగుల బాకీని తీరుస్తూ కోహ్లి సత్తా నిరూపించుకున్నాడు. ముఖ్యంగా ఒకప్పటి కోహ్లిని బయటకు తీస్తూ పరుగుల పంట పండించడం అభిమానులను ఉర్రూతలూగించింది. విరాట్ ఆత్మవిశ్వాసాన్ని ఎన్నో రెట్లు పెంచే ఇన్నింగ్స్ ఇది. తనకెంతో కలిసొచ్చిన రాంచీ స్టేడియంలో విరాట్‌కు ఇది మూడో వన్డే శతకం కావడం విశేషం. కొత్త కుర్రాళ్ల వైపు సెలక్టర్లు చూస్తున్న నేపథ్యంలో.. తన బ్యాట్ మ్యాజిక్‌ను ఇంకోసారి చూపించి తన విలువేంటో మరోసారి గుర్తు చేశాడు విరాట్. ఇదే జోరుతో.. దూకుడుతో ఈ సిరీస్‌లో అతడు మరింత చెలరేగితే అభిమానులకు పండగే.

ఫైనల్లో భారత్ ఓటమి

ఇఫో: సుదీర్ఘ విరామం తర్వాత అజ్లాన్ షా హాకీ టోర్నీ టైటిల్ గెలవాలన్న భారత్ ఆశ తీరలేదు. ఆదివారం ఫైనల్లో 0-1తో బెల్జియం చేతిలో ఓడింది. ఈ టోర్నీలో అదిరే ఫామ్‌ను కొనసాగించి చివరి లీగ్ మ్యాచ్‌లో 14-3తో కెనడాను చిత్తుగా ఓడించిన సంజయ్ బృందం.. అదే జోరును ఫైనల్లో ప్రదర్శించలేకపోయింది. మూడు పెనాల్టీ కార్నర్లను వృథా చేసుకుని ఓటమి కొని తెచ్చుకుంది. స్టాక్‌బ్రోక్స్ 34వ నిమిషంలో సాధించిన గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లిన బెల్జియం.. భారత్‌ను గోల్ చేయకుండా నిలువరించి విజయాన్ని అందుకుంది. ఈ టోర్నీలో సత్తా చాటిన జుగ్‌రాజ్, అమిత్, సంజయ్ ఫైనల్లో విఫలం కావడం భారత్‌ను దెబ్బ తీసింది. లీగ్ దశలోనూ బెల్జియం చేతిలో భారత్ ఓడడం గమనార్హం.

ఆసియా కప్ ఫుట్‌బాల్‌కు భారత్

చెన్నై: ఏఎఫ్‌సీ అండర్-17 ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీకి భారత్ అర్హత సాధించింది. వచ్చే ఏడాది జరిగే ఈ టోర్నీలో ఆడాలంటే గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో ఆదివారం భారత్ 2-1తో ఇరాన్‌ను ఓడించింది. 19వ నిమిషంలో అమీర్‌రెజా గోల్‌తో భారత్ ఖాతా తెరవగా.. ప్రథమార్ధం చివర్లో కెప్టెన్ గాంగ్టే గోల్‌తో ఆధిక్యం రెట్టింపైంది. 52వ నిమిషంలో గోల్ కొట్టిన ఇరాన్.. మ్యాచ్‌ను డ్రా చేయడానికి గట్టిగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

రన్నరప్‌గా శ్రీకాంత్

విజేత గాయత్రి జోడీ



గాయత్రి, ట్రీసా

లఖ్‌నవూ: సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత డబుల్స్ స్టార్లు గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ అదరగొట్టారు. డిఫెండింగ్ ఛాంపియన్స్ బరిలో దిగిన గాయత్రి- ట్రీసా జంట అద్భుతమైన ప్రదర్శనతో టైటిల్ నిలబెట్టుకుంది. ఆదివారం జరిగిన మహిళల డబుల్స్ ఫైనల్లో టాప్ సీడ్ గాయత్రి- ట్రీసా జోడీ 17-21, 21-13, 21-15తో కహో ఒసావా- మయ్ తనబె (జపాన్) జంటపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో అగ్రశ్రేణి ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ రన్నరప్‌గా నిలిచాడు. ఎనిమిదేళ్ల టైటిల్ కరవుకు తెరదించాలన్న అతని ప్రయత్నాలు ఫలించలేదు. ఫైనల్లో శ్రీకాంత్ 16-21, 21-8, 20-22తో జేసన్ గుణవాన్ (హాంకాంగ్) చేతిలో పోరాడి ఓడాడు. శ్రీకాంత్ చివరి సారిగా 2017లో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ సాధించాడు. ఈ ఏడాది మలేసియా మాస్టర్స్‌లో టైటిల్‌కు చేరువైనా.. ఫైనల్లో ఓడి రన్నరప్‌గా నిలిచాడు. ఇక భుజం గాయంతో అయిదు నెలలు ఆటకు దూరంగా ఉన్న గాయత్రికి పునరాగమనంలో ఇది రెండో టోర్నీ. 49 ర్యాలీలతో ప్రారంభమైన మ్యాచ్ హోరాహోరీగా సాగింది. తొలి గేమ్‌లో భారత జోడీపై జపాన్ జంట ఆధిపత్యం కనబరిచింది. 8-6, 18-15తో ముందంజ వేసిన ప్రత్యర్థి జంట 21-17తో మొదటి గేమ్‌ను గెలుచుకుంది. రెండో గేమ్ నుంచి ఆటతీరు మార్చిన గాయత్రి- ట్రీసా జోడీ.. 9-2తో గేమ్‌ను ప్రారంభించిన గాయత్రి- ట్రీసా జంట చూస్తుండగానే 20-11తో రెండో గేమ్‌ను సొంతం చేసుకుంది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ భారత జోడీ జోరు కొనసాగించింది. 7-4తో మొదలు పెట్టిన భారత జంట 15-13తో ఆధిక్యం సంపాదించింది. అద్భుతమైన స్మాష్‌లు, రిటర్న్‌లతో జపాన్ జంట పోరాటానికి తెరదించిన గాయత్రి- ట్రీసా జోడీ.. 21-15తో మూడో గేమ్‌ను, మ్యాచ్‌ను చేజిక్కించుకుంది.

అభిషేక్ అదరహో

- 12 బంతుల్లోనే అర్ధసెంచరీ
- 52 బంతుల్లోనే 148



అభిషేక్

ఈనాడు, హైదరాబాద్: టీమ్‌ఇండియా టీ20 ఓపెనర్ అభిషేక్ శర్మ (148; 52 బంతుల్లో 8×4, 16×6) సంచలనం సృష్టించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో పంజాబ్ తరఫున సుడిగాలి ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. ఆదివారం బెంగాల్‌తో జరిగిన గ్రూపు-సి మ్యాచ్‌లో టీ20 క్రికెట్లో మూడో వేగవంతమైన అర్ధసెంచరీ (12 బంతుల్లో)తో మెరిశాడు. ఈ మ్యాచ్‌లో పంజాబ్ 112 పరుగుల ఆధిక్యంతో బెంగాల్‌ను చిత్తుచేసింది. అభిషేక్, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (70; 35 బంతుల్లో 8×4, 4×6), రమణ్‌దీప్ సింగ్ (39; 15 బంతుల్లో 2×4, 4×6) సత్తాచాటడంతో మొదట పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 310 పరుగుల భారీ స్కోరు సాధించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అభిషేక్, ప్రభ్‌సిమ్రన్ 12.3 ఓవర్లలోనే 205 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలో 12 బంతుల్లో అర్ధసెంచరీ సాధించిన అభిషేక్.. తన గురువు యువరాజ్ సింగ్ రికార్డును సమం చేశాడు. అభిషేక్ 32 బంతుల్లోనే శతకాన్ని అందుకున్నాడు. గతంలో యువీ, క్రిస్ గేల్, హజ్రతుల్లా జజాయ్, సాహిల్ చౌహాన్ 12 బంతుల్లో అర్ధసెంచరీలు నమోదు చేశారు. తాజాగా ఈ జాబితాలో అభిషేక్ చేరాడు. దీపేంద్ర సింగ్ (9- నేపాల్), అశుతోష్ శర్మ (11) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. అనంతరం బెంగాల్ 9 వికెట్లకు 198 పరుగులే చేయగలిగింది. కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (130 నాటౌట్; 66 బంతుల్లో 13×4, 8×6) పోరాడినా ఫలితం లేకపోయింది.

ఇషాన్ అజేయ సెంచరీ: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో ఝార్ఖండ్ హ్యాట్రిక్ విజయం నమోదు చేసింది. ఇషాన్ కిషన్ (113 నాటౌట్; 50 బంతుల్లో 10×4, 8×6) అజేయ సెంచరీతో చెలరేగడంతో ఆదివారం ఝార్ఖండ్ 8 వికెట్ల తేడాతో త్రిపురను చిత్తుచేసింది. మొదట త్రిపుర 20 ఓవర్లలో 7 వికెట్లకు 182 పరుగులు సాధించింది. అనంతరం ఝార్ఖండ్ 17.3 ఓవర్లలో 2 వికెట్లకు 185 పరుగులు రాబట్టి విజయాన్ని అందుకుంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఇషాన్‌తో పాటు విరాట్ సింగ్ (53 నాటౌట్; 40 బంతుల్లో 4×4, 1×6) రాణించాడు. గ్రూపు-డిలో ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో రాజస్థాన్ ఒక పరుగు తేడాతో కర్ణాటకపై గెలుపొందింది. రాజస్థాన్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 201 పరుగులు సాధించగా.. కర్ణాటక 200/8 స్కోరు వద్ద ఆగిపోయింది.

హైదరాబాద్ విజయం

కోల్‌కతా: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో హైదరాబాద్ రెండో విజయం నమోదు చేసింది. ఆదివారం జరిగిన గ్రూపు-బి పోరులో హైదరాబాద్ ఏడు వికెట్ల తేడాతో గోవాను ఓడించింది. లలిత్ యాదవ్ (85 నాటౌట్; 48 బంతుల్లో 10×4, 3×6) రాణించడంతో తొలుత గోవా 20 ఓవర్లలో 4 వికెట్లకు 160 పరుగులు రాబట్టింది. అనంతరం హైదరాబాద్ మరో 36 బంతులు మిగిలివుండగానే లక్ష్యాన్ని ఛేదించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ప్రజ్ఞయ్‌రెడ్డి (67 నాటౌట్; 34 బంతుల్లో 4×4, 5×6), ఆమన్ రావు (40; 22 బంతుల్లో 3×4, 3×6) చెలరేగడంతో హైదరాబాద్ 14 ఓవర్లలో మూడు వికెట్లకు 166 పరుగులు సాధించింది.

ఆంధ్ర పరాజయం

లఖ్‌నవూ: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో ఆంధ్రకు తొలి పరాజయం ఎదురైంది. వరుసగా రెండు విజయాలతో జోరుమీదున్న ఆంధ్ర.. ఆదివారం 9 వికెట్ల తేడాతో ముంబయి చేతిలో ఓడింది. శ్రీకర్ భరత్ (30; 25 బంతుల్లో 3×4, 1×6), కెప్టెన్ రికీ భుయ్ (48 నాటౌట్; 40 బంతుల్లో 4×4, 2×6), ప్రసాద్ (44 నాటౌట్; 32 బంతుల్లో 2×4, 3×6) ఆదుకోవడంతో మొదట ఆంధ్ర 20 ఓవర్లలో 7 వికెట్లకు 159 పరుగులు సాధించింది. అనంతరం ముంబయి 15.2 ఓవర్లలో ఒక వికెట్‌కు 162 పరుగులు రాబట్టి విజయాన్ని అందుకుంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఆయుష్ మాత్రె (104 నాటౌట్; 59 బంతుల్లో 5×4, 9×6) అజేయ సెంచరీతో ముంబయిని గెలిపించాడు. సూర్యకుమార్ యాదవ్ (31 నాటౌట్; 21 బంతుల్లో 1×4, 2×6) రాణించాడు.

ఐపీఎల్‌కు రసెల్ గుడ్‌బై

కేకేఆర్ పవర్ కోచ్‌గా నియామకం

కోల్‌కతా: ఐపీఎల్‌కు కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) స్టార్ ఆల్‌రౌండర్ ఆండ్రీ రసెల్ వీడ్కోలు పలికాడు. కేకేఆర్ శిక్షణ బృందంలో పవర్ కోచ్‌గా అతను కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించనున్నాడు. ఈనెల 16న అబు దాబిలో ఆటగాళ్ల మినీ వేలం పాటకు ముందు రసెల్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. 37 ఏళ్ల రసెల్ 2014 నుంచి కోల్‌కతా జట్టులో అంతర్భాగంగా ఉన్నాడు. "ఐపీఎల్‌కు గుడ్‌బై చెబుతున్నా. ఎంతో గొప్ప ప్రయాణం. 12 సీజన్ల జ్ఞాపకాలు.. కేకేఆర్ నుంచి చాలా ప్రేమాభిమానాలు లభించాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని లీగ్‌లలో సిక్సర్లు బాదుతూ.. వికెట్లు తీస్తూనే ఉంటా. మరో మంచి విషయం.. నేను కేకేఆర్‌ను వదిలి వెళ్లట్లేదు. 2026 సీజన్‌లో కేకేఆర్ పవర్ కోచ్‌గా కొత్త పాత్రలో చూస్తారు. కొత్త అధ్యాయం.. అదే శక్తి.. ఎప్పటికీ నైట్‌రైడర్" అని రసెల్ తెలిపాడు. 2012లో ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన రసెల్.. తొలి రెండు సీజన్లు మాత్రమే దిల్లీ డేర్‌డెవిల్స్‌కు ఆడాడు. ఐపీఎల్‌లో మొత్తం 140 మ్యాచ్‌లాడిన అతడు 174.18 స్ట్రైక్ రేటుతో 2,651 పరుగులు సాధించాడు. అందులో 12 అర్ధసెంచరీలు ఉన్నాయి. అతను 123 వికెట్లు పడగొట్టాడు.




రసెల్

సంయుక్త విజేతలు భారత్, అఫ్గాన్

బెంగళూరు: అండర్-19 ముక్కోణపు వన్డే సిరీస్‌ను భారత్, అఫ్గానిస్థాన్ పంచుకున్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ వర్షం కారణంగా రద్దవడంతో రెండు జట్లు సంయుక్త విజేతలుగా నిలిచాయి. మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. పేసర్ అబ్దుల్ అజీజ్ (2/12) ధాటికి 24 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో కనిష్క్ చౌహాన్ (28 నాటౌట్), అభిజ్ఞాన్ కుందు (27) ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. ఈ జోడీ అయిదో వికెట్‌కు 51 పరుగులు జత చేసింది. భారత్ స్కోరు 19 ఓవర్లకు 5 వికెట్లకు 79 పరుగులుగా ఉన్న స్థితిలో వర్షం మొదలైంది. వర్షం ఎంతకీ తగ్గకపోవడం, వెలుతురు మందగించడంతో మ్యాచ్ రద్దయింది.

వరల్డ్ ర్యాలీలో నవీన్ జోడీ రికార్డు



నవీన్, మూసా

జెడ్డా (సౌదీ అరేబియా): వరల్డ్ ర్యాలీ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూఆర్‌సీ)లో పోడియం ఫినిష్ సాధించిన తొలి భారత జోడీగా నవీన్ పులిగిల్ల, మూసా షెరిఫ్ రికార్డు సృష్టించారు. హైదరాబాద్‌కు చెందిన నవీన్.. మూసాతో కలిసి సౌదీ అరేబియాలో జరిగిన ర్యాలీలో డబ్ల్యూఆర్‌సీ-3 విభాగంలో రెండో స్థానం సాధించారు. 4 గంటల 28 నిమిషాల 58.7 సెకన్లలో ఈ జోడీ రేసును పూర్తి చేసింది.

ముకేశ్‌కు స్వర్ణం

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో గుంటూరుకు చెందిన నేలవల్లి ముకేశ్ స్వర్ణం సాధించాడు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరుగుతున్న ఈ క్రీడల్లో ఆదివారం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో పోటీపడ్డ ముకేశ్ (కేఎల్ యూనివర్సిటీ).. 578 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. పంజాబ్ యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహించిన ఆదిత్య మల్రా, సరబ్‌జ్యోత్ సింగ్ వరుసగా రజతం, కాంస్యం నెగ్గారు. సరబ్‌జ్యోత్ ఒలింపిక్స్ కాంస్య విజేత కావడం విశేషం. ఈ టోర్నీలో ఇప్పటికే ముకేశ్.. తనిష్క్ మురళీధర్ నాయుడు, నాగసాయి తరుణ్‌లతో కలిసి 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో రజతం గెలిచాడు.



ముకేశ్

వసుంధర

vasundhara@eenadu.in



శీతకాలం చర్మం పగలొద్దంటే హెవీ క్రీములు రాయాలి. ఎలాగూ చల్లగానే ఉంది కదా! ఎస్‌పీఎఫ్‌తో పనేంటి? వేడినీళ్లతో స్నానం చేస్తేకానీ మేనికి ప్రశాంతంగా ఉండదు... ఇలా ఎన్నెన్నో అనుకుంటాం. పాటిస్తుంటాం కూడా! వాటిలో చాలావరకూ అపోహలే అని తెలుసా?

అవన్నీ అపోహలే!

ఎప్పుడైనా ఒకే క్రీమ్

ఉష్ణోగ్రతలు పడిపోయే కొద్దీ వాతావరణంలో తేమ తగ్గిపోతుంది. ఫలితంగానే ఈ కాలం చర్మం పొడిబారడం, దురద వగైరాలన్నీ. అలాంటప్పుడు ఇతర కాలాల్లో సరిపడే క్రీమ్ ఇలాంటప్పుడు సరిపోతుందా? అలాగని బాగా జిడ్డుగా ఉండే క్రీములే వాడాలనేం లేదు. ఇక్కడ తేమను అందించడమే కాదు... చర్మ రక్షణ పొరకి ఆరోగ్యాన్నీ ఇవ్వాలి. అందుకే వాటిపై దృష్టిపెట్టే సెరమైడ్స్, షియా బటర్, హైలురోనిక్ యాసిలున్న వాటికి ప్రాధాన్యమివ్వాలి. పెదాలకీ విటమిన్ ఇ, షియాబటర్... వంటివి ఉన్న లిప్‌బామ్ వాడితే మేలు.

జిడ్డు చర్మమైనా...

శీతకాలం జిడ్డు చర్మం వారికి ఒక వరం. ముఖం నూనెకారుతూ కనిపించడం, పదే పదే ముఖాన్ని కడగాల్సి రావడం వంటివి ఉండవు. పైగా పొడిబారదు కూడా. దీంతో ఈ కాలం మాయిశ్చరైజర్‌తో పనిలేదు అనుకుంటారు. నిజానికి ఏ చర్మం వారికైనా రక్షణ కావాల్సిందే. చర్మంలో తేమ తగ్గడం కణాల్లో మొదలవుతుంది. అది అందరికీ త్వరగా బయటపడదు. దీన్నే మైక్రో డ్యామేజింగ్ అంటాం. కాబట్టే వీళ్లలో వైట్‌హెడ్స్, దద్దుర్లు వంటివి రావొచ్చు. వాటినుంచి తప్పించుకోవాలంటే మాయిశ్చరైజర్ రాయక తప్పదు. కాకపోతే జిడ్డుకి కారణమవ్వని రకాలను ఎంచుకుంటే సరి.

ఎస్‌పీఎఫ్ ఎందుకు?

యూవీ కిరణాల ప్రభావం కేవలం వేసవికే పరిమితమవ్వదు. ఏడాది పొడవునా ఉంటుంది. చలిగా ఉంది, సన్‌స్క్రీన్ అనవసరం అని పక్కన పెడితే... పిగ్మెంటేషన్, ముడతలు, వృద్ధాప్యఛాయల బారిన పడాల్సి వస్తుంది. కాబట్టి, కాలమేదైనా దీన్ని రాయడం తప్పనిసరి.

వేడి నీటి స్నానాలు

చలివేళ వేడినీళ్లు మేనికి తాకుతోంటే కలిగే హాయే వేరు. ఓ పట్టాన స్నానం ముగించాలనీ అనిపించదు. ఇది మనకి మేలు చేస్తోందని భావిస్తాం కానీ... చర్మంలో సహజ నూనెల్ని తొలగిస్తుంది. ఫలితమే పొడిబారడం, దురద, ఎర్రబడటం వంటివి. గోరువెచ్చని నీటితోనే స్నానం చేయాలి. వెంటనే మాయిశ్చరైజర్ పట్టించాలి. అప్పుడే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

కురులకు నూనె అవసరం లేదు

చుండ్రు వస్తుంది తలకి నూనె పెట్టొద్దు, జిడ్డు పట్టదు తలస్నానాలు వాయిదా వేయొచ్చు... అని చాలామంది అనుకుంటారు. కానీ చలి ప్రభావం కురులమీదా పడుతుంది. కాబట్టే, నిర్జీవంగా తయారవుతాయి. చివర్లు చిట్లుతాయి, కురులు రాలటానికీ కారణమవుతాయి. అందుకే నూనె రాయడం, వారానికి రెండుసార్లు తలస్నానం తప్పనిసరి.

చూశారా ఎన్నింటిని తప్పుగా భావిస్తున్నామో! ఈ కాలం చర్మ అవసరాలు మారతాయంతే! మరి వాటిని గమనించుకుని తగ్గట్టుగా మార్పులు చేసుకుంటారా?

ఆసక్తి, అభిరుచికి కాస్త సృజనాత్మకత తోడైతే చాలు... ఏ పనిలోనైనా అద్భుతాలు చేయొచ్చు. ఇందుకు చదువు, వయసు, హోదా... వంటివేవీ అడ్డంకి కావు అని నిరూపిస్తున్నారు కర్ణాటకలో స్థిరపడిన తెలుగు మహిళ ప్రశాంతీ సుధీర్. క్లే, సెరామిక్ ఆర్ట్‌ని కాంటెంపరరీ స్టైల్‌లోకి మార్చి కొత్తదనాన్ని పంచుతున్నారు. ఆవిడను వసుంధర పలకరించింది.

అభిరుచితోనే ఆదాయం!



మనసుకి నచ్చిన పనిచేసేటప్పుడు కలిగే సంతృప్తి... కోట్లు పెట్టి వస్తువు కొన్నా కలగదు. మాది సీతానగరం. స్కూల్లో ఉన్నప్పుడు రోజూ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చేదాన్ని. ఆ సమయంలోనే ఈటీవీలో సఖి కార్యక్రమం ప్రసారమయ్యేది. దాన్ని చూస్తూ రకరకాల ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్ తయారుచేసేదాన్ని. నోట్స్ రాసుకుని సెలవురోజున నాన్నని తీసుకెళ్లి కావలసిన మెటీరియల్ తెచ్చుకునేదాన్ని. అలా నాకు క్రాఫ్ట్స్‌పైన ఇష్టం మొదలయ్యింది. కానీ, దాన్నే కెరియర్‌గా మార్చుకుంటానని మాత్రం అనుకోలేదు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ, రామచంద్రపురం వీఎస్ఎం కాలేజీలో పీజీ చేశా. తర్వాత జూనియర్ లెక్చరర్ పరీక్షల కోసమని హైదరాబాద్ వచ్చా. ఆ సమయంలోనే నాకు సుధీర్‌తో పరిచయం. అప్పటికి ఆయన సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్నారు. నేను కొన్ని రోజులు లెక్చరర్‌గా పనిచేశా. మావారు కర్ణాటక క్యాడర్ ఐపీఎస్ కావడంతో ఇక్కడ ఉద్యోగాన్ని కొనసాగించలేకపోయా.

కాంటెంపరరీ డిజైన్లతో...

తరచూ ట్రాన్స్‌ఫర్లు అవ్వడం, బాబుని చూసుకోవడానికి టైమ్ కేటాయించాల్సి రావడం వల్ల ఇంట్లో ఉండి చేసే పనులేవైనా ఉన్నాయేమో వెతకడం మొదలుపెట్టా. అప్పుడే మైసూర్‌లో నిర్వహిస్తోన్న ఓ హ్యాండీ క్రాఫ్ట్స్ వర్క్‌షాప్ గురించి తెలిసింది. అక్కడే టెర్రకోట నగల తయారీలో బేసిక్స్ నేర్చుకుని ప్రయోగాలెన్నో చేశా. ఈలోగా మాకు బెల్గాంకి బదిలీ అయ్యింది. అక్కడ ఓ క్లబ్‌లో మహిళలంతా కలిసి స్టాల్స్ ఏర్పాటు చేయాలనుకున్నాం. అందులో నేను తయారు చేసిన నగల్ని ప్రదర్శించా. అవన్నీ అమ్ముడుపోవడంతో నాకు ఆత్మవిశ్వాసం వచ్చింది. దీంతో 2018లో క్లే హోమ్ పేరుతో వ్యాపారాన్ని ఆరంభించా. ఇలా నాలుగేళ్లు గడిచాక కర్ణాటక ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే హస్తకళల సంస్థ కావేరీ ఎంపోరియం మైసూర్‌లో స్టాల్ దక్కింది. ప్రభుత్వ ఆర్టిజన్ కార్డూ వచ్చింది. వ్యాపారమూ బాగానే సాగింది. అయితే, తర్వాత కొవిడ్ మా పరిస్థితుల్ని మార్చేసింది. స్టాల్‌కి రెంట్ కట్టడమూ కష్టమైంది. దాంతో దాన్ని తీసేశాం. ఇక అప్పటి నుంచి ఎగ్జిబిషన్లలో మాత్రమే పాల్గొనేదాన్ని. మరో పక్క ఔత్సాహికులకు ఈ కళను నేర్పించడం కోసం వర్క్‌షాప్‌లను నిర్వహించడం మొదలుపెట్టా. తర్వాత మాకు బెంగళూరు బదిలీ అయ్యింది. అక్కడ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే హ్యాండీక్రాఫ్ట్ సర్వీస్ సెంటర్‌లో సెరామిక్ పాటరీ తయారీ, ఆపై మరో ప్రైవేట్ సంస్థలో దానిలోనే అడ్వాన్స్‌డ్ శిక్షణ తీసుకున్నా. ఇక్కడే డెలికేట్‌గా ఉండే సెరామిక్ వస్తువులకు రిచ్‌లుక్ తీసుకురావడంపై దృష్టిపెట్టా. కార్వింగ్స్‌తో ఫ్యూజన్ స్టైల్‌లోకి మార్చా. కొత్త రంగుల్ని వాడుతూ కప్పులు, జార్లు, ప్లేట్‌లు, జాడీలు... వంటివాటిని థీమ్ స్టైల్‌లో డిజైన్ చేస్తున్నా. వీటికి మంచి ఆదరణా లభిస్తోంది. రోజూ ఇంటి బాధ్యతలు చక్కబెట్టుకున్నాక నా పని మొదలవుతుంది. వచ్చిన ఆదాయాన్ని మళ్లీ ఈ ముడిసరకు కోసమే పెట్టుబడిగా పెడుతున్నా. స్థానిక మహిళలకు ఈ కళలో శిక్షణ ఇచ్చి ఉపాధీ కల్పిస్తున్నా.



ముక్కు మీద ఒక్కటిస్తే...



ఆ దెబ్బకు భయపడతారు...

అత్యంత సున్నితమైన భాగాల్లో ముక్కు ఒకటి. మనపైన దాడిచేయడానికి వచ్చిన వ్యక్తి ముక్కుని లక్ష్యంగా చేసుకుని ప్రతిదాడిచేస్తే అతడు వెనకంజ వేయొచ్చు. మోచేతిని కింది నుంచి పైకి వేగంగా తీస్తూ ముక్కు మీద బలంగా ఒక్కటివ్వాలి. అరచేతి కింది భాగం ముక్కు మీద సరిగ్గా తగిలితే లోపల నుంచి రక్తం వచ్చేస్తుంది. ఒక్కసారిగా రక్తం చూసేసరికి అవతల వ్యక్తి తడబడతాడు. ముక్కుని లక్ష్యంగా చేసుకున్నప్పుడు చాలా ఫోకస్ ఉండాలి. కొందరు ఈ పంచ్‌పైన 10 రోజుల్లో పట్టు సాధిస్తే, కొందరికి నెలలూ, ఏళ్లు పడుతుంది. ప్రాక్టీసు, ఏకాగ్రతపైన ఇది ఆధారపడి ఉంటుంది. ప్రాక్టీసు సమయంలో అవతల వ్యక్తికి గాయం కాకుండా చూసుకోవాలి.



మోకాలిపైన కిక్ ఇస్తే...

కొన్నిసార్లు మనకంటే ఎత్తుగా, బలంగా ఉండే వ్యక్తి దాడి చేయొచ్చు. ఆ సందర్భంలో ఫొటోలో చూపిన విధంగా మోకాలిపైన కిక్ ఇచ్చి మనం ప్రతిఘటించవచ్చు. ఒక పక్క నుంచి కిక్ ఇచ్చి దాడి చేస్తే మోకాల్లోని మృదు కణజాలాలు తీవ్రంగా దెబ్బతింటాయి. ప్రభావవంతంగా కిక్ ఇస్తే ఆ వ్యక్తి కోలుకోవడానికి రెండేళ్లయినా పడుతుంది. ప్రాక్టీసు సమయంలో మరీ ఎక్కువ ఒత్తిడితో కాకుండా జాగ్రత్తగా కిక్ ఇస్తుండాలి. లేకపోతే మనకు గాయాలయ్యే ప్రమాదం ఉంటుంది. పోషకాహారం, తగినంత నిద్ర లేకుండా ఈ కిక్ ప్రాక్టీసు చెయ్యొద్దు. అలా చేస్తే గాయాలవుతాయి.



– ప్రతిభ తక్కడపల్లి, మార్షల్ ఆర్ట్స్ నిపుణురాలు

విలాసాలను వదిలి... సాధికారత లక్ష్యంగా!

రెక్కలొచ్చి ఎగిరిపోయి... పట్టణాల్లో జీవనానికి అలవాటు పడిన వాళ్లని పల్లెకు రమ్మంటే వస్తారా? వచ్చినా చుట్టపు చూపుగానే. మనసంతా కాంక్రీటు నగరాల మీదే ఉంటుంది. అలాంటిది విదేశాల్లో విలాసవంతమైన జీవితాన్ని వదులుకుని పుట్టిన ఊరుకు సేవ చేయాలని తలచారు మాయా విశ్వకర్మ.

మధ్యప్రదేశ్, నర్సింగ్‌పూర్ జిల్లాలోని మెహ్రాగావ్‌లో పుట్టి పెరిగారు మాయ. మహిళలు బయటికి రావడమే గగనం అక్కడ. అలాంటిచోట పట్టుబట్టి చదువుకున్నారు. జబల్‌పూర్‌లోని రాణి దుర్గావతి విశ్వవిద్యాలయంలో చేరి బయోకెమిస్ట్రీలో బ్యాచిలర్స్, మాస్టర్స్ పూర్తిచేశారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లారు. లుకేమియాపై పరిశోధనలు చేస్తూ... పీహెచ్‌డీ పట్టాను పొందారీమె. తర్వాత ఉద్యోగం, పెళ్లి, కుటుంబం అన్నీ అక్కడే. అప్పుడప్పుడూ సొంతూరుకు వచ్చి వెళుతుండేవారట. చుట్టూ ఎంత అభివృద్ధి ఉన్నా... తన ఊరి మహిళల జీవనవిధానాల్లో మార్పు లేకపోవడం గమనించారీమె. ముఖ్యంగా రుతుక్రమ పరిశుభ్రతలో వెనకబడిన తన గ్రామాన్ని చూసి చలించిపోయారు. అనారోగ్యానికి గురవుతూ, సరైన చికిత్స లేక మూఢనమ్మకాలతో ప్రాణాలపైకి తెచ్చుకుంటున్న వాళ్లను చూసి... ఆ పరిస్థితుల్లో మార్పు తేవాలనుకున్నారు.

ఫౌండేషన్‌కు బీజం...

తన ఆలోచనల్ని భర్తకు చెబితే... ఆయనా సరే అన్నారట. ఆర్థికంగా సహకారం అందిస్తానని భరోసానూ ఇచ్చారట. దాంతో 2016లో మెహ్రాగావ్‌లో 'సుకర్మ ఫౌండేషన్'ను ఏర్పాటు చేశారు మాయ. దీనిద్వారా స్థానిక మహిళల్లో రుతుక్రమ పరిశుభ్రత, శానిటరీ న్యాప్‌కిన్ల వినియోగం వంటి వాటిపై ప్రచారం మొదలుపెట్టారు. 'తరాలుగా పాతుకుపోయిన సమస్య ఇది. మొదట్లో కనీసం మాట్లాడటానికి కూడా ఇష్టపడేవారు కాదు. తిట్టుకుంటూ వెళ్లిపోయేవారు. నెలల ప్రయత్నం తర్వాత వాళ్లలో మార్పు వచ్చింది. కానీ ఆర్థిక కష్టాలు వెంటాడేవి. అందుకే నా పొదుపు మొత్తం, ఫండింగ్ ద్వారా సేకరించిన నిధుల్ని పెట్టి 'నో టెన్షన్' అనే సంస్థను ప్రారంభించా. శానిటరీ న్యాప్‌కిన్లు తయారుచేసే యంత్రాలను కొనుగోలు చేసి... వాటి తయారీ విధానాన్ని మహిళలకు నేర్పించాం. దీనివల్ల రుతుక్రమ సమస్యలకు పరిష్కారం దొరికింది. ఆర్థిక స్వావలంబనకు బీజమూ పడింది. అలా తక్కువ ధరకు ఊరంతా ప్యాడ్లు పంపిణీ చేశాం. ఇప్పటికీ చేస్తున్నాం' అనే మాయ ఆమె అందించిన సేవలకుగానూ 'భారతదేశపు ప్యాడ్‌ఉమెన్'గా గుర్తింపు పొందారు. మహిళల హక్కుల కోసం గళం వినిపించాలనే ఉద్దేశంతో లోక్‌సభ ఎన్నికల్లో పాల్గొన్నా... విజయం సాధించలేకపోయారు. 2022 పంచాయతీ ఎలక్షన్లలో ఏకగ్రీవంగా ఎన్నికై సర్పంచ్‌గా సేవలందిస్తున్న మాయ ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ!



బరువు తగ్గించే కమలాలు!

తీపి, పులుపు కలగలుపుకొని నోరూరించే పండు కమలా. దీన్నే కొన్ని ప్రాంతాల్లో సంత్రాలనీ పిలుస్తారు. శీతకాలంలో మార్కెట్ల నిండా కనిపించే వీటిలోని పోషకాల గురించి తెలుసా?



- మహిళలకు రోజువారీ అవసరమయ్యే విటమిన్ సి ని కమలాపండు అందిస్తుంది. తెల్లరక్తకణాలను పెంచి, జలుబు-జ్వరాలను తగ్గిస్తుంది. ఇది కొలాజెన్ తయారీలోనూ కీలకంగా పనిచేస్తుంది. సూర్యకిరణాలు చర్మానికి నష్టం కలిగించకుండా రక్షణగా ఉంటుంది. ఇక, ఇందులో లభించే హెస్పెరిడిన్, ఆంతోసైనిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్‌ను బలంగా అడ్డుకుంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్నీ కాపాడతాయి.
- వీటిలో ఫోలేట్ పుష్కలంగా లభిస్తుంది. ఇది మహిళలు, గర్భిణీ స్త్రీలు, గర్భస్థ శిశువుల ఆరోగ్యానికీ మేలు చేస్తుంది. అంతేకాదు, ఈ పండ్లలో తక్కువ కెలోరీలు, ఎక్కువ ఫైబర్ ఉండటం వల్ల కడుపు నిండుగా అనిపిస్తుంది. దీంతో అతిగా తినే అలవాటు తగ్గుతుంది. బరువూ నియంత్రణలో ఉంటుంది.
- కమలా పండ్లలోని యాంటీ ఆక్సిడెంట్లు, పొటాషియం... రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయుల్ని నియంత్రించడంలో సాయపడతాయి. గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. అధికశాతం నీటిని కలిగిన ఈ పండు... డీహైడ్రేషన్‌నీ తగ్గిస్తుంది.

ఒత్తిడికి షాడో డ్రాయింగ్!

చదువులు, పరీక్షలతో పిల్లలు ఉక్కిరిబిక్కిరై ఒత్తిడికి గురవుతుంటే... ఇంటాబయటా బాధ్యతలు నిర్వర్తిస్తూ మానసిక, శారీరక సమస్యలతో పెద్దవాళ్లు బాధపడుతున్నారు. వీటిని అధిగమించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించాలని ఎన్నో ప్రయత్నాలూ చేస్తున్నారు. అందులో భాగంగా ఈసారి 'షాడో డ్రాయింగ్' విధానాన్ని ప్రయత్నించి చూడమంటున్నారు నిపుణులు. ప్రకృతితో మమేకమవుతూ... నచ్చిన చిత్రాల్ని గీయడమే ఇది. అంటే నీడను అనుసరిస్తూ మొక్కలు, పువ్వులు, ఆకులు తదితరాల్ని కాగితం మీద గీయడం. చిత్రలేఖనం ఒత్తిడిని తగ్గిస్తుందనీ, ఏకాగ్రతను పెంచుతుందని ఇదివరకే అనేక అధ్యయనాల్లో వెల్లడైంది కదా. ఈ షాడో డ్రాయింగ్ దీనికి అప్‌డేటెడ్ వెర్షన్ అన్నమాట. ఎండలో ఓ మొక్క దగ్గర కూర్చొని, దాని నీడ పడేట్లు ఓ పేపర్ పెడితే సరి. ఆ నీడను అనుసరిస్తూ చిత్రాన్ని గీయడమే. మామూలు చిత్రలేఖనం కన్నా ఈ విధానంలో మైండ్‌ఫుల్‌నెస్ ఎక్కువగా ఉంటుందట. ఆలోచనల ప్రవాహం ఆగి... ఒత్తిడీ, ఆందోళన నుంచి ఉపశమనం దొరుకుతుంది. అంతే కాదు, ఈ గజిబిజి జీవనశైలిలో విటమిన్-డి లోపంతో బాధపడుతున్న మహిళలు చాలామందే ఉన్నారు. ఇలా ఎండలో సమయం కేటాయించడం వల్ల విటమిన్ లోపాల్నీ అధిగమించవచ్చు అంటున్నారు నిపుణులు. అంటే శారీరకంగానూ ఈ షాడో డ్రాయింగ్ మేలు చేస్తుందన్న మాట. అయితే మధ్యాహ్నం, ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు కాకుండా ఉదయం 10-11 గంటల మధ్య, సంధ్య వేళల్లో దీనికి సమయాన్ని కేటాయించండి. పిల్లల్నీ ఇందులో భాగం చేస్తే... వాళ్లతో సమయాన్ని గడిపినట్లూ ఉంటుంది. ఒకసారి ప్రయత్నించి చూడండి మరి.



మాకు పెళ్లై నాలుగేళ్లు. ఏడాదిన్నర పాప ఉంది. ఆయనకు ఉద్యోగమే ప్రపంచం. ఇంటికి వచ్చాక కూడా ఆఫీస్ పనే. నాకేమో కుటుంబంతో కలిసి ఉండాలి, మాట్లాడాలని. ఈ విషయమై మా పెళ్లైనప్పటి నుంచి గొడవలే. అత్తయ్య ఇవేవీ పట్టించుకోరు. వచ్చిన వాళ్లకి సౌకర్యాలన్నీ ఉన్నాయా లేదా అని చూసుకుంటారు. దాంతో మా మధ్య తగాదా వచ్చిన ప్రతిసారీ నేను కూడా వాళ్ల అమ్మలానే ఉండాలంటారు ఆయన. ఈ మధ్య కోపంతో నామీదకు చెయ్యి ఎత్తారు కూడా. నేను దాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. నాదేమైనా తప్పా? మా పరిస్థితులో మార్పు రాదా? నేనూ అత్తయ్యలా మారాల్సిందేనా?

-ఓ సోదరి

వాళ్ల అమ్మలానే ఉండాలట..!

డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి
మానసిక నిపుణురాలు

మీ కోరికలన్నీ సబబే. కానీ మీవారు పెరిగిన వాతావరణం ఇందుకు పూర్తి భిన్నం. చిన్నప్పట్నుంచీ తన జీవనశైలి అలానే ఉంది. ఇప్పటికిప్పుడు అది మారాలంటే కుదరదు. నెమ్మదిగా అతని వ్యవహారంలో మార్పు తెచ్చుకునేందుకు ప్రయత్నించాలి. ముందు మీరు అతను ఆఫీసు నుంచి రాగానే కావాల్సినవన్నీ సమకూర్చండి. ఏ కొద్ది సమయం దొరికినా మీతో పాపతో గడపమని అడగండి. మీరు చెప్పే విధానాన్ని బట్టే తనలో ఆలోచన మొదలయ్యేది. అలా కొన్ని నిమిషాలైనా మీకు సమయం కేటాయిస్తే... అందులో ఉండే సంతోషం ఆయనకూ అర్థం అవుతుంది. క్రమంగా మీ దారిలోకి వస్తారు. అంతేకానీ, మీరూ అరిచి, ఆయనా అరిస్తే పరిణామాలు ఇలానే ఉంటాయి. లేదూ, ఏం చేసినా ఆయన తీరు ఇంతే అనుకుంటే... మ్యారేజ్ కౌన్సెలర్లను సంప్రదించండి. మీ ఇద్దరితో విడివిడిగా మాట్లాడి సమస్య తెలుసుకుంటారు. మీరు పడుతున్న బాధను అతనికి వివరించే ప్రయత్నం చేస్తారు. సమస్యను పరిశీలించి అవసరమైన కౌన్సెలింగ్‌ను ఇస్తారు.

మళ్లీ మెప్పిస్తున్న ఇత్తడి సొబగులు..!





ఇత్తడి సామాన్లు అనగానే... వెనకటి వంటింటి సామాన్లూ, భారీ గంగాళాలూ, గుండిగలే గుర్తొస్తాయి కదా! అప్పట్లో పండుగలూ, శుభకార్యాల సమయంలో వాటిని కిందకి దించి చింతపండుతో తోమి మళ్లీ గది పైభాగంలో ఉండే అరలమీద అందంగా సర్దించేవారు. కాలం మారుతున్న కొద్దీ అప్పటి పద్ధతులకి కాలం చెల్లిపోయింది. కానీ, ఆధునిక వసతులతో ఇల్లు కట్టుకునేవారు మాత్రం ఒకప్పటి వింటేజ్ వస్తువులనే ఇష్టపడుతున్నారు. అందులో భాగంగానే ఇత్తడితో చేసిన యాంటిక్ వస్తువులకు ఇంటి అలంకరణలో చోటిస్తున్నారు. ప్లాస్టిక్, స్టీలు పాత్రలకి బదులుగా ఇత్తడి పాత్రలను వాడుతున్నారు. అందుకే వీటిని గిన్నెలు, భోజనం ప్లేట్లూ, డైనింగ్ టేబుల్ మీద పండ్లు పెట్టుకునే హోల్డర్లు, డ్రైఫ్రూట్ బాక్సులుగానూ తయారుచేస్తున్నారు. అంతేకాదు, ఆధునిక తరం మెచ్చేట్టుగా దీనికి గాజు, మెటల్ వంటివాటిని జతచేసి వివిధ రకాల కళాకృతుల్లో వీటిని తీర్చిదిద్దుతున్నారు. అన్నట్లు ఈతరం వీటిపై ఇంతగా ఆసక్తి చూపించడానికి కారణం కూడా ఉందట. ఇత్తడి మీద సూక్ష్మజీవులు ఎక్కువసేపు జీవించలేవు. పైగా ఇత్తడి పాత్రలు ఆహార పదార్థాలను వేడిగానూ, తాజాగానూ ఉంచుతాయి. ఆరోగ్యమూ, అందం రెండూ కలగలిపిన ఈ కళాకృతులు మీకూ నచ్చాయా! మార్కెట్‌లో దొరుకుతున్నాయ్ చూసేయండి మరి. ఇవి మీ ఇంట్లో ఉంటే మాత్రం ఇంటికి వచ్చిన వారి చూపు వాటిమీదే నిలిచిపోతుందంటే నమ్మండి.



"భారత్‌లో ఏఐ విభాగంలో పనిచేస్తున్నవాళ్లలో మహిళలు 20 శాతమే. ఇక్కడ మహిళా ప్రాతినిధ్యం పెరగడానికి సంస్థలు అవకాశాలు కల్పించడం, వ్యక్తులు తాముగా నెట్‌వర్కింగ్‌ను పెంచుకోవడం కీలకం. ఇప్పటివరకూ వచ్చిన టెక్నాలజీల్లో పురుషులు- స్త్రీల మధ్య అంతరాన్ని తగ్గించే శక్తి ఏఐకే ఎక్కువగా ఉంది. - వాణి కోలా, ఎండీ, కలారీ క్యాపిటల్



పెరిమెనోపాజ్‌తో కుంగుబాటు!

శోధిత



ఉద్యోగ బాధ్యతలు, పిల్లల పెంపకం, కుటుంబ సభ్యుల బాగోగులు... ఇవన్నీ మహిళలకు తమ గురించి తాము పట్టించుకునే తీరిక ఇవ్వడం లేదు. దాంతో చాలా సమస్యల్ని దీర్ఘకాలంపాటు వాయిదా వేస్తుంటారు. వాటిల్లో ఒకటి పెరి లేదా ప్రిమెచ్యూర్ మెనోపాజ్. కారణమేదయినా ఇటీవల మహిళల్లో ఎక్కువమంది 30-35 ఏళ్ల మధ్యలోనే దీని బారినపడుతున్నారు. దాంతో వీళ్లలో నలభయ్యేళ్లు రాకుండానే ఈస్ట్రోజన్ హార్మోన్‌తోపాటు అండాశయాల పనితీరూ తగ్గిపోతోంది. ప్రత్యుత్పత్తి సామర్థ్యం తగ్గిపోవడం, వేడి ఆవిర్లు, యోని పొడిబారడం, నిద్రలేమి, జ్ఞాపకశక్తి లోపాలు, ఎముక సాంద్రత తగ్గడం, హృద్రోగ సమస్యలు పెరగడం... ఇలా ఎన్నో సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. ఫలితంగా శారీరకంగానే కాదు, మానసికంగానూ కుంగిపోతున్నారట. ముఖ్యంగా పెరిమెనోపాజ్‌కి గురయినవాళ్లలో మూడింట ఒకవంతు మంది తీవ్ర డిప్రెషన్‌నీ ఎదుర్కొంటున్నట్లు వర్జీనియా యూనివర్సిటీ నిపుణుల అధ్యయనంలో తేలింది. ఇది దాంపత్యజీవనాన్నీ తద్వారా భావోద్వేగాల్నీ ప్రభావితం చేస్తున్నట్లు గుర్తించారు. కాబట్టి, ప్రిమెనోపాజ్‌ని నిర్లక్ష్యం చేయకుండా ముందుగానే చికిత్స చేయించుకోవాలి. అలాగే సమస్యను దాచకుండా జీవిత భాగస్వామితో చర్చించి, వాళ్ల సాయంతో కుంగుబాటు నుంచి బయటపడాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

రోగులను పరీక్షిస్తున్న మంగళగిరి ఎయిమ్స్!


మంగళగిరి ఎయిమ్స్

సాధారణ రక్త పరీక్షలకూ నాలుగైదు రోజుల సమయం ● ఎండోస్కోపీకి 3 నెలలపైనే

ఈనాడు, అమరావతి: మంగళగిరి ఎయిమ్స్‌. ఏడేళ్ల కిందట రాజధాని ప్రాంతంలో ఏర్పాటైన ఈ కేంద్ర సంస్థ రాష్ట్రానికే తలమానికం. అయితే ఈ ఆసుపత్రిలో సాధారణ పరీక్షలకే నాలుగైదు రోజులు పడుతోంది. ఎండోస్కోపీ చేయాలంటే 3 నెలలకుపైగా నిరీక్షించాల్సి వస్తోంది. ప్రతిష్ఠాత్మక కేంద్ర సంస్థ కావడంతో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచీ రోజుకు సుమారు 3 వేల మంది రోగులు వస్తున్నారు. దీంతో పరీక్షలు చేయించుకోవడమే పెద్ద 'పరీక్ష'గా మారుతోంది. తెనాలికి చెందిన నాగమణి ఇటీవల కడుపునొప్పి, ఇన్‌ఫెక్షన్‌తో ఎయిమ్స్‌కి వచ్చారు. మొత్తం 12 రకాల పరీక్షల్ని వైద్యులు సూచించారు. ఆమెకు రక్త పరీక్షలకే ఐదు రోజులు పట్టింది. మిగిలిన 11 పరీక్షల్లో ఎక్స్‌రే, స్కాన్లు ఎప్పుడు చేస్తారో తేదీలే ఇవ్వలేదు. మరి ఆమెకు పరీక్షలన్నీ పూర్తయ్యేందుకు ఎన్ని నెలలు పడుతుంది? అన్న ప్రశ్నకు బదులిచ్చే నాథుడే కనిపించడం లేదు. వాస్తవానికి ఇది ఒక్క నాగమణి పరిస్థితే కాదు వందల మంది రోగులు దాదాపు ఇలాంటి ఇబ్బందులే ఎదుర్కొంటున్నారు. అలాగని మంగళగిరి ఎయిమ్స్‌లో పరికరాల కొరత కూడా లేదు. ఉన్న పరికరాలు తరచూ దెబ్బతినడం, సరిపడా సిబ్బంది లేకపోవడంతో పరీక్షలు ఆలస్యం అవుతున్నాయి. 2018 జనవరి 24న 177 ఎకరాల్లో ప్రారంభమైన ఈ సంస్థలో మొత్తం 45 విభాగాలు ప్రారంభించాల్సి ఉంటే ఇప్పటికి 39 మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. వాటిలోనూ చాలా విభాగాల్లో సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి.


ఎక్స్‌రే, స్కానింగ్‌ కోసం వేచిచూస్తున్న రోగులు


మందుల కోసం క్యూలైన్‌

ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేకే..

ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలకు రూ.వేలల్లో ఖర్చవుతుంది. చికిత్సకు అనుగుణంగా రూ.లక్షల్లో బిల్లు వసూలు చేస్తారు. అంత మొత్తం భరించలేకే తెలుగు రాష్ట్రాల్లోని వేల మంది పేద రోగులు ఎయిమ్స్‌కు వస్తున్నారు. పరీక్షలు అత్యవసరమైనా.. ప్రైవేటుకు వెళ్లి ఖర్చు చేసేంత ఆర్థిక స్తోమత వారికి ఉండదు. దీంతో అత్యవసరమైనా ఎయిమ్స్‌లో తమ వంతు వచ్చేవరకూ ఒకటికి పదిసార్లు తిరుగుతున్నారు.

రద్దీకి తగ్గట్లు ఏర్పాట్లేవి?

మంగళగిరి ఎయిమ్స్‌కు వస్తున్న రోగులకు తగ్గట్లుగా కౌంటర్లు లేవు. రిజిస్ట్రేషన్‌ కౌంటర్లు- 12, అడ్మిషన్‌ కౌంటర్లు- 2, డిశ్ఛార్జి కౌంటర్లు- 2, ఎమర్జెన్సీ రిజిస్ట్రేషన్‌ కౌంటర్‌- 1, లేబొరేటరీ బిల్లింగ్‌ కౌంటర్లు- 5, ఎక్స్‌రే బిల్లింగ్‌ కౌంటర్లు- 2 మాత్రమే ఉన్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వందల కిలోమీటర్లు ప్రయాణించి వచ్చే వారు తెల్లవారుజామకల్లా ఎయిమ్స్‌కు చేరుకుని నిరీక్షించాల్సి వస్తోంది. ఒక్కో దఫా రద్దీ మరింత పెరుగుతోంది. అందుకు అనుగుణంగా కౌంటర్ల సంఖ్య పెంచాల్సిన అవసరమూ ఉంది.

సజ్జ క్వింటాలు.. రూ. 2 వేల లోపే

రైతుకు దక్కని మద్దతు ధర

ఈనాడు, అమరావతి: సజ్జల ధర నేలచూపులు చూస్తోంది. క్వింటాలుకు మద్దతు ధర రూ.2,775 ఉంటే.. రైతుకు రూ.2వేలూ దక్కడం లేదు. నాణ్యత లేదంటూ ప్రకాశం, ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో క్వింటాలు రూ.1,600 నుంచి రూ.1,800కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఖరీఫ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 64 వేల ఎకరాల్లో సజ్జ సాగైంది. ప్రకాశం జిల్లాలో 17 వేల ఎకరాలు, ఉమ్మడి కర్నూలు జిల్లాలో 28,000, ఉమ్మడి అనంతపురం జిల్లాలో 11 వేల ఎకరాల్లో వేశారు. ఎకరానికి సగటున రూ.25 వేల పెట్టుబడి పెట్టారు. అక్టోబరులో కురిసిన భారీ వర్షాలతో పాటు తుపాను ప్రభావంతో పంట దెబ్బతింది. అధిక శాతం రైతులకు ఎకరానికి 2-3 క్వింటాళ్లే దిగుబడి వచ్చింది. పంట నాణ్యతా తగ్గింది. ఈ తరుణంలో ధరలు లేక రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం మద్దతు ధరపై మార్క్‌ఫెడ్‌ ద్వారా కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రూ.6.6 కోట్ల విలువైన గంజాయి జప్తు

బీదర్‌, న్యూస్‌టుడే: మహారాష్ట్రకు తరలిస్తున్న రూ.6.6 కోట్ల విలువైన గంజాయిని కర్ణాటకలోని బీదర్‌ నగర ఠాణా పోలీసులు జప్తు చేశారు. బీదర్‌ తాలూకా మగదాళకు చెందిన రాజకుమార హూగార, సంజుకుమార్‌లను నిందితులుగా గుర్తించారు. వీరిద్దరూ హైదరాబాద్‌లో ఉంటూ, ఒడిశాకు వెళ్లి 660 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌ మీదుగా హైదరాబాద్‌కు.. అక్కడి నుంచి బీదర్‌ మార్గంలో వస్తుండగా రాజేశ్వర గ్రామం వద్ద పట్టుబడ్డారని ఎస్పీ ప్రదీప్‌ గుంటి తెలిపారు. మహారాష్ట్రలోని సోలాపుర్‌లో టోకున విక్రయించేందుకు దీన్ని తీసుకువెళుతున్నట్లు విచారణలో గుర్తించారు.



విశాఖలో 'మారథాన్‌' సందడి

విశాఖ ఆర్కే బీచ్‌ రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున పరుగుల సందడి నెలకొంది. సంధ్యా వైజాగ్‌ మారథాన్‌ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వేల మంది తరలివచ్చారు. తెల్లవారుజామున 4.15 గంటలకు 32కే రన్‌, 5 గంటలకు 21కే, 5.30కి 10కే, 6.25కు 5కే రన్‌లతో బీచ్‌ రోడ్డులో కోలాహలం కనిపించింది. తర్వాత ఎంజీఎం మైదానంలో నృత్యాలతో నగరవాసులు హోరెత్తించారు.

– ఈనాడు, విశాఖపట్నం

పత్తి, అరటి రైతులకు న్యాయం చేయాలి

- ఏపీలో ఎస్‌ఐఆర్‌ వీలైనంత త్వరగా చేపట్టాలి
- తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు

ఈనాడు, దిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానంగా ఉన్న పత్తి, మొక్కజొన్న, అరటి రైతుల సమస్యలపై చర్చించి వారికి కేంద్ర ప్రభుత్వం తరపున న్యాయం చేయాలని కోరినట్లు తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. సోమవారం నుంచి పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమవుతున్నందున ఆదివారం ఇక్కడ పార్లమెంటు భవన్‌లో అఖిలపక్ష సమావేశంలో పాల్గొని పార్టీ తరపున డిమాండ్లు వినిపించి, మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో తాము ఏడు అంశాలు ప్రస్తావించినట్లు చెప్పారు. ఎస్‌ఐఆర్‌కు తాము అనుకూలమేనని, ఏపీలో వీలైనంత త్వరగా ఎస్‌ఐఆర్‌ ప్రారంభించాలని పేర్కొన్నారు. "జీఎస్టీ రేట్లు తగ్గించిన తర్వాత రాష్ట్ర, దేశ ఆర్థిక పరిస్థితిపై పార్లమెంటులో చర్చించాలి. పత్తి కొనుగోళ్లపై సీసీఐతో కొన్ని సమస్యలున్నాయి. అరటి రైతులకు కేంద్ర సాయం అందించాలి. మొక్కజొన్నను 25% కేంద్రం కొనుగోలుచేసి ఎంఎస్‌పీని నిలబెట్టాలని సీఎం చంద్రబాబు ఇదివరకే లేఖ రాశారు. అమెరికా సుంకాలు పెంచాక ఏపీలో ఆక్వా రైతుల ఇబ్బందులపై చర్చించాలి. విశాఖపట్నం, విజయవాడ మెట్రోరైలు ప్రాజెక్టులపై చర్చించాలి. కృష్ణా నదీజలాల పంపిణీపై చర్చ జరగాలి" అని పేర్కొన్నారు.

అమరావతి, పోలవరం పూర్తికి కేంద్రం సాయం చేయాలి: బాలశౌరి

అమరావతి, పోలవరం ప్రాజెక్టులను అనుకున్న లక్ష్యం ప్రకారం పూర్తిచేయడానికి కేంద్రం సాయం చేయాలని కోరినట్లు జనసేన పార్లమెంటరీ పార్టీ నేత బాలశౌరి చెప్పారు. "రాజధాని అమరావతిని 2028, పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తిచేసేందుకు కేంద్రం సహకారం అందించాలని కోరాం" అని చెప్పారు.

● పార్లమెంటు సమావేశాల్లో ఆక్వా రైతుల సమస్యలు, వైద్యకళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటుపరం చేయడం, 'ఉపాధి' పని దినాల తగ్గింపు, రైతుల సమస్యల గురించి ప్రస్తావిస్తామని వైకాపా ఎంపీ పిల్లి సుభాష్‌ చంద్రబోస్‌ వెల్లడించారు. ఎస్‌ఐఆర్‌ గురించి చర్చకు ప్రతిపక్షాలు చేసిన డిమాండ్‌తో తామూ ఏకీభవిస్తున్నామన్నారు.

EENADU Vol: 52, Issue: 111 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు బిజినెస్

ఇంధన ఉత్పత్తి పెంపుదలకు విరామం



ఇంధన ఉత్పత్తి పెంపుదలను 2026 తొలి త్రైమాసికంలో నిలిపివేయాలని, చమురు ఎగుమతి దేశాల సమాఖ్య ఒపెక్ నిర్ణయించింది. నిల్వలు తక్కువగా ఉండటం.. చమురుకు గిరాకీ అధికంగా ఉన్న నేపథ్యంలో, ఈ ఏడాది డిసెంబరులోనూ రోజుకు 1.37 లక్షల బ్యారెళ్ల మేర ముడిచమురు ఉత్పత్తి పెంచాలని ఒపెక్+ దేశాలు నిర్ణయించాయి. తదుపరి మాత్రం ఉత్పత్తి పెంపును నిలిపివేసి, పరిస్థితిని గమనించాక తదుపరి నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నాయి. రష్యాపై తాజా ఆంక్షల నేపథ్యంలో, చమురుకు గిరాకీ -ధరల పరిస్థితిని విశ్లేషించి, నిర్ణయం తీసుకోనున్నారు.

రూ.7 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలకు సిద్ధం

ఎస్‌బీఐ ఛైర్మన్ సి.ఎస్.శ్రీనివాసులు శెట్టి



దిల్లీ: దేశీయంగా ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడంతో, కార్పొరేట్ సంస్థల నుంచి రుణాలకు గిరాకీ మళ్లీ పెరుగుతోందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మిగిలిన రెండు త్రైమాసికాల్లో కార్పొరేట్ రుణాల మంజూరులో రెండంకెల వృద్ధి సాధించొచ్చని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఛైర్మన్ సి.ఎస్.శ్రీనివాసులు శెట్టి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రూ.7 లక్షల కోట్ల విలువైన కార్పొరేట్ రుణాలను పంపిణీ చేయనున్నామని. 'వినియోగించని వర్కింగ్ క్యాపిటల్, కాలావధి రుణాలు' ఇందులో కలిసి ఉన్నాయని వివరించారు. పలు ప్రాజెక్టుల రుణాలు కూడా ఇందులో ఉన్నాయని స్పష్టం చేశారు. గత కొంతకాలంగా నెమ్మదించిన కార్పొరేట్ రుణాలు, జులై-సెప్టెంబరు త్రైమాసికంలో 7.1% వృద్ధి చెందాయి. అక్టోబరు-మార్చిలోనూ ఈ విభాగం రెండంకెల వృద్ధిని సాధించే అవకాశం ఉందని ఎస్‌బీఐ ఛైర్మన్ అంచనా వేశారు. ఆర్థిక వ్యవస్థ మెరుగుపడటం వల్ల వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు పెరుగుతున్నాయని, త్రైమాసికం వారీగా ఇది అధికమవుతున్న ధోరణి కనిపిస్తోందన్నారు. కాలావధి రుణాల విషయానికొస్తే.. పలు టికెట్ ఆమోదించిన రుణాలను పంపిణీ చేస్తున్నామని, కొన్ని ప్రాజెక్టు రుణాలు వర్కుల్లో ఉన్నాయని తెలిపారు. రుణాల వృద్ధి కోసం, 15% మూలధన లభ్యత నిష్పత్తిని కొనసాగించేందుకు వచ్చే 5-6 ఏళ్లలో బ్యాంకుకు ఎటువంటి ఈక్విటీ మూలధనం అవసరం లేదని వివరించారు.

2 నెలల్లో రూ.40,000 కోట్ల ఐపీఓలు



స్టాక్ మార్కెట్‌లో తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓల) దూకుడు కొనసాగనుంది. ఈ ఏడాది డిసెంబరు, 2026 జనవరి నెలల్లో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ, మీషో, జునిపెర్ గ్రీన్ ఎనర్జీ సహా రెండు డజన్లకు పైగా కంపెనీలు ఐపీఓకు రానున్నాయి. దాదాపు రూ.40,000 కోట్లకు పైగా నిధులు సమీకరించాలన్నది ఈ కంపెనీల ప్రణాళికగా మర్చంట్ బ్యాంకర్లు చెబుతున్నారు. కృత్రిమ మేధ సంస్థ ఫ్రాక్టల్ అనలిటిక్స్, గృహోపకరణాల బ్రాండ్ వేక్‌ఫిట్ సొల్యూషన్స్, టెక్నాలజీ ఆధారిత సెక్యూరిటీ కంపెనీ ఇన్నోవేటివ్యూ ఇండియా, ఆతిథ్య సేవల సంస్థ పార్క్ మెడి వరల్డ్ కూడా ఐపీఓలకు రానున్నాయి. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైన రోజు లాభాలను ఇచ్చేవి, దీర్ఘకాలంలో వృద్ధి సామర్థ్యం కలిగిన కంపెనీల ఇష్యూలకు మదుపర్ల ఆదరణ లభిస్తోంది.

రూ.1.60 లక్షల కోట్ల సమీకరణ

- జనవరి నుంచి ఇప్పటివరకు 96 కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో అరంగేట్రం చేశాయి. ఈ కంపెనీలు మొత్తం రూ.1.6 లక్షల కోట్లు సమీకరించాయి. డిసెంబరు ఐపీఓలతో కలిపి, ఈ ఏడాది పబ్లిక్ ఇష్యూల మొత్తం నిధుల సమీకరణ రూ.2 లక్షల కోట్లుగా ఉండొచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు. గత మూడు నెలల్లోనే 40కు పైగా ఐపీఓలు వచ్చాయి. 2024లో 91 కంపెనీలు రూ.1.6 లక్షల కోట్లు సమీకరించాయి.
- డిసెంబరు ద్వితీయార్ధంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ రూ.10,000 కోట్ల ఐపీఓ ఉండొచ్చు. పూర్తి ఆఫర్ ఫర్ సేల్‌గా రానున్న ఈ ఐపీఓలో 1.76 కోట్ల షేర్లను బ్రిటన్ ప్రమోటర్ ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్స్ విక్రయించనుంది.
- సాఫ్ట్‌బ్యాంక్ పెట్టుబడులు కలిగిన మీషో ఐపీఓ డిసెంబరు 3న ప్రారంభం కానుంది. ఇష్యూలో భాగంగా రూ.4,250 కోట్ల విలువైన తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో 10.55 కోట్ల షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు. గరిష్ఠ ధర వద్ద కంపెనీ రూ.1171 కోట్లు సమీకరించనుంది. ఇదే సమయంలో ప్రెసిషన్ పరికరాల తయారీ సంస్థ ఏక్వస్ రూ.922 కోట్లు, విద్యా వైర్స్ రూ.300 కోట్ల ఐపీఓలు రానున్నాయి.
- ఈ నెలలోనే క్లీన్ మ్యాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్ (రూ.5,200 కోట్లు), ఫ్రాక్టల్ అనలిటిక్స్ (రూ.4,900 కోట్లు), జునిపెర్ (రూ.3000 కోట్లు) ఐపీఓలు రాబోతున్నాయి.
- డిసెంబరు- జనవరిలో ఐపీఓకు వచ్చే కంపెనీల్లో మణిపాల్ పేమెంట్, కనోడియా సిమెంట్, కరోనా రెమిడీస్, మిల్కీ మిస్ట్, అమాగి మీడియా ల్యాబ్స్, నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్, వీడా క్లినికల్, ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్, వాటర్‌వేస్ లీజర్, కేఎస్‌హెచ్ ఇంటర్నేషనల్, స్కైవేస్ ఎయిర్ సర్వీసెస్, అర్డీ ఇంజినీరింగ్, పీఎన్‌జీఎస్ రెవా డైమండ్, సీఐఈఎల్ హెచ్ సర్వీసెస్ ఉన్నాయి.
- ఈ ఏడాది వచ్చిన భారీ ఐపీఓల్లో టాటా క్యాపిటల్ (రూ.15,512 కోట్లు), ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ (రూ.11,607 కోట్లు), లెన్స్‌కార్ట్ (రూ.7,278 కోట్లు), గ్రో (రూ.6,632 కోట్లు) ఉన్నాయి.
- **8 నుంచి వేక్‌ఫిట్ ఐపీఓ:** బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఫర్నిషింగ్ బ్రాండ్ వేక్‌ఫిట్ ఇన్నోవేషన్స్ లిమిటెడ్ ఐపీఓ ఈ నెల 8న ప్రారంభమై 10న ముగియనుంది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.1400 కోట్లు సమీకరించే అవకాశం ఉంది. ఇష్యూలో భాగంగా రూ.377.1 కోట్ల విలువైన తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో 4.67 కోట్ల షేర్లను కంపెనీ విక్రయించనుంది. యాంకర్ మదుపర్లకు డిసెంబరు 5న షేర్లు కేటాయించనున్నారు.

సాంకేతిక ఉద్యోగాల్లో మహిళల హవా

సాధారణంగా పురుషులు ఆధిపత్యం వహించే, అధిక నైపుణ్యం గల వృత్తుల్లోనూ ఇప్పుడు మహిళల ప్రాతినిధ్యం పెరుగుతోందని నియామకాల సంస్థ వర్క్ఇండియా తెలిపింది. తమ ప్లాట్‌ఫామ్‌పై 2024, 2025 సంవత్సరాల్లో నమోదైన వివరాల ఆధారంగా, ఈ విశ్లేషణను ఆ కంపెనీ నివేదికగా వెల్లడించింది. దీని ప్రకారం..



- సృజనాత్మక, డిజైన్ ఉద్యోగాల్లో మహిళలు చేరడం 2024తో పోలిస్తే ఈ ఏడాది 98% పెరిగినట్లు పేర్కొంది. గ్రాఫిక్ డిజైన్, కంటెంట్ క్రియేషన్, విజువల్ కమ్యూనికేషన్ వంటి సాంకేతిక కోర్సులను మహిళలూ వృత్తిగా ఎంచుకుంటున్నారు. సాంకేతిక డిజైన్ విభాగంలో మహిళా దరఖాస్తులు 87% పెరిగాయని, యాజమాన్యాలు కూడా మహిళల కోసం కేటాయించిన ఉద్యోగాలు 34% అధికమైనట్లు తెలిపింది. సృజనాత్మక, డిజైన్ రంగాల్లో పురుషుల రంగాల్లో పురుషుల వృద్ధి 81 శాతంగా ఉన్నట్లు వివరించింది. న్యాయ రంగంలో మహిళా దరఖాస్తులు 137% పెరిగాయని.. అన్ని రంగాల కంటే ఇందులోనే అధికంగా ఉన్నాయని పేర్కొంది. లీగల్ ఉద్యోగాల్లో 55% అవకాశాలు మహిళలకు ఉండడమే దీనికి కారణం అని వివరించింది.
- ఇంజినీరింగ్‌తో అనుసంధానమైన సృజనాత్మకత, న్యాయ రంగాల్లో మహిళలు; మానవ వనరులు- బ్యూటీ రంగాలను పురుషులు ఎంచుకోవడం పెరుగుతోందని.. సంప్రదాయాన్ని భిన్నంగా తమకిష్టమైన రంగాల్లోకి ప్రవేశించేందుకే యువత ఇష్టపడుతున్నారని వర్క్ ఇండియా సీఈఓ నీలేశ్ దుంగర్వాల్ వెల్లడించారు.

102 ఒప్పందాలు.. రూ.47,000 కోట్లు

అక్టోబరులో పీఈ, వీసీ పెట్టుబడులపై ఈవై-ఐవీసీఏ నివేదిక



ఈ ఏడాది అక్టోబరులో 102 ఒప్పందాల ద్వారా 5.3 బిలియన్ డాలర్ల (సుమారు రూ.47,000 కోట్ల) ప్రైవేటు ఈక్విటీ (పీఈ), వెంచర్ క్యాపిటల్ (వీసీ) పెట్టుబడులు వచ్చాయని ఈవై-ఐవీసీఏ నెలవారీ నివేదిక వెల్లడించింది. ఒప్పందాల సంఖ్యా పరంగా చూస్తే 2024 అక్టోబరులో 112 కాగా, 2025 అక్టోబరులో 9% తగ్గి 102కు పరిమితమయ్యాయి. ఈ ఏడాది సెప్టెంబరు నాటి 145 ఒప్పందాలతో పోలిస్తే 30% తగ్గాయని ఈవై ప్రైవేట్ ఈక్విటీ సర్వీస్ పార్ట్‌నర్, నేషనల్ లీడర్ వివేక్ సోనీ వెల్లడించారు. ఈ నివేదిక ప్రకారం..

- ప్యూర్-ప్లే పీఈ/వీసీ పెట్టుబడులు 13 నెలల గరిష్ఠమైన 5 బి.డాలర్ల (సుమారు రూ.44,500 కోట్ల)కు చేరాయి. 2024 అక్టోబరుతో పోలిస్తే వీటిల్లో 81% వృద్ధి నమోదైంది. స్థిరాస్తి, మౌలిక సదుపాయాల పెట్టుబడులు మాత్రం 86% క్షీణించాయి.
- పబ్లిక్ ఈక్విటీలోకి ప్రైవేటు పెట్టుబడుల (పీఐపీఈ) విభాగం ఆధిపత్యం కనబరిచింది. ఈ పెట్టుబడులు పదింతలు పెరిగి 2.1 బి.డాలర్ల (సుమారు రూ.18,690 కోట్ల)కు చేరాయి. అంకురాల్లోకి పెట్టుబడులు 175% పెరిగి 2 బి.డాలర్ల (సుమారు రూ.17,800 కోట్ల)కు చేరాయి. గ్రోత్ ఇన్వెస్ట్‌మెంట్స్ విభాగంలో పెట్టుబడులు 810 మిలియన్ డాలర్ల (సుమారు రూ.7,200 కోట్ల)కు పరిమితమయ్యాయి. బైఅవుట్స్ మార్పు లేకుండా 227 మి.డాలర్లు (సుమారు రూ.2,020 కోట్లు)గా నమోదయ్యాయి. రుణ పెట్టుబడులు 90% తగ్గి 189 మి.డాలర్ల (సుమారు రూ.1,680 కోట్ల)కు పరిమితమయ్యాయి.
- 9 అతి పెద్ద ఒప్పందాల్లో 3.7 బి.డాలర్ల (మొత్తంలో 70%) పెట్టుబడులు వచ్చాయి. సమ్మాన్ క్యాపిటల్‌లో 43.46% వాటాను 1 బిలియన్ డాలర్ల (సుమారు రూ.8,900 కోట్ల)కు కొనుగోలు చేసిన ఇంటర్నేషనల్ హోల్డింగ్ కంపెనీ లావాదేవీనే అతి పెద్దది.
- ఆర్థిక సేవల విభాగంలోకి 2.9 బి.డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. దీని తర్వాత ఇ-కామర్స్ (715 మి.డాలర్లు), టెక్నాలజీ (455 మి.డాలర్లు) రంగాల్లోకి ఎక్కువ పెట్టుబడులు వచ్చాయి. మొత్తం కలిపి ఈ విభాగంలోకి 77% పీఈ/వీసీ పెట్టుబడులు అక్టోబరులో తరలివచ్చాయి.
- 2024 అక్టోబరులో పీఈ/వీసీ పెట్టుబడులు వెనక్కి వెళ్లడంతో పోలిస్తే, 2025 అక్టోబరులో 43% తగ్గాయి. 14 ఒప్పందాల ద్వారా 640 మి.డాలర్లు వెనక్కి తరలిపోయాయి. సెప్టెంబరులో వెనక్కి వెళ్లిన 2.6 బి.డాలర్లతో పోలిస్తే ఇవి చాలా తక్కువ. ఇందులో ఓపెన్ మార్కెట్ లావాదేవీల వాటా 234 మి.డాలర్లు (37 శాతం)గా ఉంది. ఆదిత్య బిర్లా క్యాపిటల్‌లో 2% వాటాను విక్రయించడం ద్వారా 186 మి.డాలర్ల పెట్టుబడులను అడ్వెంట్ వెనక్కి తీసుకుంది. పెట్టుబడులు వెనక్కి వెళ్లిన లావాదేవీల్లో ఇదే పెద్దది.
- నిధుల సమీకరణ 1.8 బి.డాలర్లకు చేరింది. 2024 అక్టోబరులో ఇది 209 మి.డాలర్లుగా నమోదైంది. స్వల్పకాలిక వర్కింగ్ క్యాపిటల్, ప్రారంభ-తుది దశ అంకురాలకు టర్మ్ రుణాలు అందించేందుకు హెచ్ఎస్‌బీసీ 1 బి.డాలర్లు సమీకరించింది. ఇదే అక్టోబరులో జరిగిన అతి పెద్ద నిధుల సమీకరణ లావాదేవీ.

40,000 మంది ఉద్యోగులకు ఏఐలో నైపుణ్య శిక్షణ

ఎన్‌టీటీ డేటా

టోక్యో: భారత్‌లో తమకున్న 40,000 మందికి పైగా ఉద్యోగులందరినీ కృత్రిమ మేధ (ఏఐ-నేటివ్) డెవలపర్లుగా మార్చడానికి అవసరమైన నైపుణ్య శిక్షణ (రీస్కిల్లింగ్) అందించాలని ఎన్‌టీటీ డేటా లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచ వ్యాప్తంగా జెనరేటివ్ ఏఐ సామర్థ్యాలను విస్తరించడానికి, భారత్‌లోని ఇంజినీరింగ్ ప్రతిభను విరివిగా ఉపయోగించుకోవాలనుకుంటున్నట్లు ఎన్‌టీటీ డేటా కార్పొరేషన్ గ్లోబల్ జెనరేటివ్ ఏఐ కార్యాలయ హెడ్ కార్లోస్ గాల్వే వెల్లడించారు. వ్యయ సున్నితత్వం (కాస్ట్ సెన్సిటివిటీ), డేటా సార్వభౌమత్వం/గోప్యత కోసం భారత అవసరాలను తీర్చడానికి అవసరమైన సేవలను రూపొందించాలనీ ఎన్‌టీటీ డేటా నిర్దేశించుకుంది. మన దేశం నుంచి ఇంజినీరింగ్ సేవలను ఈ సంస్థ అంతర్జాతీయ ఖాతాదారులకు అందిస్తుంటుంది. 'ప్రపంచ ప్రాజెక్టులకు మరింతగా మద్దతు ఇవ్వడానికి వీలుగా, ఉత్పాదకత పెంచేందుకు నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెడుతున్నాం. ఇందువల్ల ప్రస్తుతం 10 ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వగల ఉద్యోగుల సంఖ్య మారకుండానే, భవిష్యత్తులో 20 నుంచి 100 ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వగలర'ని ఎన్‌టీటీ డేటా గ్రూప్ కార్పొరేషన్ గ్లోబల్ జెనరేటివ్ ఏఐ కార్యాలయ హెడ్ కెంజి మొటోహాషి వెల్లడించారు.

కోడి గుడ్డు

డిసెంబరు 1న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	635	తూ/ప గోదావరి	635
వరంగల్	637	విశాఖపట్నం	625
విజయవాడ	665	చిత్తూరు	663

హరిత ఆర్థిక వ్యవస్థ ప్రోత్సాహానికి ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయండి

ప్రభుత్వాన్ని కోరిన సీఐఐ



దిల్లీ: హరిత ఆర్థిక వ్యవస్థ ప్రోత్సాహానికి, సంబంధిత కార్యక్రమాలకు తోడ్పాటు అందించేందుకు ప్రత్యేక ఆర్థిక సంస్థ, టెక్ ఎక్స్‌పో నిధిని ఏర్పాటు చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) కోరింది. 5 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.445 లక్షల కోట్ల) ఆర్థిక వ్యవస్థకు భారత్ చేరువవుతుండటంతో.. హరిత ఆర్థిక వ్యవస్థ అనేది ఎంపిక కాదని, వ్యూహాత్మక అవసరమని అభిప్రాయపడింది. దేశంలో పునరుత్పాదక శక్తి, క్లీన్ మొబిలిటీ, హరిత భవనాలు, పారిశ్రామిక డీకార్బనైజేషన్‌కు అవసరమైన రుణాల కోసం ప్రత్యేక గ్రీన్ ఫైనాన్స్ ఇన్‌స్టిట్యూషన్ (జీఎఫ్ఐ) ఏర్పాటు చేయాలని ముందస్తు బడ్జెట్ సూచనల్లో సీఐఐ సూచించింది. నియంత్రణ పరమైన సౌలభ్యంతో పాటు విదేశీ నిధులను ఆకర్షించడానికి గుజరాత్‌లోని గిఫ్ట్‌సిటీలో ఈ సంస్థను ఏర్పాటు చేయొచ్చని తెలిపింది. రాయితీ రుణాలు, ఈక్విటీ తోడ్పాటు, రుణ హామీలు, ప్రాజెక్టు రుణ వ్యయాలను తగ్గించేందుకు.. చిన్న స్థాయి హరిత ఆస్తుల సెక్యూరిటైజేషన్ వంటి వాటికి గిఫ్ట్ సిటీ తోడ్పడుతుందని సీఐఐ వివరించింది. మన దేశ హరిత టెక్ ఆవిష్కరణలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు గ్రీన్ టెక్ ఎక్స్‌పో ఫండ్ అవసరమని వెల్లడించింది.

- 2070 నాటికి నికర సున్నా ఉద్గారాల లక్ష్యాన్ని భారత్ సాధించాలంటే వచ్చే 10-15 ఏళ్లలో లక్ష కోట్ల డాలర్ల (సుమారు రూ.89 లక్షల కోట్ల) హరిత పెట్టుబడులు అవసరమని, 2070కి ఇవి మొత్తం 10 లక్షల కోట్ల డాలర్ల (రూ.890 లక్షల కోట్ల)కు చేరతాయని సీఐఐ తెలిపింది.

భారత్‌కు మరిన్ని సర్వీసులు: బ్రిటిష్ ఎయిర్‌వేస్

దిల్లీ: భారత విమానయాన రంగంలో ఉన్న అపార అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, ఇక్కడి గిరాకీని అందుకునేలా మరిన్ని సర్వీసులు ప్రారంభిస్తామని బ్రిటిష్ ఎయిర్‌వేస్ సీఈఓ రెనె డి గ్రూట్ తెలిపారు. ప్రస్తుతం మనదేశంలోని వివిధ నగరాల నుంచి లండన్‌కు వారానికి 56 సర్వీసులను సంస్థ నిర్వహిస్తోంది. ఇందులో ముంబయి నుంచి రోజుకు 3, దిల్లీ నుంచి రోజుకు 2, హైదరాబాద్-చెన్నై-బెంగళూరు నుంచి రోజుకు ఒక సర్వీసు ఉంటోంది. దిల్లీ నుంచి రోజూ మరో సర్వీసును త్వరలో ప్రారంభించనుంది. అమెరికా తరవాత తమకు రెండో అతిపెద్ద విపణి భారతేనని గ్రూట్ వివరించారు. భారత్‌లోనే ఉన్న సంస్థ కాల్ సెంటర్లో 2,000 మంది ఉద్యోగులున్నారు. ఇండిగోతో కోడ్‌షేరింగ్ ఒప్పందం, ఖతార్ ఎయిర్‌వేస్‌తో సంయుక్త వ్యాపార ఒప్పందం ద్వారా భారత్‌లోని 13 నగరాలకు విమాన సర్వీసులు అందిస్తున్నామని.. వారానికి 148 సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు.

పసిడి కొనుగోలు చేయొచ్చు

కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి ఫిబ్రవరి కాంట్రాక్టు ఈవారం కూడా సానుకూలంగానే కనిపిస్తోంది. అయితే రూ.1,31,315 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.1,33,126; రూ.1,36,654 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ రూ.1,25,976 కంటే కిందకు వస్తే రూ.1,22,448; రూ.1,20,637 వరకు దిద్దుబాటు కావచ్చు.

వెండి



వెండి మార్చి కాంట్రాక్టుకు రూ.1,65,720 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.1,56,109; రూ.1,46,457 వరకు దిగిరావచ్చు. రూ.1,81,822 కంటే పైకి వెళితే రూ.1,85,063; రూ.1,94,715 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

ప్రాథమిక లోహాలు




- రాగి డిసెంబరు కాంట్రాక్టు రూ.1,051.05 కంటే ఎగువన కదలాడితే రూ.1,065.65; రూ.1,087.95 వరకు పెరగొచ్చు. ఒకవేళ రూ.1,014.15 కంటే కిందకొస్తే రూ.991.85; రూ.977.25 వరకు దిగి రావచ్చు.
- సీసం డిసెంబరు కాంట్రాక్టుకు రూ.180.85 వద్ద మద్దతు ఉంది. ఇది కోల్పోతే రూ.179.85; రూ.179.05 వరకు దిగి రావచ్చు. రూ.182.55 స్థాయిని అధిగమిస్తే రూ.183.35; రూ.184.55 వరకు పెరగొచ్చు.
- జింక్ డిసెంబరు కాంట్రాక్టుకు రూ.306.80 వద్ద నిరోధం ఉంది. దీన్ని అధిగమిస్తే రూ.310.55; రూ.317.60 వరకు రాణించొచ్చు. రూ.296.05 వద్ద మద్దతు ఉంది. ఇది కోల్పోతే రూ.288.95; రూ.285.20 వరకు దిగి రావచ్చు.
- అల్యూమినియం డిసెంబరు కాంట్రాక్టు రూ.271 కంటే కిందకు రాకపోతే రూ.274.75; రూ.278 వరకు రాణించొచ్చు. ఒకవేళ కిందకొస్తే రూ.268.75 వద్ద మద్దతు ఉంది. ఈ స్థాయిని కోల్పోతే రూ.264.55; రూ.261.95 వరకు దిగి రావచ్చు.

ఇంధన రంగం



- ముడి చమురు డిసెంబరు కాంట్రాక్టుకు రూ.5,406 వద్ద నిరోధం ఉంది. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.5,486; రూ.5,635 వరకు పెరగొచ్చు. ఈ కాంట్రాక్టుకు రూ.5,177 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.5,028; రూ.4,948 వరకు దిగిరావచ్చు.
- సహజవాయువు డిసెంబరు కాంట్రాక్టు రూ.440.15 కంటే పైన నిలదొక్కుకుంటే కొత్తగా లాంగ్ పొజిషన్లను జత చేసుకోవడం మంచిదే. సమీపకాలంలో రూ.453.85; రూ.477.55 వరకు పెరగొచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు



- పసుపు డిసెంబరు కాంట్రాక్టు రూ.13,909 కంటే కిందకు వస్తే రూ.13,118; రూ.12,623 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ రూ.15,195 కంటే ఎగువన కదలాడితే రూ.15,690; రూ.16,481 వరకు వెళ్లే అవకాశం ఉంటుంది.
- జీలకర్ర డిసెంబరు కాంట్రాక్టు సానుకూల ధోరణిలో చలిస్తే రూ.22,613 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.23,046; రూ.23,743 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. రూ.21,483 కంటే కిందకు వస్తే రూ.20,786; రూ.20,353 వరకు దిగిరావచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి (శాతంలో)
పసిడి (ఫిబ్రవరి)	1,25,360	1,29,504	3.31
వెండి (మార్చి)	1,57,100	1,75,340	11.61
రాగి (డిసెంబరు)	1,010.65	1,036.50	2.56
సీసం (డిసెంబరు)	181.55	181.75	0.11
జింక్ (డిసెంబరు)	299.75	303.05	1.10
అల్యూమినియం (డిసెంబరు)	268.50	273.05	1.69
ముడి చమురు (డిసెంబరు)	5,194	5,327	2.56
సహజ వాయువు (డిసెంబరు)	404.90	426.40	5.31
పసుపు (డిసెంబరు)	13,900	14,700	5.76
జీలకర్ర (డిసెంబరు)	21,740	22,180	2.02

మార్కెట్.. అటూ.. ఇటూ



స్టాక్ మార్కెట్ ఈ వారం

- కొత్త రికార్డులకెళ్లొచ్చని కొంతమంది విశ్లేషకులు
- స్థిరీకరణకు అవకాశం ఉందని మరికొందరు
- టెలికాం, ఎఫ్ఎంసీజీ, ఫార్మా షేర్లకు సానుకూలతలు
- సిమెంటు షేర్లకు ప్రతికూలతలు

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	158.12	162.20	154.20
బజాజ్ ఆటో	9073.50	9217.80	8849.80
ఐషర్ మోటార్స్	7053.50	7133.80	6915.80
హీరో మోటోకార్ప్	6174.50	6291.50	6069.50
ఎం అండ్ ఎం	3757.30	3817.60	3660.00
మారుతీ	15900.00	16132.00	15734.00
టీవీఎస్ మోటార్	3531.50	3599.60	3472.40

ఎఫ్ఎంసీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5846.00	5888.00	5774.00
కోల్గేట్ పామోలివ్	2168.60	2181.70	2155.70
డాబర్ ఇండియా	517.40	524.10	510.10
ఇమామీ	530.50	538.00	520.30
హిందుస్థాన్ యునిలీవర్	2466.60	2484.10	2438.50
ఐటీసీ	404.25	406.40	401.40
మారికో	717.40	734.30	706.50

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	290.85	294.40	288.30
సీజీ పవర్	672.90	683.90	663.60
ఎల్ అండ్ టీ	4069.60	4125.70	4026.70
సీమెన్స్	3297.00	3324.90	3271.10
థెర్మాక్స్	2920.10	2970.60	2876.80

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1007.60	1015.80	1000.10
ఐసీఐసీఐ బ్యాంక్	1388.80	1403.90	1378.10
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	80.13	81.10	79.40
ఇండస్ఇండ్ బ్యాంక్	858.55	869.20	846.20
కోటక్‌మహీంద్రా బ్యాంక్	2124.40	2162.40	2083.20
పీఎన్‌బీ	124.50	125.80	123.40
ఎస్‌బీఐ	979.00	988.30	968.40

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1226.70	1254.60	1202.00
బయోకాన్	398.35	404.30	393.50
సిప్లా	1531.30	1544.40	1514.00
డాక్టర్ రెడ్డీస్	1258.80	1270.00	1239.40
గ్లెన్‌మార్క్ ఫార్మా	1946.20	1967.50	1927.10
నాట్కో ఫార్మా	877.25	914.10	850.80

స్టాక్ మార్కెట్ చలనం సమీప భవిష్యత్తులో ఎలా ఉండొచ్చన్న అంశంపై విశ్లేషకులు మిశ్రమంగా స్పందిస్తున్నారు. కొత్త రికార్డు గరిష్ఠాలకు వెళతుందని కొంత మంది అంటుండగా.. స్థిరీకరణకు అవకాశం ఉంటుందని మరికొందరు చెబుతున్నారు. సూచీలు గత వారం కొత్త రికార్డు గరిష్ఠాలకు వెళ్లినా, ముగింపులో నిలబడలేదు. కొత్త గరిష్ఠాల వద్ద సూచీలు ముగిస్తే, మరిన్ని లాభాలుండొచ్చన్నది విశ్లేషకుల భావన. రెండో త్రైమాసిక జీడీపీ గణాంకాలు అంచనాలను మించి వెలువడడం, ఈనెల 5న వెల్లడయ్యే ఆర్‌బీఐ ద్వైమాసిక సమీక్షలో 'రేట్ల కోత జరగొచ్చనే అంచనాలు' మార్కెట్‌కు సానుకూలతలు తీసుకురావొచ్చు. నిఫ్టీ-50 సూచీ కనుక 26,000-26,050 స్థాయిలను నిలబెట్టుకుంటే, ఏదైనా పుల్‌బ్యాక్ జరిగినా.. కొనుగోళ్లకు అవకాశంగా భావించొచ్చని సాంకేతిక నిపుణులు పేర్కొన్నారు. జీవనకాల గరిష్ఠ ముగింపు నమోదయ్యే వరకు ఊగిసలాటలు తప్పవనీ అంటున్నారు. అక్టోబరు నెలకు సంబంధించి పారిశ్రామికోత్పత్తి గణాంకాలు - నవంబరు నెల వాహన విక్రయ వివరాలు సోమవారం వెల్లడికానున్నాయి. అక్టోబరులో నికరంగా రూ.14,610 కోట్ల పెట్టుబడులు పెట్టిన విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు, నవంబరులో రూ.3765 కోట్ల మేర ఉపసంహరించుకున్నారు. వీరి ధోరణీ కీలకమే. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

- నవంబరు విక్రయ గణాంకాల ఆధారంగా **వాహన** షేర్లు చలించొచ్చు. డిసెంబరు త్రైమాసికంలో విక్రయ వృద్ధి బాగుంటుందనే అంచనాల మధ్య, ఈ రంగ షేర్లు మరింత రాణిస్తాయని చెబుతున్నారు.
- ఎంపీసీ నిర్ణయాలకు ముందు నిఫ్టీ **బ్యాంక్** సూచీ కాస్త రాణించొచ్చు. నిఫ్టీ బ్యాంక్‌సూచీకి 59,200 వద్ద తక్షణ మద్దతు, 58,900 వద్ద పొజిషనల్ మద్దతు ఉంది. నిరోధం 60,000-60,500 వద్ద ఉంది.
- **యంత్రపరికరాల** షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చు. ప్రభుత్వ మూలధన వ్యయాలు తగ్గొచ్చన్న అంచనాల మధ్య ఈ రంగ భవిష్యత్తుపై విశ్లేషకులు అప్రమత్తంగా ఉన్నారు.
- **టెలికాం** షేర్లు పుంజుకోవచ్చు. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా, ఇండస్ టవర్స్, టాటా కమ్యూనికేషన్స్ షేర్లు పెరగొచ్చు. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయ బకాయిల విషయంలో వొడాఫోన్ ఐడియాకు కేంద్రం నుంచి ఉద్దీపన ప్యాకేజీ లభిస్తుందన్న అంచనాలున్నాయి.
- **లోహ**, గనుల కంపెనీల షేర్లు లాభాలను కొనసాగించొచ్చు. డాలరు సూచీలో ఇటీవలి క్షీణత, డిసెంబరు సమావేశంలో ఫెడ్ రేట్ల కోత అంచనాలు ఇందుకు దోహదం చేయొచ్చు.
- **సిమెంటు** రంగానికి ప్రతికూల వార్తలున్నందున ఈ రంగ షేర్లు విక్రయాల ఒత్తిడికి లోనుకావొచ్చు. ప్రభుత్వం నుంచి నిధుల రాక ఆలస్యం, ద్రవ్యలభ్యత సమస్యలూ ఉన్నాయి. అధిక పెట్‌కోక్ వ్యయాలు, రూపాయి క్షీణత వల్ల మార్జిన్లపై ప్రభావం పడొచ్చు.
- దేశీయ **ఐటీ** షేర్లు వరుసగా నాలుగో వారమూ లాభాలు కొనసాగించొచ్చని అంటున్నారు. ఫెడ్ రేట్ల కోత అంచనాల వంటి సానుకూల సంకేతాలు ఈ షేర్లకు మద్దతు పలకొచ్చు.
- **ఎఫ్ఎంసీజీ** షేర్లు రాణించొచ్చు. ఎంపీసీ సమావేశ నిర్ణయాలు ఈ షేర్లకు చోదకంగా పనిచేయొచ్చు. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ సూచీ 55,600-54,900 మధ్య కదలాడొచ్చు. మద్దతు 55,000-54,800 వద్ద, నిరోధం 56,250-56,600 వద్ద కనిపిస్తోంది.
- నిఫ్టీ **ఫార్మా** సూచీ ఈ వారమూ రాణించొచ్చు. సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు అంచనాలను మించడం, ఔషధ ఎగుమతులపై సానుకూల అంచనాలుండడం సహకరించొచ్చు. అమెరికా టారిఫ్‌ల అమలు తర్వాతా, మన ఔషధ రంగం అంతర్జాతీయంగా బలోపేతం అవుతోంది.
- **చమురు**-గ్యాస్ రంగంలో చమురు మార్కెటింగ్ కంపెనీల షేర్లు సానుకూలతలను కొనసాగించొచ్చు. ముడి చమురు ఉత్పత్తిపై ఒపెక్, అనుబంధ దేశాలు తమ నిర్ణయాన్ని వెలువరచే అవకాశం ఉంది.

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిండాల్కో	808.40	818.00	802.40
హిందుస్థాన్ జింక్	485.20	496.10	471.50
ఎన్ఎండీసీ	73.92	75.70	72.60
సెయిల్	134.91	138.40	132.80
టాటా స్టీల్	167.96	169.80	166.40
వేదాంత	526.00	537.30	513.00

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1624.20	1644.60	1608.80
ఇన్ఫోసిస్	1560.10	1573.20	1550.40
పర్సిస్టెంట్ సిస్టమ్స్	6353.00	6512.00	6239.00
టీసీఎస్	3137.50	3158.90	3114.30
టెక్ మహీంద్రా	1517.30	1537.00	1493.80
విప్రో	249.53	253.40	246.70

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1567.50	1588.90	1552.30
బీపీసీఎల్	359.10	370.00	353.20
హెచ్‌పీసీఎల్	457.50	465.40	451.80
ఐఓసీఎల్	161.75	164.50	160.10
ఓఎన్‌జీసీ	243.25	246.50	240.90
ఆయిల్ ఇండియా	413.20	423.50	406.00

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1,850.60	1,881.50	1,831.50
అంబుజా సిమెంట్స్	550.20	555.10	543.70
ఇండియా సిమెంట్స్	392.80	403.60	385.90
శ్రీ సిమెంట్	26,400.00	27,070.00	25,990.00
అల్ట్రాటెక్ సిమెంట్	11,600.00	11,682.00	11,516.00

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	2,101.60	2142.30	2076.10
ఎమ్‌టీఎన్ఎల్	38.32	39.00	37.50
టాటా కమ్యూనికేషన్స్	1815.20	1876.50	1777.30
వొడాఫోన్ ఐడియా	9.96	10.20	9.80

ఈనాడు సినిమా




చిరు - వెంకీల మాస్ డ్యాన్స్


అగ్ర కథానాయకులు చిరంజీవి.. వెంకటేశ్ కలిసి నటిస్తే చూడాలన్న సినీప్రియుల కలను 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రంతో సాకారం చేసి చూపించనున్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. ఈ కలయికలో ముస్తాబవుతున్న ఈ సినిమాని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. వీటీవీ గణేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రం ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న సంగతి తెలిసిందే. ఇందులో చిరు - వెంకీల కాంబోలో ఓ మాస్ డ్యాన్స్ నంబర్ ఉంది. ఆ పాట చిత్రీకరణను హైదరాబాద్‌లో ప్రారంభించినట్లు చిత్ర బృందం ఆదివారం ప్రకటించింది. ప్రత్యేక సెట్‌లో దాదాపు 500మంది డ్యాన్సర్ల మధ్య ఈ గీతాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ పాటలో ఇద్దరు హీరోల కెమిస్ట్రీ, వాళ్లిద్దరు వేసే హుషారైన స్టెప్పులు ఆకర్షణగా నిలవనున్నాయని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ గీతానికి భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చారు. త్వరలో ఈ సినిమా నుంచి చిరు - నయన్‌లపై చిత్రీకరించిన ఓ మెలోడీ పాటను విడుదల చేయనున్నారు. వినోద ప్రధానంగా సాగే ఈ ఫ్యామిలీ యాక్షన్ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.


యువతను అప్రమత్తం చేసే చిత్రాలు నిర్మిస్తాం

తెలుగు చిత్రసీమలో మరో కొత్త నిర్మాణ సంస్థ ప్రారంభమైంది. ఆర్ ఎక్స్ ప్లోర్ మూవీస్ పేరుతో నిర్మాత అతీకూర్ రెహమాన్ ఈ సంస్థను ప్రారంభించారు. ఈమేరకు ఆదివారం హైదరాబాద్‌లో ఈ బ్యానర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిర్మాత అతీకూర్ రెహమాన్ మాట్లాడుతూ.. "మనుషుల అక్రమ రవాణా, మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు.. ఇలా ప్రస్తుత సమాజంలో చాలా సమస్యలు చూస్తున్నాం. ఇలాంటి వాటిలో చిక్కుకుని యువత దారి తప్పుతున్నారు. ఇబ్బందులకు గురవుతున్నారు. అందుకే అలాంటి యువతను అప్రమత్తం చేసేలా.. వాళ్ల సమస్యల్లో చిక్కుకోకుండా చూసేలా మంచి సందేశాత్మక కథలతో సినిమాలు నిర్మించాలని అనుకుంటున్నాం. ఇప్పటికే మా బ్యానర్‌లో నిర్మించనున్న తొలి చిత్ర కథ సిద్ధమైంది. త్వరలో దాన్ని ప్రకటిస్తాం. ఎలాంటి డబ్బులు వసూలు చేయకుండా మా చిత్రంలో కొత్త ప్రతిభకు అవకాశం కల్పిస్తాం. మా సినిమాలు తెలుగులోనే కాక దేశవ్యాప్తంగా ప్రభావం చూపించేలా నిర్మాణం చేస్తాం" అన్నారు. ఈ కార్యక్రమంలో మహతి, సత్యవతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సినిమా ఫస్టాఫ్ రిపోర్ట్ అటుఇటుగా ఉన్నా.. ప్రీక్లైమాక్స్, క్లైమాక్స్ పండాయంటే ఆ చిత్రం గట్టెక్కేసినట్లే. ఆ రెండూ అలరించినా చాలు ప్రేక్షకులు ఓ సంతృప్తితో థియేటర్ల నుంచి బయటకొస్తారు. ఇప్పుడు 2025 తెలుగు సినీ క్యాలెండర్‌లో కీలకమైన ప్రీక్లైమాక్స్ ఘట్టం ముగిసింది. నవంబరు తొలిరోజు నుంచి ఆఖరి రోజు వరకు థియేటర్ల ముందు వరుస కట్టిన చిత్రాల్ని చూస్తే స్టార్ కళకు లోటు లేదనిపించింది. బాక్సాఫీస్ బరిలో మంచి నంబర్స్ చూస్తామన్న భరోసా కనిపించింది. మరి మన టాలీవుడ్ ప్రీక్లైమాక్స్ ప్రేక్షకులు అంచనాల్ని అందుకుందా? లేదా? చూద్దాం.

ప్రీక్లైమాక్స్.. మెరుపులు సరిపోలే


'ఆంధ్ర కింగ్ తాలూకా'


'మాస్ జాతర'

తెలుగు చిత్రసీమకు నవంబరు ఆరంభంలోనే గట్టి ఎదురు దెబ్బ తగిలింది. అగ్ర హీరో రవితేజ 'మాస్ జాతర' చిత్రంతో తొలి రోజు ఉత్సాహంగా మొదలైనప్పటికీ.. బాక్సాఫీస్ బరిలో ఆశించిన ఫలితం దక్కలేదు. కథ, కథనాల్లో కొత్తదనం కరవైనట్లు ప్రేక్షకుల నుంచి టాక్ వినిపించడంతో రవితేజ ఖాతాలో మరో ఫ్లాప్ పడినట్లయింది. నవంబరు తొలి శుక్రవారం రష్మిక 'ది గర్ల్‌ఫ్రెండ్', సుధీర్‌బాబు 'జటాధర', విష్ణు విశాల్ 'ఆర్యన్', తిరువీర్ 'ది గ్రేట్ ప్రీవెడ్డింగ్ షో'తో పాటు మరో రెండు చిన్న చిత్రాలు థియేటర్ల ముందుకు వరుస కట్టాయి. వీటిలో రష్మిక తొలి నాయికా ప్రాధాన్య చిత్రం 'గర్ల్‌ఫ్రెండ్' ప్రేక్షకులతో పాస్ మార్కులు వేయించుకోవడమే గాక విమర్శకుల ప్రశంసల్ని దక్కించుకుంది. అలాగే ఎలాంటి అంచనాల్లేకుండా చిన్న చిత్రంగా వచ్చిన తిరువీర్ 'ప్రీ వెడ్డింగ్ షో' పసందైన వినోదంతో అందర్నీ కడుపుబ్బా నవ్వించింది. ఈ ఏడాది మంచి విజయాన్ని అందుకున్న చిన్న చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ రెండూ తప్ప మిగతావన్నీ చేదు ఫలితాన్నే అందుకున్నాయి.

- నవంబరు రెండో వారంలో దుల్కర్ సల్మాన్ 'కాంత'తో పాటు 'సంతాన ప్రాప్తిరస్తు', 'జిగ్రీస్' లాంటి కొన్ని చిన్న చిత్రాలు బాక్సాఫీస్ బరిలో అదృష్టం పరీక్షించుకున్నాయి. అయితే వీటిలో విడుదలకు ముందే ప్రచార చిత్రాలతో అందరి దృష్టినీ ఆకర్షించిన సినిమా 'కాంత' మాత్రమే. టీజర్, ట్రైలర్లకు ప్రేక్షకుల నుంచి దక్కిన ఆదరణ చూస్తే ఇది దుల్కర్ కెరీర్‌లో మరో హిట్టుగా నిలవడం పక్కా అనే భరోసా కనిపించింది. కానీ, తీరా తెరపై బొమ్మ పడ్డాక ప్రేక్షకుల నుంచి మిశ్రమ ఆదరణ లభించింది. 'నటన పరంగా దుల్కర్ కెరీర్‌లో ఇది గుర్తుండిపోయే చిత్రమ'నే ప్రశంసలతో సరిపెట్టుకుంది. మూడో వారంలో అల్లరి నరేశ్ '12ఏ రైల్వే కాలనీ', దర్శకుడు వేణు ఊడుగుల నిర్మించిన 'రాజు వెడ్స్ రాంబాయి', రాజ్‌తరుణ్ 'పాంచ్ మినార్', ప్రియదర్శి 'ప్రేమంటే' చిత్రాలు సినీప్రియుల ముందుకొచ్చాయి. అయితే వీటిలో ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్ నుంచి వచ్చిన 'రాజు వెడ్స్ రాంబాయి' ఒక్కటే విజయాన్ని అందుకుంది. ఇప్పటికీ మంచి వసూళ్లు సాధిస్తూ సత్తా చాటుతోంది. వాస్తవ సంఘటనలతో సాయిలు కంపాటి తెరకెక్కించిన ఈ ప్రేమకథా చిత్రం ప్రతిఒక్కరి మనసుల్ని కదిలించింది. ముఖ్యంగా ఈ చిత్ర క్లైమాక్స్ హృదయాల్ని బరువెక్కించింది. ఆఖరి వారంలో రామ్ పోతినేని 'ఆంధ్ర కింగ్ తాలూకా', కీర్తి సురేశ్ 'రివాల్వర్ రీటా' చిత్రాలు థియేటర్లలోకి వచ్చాయి. వీటిలో రామ్ సినిమాకి ప్రేక్షకుల నుంచి మంచి మౌత్ టాక్ లభించింది. అయితే ఇది ఈ చిత్ర వసూళ్లను ఏమేర ప్రభావం చేస్తుందన్నది తెలియాలంటే ఇంకొన్ని రోజులు వేచి చూడక తప్పదు. ఇక కీర్తి సినిమాకి తెలుగు నాట ముందు నుంచి సరైన ప్రచారం లేకపోవడం.. కథ, కథనాలు కూడా మెప్పించకపోవడం ఇది ఆమె ఖాతాలో మరో ఫ్లాప్‌గా మిగిలిపోయింది. ఇలా నవంబరు కొన్ని చిన్న చిత్రాల మెరుపులతోనే సరిపెట్టుకుంది.

అందరి చూపు.. క్లైమాక్స్‌పైనే

ఓవైపు స్టార్ హంగామాతో పాటు కథే బలంగా రూపొందిన సినిమాలు డిసెంబరులో చాలానే కనిపిస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం 'అఖండ'తో డిసెంబరు బరిలో మెరుపులు మెరిపించారు నందమూరి బాలకృష్ణ. ఇప్పుడాయన 'అఖండ 2: తాండవం'తో మరోసారి ఆ మ్యాజిక్‌ను పునరావృతం చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. బోయపాటి శ్రీను తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే ఇటు దక్షిణాదిలోనూ అటు ఉత్తరాదిలోనూ మంచి అంచనాలేర్పడ్డాయి. టీజర్, ట్రైలర్లకు దక్కిన ఆదరణ చూస్తుంటే ఈసారి బాక్సాఫీస్ బరిలో చాలా పెద్ద నంబర్లు చూస్తామన్న భరోసా కనిపిస్తోంది. మరి ఆ అంచనాల్ని ఈ సినిమా అందుకుంటుందా? లేదా? తెలియాలంటే డిసెంబరు 5వరకు వేచి చూడక తప్పదు. ఇక డిసెంబరు రెండో వారంలో వస్తున్న రోషన్ కనకాల 'మోగ్లీ'తో పాటు క్రిస్మస్ బరిలో నిలుస్తున్న రోషన్ 'ఛాంపియన్', ఆది సాయికుమార్ 'శంబాల', శివాజీ 'దండోరా', 'పతంగ్' తదితర చిత్రాలన్నీ వైవిధ్యభరితమైన కథలతో ముస్తాబైనవే. వీటికి తోడు కార్తి 'అన్నగారు వస్తారు', 'అవతార్ ఫైర్ అండ్ యాష్' తదితర అనువాద చిత్రాలు డిసెంబరు నెలకి అదనపు ఆకర్షణగా నిలవనున్నాయి. మరి వీటిలో కొన్ని హిట్టు మాట వినిపించినా.. ఈ ఏడాది తెలుగు చిత్రసీమకి మంచి మెరుపు లాంటి ముగింపు దక్కినట్లే అవుతుంది.


'రాజు వెడ్స్ రాంబాయి'


'ది గర్ల్ ఫ్రెండ్'

కీర్తి సురేశ్ శిక్షక్


కీర్తి సురేశ్

'రివాల్వర్ రీటా'లో తుపాకీ చేతపట్టి ఇటీవలే థియేటర్లలో సందడి చేసింది అందాల తార కీర్తి సురేశ్. ఇప్పుడామె విద్యావ్యవస్థలోని సమస్యలపై పోరాటం చేయడానికి సిద్ధమైంది. ఆమె, రాజ్‌కుమార్ రావ్ జంటగా ఓ చిత్రంలో నటిస్తున్నట్లు కొన్ని రోజులు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్రానికి 'శిక్షక్' అనే పేరును ఖరారు చేసినట్లు సమాచారం. ఆదిత్య నింబాల్కర్ తెరకెక్కిస్తున్నారు. విద్యావ్యవస్థలోని ఒత్తిళ్లు, భావోద్వేగ సంఘర్షణల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని, దేశ భవిష్యత్తును రూపొందించే ఈ వ్యవస్థలోని కనిపించని రహస్యాలను వెలుగులోకి తీసుకొస్తుందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

నన్ను దృష్టిలో పెట్టుకొని స్క్రిప్ట్ రాయొద్దు


మమ్ముట్టి

"బాక్సాఫీస్ ఒత్తిళ్లను పట్టించుకోకుండా.. నన్ను సవాలు చేసే భిన్నమైన పాత్రలను ఎంచుకుంటాన"ని అంటున్నారు మమ్ముట్టి. మరి కొద్ది రోజుల్లో 'కలాంకావల్' సినిమాతో తెరపైకి రాబోతున్నారీయన. ఈ సందర్భంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మమ్ముట్టి మాట్లాడుతూ.. "ఇమేజ్‌కి కట్టుబడి పాత్రల్ని ఎంపిక చేసుకోవాలనే ఆలోచన నాకు లేదు. ఎందుకంటే ప్రతి నటుడు అన్ని పాత్రల్ని చేయాలనుకుంటాడు. నేను కూడా వైవిధ్యమైన కథల్ని ఎంచుకుంటూ నాలోని నటుణ్ని సంతృప్తిపరచాలనుకుంటున్నా. ఇంకో ముఖ్య విషయం.. దర్శకులు స్క్రిప్ట్ రాసేటప్పుడు నన్ను దృష్టిలో పెట్టుకొని పాత్రను తీర్చిదిద్దకండి. మీరు ఊహించుకున్న పాత్ర రాసి.. అందులో నేను నటిస్తేనే విభిన్నమైన సినిమాలు వస్తాయి. ప్రేక్షకులందరినీ ఆకట్టుకునే చిత్రాలు చాలా తక్కువ. 'కలాంకావల్'ని కూడా అందరూ ఇష్టపడాలని నేను కోరుకోవట్లేదు. కానీ దీనికి అభిమానుల నుంచి మంచి స్పందనే వస్తుందని ఆశిస్తున్నాన"ని అన్నారు.

కుటుంబం గొప్పదనాన్ని చాటిచెప్పే చిత్రమిది - రాజేంద్ర ప్రసాద్

"ఒక నటుడు సుదీర్ఘ కాలం చిత్ర పరిశ్రమలో కనిపిస్తూ ఉండాలంటే తాను వేసే పాత్రలు ప్రేక్షకుల్ని అంతగా మెప్పించాలి" అన్నారు నటుడు రాజేంద్ర ప్రసాద్. వివిధ ప్రాంతాల భాషలు, యాసల్ని సినిమాల్లో మాట్లాడుతూ తాను ప్రతి ప్రాంతం వారికి దగ్గరవాడినయ్యానని చెప్పారు. ఇప్పుడాయన కీలక పాత్రధారిగా ఉదయ్ శర్మ తెరకెక్కించిన చిత్రం 'సఃకుటుంబానాం'. రామ్ కిరణ్, మేఘ ఆకాశ్ జంటగా నటించారు. హెచ్.మహదేవ గౌడ్ నిర్మించారు. బ్రహ్మానందం, సత్య తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 12న రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర ట్రైలర్‌ను దర్శకుడు బుచ్చిబాబు సానా ఇటీవల విడుదల చేశారు. "ఇది చాలా ప్రత్యేకమైన చిత్రం. కుటుంబ గొప్పదనాన్ని తెలియజేసేలా ఉంటుంది. ఈ 48ఏళ్ల ప్రయాణంలో నేనెప్పుడూ ఇలాంటి కథ, పాత్ర వినలేదు, చేయలేదు. దీంట్లో నేను చేసిన పాత్రలో చాలా సవాళ్లున్నాయి" అన్నారు నటుడు రాజేంద్రప్రసాద్. నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో నా పాత్ర చాలా విచిత్రంగా ఉంటుంది. సినిమా విజయవంతమవ్వాలని కోరుకుంటున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ శర్మ, రామ్ కిరణ్, మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.


బ్రహ్మానందం, రాజేంద్రప్రసాద్

"పదేళ్ల విరామం తర్వాత 'అఖండ 2' లాంటి మంచి చిత్రంతో థియేటర్లలోకి వస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది" అంది హర్షాలీ మల్హోత్రా. నందమూరి బాలకృష్ణతో కలిసి నటించడం గొప్ప అవకాశమని తెలిపింది. 'బజరంగీ భాయిజాన్'లో బాలనటిగా అలరించిన హర్షాలి.. ఇప్పుడు 'అఖండ 2: తాండవం'తో తెలుగు తెరకు పరిచయమవుతోంది. బాలకృష్ణ - బోయపాటి శ్రీను కలయికలో రూపొందిన ఈ పాన్ ఇండియా చిత్రం ఈ నెల 5న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకుంది హర్షాలి.

జననిగా గుర్తుండిపోతా


హర్షాలి


- "బజరంగీ భాయిజాన్ సినిమా చేశాక నాకు హిందీ నుంచి చాలా అవకాశాలొచ్చాయి. కానీ, నేను మంచి పాత్ర కోసం ఎదురు చూశా. ఈక్రమంలోనే 'అఖండ 2'లో బాలకృష్ణతో కలిసి నటించే గొప్ప అవకాశమొచ్చింది. ఈ కథ, పాత్ర విన్నాక ఇలాంటి సినిమా కోసమే కదా ఇన్నేళ్లు ఎదురు చూసిందనుకున్నా".
- "ఈ సినిమాలో నేను జనని అనే పాత్రలో కనిపిస్తాను. తను చాలా స్వీట్ గర్ల్. ఆమెకి అఖండ ఆశీర్వాదాలుంటాయి. తనెప్పుడు ప్రమాదంలో ఉన్నా ఆయన కచ్చితంగా వస్తారు. ఈ కథలో అలాంటి సందర్భం ఎందుకొచ్చింది.. అఖండ వచ్చాక ఏం జరిగింది? అన్నది ఆసక్తికరంగా ఉంటుంది. ఈ చిత్రంతో నేను అందరికీ జననిగా గుర్తుండిపోతా. ఈ పాత్ర కోసం దర్శకుడు బోయపాటి నన్ను ఎంపిక చేసుకోవడాన్ని అదృష్టంగా భావిస్తున్నా".
- "నేను ఈ సినిమా చేయకముందే బాలకృష్ణ చేసిన 'అఖండ', 'భగవంత్ కేసరి', 'వీరసింహారెడ్డి', 'డాకు మహారాజ్' తదితర చిత్రాల్ని చూశాను. సెట్‌లో తొలిసారి ఆయనతో కలిసి నటించేటప్పుడు చాలా ఒత్తిడికి గురయ్యా. దాన్ని ఆయన గుర్తించి.. నాకు ధైర్యం చెప్పి, ప్రోత్సహించారు. నన్ను ఒక కుటుంబ సభ్యురాలిలా చూసుకున్నారు. ఈ సినిమాలో నేను యాక్షన్ స్టంట్స్ కూడా చేశాను. దీంట్లో కొన్ని సన్నివేశాల్ని మైనస్ డిగ్రీల చలిలో చిత్రీకరించారు. అది నాకు చాలా సవాల్‌గా అనిపించింది".
- "సల్మాన్ ఖాన్‌తో నాకు చాలా అందమైన జ్ఞాపకాలున్నాయి. మేమిద్దరం కలిసి టేబుల్ టెన్నిస్ ఆడేవాళ్లం. బాలకృష్ణతోనూ మంచి అనుబంధం ఏర్పడింది. ఈ చిత్ర షూట్‌లో నన్ను అల్లం కషాయం తాగమని చెప్పేవారు. నిజానికి నాకది ఇష్టం లేకున్నా.. తాగేదాన్ని (నవ్వుతూ). తెలుగులో బాలకృష్ణతో పాటు అల్లు అర్జున్, ప్రభాస్ ఇష్టం".

సల్మాన్ - అక్షయ్‌లతో దిల్‌రాజు సినిమాలు


సల్మాన్ ఖాన్


ప్రముఖ నిర్మాత దిల్‌రాజు బాలీవుడ్‌పై దృష్టి సారిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై హిందీలో వరుసగా అగ్ర తారలతో సినిమాల్ని నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విషయాల్ని ఆయన స్వయంగా వెల్లడించారు. వచ్చే ఏడాది తమ ఎస్వీసీ సంస్థ నుంచి ఆరు సినిమాలు విడుదల కానున్నాయని.. హిందీలో అక్షయ్ కుమార్ - అనీస్ బాజ్మీ కలయికలో 'సంక్రాంతికి వస్తున్నాం' హిందీ రీమేక్‌ను నిర్మించనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయని.. 2026లోనే చిత్రీకరణ ప్రారంభించి, విడుదల చేస్తామని స్పష్టత ఇచ్చారు. అలాగే సల్మాన్ ఖాన్ - వంశీ పైడిపల్లి కలయికలో ఓ చిత్రం నిర్మించనున్నట్లు మరో నిర్మాత శిరీష్ తెలిపారు. తెలుగులో విజయ్ దేవరకొండ - కీర్తి సురేశ్ జంటగా 'రౌడీ జనార్దన' సినిమాని నిర్మిస్తున్నామని.. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుందని తెలియజేశారు.

'హౌస్‌ఫుల్' దర్శకుడితో మరోసారి?


అక్షయ్ కుమార్

'స్కై ఫోర్స్', 'కేసరి ఛాప్టర్ 2', 'జాలీ ఎల్ఎల్‌బీ 3' లాంటి చిత్రాలతో ఈ ఏడాదికి విజయవంతంగా ముగింపు పలికారు బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్. ఇప్పుడాయన వైవిధ్యమైన ప్రాజెక్టులతో కొత్త ఏడాదికి స్వాగతం పలకడానికి సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగానే ఆయన... దర్శకుడు సాజిద్ ఖాన్‌తో కలిసి ఓ భారీ ప్రాజెక్టు కోసం పనిచేయనున్నట్లు తెలుస్తోంది. ఇంకా పేరు ఖరారు కానీ ఈ చిత్రానికి ఏక్తా కపూర్ నిర్మాతగా వ్యవహరించనుందట. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, వచ్చే ఏడాది జూలైలో చిత్రీకరణ ప్రారంభమవుతుందని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 'హేయ్ బేబీ', 'హౌస్‌ఫుల్' లాంటి చిత్రాలతో ఇప్పటికే హిట్ కలయిక అనిపించుకున్న అక్షయ్, సాజిద్.. ఈసారి తెరపై ఎలాంటి మ్యాజిక్ చేస్తారో చూడాలి.


కన్నడ హాస్య నటుడు ఉమేశ్ మృతి



కన్నడ హాస్య నటుడు ఎమ్ఎస్ ఉమేశ్(80) కన్నుమూశారు. కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన చికిత్స తీసుకుంటూ ఆదివారం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాల్యంలోనే నటనా జీవితాన్ని ప్రారంభించిన ఉమేశ్ 'మక్కల రాజ్య', 'కథా సంగమ', 'గురు శిష్యారు', 'అనుపమ' లాంటి ఎన్నో వైవిధ్యమైన చిత్రాల్లో తన నటనతో మెప్పించారు. ఐదు దశాబ్దాలకు పైగా చిత్ర సీమలో రాణించిన ఆయన 350కి పైగా చిత్రాల్లో నటించారు. "ప్రముఖ హాస్య నటుడు ఉమేశ్ తన సహజ నటనతో ఎన్నో దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరించారు. కన్నడ సినిమాకు అపారమైన కృషి చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా" అంటూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమార స్వామితో పాటు, పలువురు సినీ ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా ఉమేశ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

బీఎస్సీ (ఎంపీసీ), ఎమ్మెస్సీ (జాగ్రఫీ) చేశాను. బీఈడీలో సోషల్ మెథడాలజీకి వీలవుతుందా? ఏడాది వ్యవధిలోనే బీఈడీకి అవకాశం ఉందా? - ఎ.లక్ష్మణ్

ఏడాదిలో బీఈడీ?





■ బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) శిక్షణ కోర్సులో మెథడాలజీ.. అభ్యర్థి ఇంటర్మీడియట్/ డిగ్రీ/ పీజీల నేపథ్యం ప్రకారం నిర్ణయిస్తారు. ప్రతి మెథడాలజీకి నిర్దేశిత అర్హతలు తప్పనిసరి.

◆ గణితశాస్త్రాన్ని బోధించాలంటే.. బ్యాచిలర్ డిగ్రీలో మ్యాథ్స్ తప్పనిసరి. అలాగే ఫిజికల్ సైన్సెస్ మెథడాలజీ కోసం డిగ్రీలో ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు చదవాలి. బయోలాజికల్ సైన్సెస్ మెథడాలజీ చదవడానికి డిగ్రీలో హోమ్ సైన్స్ లేదా బోటనీ, జువాలజీ సబ్జెక్టులు ఉండాలి. అదేవిధంగా సోషల్ సైన్స్ మెథడాలజీ కోసం అందుకు సంబంధించిన సబ్జెక్టులు డిగ్రీలో చదివుండటం తప్పనిసరి.

◆ ఇంగ్లిష్ మెథడాలజీలో ప్రవేశానికి.. బీఏలో స్పెషల్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ లిటరేచర్ లేదా ఎంఏ ఇంగ్లిష్ చదివుండాలి.

◆ ఓరియంటల్ లాంగ్వేజ్ మెథడాలజీకి.. డిగ్రీలో ఆ సబ్జెక్టులను ఆప్షనల్, స్పెషల్‌గా, సంబంధిత సబ్జెక్టుల్లో బీఏ లిటరేచర్ లేదా ఎంఏలో సంబంధిత లాంగ్వేజ్‌కానీ చదవాలి.

మీ ప్రశ్న విషయానికొస్తే.. డిగ్రీలో సోషల్‌సైన్స్‌కు సంబంధించిన సబ్జెక్టులు ఏవీ చదవలేదు కాబట్టి బీఈడీలో సోషల్‌సైన్స్ మెథడాలజీ ఎంచుకోవడానికి అర్హత లేదు. మీరు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో జాగ్రఫీ చదివినప్పటికీ.. సోషల్‌సైన్స్ మెథడాలజీకి అర్హత లేదు. భాషల విషయంలో మాత్రమే డిగ్రీలో ఆ లాంగ్వేజ్‌ను ఆప్షనల్‌గా చదవనప్పటికీ సంబంధిత సబ్జెక్టుల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉంటే, ఆ మెథడాలజీ ఎంచుకునే అవకాశం ఉంది. కానీ, ఈ వెసులుబాటు ఇతర మెథడాలజీలకు లేదు. కాబట్టి, మీరు బీఈడీలో మ్యాథ్స్ లేదా ఫిజికల్ సైన్సెస్ మెథడాలజీ ఎంచుకోవచ్చు. సోషల్‌సైన్స్ మెథడాలజీని చదవాలనుకుంటే.. ఓపెన్ యూనివర్సిటీ లేదా దూరవిద్య లేదా ఆన్‌లైన్ విధానంలో సోషల్‌సైన్స్ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేయాలి.

ఇంజినీరింగ్ విద్యార్థులైతే.. మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్ మెథడాలజీలు చదవడానికి అర్హులు. అలాగే బీకామ్, బీబీఏ చదివినవారు సోషల్‌సైన్స్ మెథడాలజీ ఎంచుకోవచ్చు. ఇదే మాదిరిగా బీసీఏ విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో వారు చదివిన సబ్జెక్ట్స్ ఆధారంగా బీఈడీలో సంబంధిత మెథడాలజీలను ఎంచుకోవచ్చు.

◆ నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) నిబంధనల ప్రకారం.. బీఈడీ ప్రోగ్రాం కాల వ్యవధి రెండేళ్లు. గతంలో ఇది ఏడాదిగా ఉండేది. రెండేళ్లకు పెంచినప్పటి నుంచీ బీఈడీ ప్రవేశాలు తగ్గుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని, ప్రోగ్రాం వ్యవధిని ఒక సంవత్సరానికి తగ్గించాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారు. భవిష్యత్తులో బీఈడీ కోర్సును నాలుగేళ్లు.. బీఎస్సీ బీఈడీ, బీఏ బీఈడీ, బీకామ్ బీఈడీగా ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం రూపంలో మాత్రమే అందిస్తారు. బీఈడీ ప్రోగ్రాంను ఏడాదికి కుదించే విషయాన్ని ఎన్‌సీటీఈ పరిశీలిస్తోంది. అధికారిక ప్రకటన వెలువడేంత వరకు దీని వ్యవధి రెండేళ్లే. అందువల్ల ఎవరైనా ఒక సంవత్సరంలోనే బీఈడీ పూర్తిచేసే అవకాశం ఉందని చెబితే నమ్మి మోసపోవద్దు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

జేఈఈ మెయిన్ వ్యూహమిదీ..

ఐఐటీలు, ఎన్ఐటీలతోపాటూ మేటి ఇంజినీరింగ్ సంస్థలలో ప్రవేశానికి జేఈఈ స్కోరే ప్రామాణికం. మెయిన్ పరీక్షలో మెరిస్తే చాలు.. ఐఐటీలు మినహా మిగిలిన అన్ని సంస్థల్లోనూ చేరిపోవచ్చు. జనవరిలో ప్రారంభమయ్యే ఈ పరీక్షలకు ఉన్న వ్యవధిలోనే వ్యూహాత్మకంగా సన్నద్ధమైతే మెరుగైన స్కోరు పొందడానికి వీలవుతుంది.



జేఈఈ మెయిన్ 2026 సెషన్-1ను జనవరి 21-30 మధ్యలో నిర్వహిస్తారు. ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీటెక్/బీఆర్క్ సీట్ల భర్తీకి, అంతేకాకుండా జేఈఈ అడ్వాన్స్‌డ్ అర్హత పొందేందుకు మెయిన్ స్కోరే ప్రామాణికం. పరీక్షకు ఇప్పటి నుంచి 40 రోజులే వ్యవధి ఉంది. ఈ ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే మంచి ర్యాంకుతో పాటూ, కోరిన బ్రాంచీలో, మేటి సంస్థలో సీటు పొందడానికి వీలవుతుంది.

జేఈఈ మెయిన్ పరీక్షల్లో అడిగే ప్రశ్నలను మూడు కేటగిరీలగా విభజించుకోవచ్చు.

కేటగిరీ-1: సింగిల్ టాపిక్ - సింగిల్ కాన్సెప్ట్, కేటగిరీ-2: సింగిల్ టాపిక్ మల్టిపుల్ కాన్సెప్ట్, కేటగిరీ-3: మల్టిపుల్ టాపిక్ మల్టిపుల్ కాన్సెప్ట్. అలాగే కేటగిరీల వారీ ప్రశ్నల స్థాయిని బట్టి నాలుగు లెవెల్స్‌గా విభజించవచ్చు.

లెవెల్–1: సూత్రం నేరుగా ఉపయోగించి సాధించే ప్రశ్నలు.

లెవెల్–2: బాగా తెలిసిన ప్రశ్నలే, కానీ సమాధానం సాధించటానికి ఒకటి లేదా రెండు స్టెప్పులు అవసరం.

లెవెల్–3: ప్రశ్నల్లో కాస్త తిరకాసు ఉండి, భాష, విభిన్న పదజాలం ఉన్న తెలిసిన ప్రశ్నలు.

లెవెల్–4: పూర్తిగా కష్టమైనవి, ఎప్పుడూ చూడనివి, సమాధానానికి ఎక్కువ సమయం తీసుకునేవి.

✦ సరైన ప్రణాళికతో చదివితే సాధారణ విద్యార్థులు సైతం కేటగిరీ-1, కేటగిరీ-2, లెవెల్-1, లెవెల్-2 ప్రశ్నలకు ఎలాంటి ఇబ్బందీ పడకుండా సరైన సమాధానాలు గుర్తించగలరు.

✦ జేఈఈ మెయిన్ 2025లో నిర్వహించిన 19 పేపర్లలో.. మ్యాథ్స్ 475, ఫిజిక్స్ 475, కెమిస్ట్రీ 475, మొత్తం 1425 ప్రశ్నలు సాధారణ విద్యార్థులూ రాయగలిగేలా ఉన్నాయి. అంటే సుమారుగా 80 శాతం ప్రశ్నలకు వీరు సమాధానం గుర్తించగలరు.

✦ మెయిన్‌లో సాధారణ విద్యార్థులూ 300కు 100 నుంచి 120 వరకూ మార్కులు తెచ్చుకోవటం కష్టం కాదు. ఈ మార్కులతోనే 90 కంటే ఎక్కువ పర్సంటైల్ దక్కుతుంది. దీంతో ఆల్ ఇండియా ర్యాంకుతోపాటూ పేరున్న సంస్థలో సీటూ వస్తుంది.

✦ జేఈఈ మెయిన్‌లో మీ లక్ష్యం ఆల్ ఇండియా 10 లోపు ర్యాంకు అయితే పేపర్ స్థాయి ఎలా ఉన్నప్పటికీ 300కు 295కు పైగా మార్కులు సాధించాలి. ఆల్ ఇండియా 100 లోపు ర్యాంకు పొందడానికి పేపర్ స్థాయి ఎలా ఉన్నప్పటికీ 300కు 290 కంటే ఎక్కువ మార్కులు పొందాలి. లక్ష్యం ఆల్ ఇండియా 1000లోపు ర్యాంకు అయితే కనీసం 260 మార్కులు రావాలి. 20,000లోపు ఆల్ ఇండియా ర్యాంకు దక్కాలంటే 300కు కనీసం 120కు తగ్గకుండా 150 వరకు మార్కులు పొందాలి. పేపర్ స్థాయి ఎలా ఉన్నప్పటికీ మార్కులు మాత్రం ఇంత కంటే తగ్గకూడదు.

✦ జేఈఈ మెయిన్‌లో అర్హత పొందితే చాలు అనుకున్నవారు.. పేపర్ స్థాయి ఎలా ఉన్నప్పటికీ 300కు 90 నుంచి 100 మార్కులు సాధిస్తే సరిపోతుంది. ఇందుకోసం ప్రశ్నపత్రంలోని 75 ప్రశ్నల్లో కనీసం 30 నుంచి 35 ప్రశ్నలకు కచ్చితమైన సమాధానం ఇవ్వాలి. రుణాత్మక మార్కులు ఎంత తగ్గించుకుంటే స్కోరు అంత మెరుగవుతుంది.

సన్నద్ధత

పరీక్షకు ముందు ఉన్న తక్కువ వ్యవధే సన్నద్ధతలో విలువైనదిగా నిలుస్తుంది. ఎక్కువ మార్కులు అందించే అంశాలను ఎంచుకుని, వాటిపైనే దృష్టి సారించాలి. పరీక్షలో గణనీయమైన వెయిటేజీ ఉన్న అధ్యాయాలకు ప్రాధాన్యమివ్వాలి. ఆ ప్రకారం సబ్జెక్టుల వారీ చదవాల్సినవి..

భౌతిక శాస్త్రం: 1. మెకానిక్స్-2 (ఫ్లూయిడ్ డైనమిక్స్, మెకానిక్స్, సర్ఫేస్ టెన్షన్, విస్కాసిటీ, ఎలాస్టిక్ సిటీ) 2. హీట్ అండ్ థర్మోడైనమిక్స్ 3. మోడరన్ ఫిజిక్స్ 4. ప్రాక్టికల్ ఫిజిక్స్ 5. విద్యుత్, అయస్కాంతత్వం 6. ఆప్టిక్స్.

రసాయన శాస్త్రం: 1. బేసిక్ ప్రిన్సిపుల్స్ అండ్ టెక్నిక్స్ ఆఫ్ ఆర్గానిక్ కెమిస్ట్రీ 2. కోఆర్డినేషన్ కాంపౌండ్స్ 3. బయో మాలిక్యూల్స్ 4. థర్మోడైనమిక్స్ 5. హైడ్రోకార్బన్స్ అండ్ బెంజీన్ 6. హాలో ఆల్కేన్స్ అండ్ హాలో అరేన్స్ 7. స్ట్రక్చర్ ఆఫ్ ఆటమ్ 8. కెమికల్ బాండింగ్.

గణితం: 1. వెక్టార్స్, 3-డీ, 2. ఎఫ్ఎల్‌సీడీ (ఫంక్షన్స్, లిమిట్స్, కంటిన్యుటీ, డిఫరెన్సియేషన్) 3. డీఈ అండ్ ఏరియాస్ 4. క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్ అండ్ ఎక్స్‌ప్రెషన్స్ 5. ప్రోగ్రెషన్స్ 6. పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్ 7. ప్రాబబిలిటీ 8. స్టాటి స్టిక్స్ 9. కోనిక్ సెక్షన్స్ 10. మ్యాట్రిసెస్, డిటెర్మినెంట్స్ లీనియర్ ఈక్వేషన్స్.

✦ కష్టమైన, తక్కువ ముఖ్యమైన అంశాల కోసం సమయం వృథా చేసుకోవద్దు. పాత ప్రశ్నపత్రాలను గమనిస్తే వేటిపై దృష్టి సారించాలో తెలుస్తుంది.

✦ ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో.. చాప్టర్ల వారీ.. ప్రతి పేరాగ్రాఫ్‌లో ఉన్న సమాచారాన్ని చదివి, ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నలను ఎలా అడగవచ్చో ఊహించుకుంటూ సాధన చేయాలి. అప్లికేషన్ ఓరియంటెడ్ సమస్యలను ప్రయత్నించడమూ ఎంతో ముఖ్యం.

✦ జేఈఈ మెయిన్-2025లోని 19 ప్రశ్నపత్రాలతో పాటూ 2024, 2023లలో నిర్వహించిన మొత్తం 60 ప్రశ్నపత్రాలనూ తప్పనిసరిగా సాధన చేయండి.

✦ మాక్ టెస్టులు రాస్తే చాలా ప్రయోజనం. వీటితో మీ ప్రస్తుత సన్నద్ధత స్థితిని తెలుసుకోవచ్చు. పొరపాట్లు సమీక్షించుకుంటే, తర్వాత పరీక్షల్లో తప్పులు తగ్గి, స్కోరు మెరుగవుతుంది.

✦ కీలక సూత్రాలు, భావనలు, సమీకరణాలు.. వీటిని మరోసారి బాగా చదవాలి. దీంతో పరీక్షలో ముఖ్యమైన సమాచారం మర్చిపోకుండా, వెంటనే గుర్తుకు తెచ్చుకోవడం వీలవుతుంది. సబ్జెక్టుల వారీ ముఖ్యమైనవి రాసుకుని, పరీక్షకు ముందు వాటినే పునశ్చరణ చేయండి.

✦ వ్యవధి తక్కువే ఉన్నందున కొత్త అధ్యాయాలను ఇప్పుడు నేర్చుకోవద్దు. ఇప్పటికే అర్థం చేసుకున్నవాటినే బాగా చదవండి.

✦ సమయ నిర్వహణ చాలా ముఖ్యం. మీ బలాలు, బలహీనతల ఆధారంగా సబ్జెక్టుల వారీ తగినంత సమయం కేటాయించండి. ఒకే అంశం లేదా సబ్జెక్టుపై ఎక్కువ సమయం గడపకూడదు. మీ ప్రణాళికకు కట్టుబడి ఉండాలి.

✦ ప్రశాంతత చాలా ముఖ్యం. ఒత్తిడి ప్రతికూల ప్రభావం చూపుతుంది. యోగా, దీర్ఘ శ్వాస, ధ్యానం లేదా తేలికపాటి వ్యాయామం.. ఇలా ఏవైనా ఆచరించండి.

✦ స్వల్ప విరామాలూ ఎంతో ముఖ్యం. అలాగే ఆరోగ్యంపైనా దృష్టి సారించాలి. వేళకు తినడం, సరిపోయేంత నిద్ర చాలా అవసరం. జంక్ ఫుడ్ తీసుకోకుండా, పోషకాహారానికి ప్రాధాన్యమిస్తే.. చురుకుగా, ఆరోగ్యంగా ఉండొచ్చు.

✦ అన్నింటి కంటే ఎంతో ముఖ్యమైంది ఆత్మవిశ్వాసం. పరీక్ష విజయంలో కీలకమైంది ఇదే. ప్రతికూల ఆలోచనలు రానీయొద్దు. సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలి.



ఉమాశంకర్ ఎం.
ఆల్ ఇండియా ఐఐటీ కో-ఆర్డినేటర్,
శ్రీ చైతన్య విద్యా సంస్థలు

ఐఓసీఎల్‌లో 2,757 అప్రెంటిస్‌లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్.. దేశ వ్యాప్తంగా వివిధ రిఫైనరీల్లో 2,756 అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
రిఫైనరీల వారీ: గువాహటి-82, బరౌనీ-313, గుజరాత్-583, హల్దియా-216, మథుర-189, పానిపట్-707, దిగ్‌భోయి-112, బంగాయిగావ్-142, పారదీప్-413..
అర్హత: పదోతరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ/ డిప్లొమా/ డిగ్రీ. **వయసు:** జనరల్, ఈడబ్ల్యూఎస్‌కు 18 నుంచి 24 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీలకు 18 నుంచి 29 ఏళ్లు, ఓబీసీలకు 18 నుంచి 27 ఏళ్లు, పీడబ్ల్యూబీడీకి 18 నుంచి 34 ఏళ్లు ఉండాలి. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబరు 18. **ఎంపిక:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్‌తో. **వెబ్‌సైట్:** https://iocl.com/apprenticeships

బీఈఎల్‌లో..

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, హైదరాబాద్.. అప్రెంటిస్‌ల కోసం దరఖాస్తులు కోరుతోంది.
- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్
- టెక్నీషియన్ అప్రెంటిస్

విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్(డీసీసీపీ).
అర్హత: సంబంధిత విభాగంలో నాలుగేళ్ల బీఈ/ బీటెక్, మూడేళ్ల డిప్లొమా. **వ్యవధి:** ఏడాది.
వయసు: 25 సంవత్సరాలు మించకూడదు.
ఎంపిక: విద్యార్హత మార్కులతో.
వాక్–ఇన్– సెలక్షన్స్ తేదీ: 09.12.2025.
వేదిక: లెర్నింగ్ సెంటర్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, నాచారం, హైదరాబాద్. **వెబ్‌సైట్:** https://bel-india.in/

ఎన్‌జీఆర్ఐలో ప్రాజెక్ట్ సిబ్బంది

నేషనల్ జియోఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్.. ప్రాజెక్ట్ సిబ్బంది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● ప్రాజెక్ట్ అసోసియేట్-I: 05 ● ప్రాజెక్ట్ అసోసియేట్-II: 04
● సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్: 05
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎమ్మెస్సీ/ఎంటెక్, ఎంఎస్, పీహెచ్‌డీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వేతనం: నెలకు ప్రాజెక్ట్ అసిస్టెంట్-1కు రూ.20,000; ప్రాజెక్ట్ అసోసియేట్-2కు రూ.28,000, జేఆర్ఎఫ్ ఉంటే.. ప్రాజెక్ట్ అసిస్టెంట్-Iకు రూ.31,000, ప్రాజెక్ట్ అసోసియేట్-IIకు రూ.35,000, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.42,000.
వయసు: ప్రాజెక్ట్ అసోసియేట్‌కు 35 ఏళ్లు; సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు 40 ఏళ్లు మించకూడదు. **ఇంటర్వ్యూ తేదీ:** 11.12.2025.
వేదిక: సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ, ఎన్‌జీఆర్ఐ మెట్రో స్టేషన్ దగ్గర, ఉప్పల్ రోడ్, హైదరాబాద్.
వెబ్‌సైట్: https://ngri.res.in/openings-at-ngri.php

రైట్స్‌లో అసిస్టెంట్ మేనేజర్లు



గురుగ్రామ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్ (రైట్స్).. 400 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులను ప్రకటించింది. ఇంజినీరింగ్ డిగ్రీతోపాటు రెండేళ్ల అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో నియామకాలుంటాయి.

సివిల్, ఎలక్ట్రికల్, ఎస్అండ్‌టీ, మెకానికల్, మెటలర్జీ, కెమికల్, ఐటీ, ఫార్మా విభాగాల్లో ఈ ఖాళీలు ఉన్నాయి.

పరీక్ష: ప్రశ్నపత్రం 125 ప్రశ్నలతో ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ప్రశ్నకు ఒక మార్కు. వ్యవధి రెండున్నర గంటలు. రుణాత్మక మార్కులు లేవు.

- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, డేటా ఇంటర్‌ప్రెటేషన్, లాజికల్ రీజనింగ్ విభాగాల నుంచి 35 ప్రశ్నల చొప్పున ఇస్తారు. బేసిక్ అవేర్‌నెస్/ జనరల్ నాలెడ్జ్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు.
- పరీక్షలో అర్హతకు అన్‌రిజర్వ్‌డ్/ ఈడబ్ల్యూఎస్‌లు 50 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ-ఎన్‌సీఎల్, దివ్యాంగులు 45 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి.
- అర్హత మార్కులు పొందిన వారి జాబితా నుంచి.. కేటగిరీల వారీ మార్కుల మెరిట్ ప్రకారం ఒక్కో పోస్టుకూ 6 మందిని ఇంటర్వ్యూకు అవకాశం ఇస్తారు. ఇంటర్వ్యూ తేదీని తర్వాత ప్రకటిస్తారు.
- తుది ఎంపికలో రాత పరీక్షకు 60 శాతం, ఇంటర్వ్యూకు 40 శాతం వెయిటేజీ ఉంటుంది.

సన్నద్ధత

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, డేటా ఇంటర్‌ప్రెటేషన్, లాజికల్ రీజనింగ్‌లపై అవగాహన పెంచుకోవడానికి వివిధ పోటీ పరీక్షల పాత ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. వీటితోపాటుగా మాక్ టెస్టులను రాయడమూ అలవాటు చేసుకోవాలి. దీంతో నిర్ణీత వ్యవధిలో సమాధానాలు రాయడానికి వీలవుతుంది. అలాగే ఏ అంశాల్లో వెనకబడి ఉన్నారో తెలుస్తుంది. అలాంటి వాటికి అదనపు సమయం కేటాయిస్తే, స్కోరు మెరుగవుతుంది.

● రాత పరీక్షను జనవరిలో నిర్వహిస్తారు. తక్కువ వ్యవధే ఉన్నందున, కాలయాపన లేకుండా ప్రణాళికతో సన్నద్ధతను కొనసాగిస్తే ఉన్న సమయంలోనే సన్నద్ధత పూర్తవుతుంది.

ముఖ్యాంశాలు

అర్హత: సివిల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ పవర్ సప్లయ్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్/ మెకానికల్/ ప్రొడక్షన్/ మెకట్రానిక్స్ అండ్ ఆటోమొబైల్/ మెటలర్జీ/ కెమికల్/ పెట్రోకెమికల్/ కంప్యూటర్ సైన్స్/ ఐటీ బ్రాంచ్‌తో ఇంజినీరింగ్ డిగ్రీ. లేదా ఫుడ్‌టెక్నాలజీ/ బయోటెక్నాలజీ/ ఫార్మసీ డిగ్రీ. వీటిని జనరల్/ ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు చెందినవారు 60 శాతంతో, ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ-ఎన్‌సీఎల్, దివ్యాంగులు 50 శాతంతో పూర్తిచేయాలి. సంబంధిత రంగంలో రెండేళ్ల అనుభవం తప్పనిసరి.

వయసు: దరఖాస్తు గడువు తేదీ నాటికి 40 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీలకు రూ.600. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు రూ.300.

వేతనం: నెలకు రూ.42,478. ఇది ప్రాథమిక వేతనం మాత్రమే. పనిచేసే ప్రదేశాన్ని బట్టి దీన్ని పెంచుతారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25.12.2025

రాత పరీక్ష తేదీ: 11.01.2026

పరీక్ష కేంద్రాలు: దిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, భువనేశ్వర్, బిలాయ్, పట్నా, లఖ్‌నవూ.

వెబ్‌సైట్: https://rites.com/

సీఐటీడీలో పీజీ డిప్లొమా..

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ), హైదరాబాద్.. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
● పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్ అండ్ సీఏడీ/సీఏఎం (పీజీడీటీడీ అండ్‌సీసీ) (సీనియర్ టూల్‌డిజైనర్ సీఏడీ/సీఏఎం). సీట్ల సంఖ్య: 60.
వ్యవధి: ఏడాది (రెండు సెమిస్టర్లు)
అర్హత: బీఈ/ బీటెక్(మెకానికల్) లేదా తత్సమానం. **వయసు:** 45 సంవత్సరాలు మించకూడదు. **దరఖాస్తు ఫీజు:** ఎస్సీ/ఎస్టీలకు రూ.300. ఇతరులకు రూ.700.
ఎంపిక: మార్కుల మెరిట్‌తో
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20.12.2025.
అడ్మిషన్ కౌన్సెలింగ్ తేదీ: 22.12.2025.
వెబ్‌సైట్: https://www.citdindia.org/

చదువు
కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా:
చదువు, ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మం.,
రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512
edc@eenadu.in

డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌లో..

డిజిటల్ ఇండియా కార్పొరేషన్, దిల్లీ.. ఒప్పంద ప్రాతిపదికన పలు ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● హెడ్ ఎస్ఈఎంటీ - 06
● సీనియర్ కన్సల్టెంట్ - 06 ● కన్సల్టెంట్ - 07
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 55 శాతం మార్కులతో బీఈ/ బీటెక్/ ఎంటెక్/ ఎమ్మెస్సీ/ ఎంబీఏ/ ఎంసీఏతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 05.12.2025.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://dic.gov.in/careers/

వర్క్ ఫ్రమ్ హోమ్

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: ఇన్‌అమిగోస్ ఫౌండేషన్
నైపుణ్యాలు: గ్రాఫిక్ డిజైన్, ఇలస్ట్రేటర్, క్రియేటివ్ రైటింగ్, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.4,500-6,500
దరఖాస్తు గడువు: డిసెంబరు 24
☛ https://shorturl.at/o3Y4L

మార్కెటింగ్

సంస్థ: కెరియర్స్360
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, మార్కెటింగ్
స్టైపెండ్: రూ.15,150 (ఒకేసారి)
దరఖాస్తు గడువు: డిసెంబరు 25
☛ https://shorturl.at/PYFWU

బస్తీకీ పాఠశాల ఫౌండేషన్

1. ప్రోగ్రామ్ అసిస్టెంట్

నైపుణ్యాలు: బిజినెస్ అనాలిసిస్, బిజినెస్ రిసెర్చ్, క్లయింట్ రిలేషన్‌షిప్, ఇంగ్లిష్ రాయడం, మార్కెటింగ్ క్యాంపైన్స్, మార్కెటింగ్ స్ట్రాటజీస్, మార్కెట్ రిసెర్చ్
స్టైపెండ్: రూ.1,500-15,000 (ఒకేసారి)
దరఖాస్తు గడువు: డిసెంబరు 25
☛ https://shorturl.at/3xxO4

2. బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

నైపుణ్యం: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్
స్టైపెండ్: రూ.1,500-15,000 (ఒకేసారి)
దరఖాస్తు గడువు: డిసెంబరు 26
☛ https://shorturl.at/DsSZY

రిక్రూట్‌మెంట్ కన్సల్టెంట్

సంస్థ: కన్సల్ట్ బే
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, ఎంఎస్-ఎక్సెల్, రిక్రూట్‌మెంట్

ఇంటర్న్‌షిప్స్

స్టైపెండ్: రూ.5,000-8,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 24
☛ https://shorturl.at/Q1aT3

ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్

సంస్థ: ఎమోలర్ టెక్నాలజీ ప్రై.లి.
నైపుణ్యాలు: సీఎస్ఎస్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, రియాక్ట్
స్టైపెండ్: రూ.6,000-8,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 26
☛ https://shorturl.at/uhucX

మెషిన్ లెర్నింగ్

సంస్థ: అర్వ్యాక్స్ టెక్నాలజీస్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్, డీప్‌లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్, నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (ఎన్ఎల్‌పీ), పైతాన్, వెబ్ డెవలప్‌మెంట్
స్టైపెండ్: రూ.3,000-7,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 26
☛ https://shorturl.at/QKeEb

మోషన్ డిజైన్ (ఎండీ)

సంస్థ: ఎక్స్‌పర్టల్ ఎస్ఏ - ప్రొసీడిట్ (బార్సిలోనా, స్పెయిన్)
నైపుణ్యాలు: డిజైన్, మోషన్ గ్రాఫిక్స్, వీడియో మార్కెటింగ్
స్టైపెండ్: రూ.1,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 26
☛ https://shorturl.at/L2EbX

టీచింగ్ ఫ్రెంచ్

సంస్థ: అరివ్ లెర్నింగ్
నైపుణ్యాలు: ఫ్రెంచ్ మాట్లాడటం, రాయడం, ఆన్‌లైన్ టీచింగ్
స్టైపెండ్: రూ.12,000-15,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 26
☛ https://shorturl.at/UeDMq

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు

★ హురున్ ఇండియా రిచ్‌లిస్ట్ 2025 ప్రకారం భారతదేశంలో అత్యంత ధనవంతుడిగా ఎవరు నిలిచారు? (ఈయన సంపద నికర విలువ రూ.9.55 లక్షల కోట్లుగా ఉంది. రూ.8.15 లక్షల కోట్లతో గౌతమ్ అదానీ రెండో స్థానంలో నిలిచారు.)



జ: ముఖేష్ అంబానీ

★ 'మహాత్మా గాంధీ అండ్ ది ఎన్విరాన్‌మెంట్' అనే పుస్తకాన్ని ఇటీవల ఎవరు రచించారు? (ప్రఖ్యాత పర్యావరణవేత్తలైన ఈ రచయితలు ప్రకృతి, వనరుల వినియోగంపై మహాత్మా గాంధీ ఆలోచనా సరళి, అభిప్రాయాలను తెలియజేస్తూ ఈ పుస్తకాన్ని రచించారు.)

జ: త్రిలోక్‌నాథ్ ఖోషూ, జాన్ ఎస్. మూలక్కట్టు

★ ప్రారంభ దశ అల్జీమర్స్ చికిత్సలో వాడే లెకనెమాబ్ (లెకెంబి) ఔషధాన్ని వాడటానికి ఇటీవల ఏ దేశం ఆమోదం తెలిపింది? (ఈ దేశంలో మరణాలకు ప్రధాన కారణంగా నిలుస్తున్న అల్జీమర్స్ నియంత్రణకుగాను ఈ దేశ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.)

జ: ఆస్ట్రేలియా

★ కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) ఛైర్మన్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?

జ: వివేక్ చతుర్వేది

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?



☛ ఎయిమ్స్ దిల్లీ లో గ్రూప్-బీ, సీ పోస్టులు (1,383)
చివరి తేదీ: 2.12.2025

☛ కేరళ రబ్బర్ బోర్డులో సైంటిస్ట్ ఉద్యోగాలు (50)
చివరి తేదీ: 1.12.2025

SENIOR INTER English

Of Studies: Francis Bacon



Annotations (4 Marks)

1. Studies serve for delight, for ornament and for ability.

A: Context: This line is taken from the essay "Of Studies" written by Francis Bacon. He was called the Father of English Essay. This line is about the benefits of studies.

Final Exams - 2026 IMPORTANT Q&A

Explanation: We get delight when we read a book. When we are at leisure, we read and enjoy. Reading enriches our capacity of communication and judgement. Thus it makes us efficient and it is like an ornament. Effective thinking and perfect knowledge are possible by studies.

2. Phenomenen contemn studies, simple men admire them, and wise men use them.

A: Context: This sentence is taken from the essay"Of Studies" written by Francis Bacon. He was called the Father of English Essay. This line is about people who treat studies in their own way.

Explanation : While looking into the practical side of the subject, the writer points out, three kinds of people. Cunning and dishonest people dislike studies. They are proud that they have enough of knowledge. There are people who are interested in studies. The third group of people who are wise, study books well, get knowledge and apply it in their daily life.

General Relevance : Bacon's sentences are aphoristic. They are filled with sensible ideas. The division of the three kinds,'shows the wit of Bacon. Real life situations are shown in the essay.

Short Answer Question (4 Marks)

1. What did Bacon mean in the line "Some books are to be tasted, others to be swallowed and some few to be chewed and digested".

A: Francis Bacon was a great English essayist. In the essay 'Of Studies', he gives the benefits of studies and the importance of reading books. He writes with an aphoristic style. He describes books to be of three types. Some books are there for formal reading, just taste it and leave it. Some books have to be studied completely.

For more IMP Q&A



Writer: J.Shyamala

సాగుదారులకు సంస్థాగత సాయం!

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ విత్తవనరులు

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే జీవనాడి. ప్రజల్లో అధికశాతానికి వ్యవసాయమే జీవనాధారం. రాష్ట్ర రైతుల్లో కౌలుదారులు, చిన్న రైతులు ఎక్కువగా ఉన్నారు. వీరికి పెట్టుబడి వనరులు పరిమితంగా ఉండటంతో పాటు ఆదాయ స్థిరత్వం లేకపోవడంతో క్రమంగా రుణాల ఊబిలో చిక్కుకున్నారు. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రభుత్వం సంస్థాగతంగా పెట్టుబడి సాయాన్ని, రుణాలను అందిస్తోంది. రైతు సంక్షేమ కార్యక్రమాల ద్వారా సాగును లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తోంది. ఈ అంశంపై పోటీ పరీక్షార్థులకు సమగ్ర పరిజ్ఞానం ఉండాలి. రైతులకు అందే వివిధ రకాల రుణాలు, ప్రభుత్వం సమకూరుస్తున్న ప్రయోజనాలు, పథకాలు సహా రైతు ఆత్మహత్యల నివారణకు చేపట్టిన చర్యల గురించి తెలుసుకోవాలి.

రాష్ట్ర వ్యవసాయ రంగం అనేక ప్రకృతిపరమైన పరిస్థితులతో ప్రభావితమవుతూ చిన్న, సన్నకారు రైతులకు స్థిరమైన ఆదాయం లేని ఉపాధిగా మారింది. పెట్టుబడుల కోసం అప్పులు చేసి, గిట్టుబాటు ధరలు లభించక అప్పులపై వడ్డీలు చెల్లించలేక లక్షలాది వ్యవసాయ కుటుంబాలు రుణాల్లో చిక్కుకున్నాయి. రాష్ట్ర గ్రామీణ వ్యవస్థలో రుణ బాధ అధికంగా ఉంది.



గ్రామీణ రుణగ్రస్తతకు ముఖ్య కారణాలు: 1) పేదరికం 2) రుణ భారం 3) లాభాలు అందించలేని వ్యవసాయం 4) అధిక కౌలు 5) వడ్డీ వ్యాపారులపై ఆధారపడటం 6) కుటుంబ వారసత్వం, పండగలు, ఆచారాల పేరుతో స్తోమతకు మించి చేసే వ్యయం 7) కోర్టు కేసులు 8) అనారోగ్యం 9) చెడు అలవాట్లు.

కాలపరిమితి ఆధారంగా వ్యవసాయ రుణాలు మూడు రకాలు

జనరల్ స్టడీస్
ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ

1) స్వల్పకాలిక రుణాలు- 15 నెలల్లోపు తిరిగి చెల్లించాలి. 2) మధ్యకాలిక రుణాలు- 15 నుంచి 60 నెలల్లోపు తిరిగి చెల్లించాలి. 3) దీర్ఘకాలిక రుణాలు- 60 నెలలకు మించి 20 సంవత్సరాల వరకు తిరిగి చెల్లించాలి.

రుణం ఇచ్చేవారి ఆధారంగా


1) **సంస్థాగత మార్గాలు:** ఇందులో కేవలం పట్టాదారు పాస్‌బుక్‌లు లేదా కౌలుకార్డులు ఉన్నవారికి మాత్రమే వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ, సహకార బ్యాంకులు వ్యవసాయ రుణాలు ఇస్తాయి.
2) **సంస్థాగతం కాని మార్గాలు:** వ్యవసాయం కోసం రుణాలను వడ్డీ వ్యాపారులు, వర్తకుల నుంచి పొందడాన్ని సంస్థాగతం కాని మార్గాలు అంటారు.

రుణ వినియోగం ఆధారంగా

1) **టర్మ్ లోన్:** ఇది దీర్ఘకాలిక, మధ్యకాలిక కాలపరిమితి ఉన్న రుణం. **ఉదా:** ట్రాక్టర్ కొనుగోలుకు, బోరుబావి తవ్వకానికి, అదనపు భూమి కొనుగోలు లాంటి వాటికి బ్యాంకులు టర్మ్‌లోన్ ఇస్తాయి.
2) **క్రాప్ లోన్:** ఇది స్వల్పకాలిక కాలపరిమితి రుణం. **ఉదా:** విత్తనాలు, యూరియా, పురుగుమందుల కొనుగోలు లాంటి వాటికి బ్యాంకులు పంట రుణం మంజూరు చేస్తాయి.



ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన



వ్యవసాయ పెట్టుబడి అందించడం కోసం రైతుకు నేరుగా ఏడాదికి రూ.6 వేల చొప్పున అందించే కేంద్ర ప్రభుత్వ పథకం. 2018, డిసెంబరు 1 నుంచి అమల్లోకి వచ్చింది. రైతు బ్యాంకు ఖాతాకు మూడు విడతలుగా (ఒక్కో విడతలో రూ.2,000) ఈ మొత్తాన్ని ప్రభుత్వం బదిలీ చేస్తుంది.

అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్


ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి రైతు కుటుంబానికి వ్యవసాయ అవసరాల కోసం కేంద్రం పీఎం కిసాన్ పథకంలో అందించే రూ.6,000తో కలిపి మొత్తం రూ.20 వేలు వార్షిక పెట్టుబడి సహాయంగా అందించే పథకం. ఇందులో వార్షిక పెట్టుబడి సహాయాన్ని మూడు విడతలుగా (మొదటి విడత రూ.7000 + రెండో విడత రూ.7,000 + మూడో విడత రూ.6,000) రైతు బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం బదిలీ చేస్తుంది. ఈ పథకంలో రైతులకు ఏటా ఇచ్చే సహాయం రూ.20 వేలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.14 వేలు ఇస్తుండగా, పీఎం కిసాన్ ద్వారా రూ.6 వేలు అందుతుంది. భూమి ఉన్న రైతులతో పాటు, భూమి లేని కౌలుదారులకు కూడా రూ.20 వేలు వార్షిక పెట్టుబడి సహాయాన్ని ఏపీ ప్రభుత్వం అందిస్తుంది. ✦ 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్' పథకాన్ని 'సూపర్ సిక్స్' హామీ లో భాగంగా 2025, ఆగస్టు 2న ప్రకాశం జిల్లా దర్శి మండలం వీరాయపాలెం వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. మొదటి విడతగా 46,85,838 మంది రైతుల ఖాతాల్లో రూ.7,000 చొప్పున జమ చేశారు.

విడత	ఆర్థిక సహాయం (రూపాయల్లో)
మొదటి	ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 5,000 + పీఎం కిసాన్ 2,000 = 7000
రెండో	ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 5,000 + పీఎం కిసాన్ 2,000 = 7000
మూడో	ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 4,000 + పీఎం కిసాన్ 2,000 = 6000



కౌలుదారులకు పంట రుణాలు: ఏపీ ప్రభుత్వం కౌలుదారులకు రుణాలు, పంటల బీమా, రాయితీపై వ్యవసాయ పరికరాలు, పెట్టుబడి రాయితీ, ఆత్మహత్యల పరిహారం అందించేందుకు 2019లో ఆంధ్రప్రదేశ్ క్రాప్ కల్టివేషన్ రైట్స్ యాక్ట్ (సీసీఆర్‌సీ చట్టం) చేసింది. దీని ప్రకారం భూయజమాని, కౌలుదార్ల మధ్య ఒప్పందం జరుగుతుంది. కౌలుదారుడికి 11 నెలలు పంట సంబంధ హక్కులు ఉంటాయి. యజమాని యాజమాన్య హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లదు. 2025-26 సంవత్సరానికి 5.99 లక్షల కౌలుదారులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేశారు.

రైతు ఆత్మహత్యలు:



నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో ప్రకారం ఆత్మహత్యలు చేసుకున్న రైతుల్లో అధికశాతం కౌలుదార్లు, సన్నకారు, చిన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు. రైతు ఆత్మహత్యలు ఎక్కువగా నమోదైన రాష్ట్రాలు 1) మహారాష్ట్ర 2) కర్ణాటక 3) ఆంధ్రప్రదేశ్.
ప్రధాన కారణాలు: రుణ బాధ, పంట వైఫల్యం, కుటుంబ సమస్యలు, అనారోగ్యం, ఆల్కహాల్.
ఆత్మహత్యలను తగ్గించే చర్యలు: కమతాల ఏకీకరణ, సహకార వ్యవసాయం, ఆధునిక సేద్య విధానాలు, ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమాలు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, మెరుగైన పరపతి, వ్యవసాయ బీమా, దళారులు, మధ్యవర్తుల ప్రమేయం తగ్గించడం తద్వారా రైతుకు గిట్టుబాటు ధర కల్పన.
2019, జులై 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ.7 లక్షల పరిహారాన్ని అందిస్తోంది.

రైతుమిత్ర గ్రూపులు: సన్న, చిన్నకారు రైతులు, కౌలుదారులను రైతుమిత్ర గ్రూపులుగా ఏర్పాటుచేసి ప్రభుత్వరంగ బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందిస్తారు. ప్రతి 100 హెక్టార్లకు ఒక రైతుమిత్ర గ్రూపు ఏర్పాటవుతుంది. ప్రతి 10 గ్రూపులకు బహుళార్థక విస్తరణ అధికారి పర్యవేక్షకుడిగా పనిచేస్తారు.

వ్యవసాయ రుణాలు - వడ్డీ రేట్లు: 2006-07 ఆర్థిక సంవత్సరం నుంచి కేంద్రం 'ఇంట్రెస్ట్ సబ్‌వర్షన్ స్కీమ్' ప్రవేశపెట్టింది. పంట రుణాలు రూ.3 లక్షల లోపు ఉంటే వడ్డీ 7%గా నిర్ణయించింది. సకాలంలో తిరిగి చెల్లిస్తే 3% మినహాయింపు ఇస్తారు. అంటే పంటరుణాల నికర వడ్డీ 4% మాత్రమే.

రుణమాఫీ: కేంద్రం 1990లో సన్న, చిన్నకారు రైతులకు రూ.10,000ల వరకు రుణమాఫీ చేసింది. 2008లో కేంద్రం రెండోసారి మాఫీ చేసింది. 2014లో ఏపీ ప్రభుత్వం 'కోటయ్య కమిటీ' సిఫార్సులపై కుటుంబానికి గరిష్ఠంగా రూ.1,50,000ల రుణమాఫీ చేసింది. ఇందులో 54.98 లక్షల మంది ప్రయోజనం పొందారు.



రచయిత: పి.వి.సుబ్బారెడ్డి

పునరుత్పాదక వనరులతోనే ఇంధన భద్రత!

దేశ అభివృద్ధికి శక్తివనరులు

ఆధునిక ఆర్థిక వ్యవస్థలకు శక్తి వినియోగం, దాని లభ్యతే కీలకం. వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా, విద్యుత్తు ఉత్పత్తి, వివిధ రకాల సేవలకు మూలవనరు శక్తి. నిత్య జీవిత కార్యకలాపాల నుంచి, దేశ ఆర్థిక ప్రగతి వరకు అన్నింటికీ శక్తివనరులే చోదక శక్తులు. శక్తి అవసరాల కోసం సంప్రదాయ శిలాజ ఇంధనాలతో పాటు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చేసిన సౌరశక్తి, పవన శక్తి, బయోమాస్ ఎనర్జీ తదితర పునరుత్పాదక ఇంధన వనరుల వాడకమూ పెరిగింది. వాటి లభ్యత, దేశవ్యాప్తంగా ఏర్పాటైన ఉత్పత్తి కేంద్రాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. సంప్రదాయేతర శక్తి ఉత్పత్తి, వినియోగం తీరుతెన్నులతో పాటు సంబంధిత సాంకేతికతలనూ అర్థం చేసుకోవాలి.



సైన్స్ అండ్ టెక్నాలజీ

1. కిందివాటిలో వేరుగా ఉన్న శక్తి వనరును గుర్తించండి.
ఎ) సౌరశక్తి బి) పెట్రోల్ సి) డీజిల్
డి) బొగ్గు ఇ) సహజ వాయువు
1) ఎ, బి 2) ఎ 3) సి 4) ఇ

2. కిందివాటిలో శిలాజ ఇంధనాలు కానివి ఏవి?
ఎ) బొగ్గు బి) సహజ వాయువు
సి) బయోడీజిల్ డి) హైడ్రోజన్
ఇ) బయోగ్యాస్
1) సి, డి, ఇ 2) బి, సి, డి 3) ఎ, బి, సి 4) ఇ

3. శిలాజ ఇంధనాలు వాడటం వల్ల కలిగే నష్టాలు ఏవి?



ఎ) వాయు కాలుష్యం పెరుగుతుంది.
బి) శిలాజ ఇంధనాలు పరిమితంగా లభ్యమవుతాయి.
సి) వీటిని వెలికితీసే క్రమంలో ఆవరణ వ్యవస్థ దెబ్బతింటుంది.
డి) వాడిన తర్వాత తిరిగి ఏర్పడవు.
1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, బి, సి, డి

4. కిందివాటిలో వేటిని నూతన లేదా కొత్తరకం ఇంధన వనరులు అంటారు?
ఎ) బయోహైడ్రోజన్ బి) ఫ్యూయల్ సెల్స్
సి) బయోడీజిల్
డి) బయో సి.ఎన్.జి. (బయో కంప్రెస్డ్ న్యాచురల్ గ్యాస్)
1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి, డి 4) సి, డి

5. కిందివాటిలో పునరుద్ధరింపలేని శక్తివనరులకు ఉదాహరణ?
ఎ) భూగర్భ ఉష్ణశక్తి బి) సముద్ర అలల శక్తి
సి) పవన శక్తి డి) పెట్రోలియం
ఇ) సహజవాయువు
1) డి, ఇ 2) సి, డి 3) బి, సి 4) ఎ, బి, సి

6. వివిధ రకాల శక్తివనరులు కింది ఏ విధంగా ఉపయోగపడతాయి?
ఎ) విద్యుత్తు ఉత్పత్తి
బి) పరిశ్రమలు పని చేయడానికి
సి) వాహనాలు నడవడానికి
డి) ఉష్ణాన్ని, నీటిఆవిరిని ఉత్పత్తి చేయడానికి
1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి 3) ఎ, డి 4) బి, డి

7. కింది వేటిని సాంప్రదాయేతర ఇంధన వనరులుగా పిలుస్తారు?
ఎ) భూగర్భ ఉష్ణశక్తి బి) అలలశక్తి
సి) బయోమాస్ ఎనర్జీ డి) సౌరశక్తి
ఇ) పవనశక్తి
1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి, డి, ఇ 3) సి, డి 4) డి, ఇ

8. కిందివాటిని సరైన క్రమంలో అమర్చండి.
ఎ) బొగ్గు 1) బయోమాస్ ద్వారా ఉత్పత్తి
బి) సౌరశక్తి 2) నూనెల నుంచి ఉత్పత్తి
సి) గోబర్ గ్యాస్ 3) శిలాజ ఇంధనం
డి) బయోడీజిల్ 4) పునరుద్ధరించే ఇంధన వనరు
ఇ) ఫ్యూయల్ సెల్ 5) కొత్తరకం ఇంధన వనరు
1) ఎ-2, బి-3, సి-4, డి-1, ఇ-5
2) ఎ-5, బి-3, సి-2, డి-1, ఇ-4
3) ఎ-3, బి-4, సి-1, డి-2, ఇ-5
4) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5

9. కిందివాటిలో ఎన్ని జతలు సరైనవి.



ఎ) సహజవాయువు - మీథేన్
బి) పవనశక్తి - పునరుద్ధరింపజేసే ఇంధన వనరు
సి) ఇథనాల్ - బయోఫ్యూయల్
డి) పెట్రోలియం - పునరుద్ధరించలేని ఇంధన వనరు
1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

10. బొగ్గులో ఉండే కర్బన శాతం ఆధారంగా కింది వాటిని సరైన విధంగా జతపరచండి.
ఎ) ఆంత్రసైట్ 1) 60% కార్బన్
బి) బ్యుటమినస్ 2) 90% కార్బన్
సి) లిగ్నైట్ 3) 80% కార్బన్
డి) పీట్ 4) 70% కార్బన్
1) ఎ-2, బి-3, సి-4, డి-1 2) ఎ-3, బి-2, సి-4, డి-1
3) ఎ-1, బి-2, సి-4, డి-3 4) ఎ-4, బి-3, సి-1, డి-2

11. సౌరశక్తి, పవనశక్తి లాంటి పునరుద్ధరించే ఇంధనవనరులు వాడుకోవడం వల్ల కలిగే లాభాలు?
ఎ) వాయుకాలుష్యం ఉండదు
బి) గ్రీన్‌హౌస్ వాయువులు వెలువడవు
సి) ఇంధన భద్రత సాధ్యమవుతుంది
డి) విద్యుత్తు ఉత్పత్తి పెరుగుతుంది
1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, బి, సి, డి

12. కింది సాంకేతికతలను సరైన క్రమంలో అమర్చండి.
ఎ) సూపర్ క్రిటికల్ టెక్నాలజీ 1) ఇథైల్ ఆల్కహాల్
బి) ఫొటోవోల్టాయిక్ టెక్నాలజీ 2) బయోగ్యాస్
సి) బయోమాస్ ఫెర్మెంటేషన్ టెక్నాలజీ 3) బొగ్గును పూర్తిగా మండించడం
డి) ట్రాన్స్ ఎస్టరిఫికేషన్ 4) సౌరశక్తి నుంచి విద్యుత్తు శక్తి తయారుచేయడం
ఇ) ఆల్కహాల్ ఫెర్మెంటేషన్ సాంకేతికత 5) బయోడీజిల్ తయారీ
1) ఎ-2, బి-3, సి-4, డి-1, ఇ-5
2) ఎ-4, బి-3, సి-2, డి-5, ఇ-1
3) ఎ-3, బి-4, సి-2, డి-5, ఇ-1
4) ఎ-1, బి-3, సి-2, డి-4, ఇ-5

13. థర్మల్ పవర్ ప్లాంట్‌లో నీటి ఆవిరితో కింది ఏ విధంగా విద్యుత్తు ఉత్పత్తిని చేయవచ్చు?



ఎ) బొగ్గును మండించడం
బి) సహజవాయువును మండించడం
సి) అణుఇంధనాలను ఉపయోగించడం
డి) సౌరశక్తితో నీటిని వేడి చేయడం
ఇ) బయోమాస్‌ను మండించడం
1) ఎ, ఇ 2) ఎ, డి 3) సి, డి 4) ఎ, బి, సి, డి, ఇ

14. ఇంటిగ్రేటెడ్ గ్యాసిఫికేషన్ కంబైన్డ్ సైకిల్ అనే ప్రక్రియ కింది దేని కోసం ఉపయోగిస్తారు?
ఎ) సహజవాయువు నుంచి విద్యుత్తు ఉత్పత్తికి
బి) బొగ్గును సింథటిక్ గ్యాస్‌గా మార్చి విద్యుత్తు ఉత్పత్తి చేయడానికి
సి) బయోగ్యాస్ నుంచి విద్యుత్తు ఉత్పత్తికి
డి) హైడ్రోజన్ వాయువు తయారీ, విద్యుత్తు ఉత్పత్తి
1) ఎ, డి 2) బి 3) సి 4) సి, డి

15. అణురియాక్టర్లను ఉపయోగించి అణువిద్యుత్తును తయారుచేయడానికి కిందివేటిని అణుఇంధనాలుగా వాడతారు?
ఎ) యురేనియం బి) ప్లుటోనియం సి) థోరియం
డి) రేడియో కార్బన్ ఇ) రేడియోకోబాల్ట్
1) బి, సి, డి 2) సి, డి, ఇ 3) ఎ, బి, సి 4) ఎ, డి, ఇ

16. నిత్యజీవితంలో సౌరశక్తిని కింది ఏ విధంగా ఉపయోగించుకోవచ్చు?
ఎ) సోలార్ ప్యానెల్ ద్వారా విద్యుత్తు ఉత్పత్తికి
బి) సోలార్ వాటర్ హీటర్ ద్వారా నీటిని వేడి చేసేందుకు
సి) సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా నీటి ఆవిరి నుంచి విద్యుత్తు ఉత్పత్తికి
డి) సౌరశక్తిని కేంద్రీకరించి సోలార్ ఫర్నేస్ ద్వారా లోహాలను కరిగించడానికి
ఇ) సోలార్ కుక్కర్ ద్వారా ఆహార పదార్థాలను వండడానికి
1) ఎ, బి, సి, డి, ఇ 2) సి, డి, ఇ
3) బి, డి, ఇ 4) ఎ, సి, డి

17. భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న సోలార్ పార్కులను, సోలార్ విద్యుత్తు కేంద్రాలను జతపరచండి.
ఎ) బాడ్లా సోలార్ పార్క్ 1) కర్ణాటక
బి) పావగడ సోలార్ పార్క్ 2) రాజస్థాన్
సి) ఫ్లోటింగ్ సోలార్ పార్క్ 3) గుజరాత్
డి) కావ్‌డా సోలార్ పార్క్ 4) రామగుండం
ఇ) అల్ట్రామెగా సోలార్ పార్క్ 5) కర్నూలు
1) ఎ-1, బి-3, సి-4, డి-5, ఇ-2
2) ఎ-1, బి-2, సి-5, డి-4, సి-3
3) ఎ-2, బి-1, సి-4, డి-3, ఇ-5
4) ఎ-5, బి-3, సి-2, డి-1, ఇ-4

18. పవనశక్తి గురించి కిందివాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) పవనశక్తిని విద్యుత్తు ఉత్పత్తికి, నీటిని తోడడానికి వాడతారు.
బి) పవన విద్యుత్తు ఉత్పత్తికి ఉండాల్సిన కనీస గాలి వేగం గంటకు 15 కి.మీ.
సి) దేశంలో అన్ని ప్రదేశాల్లో, అన్నివేళలా పవన విద్యుత్తును ఉత్పత్తి చేయలేము.
డి) పవన విద్యుత్తు ఉత్పత్తిలో ఎలాంటి కాలుష్యపదార్థాలు వెలువడవు.
1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, బి, సి, డి

19. భూగర్భ ఉష్ణశక్తి ద్వారా విద్యుత్తు ఉత్పత్తి కోసం ఏర్పాటు చేసిన పైలెట్ ప్రాజెక్టులను ఆయా ప్రాంతాలతో జతపరచండి.
ఎ) పుగా లోయ 1) గుజరాత్
బి) కాంబెగ్రాబెన్ 2) లద్దాఖ్
సి) మణికరన్ 3) రాజస్థాన్
డి) బార్‌మర్ 4) హిమాచల్ ప్రదేశ్
ఇ) తవాంగ్ 5) అరుణాచల్‌ప్రదేశ్
1) ఎ-2, బి-1, సి-4, డి-3, ఇ-5
2) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5
2) ఎ-5, బి-4, సి-1, డి-2, ఇ-3
4) ఎ-1, బి-3, సి-2, డి-4, ఇ-5

20. కింది వాక్యాల్లో సరైన వాటిని ఎన్నుకోండి.
ఎ) ప్రస్తుతం అధిక పవన విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రం - గుజరాత్
బి) అధిక సౌరవిద్యుత్తు ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రం - రాజస్థాన్
సి) అరుణాచల్ ప్రదేశ్‌ను హైడ్రోపవర్ క్యాపిటల్ అంటారు.
1) ఎ, బి 2) బి 3) ఎ, బి, సి 4) సి

21. సముద్రం నుంచి కింది ఏవిధంగా విద్యుత్తు ఉత్పత్తి చేయవచ్చు.



ఎ) ఆటుపోట్లతో టర్బైన్‌ను తిప్పి
బి) అలల శక్తిని ఉపయోగించి టర్బైన్ ద్వారా
సి) సముద్రంలోని నీటికి ఉన్న ఉష్ణోగ్రతల భేదం ఆధారంగా
1) ఎ, బి, సి 2) బి, సి 3) సి, డి 4) బి

22. భారత్‌లో సముద్రం నుంచి విద్యుత్తు తయారీ, వినియోగానికి సంబంధించిన కింది వాక్యాల్లో సరైనవి ఏవి?
ఎ) ఆటు, పోటుల ద్వారా విద్యుత్తు తయారీకి అనువైన ప్రాంతాలు - గుజరాత్, పశ్చిమ బెంగాల్
బి) అలల శక్తి ద్వారా విద్యుత్తు ఉత్పత్తికి ఉపయోగపడే ప్రాంతాలు - మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్
సి) సముద్రం నుంచి విద్యుత్తు శక్తిని తయారుచేసి గ్రిడ్‌కు కలిపి వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు.
1) ఎ 2) బి 3) ఎ, బి 4) బి, సి

సమాధానాలు

1-2; 2-1; 3-4; 4-3; 5-1; 6-1; 7-2; 8-3; 9-4; 10-1; 11-4; 12-3; 13-4; 14-2; 15-3; 16-1; 17-3; 18-4; 19-1; 20-3; 21-1; 22-3.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

సంవర్గమానం, ఘాతాంకం..
ఒకదానికొకటి విలోమం!

సంవర్గమానాలు

ముఖ్యాంశాలు

సంవర్గమానం అనేది ఘతాంకాలను రాయడానికి మరో పద్ధతి. ఘాతాంకానికి, ఆధార అంకె లేదా సంఖ్యకు మధ్య ఉన్న సంబంధాన్ని సూచించే ప్రాథమిక గణిత భావనే సంవర్గమానం. ధన వాస్తవ సంఖ్యలకు మాత్రమే సంవర్గమానాలను నిర్వచించవచ్చు.

✦ సంవర్గమానం, ఘాతాంకం ఒకదానికొకటి విలోమం అవుతాయి.

ప్రాథమిక సూత్రం: $\log_x^y = a \Rightarrow y = x^a$

ఇందులో x అనేది భూమి లేదా ఆధారం. $x > 0, x \neq 1$ అయి ఉండాలి.

a అనేది ఘాతం: y అనేది విలువ ($y > 0$ అయి ఉండాలి)

- $\log_a^1 = 0, \log_a^a = 1, a^{\log_a^x} = x, \log_a{(a^x)} = x$
- $\log_a^{xy} = \log_a^x + \log_a^y$
- $\log_a^{(x/y)} = \log_a^x - \log_a^y$
- $\log_a^{x^m} = m\log_a^x;\ \log_b^a = \frac{\log a}{\log b};\quad \log_{a^b}{(x)} = \frac{1}{b}\log_a^x$

మాదిరి ప్రశ్నలు

1. $a = \log_{3x}^x;\ b = \log_{5x}^{3x},\ c = \log_{9x}^{5x}$ అయితే $bc(2 - a)$ విలువ ఎంత?

1) $\frac{1}{9}$ 2) 1 3) $\frac{5}{3}$ 4) 3

సాధన: $bc(2 - a) = 2bc - abc$

$= 2\log_{5x}^{3x}.\log_{9x}^{5x} - \log_{3x}^x\log_{5x}^{3x}.\log_{9x}^{5x}$

$\log_b^a \log_c^b = \frac{\log a}{\log b} \times \frac{\log b}{\log c} = \frac{\log a}{\log c} = \log_c^a$ సూత్రం ఆధారంగా

$2bc - abc = 2\log_{9x}^{3x} - \log_{9x}^x$

$= \log_{9x}^{\frac{(3x)^2}{x}} = \log_{9x}^{9x} = 1$

సమాధానం: 2

2. $a^{\log b - \log c} \times b^{\log c - \log a} \times c^{\log a - \log b}$ విలువ ఎంత?

1) 1 2) 0 3) abc 4) పైవేవీ కావు

సాధన: $a^{\log b - \log c} \times b^{\log c - \log a} \times c^{\log a - \log b} = k$ అనుకుందాం.

$\log [a^{\log b - \log c} \times b^{\log c - \log a} \times c^{\log a - \log b}] = \log k$

$\Rightarrow \log k = (\log b - \log c)(\log a) + (\log c - \log a)(\log b) + (\log a - \log b)(\log c)$

$\Rightarrow \log k = 0 \Rightarrow k = 1$

సమాధానం: 1

3. $\log_{60}^5 = p,\ \log_{60}^6 = q$ అయితే $\log_{60}^{32}$ విలువ ఎంత?

1) $5(p - q - 1)$ 2) $6(1 - p - q)$
3) $5(1 - p - q)$ 4) $6(p - q - 1)$

సాధన: $p + q = \log_{60}^5 + \log_{60}^6$

$= \log_{60}^{(5 \times 6)} = \log_{60}^{30} = \log_{60}^{\left(\frac{60}{2}\right)}$

$= \log_{60}^{60} - \log_{60}^2 = 1 - \log_{60}^2 \Rightarrow \log_{60}^2 = 1 - p - q$

$5(\log_{60}^2) = 5(1 - p - q)$

$\Rightarrow \log_{60}^{2^5} = \log_{60}^{32} = 5(1 - p - q)$

సమాధానం: 3

4. $\log_{10}^7 = 0.8451$ అయితే 7^{20} సంఖ్యలో ఎన్ని అంకెలు ఉంటాయి?

1) 16 2) 19 3) 21 4) 17

సాధన: $7^{20} = \text{Antilog}(\log 7^{20}) = \text{Antilog}(20 \log 7)$

$= \text{Antilog}(20 \times 0.8451) = \text{Antilog}(16.902)$

లెక్కలో కోరిన అంకెల సంఖ్య $= 16 + 1 = 17$

సమాధానం: 4

5. $\log_3^{x^2 - 8x - 78} = 3$ అయితే x ధనాత్మక విలువ ఎంత?

1) 22 2) 105 3) 15 4) 7

సాధన: $\log_3^{x^2 - 8x - 78} = 3\log_3^3 = \log_3^{3^3} = \log_3^{27}$

$\Rightarrow x^2 - 8x - 78 = 27 \Rightarrow x^2 - 8x - 105 = 0$

$\Rightarrow = (x - 15)(x + 7) = 0 \Rightarrow x = 15 \text{ or } x = -7$

సమాధానం: 3

6. $\log_{10}^5 = 0.6990$ అయితే $\log_5^{10}$ విలువ ఎంత?

1) $\frac{699}{1000}$ 2) $\frac{1000}{699}$ 3) $\frac{1398}{1000}$ 4) $\frac{1000}{1398}$

సాధన: $\log_{10}^5 = \frac{1}{\log_{10}^5} = \frac{1}{0.699} = \frac{1000}{699}$

సమాధానం: 2

7. $x^2 + y^2 = z^2$ అయితే $\frac{1}{\log_{(z+x)}^{(y)}} + \frac{1}{\log_{(z-x)}^{(y)}}$ విలువ ఎంత?

1) 2 2) 1 3) 0 4) $z^2 - x^2$

సాధన: $\frac{1}{\log_{(z+x)}^{(y)}} + \frac{1}{\log_{(z-x)}^{(y)}} = \log_y^{(z+x)} + \log_y^{(z-x)}$

$= \log_y^{(z+x)(z-x)} = \log_y^{z^2 - x^2} = \log_y^{y^2}$ $(\because x^2 + y^2 = z^2 \Rightarrow z^2 - x^2 = y^2)$

$= 2\log_y^y = 2 \times 1 = 2$

సమాధానం: 1

8. $\log_{3\sqrt{2}}^{324}$ విలువ కనుక్కోండి.

1) 1 2) 2 3) 0 4) 4

సాధన: $324 = (3\sqrt{2})^4$

$\log_{3\sqrt{2}}^{324} = \log_{3\sqrt{2}}^{(3\sqrt{2})^4}$

$= 4\log_{3\sqrt{2}}^{3\sqrt{2}} = 4 \times 1 = 4$

సమాధానం: 4

9. $\frac{\log a}{p^2 + q^2 - 2r^2} = \frac{\log b}{q^2 + r^2 - 2p^2} = \frac{\log c}{r^2 + p^2 - 2q^2}$ అయితే abc విలువ ఎంత?

1) pqr 2) 1 3) 0 4) $p^2 q^2 r^2$

సాధన: $\frac{\log a}{p^2 + q^2 - 2r^2} = \frac{\log b}{q^2 + r^2 - 2p^2} = \frac{\log c}{r^2 + p^2 - 2q^2} = k$

$\log a = k(p^2 + q^2 - 2r^2),\ \log b = k(q^2 + r^2 - 2p^2),$

$\log c = k(r^2 + p^2 - 2q^2)$

$\Rightarrow \log a + \log b + \log c = k(p^2 + q^2 - 2r^2 + q^2 + r^2 - 2p^2 + r^2 + p^2 - 2q^2)$

$\Rightarrow \log abc = 0 = \log 1 \Rightarrow abc = 1$

సమాధానం: 2

10. $\frac{1}{\log_3^{105}} + \frac{1}{\log_5^{105}} + \frac{1}{\log_7^{105}}$ విలువ ఎంత?

1) 0 2) 2 3) 1 4) 15

సాధన: $\log_{105}^3 + \log_{105}^5 + \log_{105}^7$

$= \log_{105}^{(3 \times 5 \times 7)} \Rightarrow \log_{105}^{105} = 1$

సమాధానం: 3

11. $\log_x^5 + \log_x^{25} + \log_x^{125} + \log_x^{625} = 10$ అయితే x విలువ?

1) 5 2) 1 3) 0 4) 10

సాధన: $\log_x^5 + \log_x^{25} + \log_x^{125} + \log_x^{625} = 10$

$\log_x^{(5^1 \times 5^2 \times 5^3 \times 5^4)} = 10$

$= \log_x^{5^{10}} = 10$

$= (10)\log_x^5 = 10 \Rightarrow \log_x^5 = 1$

$\Rightarrow x = 5$

సమాధానం: 1



రచయిత
డా. వంగల శ్రీనివాస్
విషయ నిపుణులు

Word of the Day 847

Truculent

Telugu meaning: మొరటైన, అమానవీయంగా

English meaning: The word truculent (ట్రక్యులెంట్) is an adjective that describes someone who is aggressively defiant, eager to fight, or difficult to deal with.

Synonyms: Aggressive, Hostile

Antonyms: Gentle, Cooperative

Usage: **1.** His truculent attitude during the meeting created unnecessary tension among the team members.

2. The coach warned the players that truculent behaviour on the field would not be tolerated under any circumstances.

కరెంట్ అఫైర్స్



ఒడిశా మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.మురళీధర్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదంలో మానవ హక్కుల ఉల్లంఘనపై విచారణ జరిపేందుకు ఏర్పాటు చేసిన ప్యానెల్‌కు ఆయన నేతృత్వం వహించనున్నారు. ఐక్యరాజ్య సమితి దీన్ని ఏర్పాటు చేసింది.

☛ ఇజ్రాయెల్, 'ఆక్రమిత పాలస్తీనా ప్రాంతం'లో మానవ హక్కుల ఉల్లంఘనలపై విచారణ జరపడం ఈ ప్యానెల్ ప్రధాన బాధ్యత. ఈ స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కమిషన్‌కు గతంలో బ్రెజిల్ న్యాయనిపుణుడు పాలో సెర్గియో పిన్హీరో నేతృత్వం వహించారు.



డిజిటల్ బ్యాంకింగ్ వ్యవస్థను మరింత సురక్షితం, సులభతరం చేయడంతో పాటు, ప్రమాణీకరించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సిద్ధమయ్యింది. దీనికోసం 'డిజిటల్ బ్యాంకింగ్ ఛానల్స్ ఆథరైజేషన్ డైరెక్షన్స్-2025' పేరుతో కొత్త మార్గదర్శకాలను ప్రకటించింది.

☛ 2026 జనవరి 1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సహా, అన్ని వాణిజ్య బ్యాంకులకు ఈ నిబంధనలు వర్తిస్తాయి.

బహుభార్యత్వాన్ని నేరంగా పరిగణిస్తూ అస్సాం శాసనసభ ఒక చట్టాన్ని రూపొందించింది. దీని ప్రకారం ఈ నేరానికి పాల్పడిన వ్యక్తికి పదేళ్ల కారాగార శిక్ష విధించవచ్చు. దీనికి కొన్ని మినహాయింపులు కల్పించారు. ఆరో షెడ్యూల్ పరిధిలోని ప్రాంతాల్లో నివసిస్తున్న షెడ్యూల్డ్ తెగలకు ఈ చట్టం వర్తించదు.

ముంబయిలో ఒకే రోజులో అతిపెద్ద కెరీర్ సలహా కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా ప్రపంచ రికార్డు సృష్టించి, గిన్నిస్ రికార్డు సాధించినట్లు చార్టర్డ్ అకౌంటెంట్ల అత్యున్నత సంస్థ ఐసీఏఐ 2025, నవంబరు 28న వెల్లడించింది. ఈ సెషన్‌లో 7400 మందికి పైగా విద్యార్థులు, ఇతర వ్యక్తులు పాల్గొన్నారు.

☛ 'కెరీర్ ఇన్ అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్ ఫర్ యూత్ (సీఏఎఫ్‌వై 4.0), సూపర్ మెగా కెరీర్ కౌన్సిలింగ్ ప్రోగ్రామ్'ను నవంబరు 27న దేశవ్యాప్తంగా నిర్వహించారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

డిసెంబరు 1
చరిత్రలో ఈనాడు

ఎక్వైర్డ్ ఇమ్యునో డెఫిషియెన్సీ సిండ్రోమ్ (ఎయిడ్స్) అనేది హ్యూమన్ ఇమ్యునో డెఫిషియెన్సీ వైరస్ (హెచ్‌ఐవీ) వల్ల సంభవిస్తుంది. హెచ్‌ఐవీ మానవ శరీరంలోకి ప్రవేశించగానే ప్రధానంగా రోగ నిరోధక వ్యవస్థను తీవ్రంగా నాశనం చేస్తుంది. తద్వారా అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. సాధారణంగా హెచ్‌ఐవీ సోకాక ప్రారంభంలో గుర్తించకుండా.. అలాగే దీర్ఘకాలం వదిలేస్తే అది ఎయిడ్స్‌గా రూపాంతరం చెందుతుంది. ఈ ప్రాణాంతక వ్యాధిని నివారించడానికి ఎలాంటి మందు లేదు. కేవలం ముందు జాగ్రత్త చర్యల ద్వారానే దీన్ని అరికట్టొచ్చు. ఎయిడ్స్ వ్యాధి గురించి ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా డిసెంబరు 1న 'ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం' (World AIDS Day)గా నిర్వహిస్తారు. హెచ్‌ఐవీ సంక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయడంతోపాటు వ్యాధిగ్రస్థుల సంరక్షణ, వారి హక్కులను కాపాడటం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

సంక్రమణ – వ్యాప్తి


హెచ్‌ఐవీ ప్రధానంగా రక్తంలో ఉండే తెల్ల రక్తకణాల్లో భాగమైన సీడీ4 అనే కణాలను నాశనం చేస్తుంది. ఇవి శరీరంలో వ్యాధినిరోధక శక్తిని మెరుగుపరుస్తూ అనారోగ్యాల నుంచి మానవుడ్ని రక్షిస్తాయి.

☛ హెచ్‌ఐవీ/ ఎయిడ్స్ సంక్రమించిన వారితో అరక్షిత శృంగారంలో పాల్గొనడం, వారి రక్తాన్ని ఇతరులకు ఎక్కించడం, వ్యాధిగ్రస్థులకు వాడిన సిరంజీలను వేరేవారికి ఉపయోగించడం లాంటివి వ్యాధి వ్యాప్తికి కారణమవుతాయి.

☛ ఒకసారి హెచ్‌ఐవీ మానవ శరీరంలోకి ప్రవేశించాక.. దాన్ని అంతం చేయడం అసాధ్యం. అయితే యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ) ద్వారా శరీరంలో రోగ నిరోధక శక్తిపై ఇది జరిపే దాడిని ఆపొచ్చు. దీనిద్వారా వ్యక్తులు దీర్ఘకాలం ఆరోగ్యకర జీవనాన్ని గడిపే అవకాశం ఉంది. ఈ వైరస్ బారినపడినవారితో కలిసి భోజనం చేసినా, వాళ్లని తాకినా అది వ్యాప్తి చెందదు.

చారిత్రక నేపథ్యం:

హెచ్‌ఐవీ/ ఎయిడ్స్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ)లో పనిచేసే



జేమ్స్ డబ్ల్యూ బన్, థామస్ నెట్టర్ 1987లో గ్లోబల్ ప్రోగ్రాం ఆన్ ఎయిడ్స్ అనే కార్యక్రమాన్ని (ప్రస్తుతం యూఎన్ఎయిడ్‌గా పిలుస్తున్నారు) రూపొందించారు. దీనిపై మరింత విస్తృత ప్రచారం కల్పించే లక్ష్యంతో 1988 నుంచి ఏటా డిసెంబరు 1న 'ప్రపంచ ఎయిడ్స్ డే'గా నిర్వహించాలని తీర్మానించారు.

హెచ్‌ఐవీ ఎయిడ్స్‌కి సంబంధించిన ముఖ్యాంశాలు, గతంలో అడిగిన ప్రశ్నలు, తదితర పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భౌతికశాస్త్రం

కేంద్రక భౌతికశాస్త్రం


విశ్వానికి మూలం పరమాణువు. పరమాణువుకి మూలం కేంద్రకం. నక్షత్రాల ఆవిర్భావం, విధ్వంసకర అణుబాంబు, క్యాన్సర్ చికిత్స, కార్బన్ డేటింగ్, భూమి వయసు మొదలైనవి కేంద్రకంతో ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటాయి. కేంద్రంలో దాగిన శక్తిని ఉపయోగించుకోవడం అనేది మానవుడి నియంత్రణలోనే ఉంది.

కేంద్రకం

☛ ఊహకు అందని అతి చిన్న ప్రదేశంలో అత్యంత శక్తిని, ద్రవ్యాన్ని కూడగట్టుకుని తన చుట్టూ ఎలక్ట్రాన్ మేఘాలను తిప్పుకునే పదార్థమే కేంద్రకం. మరోవిధంగా చెప్పాలంటే విశ్వం ఏర్పడటానికి కారణం కేంద్రకం.

కేంద్రక బలాలు

☛ ధనావేశిత ప్రోటాన్లు అత్యల్ప ప్రదేశమైన కేంద్రకంలో పరస్పరం వికర్షించుకోకుండా ఉండేందుకు కేంద్రకంలో పనిచేసే బలాలను కేంద్రక బలాలు అంటారు. ఇవి గురుత్వ, విద్యుదయస్కాంత బలాలకు భిన్నమైనవి. ఇవి అల్ప అవధిలో, కేంద్రకంలోనే పనిచేసే బలాలు.



బంధన శక్తి, కేంద్రక విచ్ఛిత్తి, కేంద్రకం అభిలక్షణాలు, నాలుగు ప్రాథమిక బలాల మధ్య పోలికలు, మ్యాజిక్ సంఖ్యలు, శృంఖల చర్య, పరమాణు బాంబు, న్యూక్లియర్ రియాక్టర్ మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Faculty Jobs

All India Institute of Medical Sciences (AIIMS), Raebareli, invites applications to recruit Professor, Additional Professor, and Associate Professor on Regular, Contract/Deputation process. The total no. of posts is 96. Eligible candidates can apply online before 21 December 2025.

Individual Consultant Posts

Rail India Technical and Economic Services Limited (RITES), Gurugram, is inviting applications for the filling of the Individual Consultant posts in various departments on a contractual basis. The total no. of posts is 17. The last date for receipt of online applications is 8 December 2025.

Apprentice Posts

Bharat Dynamics Limited (BDL), Kanchanbagh unit, Hyderabad, is inviting applications for Trade Apprentice Trainee posts. The total no. of posts is 156. The last date for online applications is 8 December 2025.

Did You Apply..?

Today (December 1) is the last date for the following Jobs

☛ 50 Scientist Jobs in Kerala Rubber Board.
Eligibility: 10th Class, ITI, Inter, Diploma, Degree.

☛ Project Scientist-2 posts at THSTI-BRIC.
Eligibility: Degree, B.Sc. or Diploma, PhD.

☛ Manager Jobs in State Bank of India.
Eligibility: BA, BSc, BTech.

For more information and other notifications - scan QR code

Direct & Indirect Speech

Directions (Qs. 1 - 6): *Select the correct indirect form of the given sentence.*

1. Sita said, "I am going to visit my grandparents this weekend."
A) Sita said that she is going to visit her grandparents this weekend.
B) Sita said that she was going to visit her grandparents that weekend.
C) Sita said that I was going to visit my grandparents that weekend.
D) Sita told that she was going to visit her grandparents this weekend.

2. The passengers said, "We have been waiting here since morning."
A) The passengers said that they have been waiting here since morning.
B) The passengers told that they had been waiting here since morning.
C) The passengers said that we had been waiting there since morning.
D) The passengers said that they had been waiting there since morning.

3. He said to me, "Will you join us for dinner?"
A) He asked me if I would join them for dinner.
B) He said me if I would join them for dinner.
C) He told me that I will join them for dinner.
D) He asked me that I would join them for dinner.

4. The manager said to the clerk, "Where did you keep the documents?"
A) The manager asked the clerk where he kept the documents.
B) The manager asked the clerk where had he kept the documents.
C) The manager asked the clerk where he had kept the documents.
D) The manager asked the clerk that where he had kept the documents.

5. She said to the librarian, "Please issue me this book."
A) She requested the librarian to issue her that book.
B) She asked the librarian to issue her this book.
C) She said the librarian to issue her that book.
D) She requested that the librarian issues her this book.

6. She exclaimed, "How beautiful the garden looks!"
A) She exclaimed that how beautiful the garden looked.
B) She exclaimed that the garden looked very beautiful.
C) She said that the garden looks very beautiful.
D) She exclaimed how the garden was very beautiful.

SSC Exams
English

Directions (Qs. 7 - 11): *Select the correct direct form of the given sentence.*

7. She said that she was feeling very tired.
A) She said, "I was feeling very tired."
B) She said, "I am feeling very tired."
C) She said, "I had been feeling very tired."
D) She said, "I feel very tired."

8. He said that water boils at 100 degrees Celsius.
A) He said, "Water boiled at 100 degrees Celsius."
B) He said, "Water had boiled at 100 degrees Celsius."
C) He said, "Water boils at 100 degrees Celsius."
D) He said, "Water is boiling at 100 degrees Celsius."

9. The teacher asked if I had done my homework.
A) The teacher asked, "Do you do your homework?"
B) The teacher asked, "Had you done your homework?"
C) The teacher asked, "Did you do your homework?"
D) The teacher asked, "Have you done your homework?"

10. She asked where I had been the previous night.
A) She asked, "Where were you last night?"
B) She asked, "Where have you been last night?"
C) She asked, "Where had you been last night?"
D) She asked, "Where did you go last night?"

11. He told me to switch off the lights before leaving.
A) He said, "Switch off the lights before leaving."
B) He said, "You should switch off the lights before leaving."
C) He said, "You must switch off the lights before leaving."
D) He told, "Switch off the lights before leaving."

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

కొందరు భారతీయులకు సొంత భాషలే తెలియవు

- ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ ఆవేదన



నాగ్‌పుర్: కొంత మంది భారతీయులకు మన సొంత భాషలే తెలియవని ఆదివారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆరెస్సెస్) చీఫ్ మోహన్ భాగవత్ ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయ భాషలు, మాతృభాషల వినియోగం తగ్గిపోవటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో కవి సంత్ జ్ఞానేశ్వర్ మరాఠీలో రాసిన 'శ్రీ జ్ఞానేశ్వరీ' పుస్తకాన్ని ఆంగ్ల భాషలో విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'భాషా వారసత్వం క్షీణిస్తుండటంపై సమాజం ఆత్మపరిశీలన చేసుకోవాలి. గతంలో సంస్కృతంలోనే విద్యాబోధన, సంభాషణ జరిగేది. కానీ ప్రస్తుతం పిల్లలు తమ మాతృభాషలో కూడా సరైన పదాలు తెలియక ఇంగ్లిష్ మిశ్రితంగా మాట్లాడుతున్నారు. దీనికి ఇంగ్లిష్ మీడియం కారణం కాదు, మనమే భారతీయ భాషలు మాట్లాడానికి వెనకాడుతున్నాం. మన భాషను ఇంట్లో సరైన విధంగా ఉపయోగిస్తే పరిస్థితి మెరుగుపడుతుంది' అని భాగవత్ పేర్కొన్నారు.

ఆ ఒక్క సమస్య వల్ల భారత్‌తో సంబంధాలు దెబ్బతినవు

- హసీనా అప్పగింతపై బంగ్లాదేశ్



ఢాకా: భారత్‌లో ఆశ్రయం పొందుతున్న తమ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాను వీలైనంత త్వరగా అప్పగించాలని బంగ్లాదేశ్ మరోసారి దిల్లీని కోరింది. ఈ ఒక్క సమస్య కారణంగా భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతినవని తాత్కాలిక ప్రభుత్వ విదేశీ వ్యవహారాల సలహాదారు మహమ్మద్ తౌహీద్ హుస్సేన్ వెల్లడించారు. హసీనాను భారత్ తిరిగి అప్పగిస్తేనే ఆ దేశంతో బంగ్లాదేశ్ సంబంధాలు మెరుగు అవుతాయా అన్న మీడియా ప్రశ్నకు ఆయన ఈ విధంగా సమాధానమిచ్చారు. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వంతో దిల్లీ సంబంధాల గురించి అడిగిన మరో ప్రశ్నకు స్పందిస్తూ.."కొత్త పరిస్థితులకు అనుగుణంగా మారడానికి భారత్‌కు కొంత సమయం కావాలి. భారత్‌తో మెరుగైన సంబంధాలు ఉండాలని మేం ఆశిస్తున్నాం" అని హుస్సేన్ అన్నారు.

భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో కొత్త డిజైన్‌తో ఫెన్సింగ్

అగర్తలా: భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో ఉన్న పాత ముళ్ల కంచె దెబ్బతిన్న కారణంగా, కొత్త డిజైన్‌తో ఫెన్సింగ్ ఏర్పాటు చేసే ప్రతిపాదనను కేంద్రం పరిశీలిస్తున్నట్లు ఆదివారం త్రిపుర బీఎస్ఎఫ్ ఐజీ అలోక్ కుమార్ చక్రవర్తి తెలిపారు. త్రిపురలో భారీ వర్షాలు, వాతావరణ పరిస్థితుల కారణంగా కంచె దెబ్బతిందన్నారు. కొత్త ఫెన్సింగ్ ద్వారా సరిహద్దు భద్రత మెరుగుపడుతుందని, త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. భారత్-బంగ్లాదేశ్ బోర్డర్ గార్డుల మధ్య సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు.

చైనాలో సివిల్ సర్వీస్ పరీక్షకు అర్హత వయస్సు పెంపు

- రికార్డు స్థాయిలో 37లక్షల మంది హాజరు


బీజింగ్: చైనాలో జాతీయ సివిల్ సర్వీస్ పరీక్షకు అర్హత వయస్సు పరిమితిని 35 నుంచి 38కి పెంచిన నేపథ్యంలో ఆదివారం జరిగిన తొలి జాతీయ సివిల్ సర్వీస్ పరీక్షకు రికార్డు స్థాయిలో 37 లక్షల మందికి పైగా చైనీయులు హాజరయ్యారు. నిరుద్యోగం పెరగడంతో ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ భారీగా పెరిగింది. ఒక్క పోస్టుకు సగటున 98 మంది పోటీ పడుతున్నారు. మొత్తం ఖాళీలలో 70శాతం కొత్తగా గ్రాడ్యుయేట్ అయిన విద్యార్థులకు కేటాయించారు. మాస్టర్స్, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి వయస్సు పరిమితి 43 ఏళ్లకు సడలించారు.

ఆటంకాల్లేకుండా ముగిసిన క్యాట్-2025

- జనవరి తొలి వారంలో ఫలితాలు!

దిల్లీ: దేశవ్యాప్తంగా ఐఐఎంలతోపాటు పలు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (క్యాట్)-2025 ఎటువంటి ఆటంకాల్లేకుండా ఆదివారం నాటితో ముగిసింది. ఈసారి పరీక్షను ఐఐఎం కోజికోడ్ నిర్వహించింది. 3 విడతల్లో 160 నగరాల్లోని 400 సెంటర్లలో ఈ పరీక్ష ఎటువంటి సాంకేతిక ఇబ్బందుల్లేకుండా కొనసాగింది. ఈసారి దాదాపు 3 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. 'వెర్బల్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రెహెన్షన్ విభాగాలు ఈసారి సులభంగా వచ్చాయి. డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్ మిశ్రమంగా ఉంది' అని ఓ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు తెలిపారు. అధికారిక కీని, రెస్పాన్స్ షీట్లను డిసెంబరు మధ్యలో విడుదల చేయాలని ఐఐఎంలు భావిస్తున్నాయి. జనవరి మొదటి వారంలో ఫలితాలను విడుదల చేసే అవకాశముంది.

లోక్‌సభ సెక్రటరీ జనరల్ పదవీ కాలం మళ్లీ పొడిగింపు



ఉత్పల్ కుమార్

దిల్లీ: లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. 1986 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన 2020 డిసెంబరు 1వ తేదీన ఈ బాధ్యతలను చేపట్టారు. 2021 నవంబరు 30వ తేదీన రెండేళ్లపాటు ఆయనకు పొడిగింపు నిచ్చారు. మళ్లీ 2023, 2024లలో రెండుసార్లు ఏడాది చొప్పున పొడిగింపు ఇచ్చారు. తాజాగా మరోసారి ఆయనకు పొడిగింపు లభించింది.

నింగిలోని లక్ష్యాన్ని నేలకూల్చిన డ్రోన్



- రాడార్ గైడెన్స్‌తో తొలిసారిగా సాధించిన మానవరహిత వ్యవస్థ
- తుర్కియే సంస్థ ఘనత

రాడార్ మార్గనిర్దేశకత్వంలో ఒక యుద్ధవిమానం గగనతలంలోని మరో లక్ష్యాన్ని నేలకూల్చడం సంక్లిష్టమైన ప్రక్రియ. ఆధునిక గగనతల పోరాటంలో దీనికి ప్రత్యేకత ఉంది. ఇప్పటివరకూ మానవసహిత యుద్ధవిమానాలు ఈ విన్యాసాన్ని చేయగా.. తొలిసారిగా ఒక డ్రోన్ ఈ సత్తాను చాటింది. తుర్కియేకు చెందిన మానవరహిత యుద్ధ విమానం కిజిలెల్మా ఈ ఘనతను సాధించింది. ఈ పరిణామాన్ని కీలక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా గగనతల పోరాట వ్యూహాలను మార్చేస్తుందని చెబుతున్నారు.

గురి తప్పకుండా

సినోప్ ఫైరింగ్ రేంజ్ వద్ద సాగర జలాలపై ఈ పరీక్ష జరిగింది. ఇందులో కిజిలెల్మా డ్రోన్‌కు.. జెట్ ఇంజిన్‌తో నడిచే ఒక గగనతల లక్ష్యాన్ని నేలకూల్చే బాధ్యతను అప్పజెప్పారు. ఈ మానవరహిత యుద్ధవిమానంలో మురాద్ ఏఈఎస్ఏ రాడార్ ఉంది. ఇది చాలా దూరంలోని లక్ష్యాలను ఎప్పటికప్పుడు పరిశీలించగలదు.

- వేగంగా కదులుతున్న లక్షిత డ్రోన్‌ను.. ఎలాంటి సాయం లేకుండానే కిజిలెల్మాలోని రాడార్ గుర్తించింది.
- ఆ వెంటనే కిజిలెల్మా తన రెక్కల కిందున్న గోక్డోగన్ బియాండ్ విజువల్ రేంజ్ (బీవీఆర్) క్షిపణిని ప్రయోగించింది. ఈ అస్త్రానికి గగనతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం ఉంది. రాడార్ మార్గనిర్దేశానికి అనుగుణంగా ఇది లక్షిత డ్రోన్ వద్దకు దూసుకెళ్లి, దాన్ని నేలకూల్చింది. ఈ క్రమంలో టాయ్‌గన్ టార్గెటింగ్ వ్యవస్థ దీనికి ఉపయోగపడింది.
- ప్రయోగ సమయంలో కిజిలెల్మా వెంట ఐదు ఎఫ్-15 యుద్ధవిమానాలు పయనించాయి.



శక్తిమంతం

కిజిలెల్మా డ్రోన్ 'రాడార్ సిగ్నేచర్' చాలా తక్కువ. అందువల్ల ప్రత్యర్థి రాడార్లు అంత సులువుగా దాన్ని గుర్తించలేవు. మరోవైపు ఈ సాయుధ డ్రోన్.. చాలా దూరంగా ఉండగానే శత్రు యుద్ధవిమానాలను గమనించగలదు. అందువల్ల తాను ప్రత్యర్థి కంటపడటానికి ముందే ఇది ప్రత్యర్థిని గుర్తిస్తుంది. ఫలితంగా దాడులు చేయడంలోను, శత్రు దాడులను తిప్పికొట్టడంలో పైచేయి ప్రదర్శిస్తుంది.

- ఈ డ్రోన్‌లో శక్తిమంతమైన ఇంజిన్ ఉంది. పెను వేగంతో దూసుకెళుతూ కూడా అద్భుత విన్యాసాలు చేయగలదు. ఇందులో కృత్రిమ మేధను విస్తృతంగా వినియోగించారు. అందువల్ల అది విమానవాహక నౌకలపై కూడా సొంతంగా టేకాఫ్, ల్యాండింగ్ నిర్వహించగలదు.
- తాజా పరీక్షతో ఇది గగనతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలతోపాటు నేలపైన కూడా దాడులు చేయగలదని వెల్లడైంది.

నానాటికీ పెరుగుతున్న డ్రోన్‌శక్తి

కిజిలెల్మాను బేరక్తర్ సంస్థ అభివృద్ధి చేసింది. ఇది అంతర్జాతీయంగా అగ్రశ్రేణి డ్రోన్ సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. 2023, 24 సంవత్సరాల్లో ఇది ఎగుమతుల ద్వారా 180 కోట్ల డాలర్లను ఆర్జించింది. ఇది వరుసగా గత నాలుగేళ్లలో తుర్కియేలో అగ్రశ్రేణి రక్షణ ఎగుమతిదారుగా నిలిచింది.

భారత్‌పై ప్రభావం

తాజా పరిణామం భారత్‌కు చాలా కీలకం. మన దేశానికి పొరుగునున్న పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లు తుర్కియే నుంచి భారీగా డ్రోన్లను దిగుమతి చేసుకుంటుండటమే ఇందుకు కారణం. ముఖ్యంగా బేరక్తర్ డ్రోన్లను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నాయి. ఈ పరిణామాలను భారత్ నిశితంగా గమనిస్తోంది. తుర్కియే అభివృద్ధి చేస్తున్న డ్రోన్లలో సాంకేతిక పురోగతి, ఆ దేశంతో పాక్, బంగ్లాదేశ్‌లకున్న మైత్రిని బేరీజు వేసుకొని భవిష్యత్ డ్రోన్ల రూపకల్పనకు సిద్ధమవుతోంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

కొత్త ఆలోచనలు, ఆవిష్కరణల వెనక యువత

- వారే 'వికసిత్ భారత్'కు ప్రధాన బలం
- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ



దిల్లీ: అంతరిక్షం నుంచి వ్యవసాయం వరకు వివిధ రంగాల్లో భారత్ సాధిస్తోన్న తాజా విజయాల వెనక యువతదే కీలక పాత్ర అని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. యువత అంకిత భావమే వికసిత్ భారత్‌కు అతి పెద్ద బలమని చెప్పారు. 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆదివారం మోదీ మాట్లాడుతూ నవంబరులో జరిగిన వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు, సెంట్రల్ హాల్లో జరిగిన రాజ్యాంగ దినోత్సవాలు, అయోధ్యలోని రామ మందిర శిఖరాన 'ధర్మ ధ్వజ' ఆవిష్కరణ.. తదితర స్ఫూర్తిదాయక సంఘటనలను ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ప్రపంచ అతి పెద్ద లీప్ ఇంజిన్ ఎంఆర్‌వో సదుపాయం ప్రారంభోత్సవాన్ని, భారత నౌకాదళంలోకి ఐఎన్ఎస్ మాహె చేరిక గురించి కూడా వివరించారు. "అంతరిక్ష రంగ పురోగతికి గత వారమే స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ కొత్త ఊపునిచ్చింది. ఇది భారత్ కొత్త ఆలోచనలకు, ఆవిష్కరణలకు, యువశక్తికి ప్రతిబింబం" అని తెలిపారు. ఇస్రో నిర్వహించిన ప్రత్యేక డ్రోన్ పోటీకి సంబంధించిన సోషల్ మీడియా వీడియోనూ మోదీ ప్రస్తావిస్తూ.. "ఆ వీడియోలో మన దేశ యువత..అంగారక గ్రహంలో ఉండే వాతావరణ పరిస్థితుల్లో డ్రోన్లు ఎగరవేయటానికి ప్రయత్నించింది. ఎన్నోసార్లు అవి కూలిపోయినప్పటికీ అంతిమంగా యువ బృందం విజయం రుచి చూసింది" అని పేర్కొన్నారు. చంద్రయాన్-2 విఫలమైనపుడు కూడా ఇదే జరిగిందని..ఇస్రో శాస్త్రవేత్తలు చాలా నిరాశ చెందారని, కానీ ఆ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకొని అంతిమంగా విజయం సాధించారని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తి ప్రస్తుత యువతలోనూ కనిపిస్తోందని.. ఓటమి నుంచి గెలుపు దారిలో వారు ప్రయాణిస్తున్నారని.. ఈ యువతే వికసిత్ భారత్‌కు ప్రధాన బలమని మోదీ చెప్పారు. క్రీడల్లో తాజా విజయాలు, కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య బిడ్ భారత్ దక్కించుకోవడం, భూటాన్, దక్షిణాఫ్రికాకు తాను చేసిన పర్యటనల గురించి కూడా వివరించారు.

తమిళం నేర్చుకోండి

వారణాసిలో జరగనున్న తమిళ-కాశీ సంగమంలో పాల్గొనాలని ప్రజలకు మోదీ పిలుపునిచ్చారు. ఈ సందర్భాన్ని తమిళం నేర్చుకొనేందుకు ఉపయోగించుకోవాలని అన్నారు. తమిళనాడు వాసులను ఆహ్వానించేందుకు కాశీ ప్రజలు ఉత్సుకతతో ఎదురుచూస్తున్నారని చెప్పారు. గొప్ప శీతాకాల పర్యాటక కేంద్రంగా ఎదిగే సామర్థ్యం భారత్‌కు ఉందని, సెలవులకు ప్రణాళిక వేసుకొనేటపుడు హిమాలయ ప్రాంతాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రజలకు ప్రధాని సూచించారు.

జమ్మూలో జర్నలిస్టు ఇంటిపై బుల్డోజరు.. భూమి ఇచ్చి ఆదుకొన్న మాజీ సైనికుడు



అర్ఫాజ్ అహ్మద్‌కు భూమి పత్రాలు అందజేస్తున్న మాజీ సైనికుడు కుల్దీప్‌శర్మ, ఆయన కుమార్తె తాన్యాశర్మ

ఈటీవీ భారత్: జమ్మూలో జర్నలిస్టుగా పనిచేస్తున్న అర్ఫాజ్ అహ్మద్ ఇంటిని ఆక్రమణ కింద చూపుతూ 'జమ్మూ డెవలప్‌మెంట్ అథారిటీ' (జేడీఏ) అధికారులు బుల్డోజరుతో కూల్చివేయడం రాజకీయ దుమారం రేపుతోంది. అదే ప్రాంతంలో నివసిస్తున్న మాజీ సైనికుడు కుల్దీప్‌శర్మ ఈ చర్యతో చలించిపోయి అర్ఫాజ్‌ను ఆదుకునేందుకు తన సొంత భూమి ఇవ్వడంపై ప్రశంసల వర్షం కురుస్తోంది. గత గురువారం అధికారులు ఇంటిని కూల్చివేస్తున్న సమయంలో అర్ఫాజ్ వృద్ధ తల్లిదండ్రులు, పిల్లలు వారిని వేడుకున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి. "నేనేం ధనికుడిని కాను. వాళ్ల దీనావస్థ నన్ను కదిలించింది. అందుకే అధికారులు కూల్చిన దానికంటే ఎక్కువ భూమి ఇచ్చాను. నా సోదరుడు అర్ఫాజ్ తన ఇంటిని తిరిగి నిర్మించుకునేందుకు నేను చేయగలిగినంత సాయం చేస్తాను. మతం కాదు.. మానవత్వం ముఖ్యం" అని కుల్దీప్‌శర్మ తెలిపారు. అర్ఫాజ్‌కు తాను భూమి ఇచ్చాక జమ్మూకశ్మీర్‌లోని పలు ప్రాంతాల నుంచి అన్ని వర్గాలవారు తనకు ఫోన్లు చేస్తున్నారని, ఇది మన సౌభ్రాతృత్వానికి నిదర్శనమని చెప్పారు. అర్ఫాజ్ కుటుంబం ఆ ప్రాంతంలో గత 40 ఏళ్లుగా ఉంటున్నా ఎన్నడూ ఎవరూ నోటీసు ఇవ్వలేదని, మాదకద్రవ్యాల స్మగ్లింగు కేసులో ఓ పోలీసు అధికారి పాత్ర గురించి రాసిన కథనం కారణంగానే ఆయనను లక్ష్యంగా చేసుకొన్నట్లు కథనాలు వినవస్తున్నాయి.

రూ.కోటి భూమి ఇస్తానన్న వ్యాపారి

మతాలకు అతీతంగా అర్ఫాజ్‌కు భూమి ఇచ్చి ఆదుకోవడాన్ని అభినందిస్తూ పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఓ కశ్మీరీ వ్యాపారి (46) రూ.కోటి విలువైన భూమిని కుల్దీప్‌శర్మకు కానుకగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఆ వ్యాపారి నుంచి తనకు ఫోను వచ్చిందని, త్వరలో ఇంటికి వచ్చి పత్రాలు అందజేస్తానని చెప్పినట్లు కుల్దీప్‌శర్మ వెల్లడించారు. "కులం, మతం, రంగు అంటూ జనం కొట్లాడుకుంటున్న తరుణంలో మీ చర్య మానవత్వం ఇంకా సజీవంగా ఉందని నిరూపించింది" అని ఆ వ్యాపారి చెప్పారన్నారు.

జడ్జి మారితే తీర్పు మారకూడదు

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న

దిల్లీ: న్యాయమూర్తి మరోచోటకు మారిపోవడమో, ఆ పదవి నుంచి దిగిపోవడమో జరిగినంతమాత్రాన వారు రాసిన తీర్పు మారిపోకూడదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి.నాగరత్న పేర్కొన్నారు. ఇటీవల సర్వోన్నత న్యాయస్థానంలో కొన్ని తీర్పులను ఆ తర్వాత వేరే ధర్మాసనాలు రద్దుచేసిన నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్య చేశారు. న్యాయవ్యవస్థ స్వతంత్రత అనే అంశంపై శనివారం హరియాణాలోని సోనీపత్‌లో ఓ.పి.జిందాల్ గ్లోబల్ విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆమె ప్రసంగించారు. "న్యాయమూర్తి ఒకసారి తీర్పు వెలువరిస్తే అది ఇసుకలో రాసినట్లు కాకుండా కలంతో రాసినట్లు కలకాలం నిలిచిపోవాలి. అప్పుడే న్యాయవ్యవస్థ స్వతంత్రతకు చట్టాల వ్యవస్థ భరోసా ఇచ్చినట్లు లెక్క. తీర్పు ఎలా ఉన్నా దానిని గౌరవించడమనేది న్యాయవ్యవస్థతో ముడిపడిన అందరితోపాటు ప్రభుత్వ కర్తవ్యం. ఒకవేళ తీర్పుపై ఏమైనా అభ్యంతరాలు లేవనెత్తాలంటే అది చట్టం చెబుతున్న సంప్రదాయాల ప్రకారం జరగాలే తప్ప జడ్జి మారిపోగానే మొత్తం తీర్పును అవతలపెట్టాలని ప్రయత్నించకూడదు. దేశ పరిపాలనలో న్యాయవ్యవస్థ ఒక అంతర్భాగం. రాసే తీర్పులే కాకుండా జడ్జీల వ్యక్తిగత ప్రవర్తన కూడా న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడుతుంది. వారి ప్రవర్తన ఎలాంటి అనుమానాలకు తావివ్వని రీతిలో ఉండాలి. న్యాయవ్యవస్థ నిష్పాక్షికంగా ఉండాలంటే దానిపై రాజకీయాల ప్రభావం ఏమాత్రం పడకూడదు" అని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు.





ఆముదం సాగుతో లాభాలు 'పట్టు'

ఈటీవీ భారత్: గుజరాత్‌లో విస్తృతంగా సాగు చేసే ఆముదం ఇకపై రైతులకు రెట్టింపు లాభాలు ఇవ్వనుంది. రాష్ట్రంలోని బనాస్‌కాంతా జిల్లాలో గల దాంతీవాడా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఆముదం సాగును మరింత లాభదాయకంగా మార్చేందుకు చాలా ఏళ్లుగా పరిశోధనలు చేస్తున్నారు. ఇప్పటిదాకా ఈ పంటలో విత్తనాలు మాత్రమే రైతులకు పనికొచ్చేవి. మొక్కల ఆకులను చెత్తకుప్పల్లో పడేసేవారు. ఇటీవల అస్సాం పర్యటనకు వెళ్లిన గుజరాత్ శాస్త్రవేత్తలు అక్కడ పట్టు పురుగులకు ఆముదం ఆకులను ఆహారంగా అందిస్తుండటం చూశారు. ఈ ఆకులతో అత్యంత నాణ్యమైన పట్టు కూడా లభిస్తోంది. దీంతో ఆముదం సాగు పెద్దఎత్తున జరిగే గుజరాత్ రైతులకు ఇది బాగా కలిసొస్తుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. నాణ్యమైన పట్టుకు మార్కెట్‌లో కేజీకి రూ.300 దాకా ధర లభిస్తోంది. ఈ లెక్కన ఓ రైతు నాలుగు ఎకరాల్లో ఆముదం పంట వేయడంతోపాటు పట్టు పురుగుల పెంపకం కూడా చేపడితే ఆదాయం రెట్టింపు అవుతుందని గుజరాత్ వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో ఒంటిచేత్తో విజయం



ఈటీవీ భారత్: తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా మెట్టుపాళ్యంకు చెందిన సంధానకుమార్‌ను ఓ రోడ్డుప్రమాదం అంతర్జాతీయ అథ్లెట్‌గా తీర్చిదిద్దింది. 2016లో స్నేహితుడితో కలిసి బైకుపై కాలేజీకి వెళుతుండగా.. ఓ ప్రయివేటు బస్సు వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో స్నేహితుడు మరణించగా, తీవ్రంగా గాయపడిన సంధానకుమార్ కుడిచేయి పూర్తి అచేతనంగా మారిపోయింది. ఆ తర్వాత ఐటీ సెక్టారులో ఉద్యోగం సాధించినా, ఆ జీవితం సంతృప్తిని ఇవ్వలేదు. ఇంట్లో ఖాళీగా కూర్చోకుండా ఏదో ఒకటి సాధించాలనే తపన సంధానకుమార్‌ను వెన్నాడింది. తనకు ఇష్టమైన 400 మీటర్ల రేసింగులో శిక్షణ పొందటం ప్రారంభించాడు. రాష్ట్రస్థాయిలో పలు పతకాలు సాధించాక థాయిలాండ్‌లో జరిగిన ప్రపంచ వికలాంగుల నైపుణ్య పోటీల్లో పాల్గొనే అవకాశం లభించింది. తమిళనాడు ప్రభుత్వ ఆర్థికసాయంతో థాయిలాండ్‌కు వెళ్లిన సంధానకుమార్ 20 దేశాల క్రీడాకారులు పాల్గొన్న ఆ పోటీల్లో 400 మీటర్ల పరుగును 54 సెకండ్లలో పూర్తిచేసి వెండి పతకం గెలుచుకున్నాడు. 2028లో రానున్న పారాలింపిక్స్ పోటీల్లో భారత్ తరఫున పాల్గొని బంగారు పతకం సాధించాలన్నది తన లక్ష్యమని, ఆ దిశగా సాధన చేస్తున్నట్లు సంధానకుమార్ తెలిపాడు.

నేర పరిశోధనలో గూఢచారులుగా నల్లులు!



ఈటీవీ భారత్: నల్లులు కనిపిస్తే వెంటనే ఎలా చంపాలని అందరూ ఆలోచిస్తుంటారు. మలేసియా శాస్త్రవేత్తలు మాత్రం వాటిని మచ్చిక చేసుకొని పరిశోధనలు చేస్తున్నారు. భవిష్యత్తులో అనేక నేర పరిశోధనల్లో ఇవి కీలక గూఢచారులుగా మారే అవకాశం ఉందని.. వాటి సాయంతో ఎన్నో కేసులను ఛేదించవచ్చని వీరు అంటున్నారు. నేరం జరిగిన చోట అప్పటికే నల్లులు ఉంటే బాధితులు లేదా అనుమానితులను గుర్తించేందుకు అవి సహాయపడతాయని ఇటీవల చేసిన పరిశోధనలో తేలినట్లు ఉత్తర పెనాంగ్‌లోని సైన్స్ యూనివర్సిటీ ఆఫ్ మలేసియా బృందం పేర్కొంది. యూఎస్ఎం స్కూల్ ఆఫ్ బయోలాజికల్ సైన్సెస్ ప్రయోగశాలలో తమ బృందం చాలా ఏళ్ల నల్లులపై అధ్యయనం చేసినట్లు శాస్త్రవేత్త అబ్దుల్ హఫీజ్ అబ్ మజీద్ పేర్కొన్నారు. నల్లులు మానవుల నుంచి రక్తాన్ని పీల్చిన దాదాపు 45 రోజుల వరకు వారి డీఎన్ఏ నల్లుల్లో ఉన్నట్లు గుర్తించామన్నారు. రక్తాన్ని పీల్చకపోయినా నిందితులు వాడిన దుప్పట్లు, మంచాలు, దిండులపైన అవి తిరిగినా వారి డీఎన్ఏ నల్లుల్లో ఉంటుందన్నారు. కొన్ని కేసుల్లో బాధితులు లేదా నిందితుల ఆచూకీ తెలియనప్పుడు వారుండే స్థలంలో నల్లులు ఉంటే వాటి నుంచి సేకరించిన డీఎన్ఏ ద్వారా ఎవరనేది గుర్తించవచ్చన్నారు. సాధారణంగా నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తులో ఘటనా స్థలంలోని రక్తపు మరక నుంచి సేకరించిన డీఎన్ఏ ద్వారా నిందితులు, బాధితులకు సంబంధించిన కొన్ని వివరాలను గుర్తిస్తారు. అదేవిధంగా నేర స్థలంలో ఉన్న నల్లుల్లో ఉన్న డీఎన్ఏ ద్వారా బాధితులు లేదా నిందితుల జెండర్, కంటి రంగు, జుట్టు, చర్మం రంగు వంటి విషయాలు బయటపడతాయన్నారు. దోమలు, ఈగల మాదిరిగా నల్లులు ఎగరలేవని.. మనుషుల నుంచి ఒక బిందువు పరిమాణంలో రక్తాన్ని పీల్చగానే వాటి కడుపు నిండిపోతుందని శాస్త్రవేత్త తెలిపారు. దీంతో అవి ఎక్కువదూరం కదలలేకపోతాయన్నారు. అందువల్లే నిందితులను గుర్తించడంలో నల్లులు కీలకంగా మారుతాయని తెలిపారు. ఇవి దుప్పట్లు, దిండులలో దాక్కొని ఉంటాయి కాబట్టి, నిందితులకు సాక్ష్యాలను నాశనం చేసే అవకాశం కూడా ఉండదన్నారు.

2080 నాటికి భారత జనాభా స్థిరీకరణ

- వెల్లడించిన ఐఏఎస్‌పీ

కోల్‌కతా: సంతానోత్పత్తి రేటు తగ్గిపోతుండటంతో 2080 నాటికి భారత జనాభా 180 లేదా 190 కోట్లలో స్థిరీకరణ జరగనుంది. గత రెండు దశాబ్దాలుగా జననాల రేటు గణనీయంగా తగ్గుతుండటమే దీనికి కారణమని 'భారత జనాభా అధ్యయన సమితి'(ఐఏఎస్‌పీ) ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్రన్ వెల్లడించారు. "2000లలో మొత్తం సంతానోత్పత్తి రేటు(టీఎఫ్ఆర్) 3.5గా ఉండేది. ఇప్పుడు అది 1.9కి పడిపోయింది. దీనివల్ల 2080 నాటికి జనాభాలో తగ్గుదల ఏర్పడి స్థిరీకరణ జరగనుంది. భారత గరిష్ఠ జనాభా 200 కోట్ల కంటే తక్కువగా ఉంటుందని అన్ని అంచనాలు చెబుతున్నాయి" అని చంద్రన్ వ్యాఖ్యానించారు. అభివృద్ధి, అక్షరాస్యత పెరగడమే సంతానోత్పత్తి తగ్గడానికి ప్రధాన కారణాలని ఆయన విశ్లేషించారు. కుటుంబ నియంత్రణ చర్యలు, గర్భ నిరోధక సాధనాల వినియోగం పెరిగిందని, ఏ వయసులోగా సంతానాన్ని పొందాలి? ఎంతమంది పిల్లల్ని కనాలి? అనే దానిపై దంపతులకు స్పష్టత ఉంటోందని అన్నారు. దేశ అభివృద్ధికి పూర్తి విలోమానుపాత దిశలో సంతానోత్పత్తి ఉంటుందని తెలిపారు. నేటికీ భారత్‌లోని నిరక్షరాస్యుల సంతానోత్పత్తి రేటు 3కు పైనేనని, కానీ అక్షరాస్యుల్లో టీఎఫ్ఆర్ 1.5-1.8 మధ్య పరిమితం అయిందని వివరించారు. "దేశంలో ఓ వైపు జననాల రేటు తగ్గుతుంటే, మరోవైపు ప్రజల ఆయుర్దాయం క్రమంగా పెరుగుతోంది. సగటున 60 ఏళ్లకుపైగా జీవించే వారి సంఖ్య పెరుగుతోంది. దీనివల్ల వృద్ధుల సంరక్షణ విషయంలో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. ఉపాధి అవకాశాలను వెతుక్కుంటూ యువత వలస బాట పడుతుంటే, ఇళ్లలో ఉండే వయో వృద్ధులను పట్టించుకునే వారు కరువవుతున్నారు. ఈ తరుణంలో వృద్ధుల బాగోగులను చూసుకునే సంరక్షణ కేంద్రాలు పెద్దసంఖ్యలో ఏర్పాటవుతున్నాయి" అని అనిల్ చంద్రన్ పేర్కొన్నారు.

ఓ వైపు చర్చలు.. మరోవైపు బాంబులు

- ఫ్లోరిడా చేరుకున్న ఉక్రెయిన్ బృందం
- మార్కో రూబియో, విట్కాఫ్‌లతో సమావేశం
- కొనసాగుతున్న రష్యా దాడులు

వెస్ట్‌పామ్ బీచ్/కీవ్: ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన 28 సూత్రాల శాంతి ప్రణాళికను ముందుకు తీసుకెళ్లేందుకు అమెరికా యంత్రాంగం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఆదివారం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్‌లు ఉక్రెయిన్ బృందంతో ఫ్లోరిడాలో సమావేశమయ్యారు. ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్ కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఈ చర్చల అనంతరం రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను కలిసేందుకు విట్కాఫ్ మాస్కోకు వెళ్లనున్నారు. ట్రంప్ 28 పాయింట్లలో ఇప్పటికే కొన్నింటికి సవరణలు చేసినట్లు సమాచారం. మొత్తం ఒప్పందం రష్యాకు అనుకూలంగా ఉందని విమర్శలు వెల్లువెత్తడంతో కొన్ని అంశాలపై అమెరికా కాస్త వెనక్కి తగ్గింది. ఓవైపు యుద్ధం ఆపేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగుతున్నా, ఉక్రెయిన్, రష్యాలు పరస్పర దాడులను మాత్రం ఆపడం లేదు. శనివారం రాత్రి నుంచి ఉక్రెయిన్‌పైకి క్షిపణులు, డ్రోన్లతో రష్యా విరుచుకుపడింది. ఈ దాడుల్లో ఒకరు మృతి చెందారు. ముగ్గురికి గాయాలయ్యాయి. 122 డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులను రష్యా ప్రయోగించిందని ఆదివారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు.

పొగాకు ఉత్పత్తులు, పాన్ మసాలాలపై ప్రత్యేక పన్ను

- జీఎస్టీ సెస్ నుంచి బయటకు..
- రెండు బిల్లులు పెట్టనున్న ప్రభుత్వం

దిల్లీ: పొగాకు, పొగాకు ఉత్పత్తులు, పాన్ మసాలాలను జీఎస్టీ సెస్ నుంచి బయటకు తీసుకొచ్చి ప్రత్యేక పన్నులు వేసే విధానాన్ని అమలు చేసేందుకు ఉద్దేశించిన రెండు బిల్లులను పార్లమెంటు శీతాకాల సమావేశాల తొలిరోజైన సోమవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. కొత్త చట్టాలు వచ్చాక పొగాకు, పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ లెవీని, పాన్ మసాలా తయారీపై కొత్త సెస్‌ను ప్రభుత్వం విధించనుంది. జీఎస్టీ పరిహార సెస్ స్థానాన్ని ద సెంట్రల్ ఎక్సైజ్ సవరణ బిల్లు-2025 భర్తీ చేయనుంది. జాతీయ ఆరోగ్య భద్రత సెస్ బిల్లు-2025.. పాన్ మసాలాలపై సెస్‌లను పెంచనుంది. ఈ బిల్లులు ఆమోదం పొందాక.. పొగాకు, పొగాకు ఉత్పత్తులపై జీఎస్టీతోపాటు ఎక్సైజ్ డ్యూటీ పడనుంది. పాన్ మసాలాలపై జీఎస్టీతోపాటు ఆరోగ్య భద్రత సెస్ పడనుంది.



పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయ్ గుడీలో రైలు ఢీకొనడంతో గాయపడిన గున్న ఏనుగును ఆసుపత్రికి తీసుకెళ్లడానికి క్రేన్ సాయంతో వాహనంలోకి తరలిస్తున్న అటవీశాఖ అధికారులు

పార్టీ నాయకులంతా పింఛన్ల పంపిణీలో పాల్గొనాలి

● తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ఈనాడు, అమరావతి: పేదల సేవలో కార్యక్రమంలో రాష్ట్రస్థాయి నుంచి బూత్‌స్థాయి వరకూ నాయకులంతా పాల్గొనాలని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. పాల్గొన్నవారంతా కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ‘మై టీడీపీ యాప్’లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పింఛన్ల పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.34 వేల కోట్లు ఖర్చు చేస్తోందని గుర్తుచేశారు. ఈ మేరకు ఆదివారం తెదేపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా బూత్‌స్థాయి కార్యకర్తల వరకూ నేతలతో ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. “గతంలో 16 వేల మంది నాయకులే పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో గత నెల 25 వేల మంది పాల్గొన్నారు. ఈసారి 35 వేల మంది పాల్గొనాలి. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని తెలియజేయాలి” అని పల్లా సూచించారు.

హెచ్‌ఐవీ కేసుల నియంత్రణలో ఏపీ ప్రథమం

● మంత్రి సత్యకుమార్ యాదవ్

ఈనాడు, అమరావతి: హెచ్‌ఐవీ కేసుల నియంత్రణలో ఏపీ ప్రథమ స్థానంలో ఉందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నిర్దేశించిన 80% లక్ష్యంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ 76.96% చేరుకొందని పేర్కొన్నారు. హెచ్‌ఐవీ పాజిటివిటీ రేటు 2024-25 నాటికి 0.58 శాతానికి చేరిందని ఆదివారం ఓ ప్రకటనలో వివరించారు.

సీఐఐ బిగ్ పిక్చర్ సమిట్‌కు మంత్రి కందుల దుర్గేష్

ఈనాడు, అమరావతి: ముంబయిలో సోమ, మంగళవారాల్లో (డిసెంబరు 1, 2 తేదీల్లో) నిర్వహించే 12వ ‘సీఐఐ బిగ్ పిక్చర్ సమిట్-2025’కు రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ హాజరుకానున్నారు. ప్రస్తుత ఏఐ యుగంలో మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగం భవిష్యత్ వృద్ధికి రోడ్ మ్యాప్ రూపొందించే కార్యక్రమంలో ఆయన ప్రసంగించనున్నారు.

‘ఉద్భవ్-2025’కు వేగంగా ఏర్పాట్లు

● ప్రోమో విడుదల చేసిన గిరిజన సంక్షేమశాఖ

ఈనాడు, అమరావతి: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఈఎంఆర్‌ఎస్) జాతీయ సాంస్కృతిక, సాహిత్య, కళా ఉత్సవ్(ఉద్భవ్)-2025కు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. డిసెంబర్ 3, 4, 5 తేదీల్లో గుంటూరు జిల్లా కేఎల్ విశ్వవిద్యాలయంలో ఈ పోటీలను నిర్వహించనున్నారు. నిర్వహణ ఏర్పాట్లను ఆదివారం గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్, గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి గౌతమి పరిశీలించారు. ప్రారంభ, ముగింపు వేడుకలు జరిగే వేదికల పనులు, ఆడిటోరియం, విద్యార్థుల వసతి గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉద్భవ్-2025 ప్రోమోను విడుదల చేశారు.

రైతుల సమస్యలు పార్లమెంటులో ప్రస్తావించండి

● వైకాపా ఎంపీలతో జగన్


ఈనాడు, అమరావతి: రాష్ట్ర రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పార్లమెంటులో ప్రస్తావించాలని వైకాపా ఎంపీలకు ఆ పార్టీ అధినేత జగన్ సూచించారు. పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, తుపానులతో రైతులు నష్టపోయిన తీరు తదితర అంశాలపై చర్చించాలని ఎంపీలకు జగన్ దిశానిర్దేశం చేశారని వైకాపా కేంద్ర కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ‘‘ఈ-క్రాప్ విధానం అమలు చేయకపోవడాన్ని ప్రస్తావించండి. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డుల తొలగింపును గట్టిగా ప్రశ్నించండి’’ అని జగన్ పేర్కొన్నారు.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య



బానోత్ వీరన్న

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: అప్పులు తెచ్చి పంటలు సాగు చేసి.. నష్టాల పాలైన ఓ యువ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన తెలంగాణలోని ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని శంకరగిరి తండాకు చెందిన రైతు బానోత్ వీరన్న(30) డిగ్రీ చదివారు. ముదిగొండ మండలం మాదాపురంలో సుమారు 15 ఎకరాల వరకు భూమిని కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి, ఇతర పంటలు వేశారు. చీడపీడలతో పంటల దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయారు. సుమారు రూ.10 లక్షల వరకు అప్పులయ్యాయి. వాటిని తీర్చే మార్గం లేక ఆవేదన చెందిన వీరన్న.. శనివారం తాను అప్పులు తెచ్చి వ్యవసాయం చేసి తీవ్రంగా నష్టపోయానని, ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలని సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుమందు తాగారు. ఆ వీడియోను స్నేహితులకు పంపగా.. వారు అక్కడికి వెళ్లారు. ఆయన్ను వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.



90% వ్యాధులకు కారణం అవే..

తొంభై శాతం వ్యాధులకు కారణం మన జన్యువులు కాదు. మనం తినే ఆహారం, జీవనశైలి, మనం నివసించే వాతావరణం, అలవాట్లే అందుకు ప్రధాన కారణం. అందుకే ఈ విషయాల్లో అత్యంత జాగరూకతతో ఉండాలి.

– మార్క్ హైమన్, హెల్త్ ఎక్స్‌పర్ట్

ఆకర్షించాం.. ఇక అమల్లోకి తెస్తాం!

- ఒప్పందాల గ్రౌండింగ్‌కు కార్యాచరణ
- పరిశ్రమలు స్థాపించేలా కలెక్టర్లకు సమన్వయ బాధ్యతలు
- విశాఖ భాగస్వామ్య సదస్సులో 613 ఎంవోయూలు
- రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు



ఈనాడు, అమరావతి: విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదిరిన పెట్టుబడి ఒప్పందాలన్నింటినీ గ్రౌండింగ్ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. వాటిని ప్రాధాన్యక్రమంలో అమలు చేసేందుకు దశల వారీ లక్ష్యాలను అధికారులకు నిర్దేశించింది. ఒప్పందాలను మూడేళ్లలో గ్రౌండింగ్ చేస్తామని సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. నవంబర్ 14, 15 తేదీల్లో నిర్వహించిన సదస్సులో వివిధ సంస్థలతో 613 ఒప్పందాలను ప్రభుత్వం కుదుర్చుకుంది. వాటి ద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయి. వాటిలో ఇంధన, పరిశ్రమలు, మౌలికసదుపాయాలు, ఐటీ రంగాల పెట్టుబడులు రూ.11,74,960 కోట్లు. నాలుగు విభాగాలవే 88.62 శాతంగా ఉన్నాయి.

మొదటి దశలో ఆన్‌లైన్

వివిధ కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. ఆ వివరాలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), వివిధ శాఖల కార్యదర్శులు, హెచ్‌వోడీలకు కనిపించే ఏర్పాటు చేశారు. జిల్లాల వారీగా ఎంవోయూలు విభజించి.. సంబంధిత కలెక్టర్ల లాగిన్‌లోనూ ఆన్‌లైన్‌లో కనిపించే వీలు కల్పించారు. పరిశ్రమల శాఖ అధికారులతో పాటు జిల్లా నుంచి.. సంబంధిత కంపెనీలతో సమన్వయం చేసేలా కలెక్టర్లకు బాధ్యత అప్పగించనున్నారు గ్రౌండింగ్‌లో ఇబ్బందులుంటే వెంటనే పరిష్కరించాలన్నది అధికారుల ఆలోచన. కొన్ని సంస్థలు ఎంవోయూ కుదుర్చుకున్నా.. ఎక్కడ ఏర్పాటు చేయాలన్న(లొకేషన్) దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే పరిశీలించిన ప్రాంతాల్లో ఏదో ఒకదాన్ని వెంటనే ఎంపిక చేసుకునేలా సదరు కంపెనీని అధికారులు కోరనున్నారు. ఆయా కంపెనీల ప్రతినిధులతో సమన్వయం చేసుకుని ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులు భావిస్తున్నారు.

● రెండో దశలో డీపీఆర్‌లు పూర్తి చేసేలా కంపెనీలతో అధికారులు సంప్రదింపులు జరపాలని నిర్ణయం. వాటికి ఎస్‌ఐపీబీలో ఆమోదం.. గ్రౌండింగ్ చేయించే వరకు పర్యవేక్షణకు కార్యాచరణ.

ఎంవోయూలకు ముందే కసరత్తు

భాగస్వామ్య సదస్సులో ఒప్పందాల విషయంలో అధికారులు ముందస్తు వ్యూహంతో వ్యవహరించారు. ఎంవోయూ ప్రతిపాదనలు ముందుగానే సంబంధిత కంపెనీలకు అధికారులు పంపారు. వాటిపై పూర్తి స్థాయిలో సంప్రదింపులు జరిపిన తర్వాతే ఎంవోయూ సిద్ధం చేశారు. ఆయా కంపెనీ ప్రతినిధులతో సంతకాలు చేయించిన వాటికే సదస్సులో ఆమోదం తెలిపారు.

ఎస్‌ఐపీబీ మినిట్స్‌లోనూ చర్చ

● ప్రతి నెలా నిర్వహించే రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్‌ఐపీబీ) సమావేశంలో ఎంవోయూల పరిస్థితిపై సీఎం సమీక్షించనున్నారు. ఇప్పటికే డీపీఆర్‌లు అందించిన కంపెనీల ప్రతిపాదనలను ఎస్‌ఐపీబీ ఆమోదానికి పంపనున్నారు.

● ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వివిధ శాఖల కార్యదర్శుల నేతృత్వంలో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. ఎంవోయూ ప్రతిపాదనలపై ప్రతి 15 రోజులకోసారి కమిటీ సమీక్షిస్తుంది.

ప్రభుత్వం కుదుర్చుకున్న ఎంవోయూల వివరాలు

సంబంధిత శాఖ	కంపెనీల సంఖ్య	పెట్టుబడులు	ఉపాధి (రూ.కోట్లలో)
ఇంధన శాఖ	63	5,33,351	2,66,722
పరిశ్రమలు	193	2,80,384	5,19,083
మౌలికసదుపాయాలు	38	2,01,758	3,06,649
ఐటీ, ఎలక్ట్రానిక్స్	107	1,59,467	2,96,315
సీఆర్‌డీఏ	41	48,711	41,625
పర్యాటకం	112	21,036	1,05,804
ఫుడ్ ప్రాసెసింగ్	38	13,008	47,390
మున్సిపల్	8	4,944	12,150
టెక్స్‌టైల్స్	7	4,490	8,450
వైద్యం	3	4,208	24,000
విద్యాశాఖ	2	4,359	3,000
ఏఐ డేటాసెంటర్	1	50,000	----
	613	13,25,716	16,31,188

● ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యాన్ని పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ప్రతి నెలా సమావేశమై ఎంవోయూల అమలుపై సమీక్షిస్తుంది. ఏదైనా కంపెనీ నుంచి సమస్య ఉన్నట్లయితే జోక్యం చేసుకుని పరిష్కరిస్తుంది.

ఎంవోయూలన్నీ పోర్టల్‌లో ఉంచుతున్నాం

– యువరాజ్, పరిశ్రమల శాఖ కార్యదర్శి

భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలను విభాగాల వారీగా పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతున్నాం. ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీల నుంచి డీపీఆర్‌లు తెప్పించడంపై దృష్టి పెడుతున్నాం. కంపెనీలు ఎంవోయూలపై సంప్రదింపులు జరిపేటప్పుడే గ్రౌండింగ్‌పై స్పష్టత ఇచ్చాయి. నిర్దేశిత సమయంలో అమలు కాకుంటే.. కారణాలను సీఎంకు వివరిస్తాం.

ఈఎస్‌ఐ ఆస్పత్రుల్లో మందులేవి సారూ?



- 2025-26 సంవత్సరానికి ఇంకా కొనుగోళ్లే లేవు
- కొనుక్కుని బిల్లులు పెట్టుకోవాలంటూ చిరుద్యోగులకు ఉచిత సలహాలు
- జనవరి వరకు ఇదే పరిస్థితి?

ఈనాడు-అమరావతి, రాజమహేంద్రవరం: కార్మికుల ఆరోగ్యానికి భరోసానిచ్చే ఈఎస్‌ఐ ఆస్పత్రుల్లో మందులు ఉండట్లేదు. చాలా ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో మందులు లేకపోవడంతో బయట కొనుక్కోవాలని వైద్యులు సూచిస్తున్నారు. చిరుద్యోగులు అలా కొనలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా ఈఎస్‌ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీలకు మూడు నెలలకోసారి ఇండెంట్లు తీసుకొని, వాటి ఆధారంగా మందులు కొంటారు. కేంద్రీయ ఔషధ నిల్వకేంద్రాల (సీడీఎస్) నుంచి వీటిని పంపిస్తారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు మందులు కొనలేదు. 2024-25 సంవత్సరానికి 2025 మార్చిలో చివరిగా మందులను సరఫరా చేశారు. అవన్నీ ఆగస్టులోనే ఆయిపోయాయి. ఇండెంట్ ఎక్కువ పెట్టిన కొన్నిచోట్ల సెప్టెంబరు వరకు వచ్చాయి. మందులు లేకపోవడంతో బయట కొనుక్కుని బిల్లులు పెట్టుకోవాలని కొన్నిచోట్ల వైద్యులు సూచిస్తున్నారు. ఆ బిల్లుల మంజూరులోనూ తీవ్ర జాప్యం నెలకొంది.

ముగియనున్న ఆర్‌సీ గడువు

రాష్ట్రవ్యాప్తంగా 14,55,987 మంది ఈఎస్‌ఐ ఉద్యోగులు ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికి ఏడాదికి రూ.2,750 చొప్పున రాష్ట్రానికి కేంద్రం నిధులిస్తోంది. దీనికి 1% రాష్ట్రప్రభుత్వ వాటా కలిపి ఈఎస్‌ఐ సేవలందించాలి. రాష్ట్రంలో విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయవాడలో ఈఎస్‌ఐ ఆస్పత్రులు ఉండగా.. విజయనగరం, సూళ్లూరుపేట, ఆదోనిలో డయాగ్నస్టిక్ సెంటర్లు (డీసీ), 78 ప్రాంతాల్లో డిస్పెన్సరీలున్నాయి. ఆస్పత్రుల్లో మందుల కొరత రాకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి, ఇండెంట్లు పెట్టాల్సి ఉండగా. . ఓ ప్రజాప్రతినిధి, కొందరు సిబ్బంది కమీషన్ల కోసమే ఈ జాప్యం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

● ఈఎస్‌ఐ ఆసుపత్రులకు సరఫరా చేసే మందుల్లో 298 రకాలకు రేట్ కాంట్రాక్టు (ఆర్‌సీ) గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. గడువు మీరితే ఈ మందుల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వ ఈఎస్‌ఐసీ డీజీ నుంచి అనుమతులు తీసుకోవాలి. ఆర్‌సీ ధరలను కేంద్ర ప్రభుత్వ ఈఎస్‌ఐసీ టెండర్ల ద్వారా నిర్ణయిస్తుంది. ఈ ధరలకే దేశవ్యాప్తంగా ఆయా కంపెనీలు మందులు సరఫరా చేస్తాయి.

● ప్రస్తుతం మధుమేహం, రక్తపోటు, కాళ్ల, కీళ్ల నొప్పులు, గ్యాస్ తదితర మాత్రలు లేవు. చాలా తక్కువ మందికి అవసరయ్యే దీర్ఘకాలిక వ్యాధుల మందులతో పాటు ఐరన్ సిరప్, చర్మసమస్య ఆయింట్‌మెంట్, ఇన్‌హేలర్లు, దగ్గు, జ్వరం మందులు అంతంతమాత్రంగా ఉన్నాయి.

● రాజమహేంద్రవరం సీడీఎస్ ఆధారంగా ఉభయగోదావరి జిల్లాల్లో 15 డిస్పెన్సరీలు ఉన్నాయి. ఏప్రిల్‌లో 407 రకాల మందులకు ఇండెంట్ పెడితే 268 రకాలే వచ్చాయి. సాధారణంగా ఒక్కో విడత సుమారు రూ.7 కోట్ల విలువైన మందులొస్తే, ప్రస్తుతం 10% కూడా అందుబాటులో లేవు. ప్రస్తుతం 510 రకాల మందులకు ఇండెంట్ పెట్టారు. ఇక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న (ఇన్‌పేషెంట్లు) వారికి మాత్రం బయట కొనుగోలు చేసి అందిస్తున్నారు.

● ఈఎస్‌ఐ విభాగం మందులకు ఇండెంట్లు తీసుకుంది. వీటి సరఫరాకు ఆర్డర్లు ఇంతవరకు ఇవ్వలేదు. ఆర్డర్ ఇచ్చాక 42రోజుల వరకు సరఫరాదారులకు సమయం ఉంటుంది. ఈ లెక్కన అన్ని రకాల మందులు రావాలంటే డిసెంబరు సైతం దాటిపోతుంది.

ఇండెంట్‌లో కొనసాగుతున్న జాప్యం

రాష్ట్రవ్యాప్తంగా ఆస్పత్రులు, డిస్పెన్సరీల నుంచి ఇండెంట్లు వచ్చాయి. సుమారు రూ.73 కోట్ల విలువ చేసే మందులు అవసరమని అధికారులు లెక్కలు వేశారు. ఓ ప్రైవేటు మందుల కంపెనీ దళారీ రంగప్రవేశం చేసి, తనకు అనుకూలంగా ఉన్న మందులే ఎక్కువ పెట్టించేలా చక్రం తిప్పుతున్నారు. కొన్నిచోట్ల ఇప్పటికీ సీడీసీల నుంచి ఫోన్లు చేసి, ఫలానా మందులు పెట్టాలని వైద్యులు, ఫార్మసిస్టులపై ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలోనే మందుల కొనుగోళ్లలో జాప్యం చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

తుపాను దృష్ట్యా వైద్యారోగ్య శాఖ ముందస్తు చర్యలు

కమిషనర్ వీరపాండియన్

ఈనాడు, అమరావతి: దిత్వా తుపాను ప్రభావంతో వైద్యారోగ్య శాఖ ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు ఆ శాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. తుపాను ప్రభావిత అన్నమయ్య, చిత్తూరు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి, వైఎస్సార్ కడప, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రసవానికి దగ్గర్లో ఉన్న గర్భిణుల విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఆదివారం రాత్రి వరకు 375 మంది గర్భిణులను ఆసుపత్రులకు చేర్చామని వివరించారు. తుపాను దృష్ట్యా వైద్యారోగ్య శాఖ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కూడా సమీక్షించారు.

బీసీ జనాభా నిష్పత్తి మేరకు రిజర్వేషన్లు ఉండాలి

ఈనాడు, అమరావతి: బీసీ జనాభా నిష్పత్తికి అనుగుణంగా స్థానిక సంస్థల్లో వారికి రిజర్వేషన్లు అమలు చేయాలని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. రాజకీయాలు, ఇతర రంగాల్లో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించేలా కోర్టులు, ప్రభుత్వాలూ చూడాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

మెట్రో నగరాల తరహాలోనే పల్లెల్లో విద్యాబోధన

- వచ్చే పదేళ్లలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు
- ‘ఈనాడు’తో నేషనల్ ఎడ్యుకేషనల్ ఫోరం ఛైర్మన్ ప్రొ.అనిల్ సహస్రబుద్ధే



ఈనాడు, హైదరాబాద్: ‘హైదరాబాద్, దిల్లీ, ముంబయి, బెంగళూరులాంటి మెట్రో నగరాల్లో విద్యార్థులకు ఎలాంటి విద్యాబోధన ఉంటుందో.. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకూ ఆ తరహాలో అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. జాతీయ విద్యావిధానం ద్వారా వచ్చే పదేళ్లలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి’’ అని జాతీయ విద్యా సాంకేతిక వేదిక అధ్యక్షుడు, న్యాక్ ఛైర్మన్ ప్రొఫెసర్ అనిల్ సహస్రబుద్ధే అన్నారు. ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన ఆయన విద్యారంగంలో సంస్కరణలు, కృత్రిమ మేధ లాభనష్టాలు, ఏవీజీసీ (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్ గేమింగ్, కామిక్స్) పద్ధతులు, ఉద్యోగ ఉపాధి అవకాశాలపై అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

? కృత్రిమ మేధ కారణంగా విద్యార్థుల్లో సృజనాత్మకత తగ్గిపోతోందని విద్యానిపుణులు అంటున్నారు. హోంవర్క్ చేసేందుకు చాట్‌జీపీటీ, సైన్స్ ప్రయోగాలకు జెమినీ.. ఇలా విద్యార్థులు కృత్రిమ మేధ వినియోగిస్తున్నారు.. దీనికి మీరేమంటారు

కృత్రిమ మేధ మన ఆలోచన సమయాన్ని తగ్గిస్తుంది. మనం అంతకుముందు ఫీడ్ చేసిన చరిత్రను చెబుతుంది. దీన్ని మంచికి వినియోగించాలి తప్ప హోంవర్క్, ప్రయోగాలకు వాడకూడదు. ఇలాంటివి ఊహించే.. విరుగుడు కనిపెట్టారు. చాట్‌జీపీటీ, జెమినీల సాయంతో రాసిన వాటిని గుర్తించే సాఫ్ట్‌వేర్ వచ్చింది. కృత్రిమ మేధ వినియోగం మన సృజనాత్మకతను వెలికి తీసేలా ఉండాలి.

? భవిష్యత్తు అంతా సాఫ్ట్‌వేర్ రంగానిదే అన్న అంచనాతో దేశవ్యాప్తంగా లక్షలమంది విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యను ఎంచుకుంటున్నారు. ఏటా 15 లక్షల మంది బయటకు వస్తుండగా.. 50 శాతంలోపు పట్టభద్రులకే ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. కారణమేంటి

కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ కోర్సులు పూర్తిచేస్తే వెంటనే ఉద్యోగాలు వస్తున్నాయి. 50 శాతం కంటే ఎక్కువగానే ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. మిగిలిన వారిలో 10 శాతం ఉన్నతవిద్యను ఎంచుకుంటున్నారు. మరో 10 శాతం మంది విదేశాలకు వెళ్తున్నారు. ఇంజినీరింగ్ పాఠ్యాంశాలు, మూల్యాంకనాలను మార్చుతున్నాం. చదువుతోపాటు నైపుణ్యాలు నేర్పించేలా పాఠ్యాంశాలను రూపొందిస్తున్నాం.

? వర్సిటీలు, పరిశ్రమలకు అనుసంధానంగా కొత్త కోర్సులు, నైపుణ్య శిక్షణ అందిస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అంకుర సంస్థలను ప్రోత్సహిస్తామని వివరిస్తోంది. ఇంజినీరింగ్, డిగ్రీ పూర్తైన విద్యార్థులకు ఇవి ఎంతవరకు ఉపకరిస్తున్నాయి

మన విద్యావిధానంలో సమూల మార్పులు తీసుకురావాలన్న లక్ష్యంతో జాతీయ విద్యావిధానాన్ని కేంద్రం తెరపైకి తీసుకొచ్చింది. ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్ విద్యార్థులకు చదువు పూర్తయ్యేలోపే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా వర్సిటీల్లో ఆచార్యులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వీరిని ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగాలిచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మారేందుకు నైపుణ్యాలు దోహద పడనున్నాయి. ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ఇంజినీరింగ్ కళాశాలల్లో అంకుర సంస్థలను స్థాపించేందుకు విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయి.

? ప్రాథమిక, ఉన్నతవిద్యకు సంబంధించి పల్లెలు, పట్టణాలు, నగరాల్లో చాలా అంతరాలు ఉన్నాయి. వీటిని సరిచేసేందుకు కేంద్రం ఎలాంటి చర్యలు చేపడుతోంది

పల్లెలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కొరత ఉంటుంది తప్ప పాఠాలు చెప్పే విధానంలో తేడా ఉండదు. గ్రామీణ విద్యార్థులు పట్టణ ప్రాంతాల విద్యార్థులతో పోల్చితే తెలివైనవారు. వారికి ప్రాక్టికల్ నాలెడ్జ్ ఎక్కువ. అంతరాలను సరిచేసేందుకు సులభమైన విధానం డిజిటల్ విద్యాబోధన. గ్రామాల్లోనూ వేగవంతమైన ఇంటర్నెట్ సౌకర్యం ఉంటే చాలు.. అమలు సాధ్యమవుతుంది.

? గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు మరింత సులభంగా పాఠాలు అర్థం అవ్వాలంటే ఉపాధ్యాయులు ఏ తరహాలో విద్యను బోధించాలి

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడైనా సరే తేడా లేకుండా సెల్‌ఫోన్లు ఉన్నాయి. మొబైల్ డేటా ఉంది. పల్లెటూరి విద్యార్థులకు ‘ఏవీజీసీని పరిచయం చేయాలి. పిల్లలకు ఆటలు, కార్టూన్‌లు, యానిమేషన్ అంటే చాలా ఇష్టం. వీటి సాయంతో ఉపాధ్యాయులు పాఠాలు చెబితే విద్యార్థులు వేగంగా అర్థం చేసుకుంటారు.

లోక్ భవన్, లోక్ నివాస్‌లుగా గవర్నర్ల అధికారిక నివాసాలు!

● కొన్ని రాష్ట్రాల్లో మొదలైన మార్పులు

● నేరుగా రాజ్‌భవన్‌లకే సమాచారం?

దిల్లీ, చెన్నై-న్యూస్‌టుడే: గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్ల అధికారిక నివాసాలైన రాజ్‌భవన్, రాజ్‌నివాస్‌ల పేర్లను లోక్‌భవన్, లోక్‌నివాస్‌లుగా మార్చాలని కేంద్రం సూచించినట్లు వార్తలు వెలువడుతున్నాయి. దీనిపై కేంద్రం నుంచి అధికారిక ప్రకటన వెలువడకపోయినా.. కొన్ని రాష్ట్రాల గవర్నర్లకు, లెఫ్టినెంట్ గవర్నర్లకు నేరుగా సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. పశ్చిమబెంగాల్, తమిళనాడు గవర్నర్లు, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ ఈ మేరకు ఇప్పటికే మార్పులు చేశారు. ప్రజల కోసం గవర్నర్లు సేవలందిస్తున్న నేపథ్యంలో రాజ్‌భవన్‌లను లోక్‌భవన్‌లుగా మార్చాలంటూ గతేడాది ఆగస్టులో దిల్లీలో జరిగిన గవర్నర్ల సదస్సులో తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రతిపాదించారు. దానిని తాజాగా కేంద్ర హోంశాఖ సూచనలు జారీ చేసిందని, రవి ప్రయత్నం చరిత్రలో ఓ మైలురాయిగా నిలుస్తుందని ఆయన సలహాదారు తిరుజ్ఞాన సంబంధం ఆదివారం ‘ఎక్స్’లో పేర్కొన్నారు. పేరు మార్పుపై బెంగాల్‌లో రాజకీయంగా విమర్శలు వస్తున్నాయి. పాత వాసనలు వదిలించుకునేందుకే పేరు మార్చాలంటే స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్ల తర్వాత కూడా గవర్నర్ల వ్యవస్థ ఎందుకని అక్కడి విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. లేదా కొత్త పేర్లకు తగ్గట్టుగా గవర్నర్లకూ ఎమ్మెల్యేల ద్వారా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి.

క్వాంటమ్ కంప్యూటింగ్ విధానం అమలుకు ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: ఏపీ క్వాంటమ్ కంప్యూటింగ్ విధానం అమలుకు మార్గదర్శకాలు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పాలసీ 2025-30 మధ్య (ఐదేళ్ల పాటు) అమలులో ఉంటుంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఏర్పాటు చేసే సంస్థలకు మాత్రమే ఈ పాలసీ వర్తిస్తుంది. సంస్థలకు చెల్లించే ప్రోత్సాహకాలు, సంస్థను గుర్తించేందుకు అనుసరించే నిబంధనలను ప్రభుత్వం ప్రస్తావించింది. అందుకు అనుగుణంగా సంస్థలకు టైలర్ మేడ్ విధానంలో ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అనుమతించనుంది.


నైబర్‌హుడ్ వర్క్ స్పేస్ పాలసీ మార్గదర్శకాలు

ఏపీ నైబర్‌హుడ్ వర్క్‌స్పేస్ పాలసీ అమలు మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ పాలసీ 2025-30 మధ్య అమల్లో ఉంటుంది. షేర్డ్, ప్రొఫెషనల్లీ మేనేజ్డ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అందుబాటులోకి తేవడం ద్వారా ఖర్చుల భారాన్ని తగ్గించాలన్నది ఈ పాలసీ ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. పాలసీ నిబంధనలను ఐటీ శాఖ పర్యవేక్షించనుంది.

ప్రధాని నోట.. కరీంనగర్ ఫిలిగ్రీ మాట



కరీంనగర్ సాంస్కృతికం, తెలంగాణచౌక్, న్యూస్‌టుడే: తెలంగాణలోని కరీంనగర్ ఫిలిగ్రీ వెండి హస్తకళ గురించి ప్రధాని మోదీ ఆదివారం ‘మన్ కీ బాత్’ కార్యక్రమంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా దేశీయంగా తయారవుతున్న కళాత్మక ఉత్పత్తులను ప్రోత్సహించాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. నవంబరులో దక్షిణాఫ్రికాలో జరిగిన జీ-20 శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్న దేశాల అధినేతలకు భారత్‌లోని వివిధ రాష్ట్రాల్లో తయారు చేసిన కళాకృతులను అందజేశామన్నారు. ఇందులో భాగంగా జపాన్, ఇటలీ ప్రధానులకు కరీంనగర్‌లో ఫిలిగ్రీ కళాకారులు రూపొందించిన సిల్వర్ బుద్ధుని ప్రతిమ, పూల ఆకృతితో కూడిన సిల్వర్ మిర్రర్‌ను బహూకరించినట్లు వివరించారు. కరీంనగర్‌లో 400 ఏళ్లకుపైగా వారసత్వంగా తయారవుతున్న ఫిలిగ్రీ గిఫ్ట్ ఆర్టికల్స్ ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందాయి. ఈ ఉత్పత్తులను ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులు, మంత్రులు ముచ్చటపడి తీసుకుంటారు. జిల్లాలో ఇది ఒక పరిశ్రమగా విస్తరిస్తూ వందల మంది కళాకారులకు ఉపాధి కల్పిస్తోంది. ప్రధాని తమ కళాకృతుల గురించి ప్రస్తావించడంతో అరుదైన గౌరవం లభించడమే కాకుండా మరింత ప్రాచుర్యం లభిస్తుందని కరీంనగర్ ఫిలిగ్రీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గద్దె అశోక్‌కుమార్ పేర్కొన్నారు.



చిన్నారి జుట్టు పట్టుకుంటూ.. కొడుతూ.. కాళ్లపై తొక్కుతూ..

కాళ్లపై నిలబడి.. దారుణంగా కొట్టి..!

● నాలుగేళ్ల పాపపై ఆయా కర్కశత్వం

● షాపూర్‌నగర్‌లో అమానుష ఘటన

జీడిమెట్ల, న్యూస్‌టుడే: అభం శుభం తెలియని నాలుగేళ్ల చిన్నారిపై ఓ ప్రైవేటు పాఠశాల ఆయా అమానుషంగా వ్యవహరించింది. పాప తండ్రి తనను తిట్టాడనే అక్కసుతో చిన్నారిని అత్యంత దారుణంగా కొట్టింది. మానవత్వాన్ని మరిచి.. పాప కాళ్లపై నిలబడి చితకబాదింది. హైదరాబాద్‌లోని షాపూర్‌నగర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. షాపూర్‌నగర్ ఎన్‌ఎల్‌బీనగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో లక్ష్మి అనే మహిళ ఆరేళ్లుగా ఆయాగా పనిచేస్తోంది. ఆరు నెలల క్రితం ఒడిశా నుంచి వచ్చిన కలియో, సంతోషి దంపతులు స్కూల్ కాపలాదారులుగా పనిచేస్తున్నారు. వారి నాలుగేళ్ల పాపను అదే పాఠశాలలో నర్సరీ చదివిస్తున్నారు. ఇటీవల ఆయాకు, పాప తండ్రికి గొడవ జరిగింది. దీన్ని మనసులో పెట్టుకున్న ఆమె శనివారం ఉదయం చిన్నారిని పాఠశాల ప్రాంగణంలోకి తీసుకెళ్లి పాశవికంగా దాడి చేసింది. ఈ దారుణాన్ని స్కూల్ పక్కనున్న భవనం పైనుంచి ఓ యువకుడు వీడియో తీశాడు. అది సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసుల దృష్టికి వచ్చింది. వెంటనే చిన్నారి ఇంటికి వెళ్లి ఆరా తీశారు. వారి సాయంతో తల్లిదండ్రులు పాపను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలానగర్ ఏసీపీ నరేశ్‌రెడ్డి, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ ఆసుపత్రికి వెళ్లి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయాను పోలీసులు అరెస్టు చేశారు. ఆమెతోపాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆడబిడ్డను కని.. ముళ్లపొదల్లో పారేసిన తల్లి

● చికిత్స పొందుతూ మృతి చెందిన పసికందు



ముళ్లపొదల్లో నవజాత శిశువు

నారాయణపేట, న్యూస్‌టుడే: పండంటి బిడ్డను ప్రసవించిన ఆ తల్లి.. వెంటనే పసికందును ముళ్లపొదల్లో పడేసింది. విషయం తెలిసి.. పోలీసులు ఆ శిశువును ఆసుపత్రిలో చేర్పించినా పసిప్రాణం దక్కలేదు. ఈ హృదయవిదారక ఘటన తెలంగాణలోని నారాయణపేట జిల్లాలో చోటుచేసుకుంది. గ్రామీణ ఎస్సై రాముడు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట మండలం అప్పక్‌పల్లికి చెందిన భారతి, ధన్వాడకు చెందిన బాల నర్సింహులు దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె సంతానం. దంపతులు ఉపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటున్నారు. మూడోసారి గర్భం దాల్చిన భారతి.. ఇటీవల కాన్పు కోసం స్వగ్రామానికి వచ్చి నవంబరు 24న పేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. అదే రోజు రాత్రి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. హైదరాబాద్‌లో ఉన్న భర్తకు శనివారం రాత్రి ఫోన్ చేసి.. పుట్టిన బిడ్డ చనిపోయిందని, పూడ్చిపెట్టామని అబద్ధం చెప్పింది. భర్త గట్టిగా నిలదీస్తే చెత్తకుప్పలో పడేసినట్లు తెలిపింది. దీంతో అతడు వెంటనే గ్రామానికి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెదకగా.. ఆదివారం ఉదయం ఆసుపత్రి సమీపంలోని కాటన్‌మిల్లు వెనకాల ముళ్లపొదల్లో ఉన్న శిశువు కనిపించింది. పసికందును వెంటనే జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది.